
శ్రీమాన్ వేదాంత దేశిక ప్రణీత


ద్రవిడోపనిషత్తాత్పర్యరత్నావళిః



శ్రీ కంచి వరదరాజ స్వామి కి అంకితం

ప్రకాశికా వ్యాఖ్య :

శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యులు



వేదాంత దేశికులు

శ్రియై నమః

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీమన్నిగమాన్త మహాదేశికాయనమః

శ్రీమాన్ వేదాంతదేశిక ప్రణీత
ద్రవిడోపనిషత్తాత్పర్యరత్నావళిః

ప్రకాశికా వ్యాఖ్య :

శ్రీమాన్ కె.వి. రాఘవాచార్య

ప్రథమ సంపుటము

శ్రీమాన్ వేదాంతదేశిక ప్రణీత
ద్రవిడోపనిషత్తాత్పర్యరత్నావళిః

ప్రకాశికా వ్యాఖ్య :
శ్రీమాన్ కె.వి. రాఘవాచార్య
ప్రథమ సంపుటము

ప్రథమ ముద్రణ : అక్టోబర్ 2003

ప్రతులు : 1000

వెల : రూ. 50-00

ప్రచురణకర్తలు : చక్రవర్తుల లక్ష్మీనర్సిహ్మాచార్యులు
చక్రవర్తుల పవన్‌కుమార్
చక్రవర్తుల లక్ష్మీనారాయణ

ప్రాప్తిస్థానము : శ్రీమాలోల గ్రంథమాల
శ్రీఅహోబిలమఠం
దుర్గాబాయిదేశ్‌ముఖ్ కాలనీ
హైదరాబాద్ - 500 013.

చక్రవర్తుల లక్ష్మీనర్సిహ్మాచార్యులు
C/o లక్ష్మీనారాయణ దేవస్థానము
ఆఫీస్‌రోడ్, కరీంనగర్

అక్షరకూర్పు,ముద్రణ : సాగర్ గ్రాఫిక్స్, కరీంనగర్



45TH JEER OF SRI AHOBILA MUTT


శ్రీ వేదాంతదేశిక ప్రణీత

ద్రవిడోపనిషత్తాత్పర్యరత్నావళిః

శ్రీమాన్ కె.వి. రాఘవాచార్య విరచిత

ప్రకాశికా వ్యాఖ్య

ప్రథమ సంపుటము



కీ॥శే॥ చక్రవర్తుల శేషాచార్యులు

1919 - 2-11-1993



కీ॥శే॥ చక్రవర్తుల సత్యమ్మ గారు

1924 - 4-11-2002

స్మృతిలో ప్రచురింపబడి

అష్టాక్షరీస్వరూపులైన కంచివరదరాజస్వామి వారికి

అంకితము

కుమారులు :

చక్రవర్తుల లక్ష్మీనర్సిహ్మాచార్యులు

చక్రవర్తుల పవన్ కుమార్

చక్రవర్తుల లక్ష్మీనారాయణ



॥ श्रीः ॥

श्रीमते श्रीलक्ष्मी नृसिंह परब्रह्मणे नमः

श्रीमते रामानुजाय नमः

श्रीमते वेदान्त गुरवे नमः

श्रीमते श्रीवण्शठकोप श्री वेदान्त देशिकयतीन्द्र महादेशिकाय नमः

श्रीमदहोबिलमठे पंचचत्वारिंश पट्टे मूर्धाभिषित्तानां श्रीमत्परम हंसेत्यदि अन्वर्थ बिरुदावलि मण्डितानां श्रीमतां श्रीलक्ष्मी नृसिंह दिव्यपादुका सेवक श्रीवण् शठकोप श्री नारायण यतीन्द्र महा देशिकानां श्रीमुखपत्रम् ॥

श्रीमन्निगमन्त महादेशिकैः सकललोकोज्जीवनाय बहवो ग्रन्थाः अनुगृहीताः। तेषु एकैकोपि अनुसंधीयमानः इहभोगाय, प्रेत्य मोक्षाय चालं भवेदिति सुधियां सार्वभौमाः उद्घोषयन्ति। तेषु एकविंशत्युत्तर शतश्लोकयुक्तः 'द्रमिडोपनिषत्ता त्पर्यरत्नावलिः', इत्यभिधो ग्रन्थः अत्युत्तमः इतिवदन्ति। "शठजिद्दृष्ट सर्वीय शाखा गाथा तात्पर्य रत्नावलि रखिलभयो त्तारणी धारणीया" इति देशिकैरूपदिष्टम्। ग्रन्थतल्लजस्यास्य आन्ध्रभाषायां श्री उ.वे.के.वि. राघवाचार्याः इति प्रसिद्धैः, पादुकासहस्र व्याख्यातृभिः अतिसरलया सङ्क्षिप्तया अतिरुचिरया च **'प्रकाशिका'** नाम्नीं व्याख्यां कारयित्वा, श्रीसन्निधिशिष्याणां की.शे. श्रीमतां चक्रवर्ति शेषाचार्यसूरिणाम् पुत्राः श्री च. लक्ष्मीनरसिंहाचार्याः करीण्णगरवास्तव्याः, तां इदानीं प्रकाशयितुं सज्ञाः।

ते अनितरसाध्यं साधयन्तीति नितरां प्रशंसां अर्हन्ति। प्रकटीक्रियमानः ग्रन्थोऽयं, व्याख्याता, प्रकाशयिता च सर्वे एधन्ताम् शरदांशतम् । देशिक ग्रन्थाः व्याख्येयाः लब्धावकाशाः विराजन्ताम् इति मङ्गलानि आशास्महे।

HIS HOLINESS
THE–JEER OF SRI AHOBILA MUTT

శ్రీమతే రామానుజాయనమః

శ్రీ వేదాన్త మహాదేశికాయనమః

మున్నుడి

సర్వతంత్ర స్వతంత్ర, కవితార్కిక సింహబిరుదాంచితులైన శ్రీ వేంకటనాథాచార్యులు అనే వేదాన్త దేశికులవారు అనుగ్రహించిన శతాధిక గ్రంథాలలో 'ద్రవిడోపనిషత్ తాత్పర్య రత్నావళి' అనే సంస్కృత గ్రంథం ఒక మహార్ఘమైన నేవళం

ప్రపన్నజనకూటస్థులైన శ్రీశఠకోపదివ్యసూరులు అనే నమ్మాళ్వార్లు "మయర్వఱ మతినలమరుళినన్" అన్నట్లు భగవద్దత్తమైన భక్తి రూపాపన్న జ్ఞానం చేత ద్రావిడభాషలో భగవానుని బహువిధాల సంకీర్తనం చేసి, తిరువిరుత్తం, తిరువాశిరియం, పెరియ తిరువన్దాది, తిరువాయ్‌మొఴి, అనే నాల్గు దివ్య ప్రబంధాలను సామవేద స్వరూపుడు శ్రియఃపతి "శ్రియఃపతిఃసామవేదఃఛాందోగ్యంతస్యమస్తకమ్" అనే రీతిగా, ఛందోబద్ధమంత్రాలను (ఛందోగుల) సామగానకర్తల (స్తోభం) గానకళాచాతుర్యంవల్ల బుక్కులు విస్తరించి, సహస్ర శాఖలుగా వెలసిన సామవేదానికి సంబంధించిన ఉపనిషత్తు ఛాందోగ్యం.

శ్రియఃపతిని ప్రతిపాదించే ఉపనిషత్తులకు (సంస్కృత) వేదాన్త శాస్త్రమని పేరు. నూఱు దశకాల (100×10) లో 1102 (గాథలు)పాశురాలు కలిగి, దివ్యగానకళా మేదురమైన 'తిరువాయ్‌మొఴి' అనే దివ్య ప్రబంధం సామవేద సదృశమైనది. పన్నిద్దరాళ్వారులలో నమ్మాళ్వార్లు 'అంగి'యైనట్లే, ఆళ్వార్లందఱుకృపజేసిన నాలాయిర దివ్య ప్రబంధాలలోకెల్ల ఉత్తమమైనది 'తిరువాయ్‌మొఴి'. ఇందులోనూ ప్రతిపాద్యుడు శ్రియఃపతియే కాబట్టి ఈ దివ్యప్రబంధాన్ని "ద్రవిడోపనిషత్" అని పూర్వాచార్యులు కీర్తించారు.

శ్రీ వేంకటేశ్వరుని ఘంటావతారులూ, అనేక శిష్యులను అనుగ్రహించినవారూ, కరుణామయమూర్తులూ అయిన శ్రీ వేదాన్తాచార్యులు దేశిక శబ్దవాచ్యులుగా సుశ్లోకితులు.

"దేవతారూపధారిత్వాత్ - (దే)
శిష్యానుగ్రహకారణాత్ - (శి)
కరుణామయమూర్తిత్వాత్ - (క)
దేశికః కథితః ప్రియే"

శ్రీమద్వేదాన్త దేశికులవారు 'ద్రవిడోపనిషత్' అనే 'తిరువాయ్‌మొషి' ప్రబంధంలోని నూఱు దశకాల సారార్థాన్ని నూఱు రత్నాల వంటి సంస్కృత శ్లోకాలలో గ్రథనం చేశారు. ఒక్కొక్క దశకంలోని ఒక్కొక్క (గాధ) పాశురం యొక్క తాత్పర్యానికి ప్రాణభూతమైన ఒక్క పదాన్ని ప్రయోగిస్తూ, పదకొండు పాశురాలకు ఒక్క స్రగ్ధరా వృత్త శ్లోకం చొప్పున, అక్కడక్కడ స్వాపదేశార్థాన్ని వివరించడం కోసమూ, శతకం (ఒక్కొక్కపత్తు) చివర శతక సారాన్ని బోధించడం కోసమూ, మరి కొన్ని శ్లోకాలను విశేషంగా సమకూర్చి, ఈ గ్రంధానికి స్వయంగా "ద్రవిడోపనిషత్తాత్పర్యరత్నావళి" అని నామకరణం చేసి, లోకానికి అందించి, మహోపకారకులైనారు.

సత్పధాచారులూ, సాహితీ సింధువులూ, ఆత్మ బంధువులూ అయిన మా అన్నగారి (శ్రీమాన్ చక్రవర్తుల శేషాచార్యుల) కుమారులైన శ్రీమాన్ చక్రవర్తుల లక్ష్మీనరసింహాచార్యులు, పవన్‌కుమార్, లక్ష్మీనారాయణాచార్యులను ధీమంతులు 'ద్రవిడోపనిషత్ తాత్పర్య రత్నావళి'కి ఆంధ్రభాషలో వ్యాఖ్యానం రచించి తమకు ఇస్తే, తాము ఆ గ్రంథాన్ని తమ పితృదేవతలైన కీ.శే. శ్రీ సత్యమ్మశేషాచార్యులగారి స్మృత్యర్థం ప్రచురిస్తామని, సంవత్సరం క్రితం నన్ను కోరినారు.

ఆస్మదాదులకు ప్రాతఃస్మరణీయులైన శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారూ, ఉ.వే.ప్ర.శ్రీమాన్ (ఎలిజర్ల) కె. సీతారామా చార్యులవారూ, శ్రీ న.చ.రఘునాథాచార్యులవారూ, కందాళ- చిక్కుడుగాయల రంగాచార్యులవారూ, దాసుడు 1989లో ఆంధ్రానువాదం చేసిన 'భగవద్విషయము' (ఈడు-అవతారిక, 3 శ్రియఃపతులు) అనే గ్రంథంలో, ఇటీవల రచించిన, రమణీయాంధ్రటీకాతాత్పర్యవ్యాఖ్యాసహితమైన, శ్రీరంగనాథపాదుకాసహస్ర' మనే గ్రంథంలో శ్రీశ్రీశ్రీ ఆదివణ్‌శఠకోపశ్రీనారాయణయతీంద్ర మహాదేశికులునూ, కృపజేసిన మంగళాశాసనం ఫలించే భాగ్యం లభించిందని భావించాను.

అల్పజ్ఞుడనై 'ద్రవిడోపనిషత్తాత్పర్యరత్నావళి'కి 'ప్రకాశికావ్యాఖ్య'ను రచింప సాహసించినందులకు పండిత ప్రకాండులు నన్ను క్షమించగలరని వేనోళ్ళ వేడుకొంటున్నాను.

భగవద్రామానుజులవారు నేరుగా ఆజ్ఞాపించినందువల్ల 'తిరుక్కురుగైప్పిళ్ళాన్' అనే ఆచార్యులు 'తిరువాయ్ మొషి'కి మొట్టమొదట రచించిన 'ఆఱాయిరప్పడి' (6 వేల పంక్తుల) వ్యాఖ్యానాన్నీ -

భగవద్విషయం, ఈడు, అనే నామాంతరాలతో వెలసియున్న 'ముప్పత్తాఱాయిరప్పడి' (36వేల పంక్తుల) వ్యాఖ్యానాన్నీ - అనుశీలిస్తూ రచించే ఈ, 'ప్రకాశికా వ్యాఖ్యాన గ్రంథం మూడు (3) సంపుటాలుగా వెలయింప నిర్ణయింపబడినది.

ఈ మొదటి సంపుటంలో దేశికుల సంగ్రహ జీవిత చరిత్రను వెలయించిన తర్వాత, మొదటిశతకం (ఒక పత్తు) మాత్రమే వ్యాఖ్యాతమైనది.

బహుకార్యధురంధరులైనా శ్రమయనక ఈ వ్యాఖ్యానాన్ని సమగ్రంగా పరిశీలించి, "ప్రకాశికాప్రశంస" అనే శీర్షికతో 'ద్రవిడోపనిత్తాత్పర్యరత్నావళి' యొక్క నామౌచిత్యాన్నీ, తదనుబంధవిషయాలనూ విశేషంగా వివరించి కృపజేసిన శ్రీమదుభయవేదాన్త విద్వాంసులూ అయిన డా॥ ఈయుణ్ణి అషగియశింగరాచార్య స్వామివారికి కార్తజ్ఞ్యపురస్సరంగ3 అసంఖ్యాకప్రణతులర్పిస్తున్నాను.

ఈ వ్యాఖ్యను రచించే అవకాశం కల్పించిన శ్రీమాన్ చ.ల.నాచార్యుల (ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాల, ప్రిన్సిపాల్) గారికీ, వారి సోదరులకూ యావత్కుటుంబానికి అనేక మంగళాశాసనములు.

అచ్చులో చక్కగా ముద్రించి ఇచ్చిన, కరీంనగర్ సాగర్ గ్రాఫిక్స్ ప్రెస్ అధినేతలకు ధన్యవాదాలు.

ఇట్లు
భాగవతాంఘ్రిరేణువు,
కె.వి.రాఘవాచార్యులు

C/o శ్రీ కె.వి.రమణాచారి, IAS
B.H. 3/6, IAS Quarters,
రోడ్ నం. 10,
బంజారాహిల్స్, హైద్రాబాద్. ఆం.ప్ర.
ఫోన్ : 040-23350258
15-10-2003, బుధవారం
స్వభాను ఆశ్వీజ కృష్ణ పంచమి

శ్రీమతేరామానుజాయనమః
శ్రీవేదాన్త దేశికా యనమః
ప్రకాశికా ప్రశంస

శ్రీమదుభయవేదాన్త విద్వాన్
డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు
తిరుపతి.

అనాదియైన పరమవైదిక సిద్ధాన్తమైన మహనీయులగుమహర్షులచేత దివ్యసూరులచే, పూర్వాచార్యులందరిచే ప్రచారమొనర్పబడినదగు విశిష్టా ద్వైత సిద్ధాన్తమునకు రెండుకన్నుల (దర్శనములు) వంటివి సంస్కృత వేదాన్తము, ద్రావిడవేదాన్తము అనబడు ఉభయవేదాన్తములు. తాము చేసిన నిరన్తర తపస్సు యొక్క ఫలితముగా మహర్షులు దర్శించినది సంస్కృత వేదాంతముకాగా భగవానుని నిర్హేతుక కృపావశము చేత దివ్యసూరులు దర్శించినది ద్రావిడవేదము. దీనికే దివ్య ప్రబంధమనియు పేరు. ఒక వస్తువు యొక్క స్వరూప రూపాది విశేషములన్నియుఆ వస్తువును దర్శించు నేత్రములు రెండిటికిని ఒకే విధముగా గోచరించును. అట్లే సంస్కృత, ద్రావిడవేదాన్తములనబడు ఈ రెండు దర్శనములచే ప్రతిపాదింపబడు తత్త్వములన్నియు ఒకే రీతిగా కన్పించును. ఇట్టి ఉభయ వేదాంత సమన్వయ ప్రక్రియ వేరొకసిద్ధాంతమునకానరాదు. భగవద్రామానుజ సిద్ధాంతమున మాత్రమే గోచరించు ప్రత్యేకమైన, విలక్షమైన ప్రక్రియ ఇది. ఈ సిద్ధాన్తమున ఉభయవేదాంతములకు సమప్రాధాన్య మీయబడినది.

సంహితలు, బ్రాహ్మణములు, ఆరణ్యకములు, ఉపనిషత్తులు అనురూపములో కన్పించు సంస్కృత వైదిక వాఙ్మయము పూర్వోత్తర భాగములుగా వర్గీకరింపబడినది. పూర్వభాగమునకు కర్మకాండఅని, ఉత్తరభాగమునకు బ్రహ్మకాండ అనియుపేరు. కర్మకాండగా చెప్పబడు పూర్వభాగమున సంహితాది ఆరణ్యకాధి మిగిలిన రెండు విభాగములు చేరున్నవి. పూర్వభాగమున భగవానుని ఆరాధనాత్మకమైన వైదిక కర్మల స్వరూపము, ఉత్తరభాగమున ఆకర్మలచే ఆరాధింపబడు పరబ్రహ్మయగు భగవానుని స్వరూపరూపగుణాదులు తెలుపబడుటచే వాని కట్టి పేర్లు కల్గినది. ఈ పేర్లు రెండును "ప్రాధాన్యేన వ్యపదేశాఃభవంతి" అను న్యాయమున ఏర్పడినవే.

కర్మకాండలో అచ్చటచ్చట బ్రహ్మస్వరూప విచారము, బ్రహ్మకాండలోను అక్కడక్కడ కర్మస్వరూప నిరూపణమును కన్పించుటను బట్టి ఇట్టి వ్యపదేశము లేర్పడినవి అని చెప్పనగును. ఈ వేదవాఙ్మయమంతము "యస్యనిశ్వసితో వేదాః" అనునట్లు భగవానునిని నిశ్వాసరూపము. కావున అపౌరుషేయములు, భగవదాజ్ఞారూపములును ఇట్టివేదములను స్మృతి, ఇతిహాస, పురాణములు ఉపబృంహణమొనర్చుచున్నవి. ఇట్లు స్మృతీతిహాసపురాణోపబృంహితమైన వేదము సమస్తము భగవానుని గూర్చి తెల్పుచున్నది. అనగా - ఆరాధనాస్వరూపమును, ఆరాధ్యస్వరూపమును రెండింటిని ప్రతిపాదించుచున్నది. ఈ అంశమును గీతాచార్యుడే స్వయముగా "వేదైశ్చసర్వైరహమేవవేద్యః" - అని గీతలో నుడివెను కదా! శ్రీ పరాశరభట్టర్ కూడ " శ్రీరంగరాజస్తవోత్తరశతకమున ఒక అద్భుతమైన శ్లోకరత్నముతో పై అంశములను ప్రకాశింపజేసిరి.

శ్లో॥ "ఆదౌవేదాఃప్రమాణం స్మృతిరుపకురుతే సేతిహాసైఃపురాణైః
న్యాయైస్సార్థం త్వదర్చావిధిముపరి పరిక్షీయతే పూర్వభాగః
ఊర్ధ్వోభాగః త్వదీహాగుణవిభవపరిజ్ఞాపనైః త్వత్పదాప్తౌ
వేద్యో వేదైశ్చ సర్వైరహమితి భగవన్! స్వేనచవ్యాచకర్థ॥

దివ్యసూరులనబడు ఆళ్వార్లు దర్శించిన ద్రావిడప్రబంధములలో నమ్మాళ్వార్లుగా ప్రసిద్ధిచెందిన శ్రీ శఠకోపులు ప్రసాదించిన 'తిరువిరుత్త, తిరువాశిరియ, పెరియతిరువన్దాది, తిరువాయ్‌మొழி' ప్రబంధములు నాల్గువరునగా ఋగ్యజురథర్వణ సామవేదతుల్యములని శ్రీ వైష్ణవ సంప్రదాయమున ప్రసిద్ధికలదు. "ఇయల్ మూన్లుమ్ వేదత్రయమ్‌పోలే, పణ్ణార్‌పాడల్ పణ్బురై యిశైకళ్ వేదమ్‌పోలే' ' (50) అనుచు 'ఆచార్యహృదయ' కారులు ఈ అంశమును తెలుపుటయేకాక, ఋగ్వేదమే "ఋచఃసామరసః" అను రీతిలో సామరూపములో విస్తృతమగునట్లే, ఋగ్వేదసమమగు 'తిరువిరుత్త' ప్రబంధములో, గల నూరు పాశురములే సామవేదతుల్యమగు 'తిరువాయ్‌మొழி' ప్రబంధములోని నూరుదశకములుగా విస్తరించిన వనుటను - "ఋక్కుసామత్తాలే సరసమాయ్, స్తోభత్తాలే పరమ్బుమాపోలే, శొల్లార్ తొడైయల్ ఇశైకూట్టు అమర్ శువైయాయిరమ్ ఆయ్‌త్తు" (51) అనుచు ఉద్ఘాటించిరి. కావున 'తిరువిరుత్త, ప్రబంధమునకు వివరణమే తిరువాయ్ మొழி'. ఇట్లు చతుర్వేదసమానములైన నాలుగు ప్రబంధములను దర్శించిన నమ్మాళ్వార్లు,

నాలుగువేదములను దర్శించి వర్గీకరించిన వ్యాసభగవానుడు కవిగా, ఋషిగా, మునిగా కీర్తింపబడినట్లే "ఋషింజుషామహే" అని ఋషిగా "శఠకోపమునింవందే' ' అని మునిగా, "ఒణ్ణియొణ్ణియులకమ్ పడైత్తాన్ కవియాయ్ నేఱ్ఱ" అని కవిగా కీర్తింపబడిరి.

ప్రస్తావము, ఉద్గీథము, ప్రతిహారము, ఉపద్రవము, నిధనము అను ఐదు విధములైన భాగములను సామముకల్గినదైనను వీనిలో "సామ్నఉద్గీథోరసః" అనునట్లు ఉద్గీథమే సామవేదరసము. "ఓ మిత్యేతదక్షరముద్గీథముపాసీత" అనునట్లు ప్రణవ పూర్వకముగా ఉద్గీథము గానముచేయబడును. సామవేద సదృశమైన 'తిరువాయ్మొషి' ప్రబంధముకూడ ఇట్లే ప్రణవ పూర్వకముగా గానము చేబడుట ప్రత్యక్షసిద్ధము. అదెట్లనగా - ఆప్రబంధములోని మొదటిపాశురములోగల మొదటి మూడుపాదముల ప్రారంభములో వరుసగా ఉకార, మకార, అకారములు ఘటితములగుటచే ప్రణవము ప్రబంధ ప్రారంభమున అనుసంధింపబడినది. ఇట్లు ఉద్గీథసూచకమై, భగవద్వాచకమైన "ఉత్" అను నామమును ప్రబంధములోని ఆద్యంతాక్షరములతో స్ఫురింపజేయుటకు, పరమగుహ్యమైన, అధికృతాధికారమైన ప్రణవములను స్త్రీ, బాలాదులుసైతము వ్యత్యస్తముగా నైనను అనుసంధింప వీలుగా నుండుటకును, ప్రణవములోగల అకార-ఉకార-మకారములు వరుసగా అనుసంధింపబడకపోవుటలోని తాత్పర్యము. కావున, 'తిరువాయ్మొషి' ప్రబంధము సామవేదమునకు చెందిన ఛాందోగ్యముతో సదృశమని ఏర్పడుచున్నది.

ఛాందోగ్యోపనిషత్తులో చివర ముక్తుని అర్చిరాదిగతిని గూర్చి తెల్పబడినట్లే,' తిరువాయ్మొషి' ప్రబంధమునందును చివరలో 'శూష్విశుంబు" (10 - 9) అను దశకములో అర్చిరాదిగతి వర్ణింపబడుటను ఈ ప్రబంధమునకు ఛాందోగ్యమునకు మధ్యగల సామ్యమునకు వేరొక తార్కాణముగా గ్రహింపవచ్చును.

ఇంతియేకాక 'తిరువాయ్ మొషి' లోని పలుసూక్తులు ఛాందోగ్యములోని పలువాక్యముల భావమును స్మరింప జేయుచున్నవని. పూర్వాచార్యులు పలువురు తమ వ్యాఖ్యలలో నిరూపించిరి.

"తామోదరనై త్తని ముదల్వనై" (2-7-12) అను 'తిరువాయ్మొషి' సూక్తిలోని "ముతల్ తనివిత్తేయో" - "తనిముదల్వన్" - అను ప్రయోగములు "సదేవ

సౌమ్యేదమగ్ర ఆసీత్, ఏకమేవాద్వితీయమ్" (6-2-1) అనుచు ఛాందోగ్యంలో తెల్పబడిన భగవానుని త్రివిధకారణత్వను సూచించుచున్నవని; "నామవన్ ఇవన్ ఉవన్ (1-1-4) అను 'తి.వా.మొషి' సూక్తి "సర్వంఖల్విదంబ్రహ్మ" (3-14-1) అను ఛాందోగ్యసూక్తిని పరామర్శించు చున్నదని, "శెయ్యతామరై కణ్ణనాయ్" - (తి.వా.మొ. 3-6-1) అను సూక్తి "యథా కప్యాసంపుండరీకమేవమక్షిణీ (1-6-6 అను ఛాందోగ్యసూక్తిని తలపింప జేయు చున్నదని "శమన్కొళ్వీడు తరుమ్" (3-3-7) అను"తిరువాయ్మొషి" సూక్తి "స్వేనరూపేణాభి నిష్పద్యతే" (8-12-2) అను ఛాందోగ్య ప్రయోగమును సూచించు చన్నదని; ఇట్లు పలు సందర్భములలోని 'తి.వా.మొషి' సూక్తులు ఆయాఛాందో గ్యోపనిషత్ వాక్యార్థాను సంధాయకములని నంబిళ్ళై మొదలగు ఆచార్యవర్యులు వివరించి చూపిరి. అందుచే తిరువాయ్ మొషి ప్రబంధము చాందోగ్యోపనిషత్సమానమనుటచే దానిని ద్రవిడోపనిషత్ శబ్దముచే నిర్దేశించుట మిక్కిలి యుక్తము.

ఇట్లు ప్రధానముగా ఛాందోగ్యసమమనదగియున్నను, తిరువాయ్ మొష ప్రబంధము పలుఇతరో పనిషద్వాక్యముల అర్థమును తెలుపుచున్నది. ఉదాహరణకు ~~"యావయుమ్ పనిషద్వాక్యముల అర్థమును తెలుపుచున్నది. ఉదాహరణకు~~ "యావయుమ్ యావరుమ్ పిణంగి" - (6-28) అను ప్రకృత ప్రబంధ సూక్తి "తమః పరేదేవేకీభవతి" (సుబాలోపనిషత్ 2) అనుసుబాలోపిని షద్వాక్యార్థమును, "ఆదుమిల్పాష్ నెడు ఞ్జాలత్తు నన్మై పునల్వణ్ణి, నాన్ముగనై ప్పణ్ణి" (7-5-4) అను తి.వా.మొషిసూక్తి "యోబ్రహ్మాణంవిదధాతిపూర్వం" (6-18) అను శ్వేతాశ్వతరోపనిషత్ సూక్తి భావమును. "అరువాకి నిఱ్కుమ్ వళరొళిఈశనై" (3-10-10) అను తి.వా.మొషిసూక్తి "అనశ్నన్నన్యో అభిచాకశీతి" (3-1-1) అను ముండకోపనిషత్సూక్తిని, "ఎన్నాపినుళానే" (1-9-7) అను తి.వా.మొషిప్రయోగము, "యోవాచితిష్ఠన్" (5-7-21) అను బృహదారణ్యకోపనిషత్సూక్తిని, "ఆరుయిరేయో" (8-1-5) అను తి.వా.మొషిసూక్తి "ప్రాణస్యప్రాణః" (1-2) అను కేనోపని షత్సూక్తిని, "వరన్మృతలాయవై ముషుదుణ్ణపరపరన్" (1-1-8) అను తి.వా.మొషిసూక్తి" యస్యబ్రహ్మచక్షత్రంచ ఉభేభవతి ఓదనః మృత్యుర్యస్యోపసేచనమ్ క ఇత్థావేద యత్రసః" (1-2-25) అను కఠోపనిషద్వాక్యమును, "తన్మృడి వొన్టిల్లాద" అను తి.వా.మొషిసూక్తి "యతోవాచోనివర్తంతే" (2-8) అను తైత్తిరీయో పనిషత్సూక్తిని తలపింప చేయుచున్న

వను పూర్వాచార్యుల వివరణములను ఇచట అనుసంధింపనగును. ఈ విధముగా తిరువాయ్ మొషిలోని పలు ప్రయోగములు అనేక ఉపనిషద్వాక్యార్థములను ప్రకాశింప చేయుటచే ఈ ప్రబంధమును ద్రవిడోపనిషత్ అనుట అన్వర్థముకదా! కావుననే దేశికులు దీనికి ఆ పేరును పెట్టిరి.

ఈ ద్రవిడోపనిషత్తు ఒక గొప్పసాగరము. నాథమునులు దీనిని "ద్రావిడవేదసాగరమ్" అనిరి. దీనిని అనుసరించుచు శ్రీదేశికులు ఈ ప్రబంధమును, తాత్పర్యరత్నావళి ప్రారంభములో "శఠజిదుపనిషదుగ్ధసింధుమ్" అని , చివరలో "శుద్ధబోధార్ణవ" మనియు సాయించిరి. సాగరము పలురత్నములకు ఆకరము. ఈ ద్రవిడోపనిషత్సాగరము నందును మహార్ఘములైన రత్నము లెన్నియో నిక్షిప్తములై యున్నవి. అవి సామాన్యులకు అందుబాటులో నుండునవికావు. కావున పరమకారుణికులైన దేశికులు తమబద్ధి అను మంథర పర్వతముతో ఈ సాగరమును మథించి, అందలి అమూల్యములైన తాత్పర్యార్థములను రత్నములను సేకరించి, సంస్కృతీకరించి, వానిని గ్రథనము చేసి రత్నావళిగా రూపొందించిరి. అదియే ప్రస్తుతము వ్యాఖ్యాతమగుచున్నద్రవిడోపనిత్తాత్పర్యరత్నావళీ ప్రబంధము.

ఇందునూటికి మించిన స్రగ్ధరావృత్తనిబద్ధములైన శ్లోకములు కలవు. వీనిలో మొదటి 10 శ్లోకములు ఉపోద్ఘాతరూపములు. ఈ శ్లోకములలో తిరువాయ్ మొషిప్రబంధము యొక్క, తత్ప్రణీత లైన శ్రీశఠకోపుల యొక్క ప్రబంధ ప్రతిపాద్యార్థము యొక్క వైలక్షణ్యమును, "భాషాగానం నగాతవ్యమ్" అనుచు దేశీయభాషలో భగవ ద్గానము చేయరాదను నియమము ఇచటవర్తింపకుండుటను, తిరువాయ్ మొషి ప్రబంధము యొక్క చతుర్వేద రూపత్వమును, శారీరక మీ మాంసాసామ్యమును ఇందు పది శతకములలో భగవానుని సేవ్యత్వాది గుణదశకము ప్రతిపాదింవబడుటయును, ఇందలి నూరు దశకములు భగవానుని నూఱుగుణవిశేషములను సూచించుటను "యాని నామాని గౌణాని" అనునట్లు శ్రీ విష్ణుసహస్రనామములోని వేయినామములు భగవానుని వేయి గుణములను ప్రదర్శించునట్లే 'నామఙ్గళాయిరత్తుళ్' అను శఠకోపసూక్తి ప్రకారము ఈ ప్రబంధములోని వేయి పాశురములువేయి గుణములకు ప్రకాశములగుటయును తెలుపబడినవి. ఇట్టి ప్రక్రియను దృష్టిలో నుంచుకొనియే దేశికులు తిరువాయ్ మొషి ప్రబంధములో గల ఒక్కొక్క పాశురములో నున్న ప్రాణభూతమైన ప్రయోగమును

ఒక్కొక్క గుణముగా నుడివిరి. ఉదాహరణకు - ప్రబంధములోని మొట్టమొదటి పాశురములోని "ఉయర్వఱ ఉయర్నల ముడైయవన్" అను ప్రయోగమును "నిస్సీమోద్య ద్గుణత్వాత్" అనుచు సంస్కృతీకరించిరి. ఇట్టివిదానమునే కృతిలో సర్వత్రపాటింపబడుటను గమనింపవచ్చును. ఇట్లు ప్రతి దశకమునకు ఒక్కొక్క శ్లోకము చొప్పున రచింపబడినది. దీనితోపాటు, అచ్చటచ్చట స్వాపదేశార్థములను విశదీకరించుటకై అధికముగా కొన్ని శ్లోకములును అనుగ్రహింపబడినవి.

ఉదాహరణకు - ప్రథమశతక చతుర్థ దశకమగు "అఞ్జిఱైయు" దశకములోని పదిపాశురములలో గల స్వాపదేశార్థములను "సధ్రీభవ్యాన్" అను ఒక ప్రత్యేకమైన శ్లోకములో నిబంధించిరి. ప్రతి శతకము చివర ఆశతకములోని పది దశకములలో అనుసంధింప బడిన పది గుణములను తెల్పుచు అధికముగా ఒక్కొక్క శ్లోకమును అనుగ్రహించిరి. ఈ విధముగా తాము ప్రారంభమున తిరువాయ్ మొషిలోని నూఱు దశకములు భగవానుని నూఱు గుణములను, వేయిపాశురములు వేయి గుణములను సూచించుచున్నవనుటను నిరూపించిరి. చివరలో మరల వేరొకపర్యాయము పదిశతకములలో కీర్తింపబడిన పది గుణములను "ఇత్థంసేవ్యం సుభోగ్యమ్" అను శ్లోకములో వ్యక్తీకరించిరి. ఆ పిమ్మట నమ్మాళ్వార్లు సాయించిన నాల్గు ప్రబంధములతాత్పర్యమును "ఆద్యేస్వీయప్రబంధే" అను శ్లోకముననుడివి, తదుపరి రెండు శ్లోకములలో పునః తిరువాయ్ మొషి ప్రబంధములోని అర్థ విశేషములను సంగ్రహించిరి. చివరగా తాము అనుగ్రహించిన తాత్పర్యరత్నావళీ ప్రబంధము తిరువాయ్ మొషి ప్రబంధప్రతిపాద్యుడైన శ్రీరంగనాథునకు, తద్భక్తులకు ను హృదయ ధార్యము కాగలదని ఆశంసించుచు కృతిని ముగించిరి.

తిరువాయ్ మొషి ప్రబంధమునకు దశోపనిషద్భాష్యకారులగు శ్రీరంగరామానుజముని వరులు ప్రసాదించిన ఒన్బది నాయిరప్పడి అను సంస్కృత వ్యాఖ్య, పెరియ పరకాలస్వామి వారు సాయించిన పదినెణ్ణాయిరప్పడి అను మణి ప్రవాళవ్యాఖ్యయుకలవు. ఈ వ్యాఖ్యలలో సర్వత్ర ద్రవిడోపనిషత్తాత్పర్యరత్నావళీ శ్లోకములు బహుత్ర ప్రస్తావింపబడుటయేకాక, ఆ శ్లోకములలో దేశికులు ఏ విశేషణమును 'తిరువాయ్‌మొషి'లోని ఏ ప్రయోగమును దృష్టిలో నుంచుకొని ప్రయోగించిరో వివరింపబడినది. ఈ వ్యాఖ్యలు రెండును బ్రహ్మతంత్ర పరకాల మహాదేశికస్వామివారి ఆజ్ఞానుసారము చెన్నైనగరములోని గీతాచార్యముద్రాక్షరశాలలో

1942 వ సం. న ముద్రింపబడినవి. ఈ ముద్రణలో ఏకారణము వలననో "ఇత్థంసద్వారగమ్యమ్" అను షష్ఠశతక సంగ్రహశ్లోకము కన్పించుటలేదు.

ద్రవిడోపనిషత్ తాత్పర్యరత్నావలికి శ్రీవేంకటాచార్యస్వామివారి మణి ప్రవాళ వ్యాఖ్యకలదు. ఇది పూర్వోక్త ఒన్బది నాయిరప్పడి, పది నెణ్ణాయిరప్పడి వ్యాఖ్యలతో పాటు ముద్రించి బడుట యేకాక, తత్పూర్వమే ఆఱాయిరప్పడి, పన్నీరాయిరప్పడి, ఈడు ముప్పత్తాఱాయిరప్పడి - ఇత్యాది వ్యాఖ్యాన త్రయముతో ముద్రింపబడినకోశములందు, ఆఱాయిరప్పడి, ఒన్బది నాయిరప్పడి, పన్నీరాయిరప్పడి కోశము (గ్రంథము) లందును ప్రచురితమైనది. తెనుగుభాషలో టీకాతాత్పర్యములు మాత్రము ప్రచురింపబడినవి.

ఇంతవరకు ఈకృతిని ఆంధ్రములో సమగ్రమైన సంప్రదాయ రస్యరహస్యార్థ విశదీకరణచణమైన, సహృదయ హృదయావర్జకమైన వ్యాఖ్యానము రచింప బడలేదనుకొఅతను వ్యాఖ్యాతృశిరోమణులు ఉ.వే.శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యస్వామి వారు తమ ప్రకాశికావ్యాఖ్యతో సంపూర్ణముగా తీర్చిరి. వీరు ఇతః పూర్వమే గోదాస్తుతి, భగవద్ధ్యానసోపానము వంటి దేవిక కృతస్తోత్రములకు బుధరంజకములైన వ్యాఖ్యానములను వెలయించి ప్రసిద్ధులగుటయేకాక, అనితర సాధారణమైనరీతిలో పాదుకాసహస్రమునకు 'రమణీయ, మను సార్థక వ్యాఖ్యను అయిదు సంపుటములలో నమకూర్చి, శ్రీవైష్ణవ సంప్రదాయజ్ఞులను, విశేషించి ఆంధ్రపాఠకులను అధమర్ణులనుగావించుకొనిరి. గడచిన సంవత్సరములో వీరు బమ్మెరపోతనామాత్య ప్రణీతమైన నారాయణశతకమునకు కూర్చిన రాఘవీయవ్యాఖ్య పలువురి విద్వాంసుల, రసజ్ఞులమెప్పును పొందినది. వీరి వ్యాఖ్య లన్నియు అవశ్యక సర్వవిషయ సంకలితములై, మధురశైలీ శోభితములై, పండిత పామర రంజకములై ఒప్పారు చున్నవి.

ఈ వ్యాఖ్యలన్నియు ఒక ఎత్తుకాగా, ప్రస్తుతము స్వామివారు సంతరించిన ప్రకాశికా వ్యాఖ్య ఒక ఎత్తు. ఇది కేవలము తాత్పర్యరత్నావళీ శ్లోకములలోని ప్రయోగము లను వివరించుటతో పర్యాప్తముకాలేదు. తన్మూలములైన తిరువాయ్‌మొషి పాశురములలో నిరస్యరహస్యార్థములను పుర్వాచార్యుల వ్యాఖ్యలను అనుసరించి సందర్భోచితముగా విశదీకరించుట దీని వైలక్షణ్యమును

నిరూపించుచున్నది. ఉదాహరణకు - తి.వా.మొషి లోని "తయరఱు శుడరడి " అను మొదటి పాశురం ప్రారంభ ములో గల) విశేషణము కంచివరదరాజస్వామిని ఉద్దేశించి అనుగ్రహించబడినదనే సంప్రదాయరహస్యాన్ని వ్యాఖ్యాతలు ఉట్టంకించారు. ఈ స్వారస్యము ఆపాశురంలోని "అమరర్ కళ్ అదిపతి" అనే ప్రయోగాను గుణముగ అర్చా మూర్తులలో "దేశాధిరాజు" నాయుడు వరదరాజస్వామియేకదా! ఈ స్వారస్యము శ్రీ కాంచీ మహావిద్వాన్ అణ్ణాస్వామి వారు సాయించారు.

అట్లే మొదటిశతకం చతుర్థ దశకంలోని "ఇన్నడి శల్ వైప్పారై నాడాయే" అనే ప్రయోగాన్ని వివరిస్తూ తిరుమలనంబికి సంబంధించిన ఐతిహ్యాన్ని ఉట్టంకించిరి. వ్యాఖ్యాతలు తమ వ్యాఖ్యలో ఆయా విశేషములను విశదీకరించే ప్రయత్నములో పలువైదిక, పౌరాణిక, దివ్య ప్రబంధసూక్తులను ఆకర సహితముగా ప్రమాణములుగా ఎత్తి చూపుటతో పాటు తమిళ, తెనుగు సాహిత్యములలో గల ప్రయోగములను కూడా గ్రహించుట విశేషము. "కారుణ్యాప్తత్వ యోగాత్" అనే తాత్పర్యరత్నావళీ సూక్తిని విశదీకరించుచు గోపీనాథవేంకట రామాయణములోని "ఏను బ్రతికి యుండ నినకుల వరుడు" ఇత్యాది పద్యమును ఉద్ధరించి ప్రమాణముగాగైకొనిరి. "వళవేఘలకిన్" అనే (1-5) దశకసారమును తెలిపే శ్లోకము లోని "క్షుద్రాహ్వానాభిముఖ్యాత్" అనే విశేషణమును వివరించుచు శ్రీపిళ్ళై ప్పెరుమాళ్ అయ్యఙ్గార్ సాయించిన 'నూత్తెట్టు తిరుపతి అన్దాది'లోని "పణ్డేఉన్" అనే పాశురమును ప్రమాణముగా గ్రహించిరి. ఇవన్నీ వీరి బహు భాషావైదు ష్యమును, బహుగ్రంథానుశీలన తత్పరతను, మూలగ్రంథ తాత్పర్యమును సమగ్రముగా వివేచించగలిగే సామర్థ్యమును నిరూపించుచున్నవి. వీరు కేవలము ఈడు వ్యాఖ్యానమునే కాక, ఇరుపత్తు నాలాయిరప్పడి వంటి ఇతర వ్యాఖ్యాలను కూడ పరిశీలించినారనే విషయము "శర్వాదేః స్వాంగదానాత్" అను ప్రయోగ వివరణము వలన స్పష్టమగు చున్నది. ఈ విధముగ ప్రకాశికా వ్యాఖ్యను సేవించినపుడు, అది కేవలము ద్రవిడోపనిషత్ తాత్పర్యరత్నావళికి వ్యాఖ్యానము మాత్రమే కాదని, తిరువాయ్ మొషి కి గల వ్యాఖ్యానము లన్నిటిలో నిక్షిప్తములై యున్న, మధురములైన సకల సంప్రదాయ విశేషార్థములను విశదీకరించు అద్వితీయవ్యాఖ్యారూపమైన ఉద్గ్రంథమని ఎవరికైనను వ్యక్తముకాగలదు. ఇది సంప్రదాయరసజ్ఞులను మెప్పించు

ఉత్తమమైన వ్యాఖ్య అనుటలో అతిశయోక్తి లేదు. తెలుగు పాఠకులను, ప్రత్యేకించి సంప్రదాయజ్ఞులను శ్రీస్వామివారు ఈ ప్రకాశికావ్యాఖ్యానముతో మరింతగా అధమర్ణులను చేసికొన్నారు.

శ్రీమాన్ స్వామి వారికి తెలిసిన విజ్ఞులైన పెద్దలెందఱో ఉన్నను అల్పజ్ఞుడనైన నన్ను తిరువాయ్ మొషి మొదటి శతకమును వివరించు తాత్పర్యరత్నావళీ శ్లోకముల వ్యాఖ్యను గూర్చి విన్నపింపుమని ఆజ్ఞాపించుట వారికి నా మీద ఉన్న వాత్సల్యాతిశయమును, వారి హృదయ వైశాల్యమును తెలియజేయుచున్నది. పెద్దల ఆజ్ఞ శిరోధార్యమనే ఒక్కభావన తోనే దాసుడు ఈ సాహసమును చేసినాడు. సహృదయులు క్షమింతురని ఆశింతును. నాకీ గొప్ప అవకాశమును అనుగ్రహించిన వ్యాఖ్యాతలు ఉ.వే.శ్రీమాన్ కే.వి. రాఘవాచార్యస్వామివారికి, వారి సోదరులకుమారులైన ఉ.వే శ్రీమాన్ చ. లక్ష్మీ నరసింహాచార్యస్వామి వారికి సవినయముగ కృతజ్ఞతాంజలులను సమర్పించుకొనుచు రసజ్ఞులైన, సంప్రదాయ శ్రద్ధాళువులైన పాఠకులను 'ప్రకాశికావ్యాఖ్య'ను సావధానముగా ఆవలోకించి, ఆనందింప వేడుచున్నాను.

ఈ విధముగనే శ్రీమాన్ స్వామి వారు పూర్ణారోగ్యముతో చిరకాలమువేంచేసి యుండి ముముక్షుజన జీవాతువులైన కృతి రత్నములను ప్రసాదించునట్లు వారిని అనుగ్రహించవలసినదిగా మాకుల దైవమగు తిరుమల శ్రీనివాస ప్రభువు సన్నిధిలో ప్రార్థించుచున్నాను.

శ్రీమతే వేంకటేశాయ వేదాన్తగురవేనమః

తిరుపతి
విజయదశమి
5-10-2003

ఇట్లు
భాగవతవిధేయుడు,
ఈ.ఏ.శింగరాచార్యులు



శ్రీమతే రామానుజాయనమః
శ్రీమన్నిగమాంత దేశికాయ నమః

అంతరంగము

"సర్వతీర్థమయీ మాతా సర్వదేవమయః పితా ।
మాతరం పితరం తస్మాత్ సర్వయత్నేన పూజయేత్ ॥"

అనునది సర్వజనులకు అత్యంత ప్రాధాన్యమైన సూక్తి. వేదము కూడా "మాతృదేవోభవ-పితృదేవోభవ" అని జన్మప్రదాతల వైభవమును తెలిపి వారిపట్ల సంతానము ప్రదర్శించవలసిన అమూల్య ధర్మాలను తెలిపినది.

ప్రేమ పొత్తిళ్ళలో అనురాగ క్షీరామృతమందించి స్వార్థములేని దివ్యభావనతో మా భవిష్యజ్జీవితానికి మార్గాలు వేసి మమతతో విద్యాబుద్ధులు నేర్పి మమ్మల్నింత వారిగా తీర్చిదిద్దినవారు మా అమ్మానాన్నలే కదా! మరి వారందించిన మహా సౌభాగ్య ఋణాన్ని తీర్చుకోవడానికి మేమేమి చేయగలము?

అయినా ఎంతోకొంత మావల్ల అయినంత మా జననీ జనకుల స్మృతి చిహ్నంగా ఒక మంచి పని చేయాలన్న ఆలోచన వచ్చినప్పుడు, కవితార్కిక కేసరి, వేదాంత దేశికుల విరచితమైన "ద్రవిడోపనిషత్తాత్పర్యరత్నావళి"ని చక్కని వ్యాఖ్యతో ప్రచురించవలెనను కోరిక కలిగినది.

మా మాతృమూర్తి తీర్థతిరువధ్యయన కార్యక్రమ సందర్భముగా వేంచేసిన, దేహబంధువులు (చిన్నాన్న) వాత్సల్య సింధువులు ఉభయవేదాన్తములనెరిగిన మహా పండితులు శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యుల వారికి మా మనసులోని మాటను విన్నవించి అర్థించగా వారందుకంగీకరించి, శ్రమకోర్చి 'ద్రవిడోపనిషత్తాత్పర్యరత్నావళి' కి 'ప్రకాశికా వ్యాఖ్య' వ్రాయసంకల్పించిరి. అయితే వ్యాఖ్యానము బృహత్కార్యమగుట వలన, విషయము గంభీరమగుటవలన ఒక్కమారు కాక మూడంచలుగా ప్రచురించుట భగవన్నిర్ణయముగా భావించినాము.

శ్రీవైష్ణవుల కార్యక్షేత్రములు మూడు (1) అష్టాక్షరీ స్వరూపులైన శ్రీ కంచి వరద రాజ స్వామి వారు (2) ద్వయస్వరూపులైన శ్రీరంగనాయకులవారు (3) చరమశ్లోక స్వరూపియైన తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారు కాన "ద్రవిడోపనిషత్తాత్పర్య రత్నావళి, ప్రథమ సంపుటమైన ఈ గ్రంథము **అష్టాక్షరీ స్వరూపులైన శ్రీ కంచి వరదరాజస్వామి వారికి అంకితము చేస్తున్నాము.** ఇట్టి మహద్భాగ్యమును కలిగించిన శ్రీకంచి వరదరాజుల పాదపద్మాల, శిరస్సుల అధిరోహింప జేసుకొన్నాము.

మా మనవిని మన్నించి, వయోభారమును లెక్కచేయక, శ్రమకోర్చి సులభ శైలిలో "ప్రకాశికావ్యాఖ్య" నందించి "ద్రవిడోపనిషత్తాత్పర్యరత్నావళి" ప్రథమ సంపుటం సిద్ధం చేసిన మా కనిష్ట పితృపాదులకు సాష్టాంగదండవత్ప్రణామాలు.

ప్రకాశికా వ్యాఖ్యానానికిప్రశంసలందించిన సాంప్రదాయ సారస్వత ధురీణులు మాన్యులు శ్రీమాన్ ఈయుణ్ణి శింగరాచార్య స్వామి, తిరుమల వారి చరణకమలాల కనేక నమస్కృతుల మంజరులు.

అచ్చుపనులలో మమ్మనుసరించి సహకరించిన ఆత్మీయుడు (అనంతన్న) శ్రీమాన్ మరింగంటి అనంతాచార్య (గూడెం) తె.పం.1, జి.ప.సె.పా. ఎలగందుల గారికి స్నేహాభివందనములు.

తామే పుస్తకాన్ని ప్రచురిస్తున్న విధము ముద్రణ విషయాల్లో అన్ని విధాల మాకు సహకరించి సర్వాంగ సుందరంగా రూపొందించిన 'సాగర్ గ్రాఫిక్స్' కరీంనగర్ యజమాని శ్రీ వావిలాల విద్యాసాగర్‌రెడ్డి గారికి, శ్రీ దావు సదాశివరెడ్డి మరియు సిబ్బందికి కృతజ్ఞతలు.

ప్రచురింపవలసిన రెండు సంపుటములకు త్వరితగతిన వ్యాఖ్యానము కూర్చుటకై వ్యాఖ్యాతకు, ప్రచురించుటకై మాకు సర్వశేషి శ్రీమన్నారాయణుడు, సర్వ విధముల సత్తాను కలిగింపజేయునను దృఢవిశ్వాసముతో ఆస్వామినే నిరంతరం ప్రార్థిస్తూ సెలవు తీసుకొంటున్నాము."భృత్యస్య భృత్య ఇతిమాంస్మరలోకనాథ!"

భాగవత పాదరేణువులు
చక్రవర్తుల లక్ష్మీనర్సింహాచార్యులు
చక్రవర్తుల పవన్‌కుమార్
చక్రవర్తుల లక్ష్మీనారాయణ

తేది 20-10-2003
కరీంనగరము.

శ్రీమతే రామానుజాయనమః
శ్రీమన్నిగమాంత దేశికాయ నమః

అంతరంగము

"సర్వతీర్థమయీ మాతా సర్వదేవమయః పితా ।
మాతరం పితరం తస్మాత్ సర్వయత్నేన పూజయేత్ ॥"

అనునది సర్వజనులకు అత్యంత ప్రాధాన్యమైన సూక్తి. వేదము కూడా "మాతృదేవోభవ-పితృదేవోభవ" అని జన్మప్రదాతల వైభవమును తెలిపి వారిపట్ల సంతానము ప్రదర్శించవలసిన అమూల్య ధర్మాలను తెలిపినది.

ప్రేమ పొత్తిళ్ళలో అనురాగ క్షీరామృతమందించి స్వార్థములేని దివ్యభావనతో మా భవిష్యజ్జీవితానికి మార్గాలు వేసి మమతతో విద్యాబుద్ధులు నేర్పి మమ్మల్నింత వారిగా తీర్చిదిద్దినవారు మా అమ్మానాన్నలే కదా! మరి వారందించిన మహా సౌభాగ్య ఋణాన్ని తీర్చుకోవడానికి మేమేమి చేయగలము?

అయినా ఎంతోకొంత మావల్ల అయినంత మా జననీ జనకుల స్మృతి చిహ్నంగా ఒక మంచి పని చేయాలన్న ఆలోచన వచ్చినప్పుడు, కవితార్కిక కేసరి, వేదాంత దేశికుల విరచితమైన "ద్రవిడోపనిషత్తాత్పర్యరత్నావళి"ని చక్కని వ్యాఖ్యతో ప్రచురించవలెనను కోరిక కలిగినది.

మా మాతృమూర్తి తీర్థతిరువధ్యయన కార్యక్రమ సందర్భముగా వేంచేసిన, దేహబంధువులు (చిన్నాన్న) వాత్సల్య సింధువులు ఉభయవేదాన్తములనెరిగిన మహా పండితులు శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యుల వారికి మా మనసులోని మాటను విన్నవించి అర్థించగా వారందుకంగీకరించి, శ్రమకోర్చి 'ద్రవిడోపనిషత్తాత్పర్యరత్నావళి' కి 'ప్రకాశికా వ్యాఖ్య' వ్రాయసంకల్పించిరి. అయితే వ్యాఖ్యానము బృహత్కార్యమగుట వలన, విషయము గంభీరమగుటవలన ఒక్కమారు కాక మూడంచలుగా ప్రచురించుట భగవన్నిర్ణయముగా భావించినాము.

శ్రీవైష్ణవుల కార్యక్షేత్రములు మూడు (1) అష్టాక్షరీ స్వరూపులైన శ్రీ కంచి వరద రాజ స్వామి వారు (2) ద్వయస్వరూపులైన శ్రీరంగనాయకులవారు (3) చరమశ్లోక స్వరూపియైన తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారు కాన "ద్రవిడోపనిషత్తాత్పర్య రత్నావళి, ప్రథమ సంపుటమైన ఈ గ్రంథము **అష్టాక్షరీ స్వరూపులైన శ్రీ కంచి వరదరాజస్వామి వారికి అంకితము చేస్తున్నాము.** ఇట్టి మహద్భాగ్యమును కలిగించిన శ్రీకంచి వరదరాజుల పాదపద్మాల, శిరస్సుల అధిరోహింప జేసుకొన్నాము.

మా మనవిని మన్నించి, వయోభారమును లెక్కచేయక, శ్రమకోర్చి సులభ శైలిలో "ప్రకాశికావ్యాఖ్య" నందించి "ద్రవిడోపనిషత్తాత్పర్యరత్నావళి" ప్రథమ సంపుటం సిద్ధం చేసిన మా కనిష్ఠ పితృపాదులకు సాష్టాంగదండవత్ప్రణామాలు.

ప్రకాశికా వ్యాఖ్యానానికిప్రశంసలందించిన సాంప్రదాయ సారస్వత ధురీణులు మాన్యులు శ్రీమాన్ ఈయుణ్ణి శింగరాచార్య స్వామి, తిరుమల వారి చరణకమలాల కనేక నమస్కృతుల మంజరులు.

అచ్చుపనులలో మమ్మనుసరించి సహకరించిన ఆత్మీయుడు (అనంతన్న) శ్రీమాన్ మరింగంటి అనంతాచార్య (గూడెం) తె.పం.1, జి.ప.సె.పా. ఎలగందుల గారికి స్నేహాభివందనములు.

తామే పుస్తకాన్ని ప్రచురిస్తున్న విధము ముద్రణ విషయాల్లో అన్ని విధాల మాకు సహకరించి సర్వాంగ సుందరంగా రూపొందించిన 'సాగర్ గ్రాఫిక్స్' కరీంనగర్ యజమాని శ్రీ వావిలాల విద్యాసాగర్‌రెడ్డి గారికి, శ్రీ దావు సదాశివరెడ్డి మరియు సిబ్బందికి కృతజ్ఞతలు.

ప్రచురింపవలసిన రెండు సంపుటములకు త్వరితగతిన వ్యాఖ్యానము కూర్చుటకై వ్యాఖ్యాతకు, ప్రచురించుటకై మాకు సర్వశేషి శ్రీమన్నారాయణుడు, సర్వ విధముల సత్తాను కలిగింపజేయునను దృఢవిశ్వాసముతో ఆస్వామినే నిరంతరం ప్రార్థిస్తూ సెలవు తీసుకొంటున్నాము."భృత్యస్య భృత్య ఇతిమాంస్మరలోకనాథ!"

భాగవత పాదరేణువులు
చక్రవర్తుల లక్ష్మీనర్సింహాచార్యులు
చక్రవర్తుల పవన్‌కుమార్
చక్రవర్తుల లక్ష్మీనారాయణ

తేది 20-10-2003
కరీంనగరము.

శ్రీవేదాన్తదేశికుల సంగ్రహ జీవితచరిత్ర

గురుభ్యస్తద్గురుభ్యశ్చ నమోవాకమధీమహే।
వృణీ మహేచతత్రాద్యౌదమ్పతీజగతాంపతీ॥

శ్రియఃపతి, ఉభయవిభూతినాయకుడైన శ్రీమన్నారాయణుడు హంస, మత్స్య, హయగ్రీవ, నరనారాయణాద్యనేకావతారాలెత్తి సంసార ప్రవాహంలో పడి కొట్టుమిట్టాడుతున్న జీవులు తనను ఉపాసించి తరించడం కోసం వేదమార్గాన్ని నెలకొల్పాడు. భగవత్తత్త్వాన్ని తెలిపే శాస్త్రాలను ప్రవర్తింపజేశాడు. అజ్ఞానులైన చేతనులు ఆ సౌలభ్యాన్ని గమనించకపోవడమే కాక "అవజానంతిమాం మూఢాః" అని ఆయన ఆవేదన పడే రీతిగా ప్రవర్తించారు. భగవానుడు పరమదయాళువు కాబట్టి మరొక ఉపాయాన్ని పన్నినాడు. క్రూర మృగాలను పట్టుకొనే వ్యక్తి మరొక మృగాన్ని ఎరగా చూపి వాటిని పంజరంలో పడేలాగా చేసుకొంటాడు కదా! అలాగే సర్వేశ్వరుడు తన పారిషదులలో కొందరిని ఈ జీవులతో సమానంగా లోకంలో అవతరింపజేస్తే, వారి ఉపదేశానుష్ఠానాలవల్ల జనులు జ్ఞానులవుతారని ఆశించి, క్రమంగా ఆళ్వారులనూ, ఆచార్యులనూ అవతరింపజేశాడు.

ప్రాచీనమైన విశిష్టాద్వైత సంప్రదాయాన్ని ఆళ్వారులు భగవద్భక్తి పరీవాహ రూపాలైన తమ దివ్య ప్రబంధాల ద్వారా ప్రపంచానికి వెల్లడించారు. తర్వాత 11 వశతాబ్దిలో శేషాంశ సంభూతులైన భగవద్రామానుజాచార్యులు బాగా చెదరిపోయిన వైదిక పద్ధతిని చక్కదిద్ది, శ్రీభాష్యాది సంస్కృత గ్రంథాలద్వారా ఆ విశిష్టాద్వైత సిద్ధాంతాన్నే స్థిరీకరించి జగదుపకారులైనారు.

కొంత కాలానికి ఉభయవేదాంత సంప్రదాయప్రవిష్టులలోనూ ఆచారధర్మాలను పాటించడం పట్ల ఔచిత్యానౌచిత్యాలను గమనింపలేనట్టి లోపాలు ఏర్పడినాయి. అందువల్ల జ్ఞానానుష్ఠానాలమూలంగానూ, ప్రబంధ రచనలచేతనూ శ్రీభాష్యాన్ని బలపరుస్తూ, రామానుజ సిద్ధాంతానికి మంచి పూనికనిచ్చే మరొక అవతారం అత్యవసరమయింది. ఆ అవతార విశేషమే శ్రీవేదాన్తదేశికులు.

శ్రీమద్రామానుజాచార్యులవారి అంతేవాసులలో సుప్రసిద్ధులైన శ్రీకూరేశులు, దాశరథి, ప్రణతార్తిహరాచార్యులు మొదలైన గొప్ప విద్వాంసులెందరో ఉండిరి. వీరిలో ప్రణతార్తి హరాచార్యులు సంస్కృతవేదాన్త శాస్త్రంలో ఉద్దండ పండితులు. వీరికి 'కిడంబి అచ్చాన్' అని ప్రసిద్ధమైన పేరు. రామానుజుల వారే వీరికి 'వేదాంతోదయనుడు' అని బిరుదునిచ్చి శ్లాఘించారు.

శ్రీరంగనాథ దేవాలయంలోని అర్చకస్వాములకు రామానుజులవారు విధించిన పడికట్లను పాటించడం కష్టమనిపించింది. యత్యాశ్రమనియమానుసారంగా రామానుజులవారు గృహస్థులైన స్వాములయిండ్లకు ఎప్పటివలె భిక్షకు పోగా, ఒక గృహస్థుడు అన్నంలో విషం కలిపి భిక్షను పెట్టాడు. అంతే వాసులు వన్నెమారిన భిక్షాన్నాన్ని నిషేధింపగా దాన్ని ఒక కుక్కతిని మరణించింది. అప్పటి నుంచి రామానుజులవారు ఉపవాస దీక్షకు పూనుకొన్నారు. వీరిని పరామర్శించడానికి వీరి ఆచార్యులైన మహాపూర్ణులు వస్తుండగా రామానుజులవారు ఎదురేగి సాష్టాంగ ప్రణామంచేశారు. వీరు లెమ్మనలేదు. వారు లేవ లేదు. కావేరిలో పట్టపగలు కాలుతున్న ఇసుకలో కమిలిపోతున్న సుకుమార శరీరాన్ని చూచి సహించలేక ప్రణతార్తిహరాచార్యులు రామానుజులవారిని ఆవేశంతో భుజాలపైన ఎత్తుకొనిపోయి మఠంలో శైత్యోపచారం చేస్తూండగా, మహాపూర్ణులక్కడికివచ్చారు.

'మీకు ప్రాణసమానులైన ఈ అంతరంగశిష్యునితోనే మఠంలో వంటచేయించుకొని ప్రసాదాన్ని స్వీకరించు'మని మహాపూర్ణులు రామానుజుల వారిని ఆదేశించారు. ఈ ప్రణతార్తి హరాచార్యులే రామానుజ మఠంలో ఆచార్యులవారికి మాహానసికులుగా నియమితులైనారు.

వేదాన్తోదయనా (ప్రణతార్తిహరా)చార్యుల పుత్రుడు రామానుజాచార్యులు, వీరి పుత్రుడు పద్మనాభనామాంతరులైన రంగరాజాచార్యులు, వీరికి 'ఆత్రేయ రామానుజాచార్యులు' అనే పుత్రుడు 'తోతాద్ర్యంబ, అనే పుత్రిక కలిగారు. 'కిడాంబి అప్పుళ్ళార్' అనే 'వాదిహంసాంబువాహులు' అనే ప్రసిద్ధనామధేయులైన ఈ ఆత్రేయరామానుజులు, శ్రీ భాష్యానికి శ్రుతప్రకాశికావ్యాఖ్యానకర్తలైన శ్రీ సుదర్శన భట్టర్ (వీరిద్దరు) 'నడాదూర్ అమ్మాళ్' అనే సుప్రసిద్ధులూ, శ్రీ భాష్యసింహసనాధీశులూ అయిన 'వాత్స్య వరదాచార్యుల వారికి శిష్యులు. (దేశికుల వంశవృక్షమున్నపుట దర్శనీయము).

భగవద్రామానుజులవారు నియమించిన చతుస్సప్తతి(74) సింహాసనాధిపతులలో ఒకరైన 'శ్రీ అనంతసోమయాజి' కాంచీనగరంవద్ద 'తూప్పుల్' అనే అగ్రహారంలో దీపప్రకాశాఖ్య దేవాలయసమీపంలో నివసించారు. వీరి పుత్రుడు 'పుండరీకాక్షసోమయాజి'. వీరి పుత్రుడైన 'అనంత సూరి'కి ఆత్రేయరామానుజుల సోదరియైన 'తోతాద్ర్యంబ' ధర్మపత్ని అయింది.

ఈ దంపతులు తిరుమలకు వెళ్ళి శ్రీ వేంకటేశ్వర స్వామికి అర్చన చేసి ప్రార్థించారు. నాటిరాత్రి తోతాద్ర్యంబ గర్భమందు శ్రీ వేంకటేశ్వర స్వామి ఘంటప్రవేశించినట్లు దంపతులు కలగన్నారు. 'అనతికాలంలో' వీరికి సుపుత్రుడు ఆవిర్భవించాడు.

అది విభవ నామసంవత్సరం. 1268 క్రీ.శ॥ (పురటాశి) కన్యామానం. ఆశ్వీజశుక్ల ఏకాదశి, శ్రవణ నక్షత్రం, శ్రీ వేంకటేశ్వరస్వామికి (బ్రహ్మోత్సవంలో) చక్రతీర్థోత్సవం జరుగుతున్న శుభదినం.

విశ్వామిత్రగోత్రానికి చెందిన మహానుభావుడు 'అనంతసూరి' శ్రీ వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రాన అవతరించిన ఆ శిశువుకు 'వేంకటనాథుడు'అని నామకరణంచేశారు.

"ఉత్ప్రేక్ష్యతే బుధజనై రుపపత్తిభూమ్నా ఘంటాహరేస్స మజనిష్ఠయదాత్మనేతి." (సం.సూ) వీరి జీవితకాలంలో లోకులు వీరిని ఆ 'వేంకటేశుని ఘంటావతారు' లని వ్యవహరించారన్న వీరి మాటచే స్పష్టీకృతం.

'అప్పుళ్ళార్' ఆ బాలునికి ఐదవయేట అక్షరాభ్యాసంచేయించి, రామాయణ, భారత, భాగవతకథలను బోధించాడు. ఆ సంవత్సరమే కంచి వరదరాజ దేవాలయంలో శిష్యులకు శ్రీ భాష్యప్రవచనం చేస్తున్న శ్రీ వాత్స్యవరద గురుసన్నిధికి తన భాగినేయుడైన బాలుణ్ని వెంట తీసుకొని వెళ్ళాడు. దివ్యతేజస్సంపన్నుడైన ఈ బాలుణ్ని చూచి, గోష్ఠిలో కాసేపు ప్రవచనం ఆపి, "ఆ బాలుడెవరు?" అని ఆ గురువు అప్పుళ్ళార్ ను అడిగాడు. ఆయన 'తన మేనల్లుడని' చెప్పాడు. ఆగిపోయిన ప్రవచనం ఎంతవరకుపూర్తి అయిందో అని ఆ వరద గురువు ఆలోచించసాగాడు.

"ఆచార్యవర్యా, దాసుడు ఈ గోష్ఠిలో ప్రవేశించుసరికి" శాస్త్రయోనిత్వాత్"

అనే వాక్యార్థాన్ని దేవరవారు ప్రవచిస్తున్నారు కదా" అని సూచించిన ఆ బాలుని జ్ఞాపకశక్తికి సదస్యులందరు ఆశ్చర్యపడినారట. వాత్స్యవరదాచార్యులు మహానుభావులు. వీరికి "నడాధూర్ అమ్మాళ్" అని ప్రసిద్ధ నామమేర్పడింది. 'అమ్మాళ్' అంటే మాతృమూర్తి అని అర్థం. స్త్రీలింగ శబ్దం. వీరు ప్రతిదినం కాచిన పాలు తెచ్చి, నోటితో ఊది చల్లార్చి, వరదరాజ పెరుమాండ్లకు ఆరగింపు సమర్పించేవారు. 'నడాధూర్' గ్రామానికి చెందిన వీరిని ఆవరదరాజ స్వామి " నడాధూర్ అమ్మాళ్ " అని ఆదరంతో పిలిచేవారట.

అట్టి వరదగురువు వేంకటనాథుణ్ని ఆ పాదమస్తకం చూచి,

"ప్రతిష్ఠాపిత వేదాన్తః ప్రతిక్షిప్త బహిర్మతః।
భూయా స్త్రై విద్య మాన్యస్త్వం భూరికళ్యాణ భాజనమ్॥" (సం.సూ)

(నీవు ఇతరమత సిద్ధాన్తాలను ఖండించి, వేదాన్తశాస్త్రసిద్ధాన్తాన్ని స్థిరంగాస్థాపించి వేద మూర్తులచే సమ్మానితుడవై, సకలశుభాలను పొందెదవు గాక) అని అనుగ్రహించారు.

తండ్రిగారు తనయునికి ఏడవయేట యథావిధి ఉపనయన సంస్కారం చేశారు. అప్పటి నుంచి గురువూ, మేనమామగారూ అయిన ఆత్రేయరామానుజాచార్యులు వేంకటనాథునికి శ్రద్ధతో వేద, వేదాంగ, తర్క మీమాంసాది శాస్త్రాలను, రామానుజ దర్శనాది సకలవిద్యలనూ బోధించారు.

శ్రీవేంకటనాథశర్మ మంచి వర్చస్వి, మేధావి, ఏకసంతగ్రాహి, కాబట్టి **"వింశత్యబ్దే విశ్రుతనానావిద్యః"(సం.సూ)** ఇరువదేండ్ల ప్రాయంవరకే సకల విద్యలను అభ్యసించాడు. ఆత్రేయ రామానుజాచార్యులు ఈయన సదాచారనిష్ఠకు సంతోషించి, గరుడ మంత్రాన్ని ఉపదేశించారు. గుర్వాజ్ఞప్రకారం, కంచి నుంచి తిరువహీంద్రపురం వెళ్ళి, అక్కడ గరుడనదిలో స్నానం చేసి, ఔషధాద్రి పైన అశ్వత్థవృక్షం క్రింద పద్మాసనుడై గరుడమంత్రోపాసన చేశాడు. గరుత్మంతుడు ప్రత్యక్షమైనాడు. వేంకటనాథశర్మ గరుడదండకంతో స్తుతించాడు. ప్రసన్నుడైన ఆ విష్ణురథుడు శ్రీహయగ్రీవమంత్రాన్ని ఉపదేశించాడు. తదేక దీక్షతో ఉపాసనచేసిన వేంకటనాథశర్మకు లక్ష్మీహయవదనుడు సాక్షాత్కరించి తన లాలాజలాన్ని పానం చేయించాడు. ఆ దైవానుగ్రహం చేత సకల శాస్త్రాలు ఈయన జిహ్వాగ్రాననర్తించాయి. ఆ క్షణాన, ఆశువుగా శ్రీ హయగ్రీవస్తోత్రం చేశాడు.

విద్యావ్రత స్నాతకానంతరం శ్రీ వేంకటనాథస్వామి 'తిరుమంగై' (కనకవల్లి) అనేకన్యకను ధర్మపత్నిగా స్వీకరించారు. గృహస్థాశ్రమ ధర్మాన్ని చక్కగా అనుష్ఠిస్తూ, వీరు నాలుగు ఆశ్రమాలలో ద్వితీయమైన, గృహస్థాశ్రమమే అద్వితీయమైనదని నిరూపించిన మహాపురుషులు.

తమనాశ్రయించిన శిష్యబృందాలకు వేదాన్త శాస్త్రగ్రంథాలను ప్రవచిస్తుండేవారు. 'సంకల్పసూర్యోదయ' నాటకాన్ని రచించే కాలం వరకు "త్రింశద్వారంశ్రావితశారీరక భాష్యః" అంటే ముప్పదిసార్లు శ్రీభాష్యప్రవచనం పూర్తి అయిందని వీరే విశదపరచారు.

అద్వైత పండితులు కొందరు శ్రీరంగంలో సంప్రదాయసిద్ధంగా జరిగే అధ్యయనోత్సవాన్ని జరుపకుండా మాన్పించారు. అక్కడి పండితులు వృద్ధులైనందువల్ల వారితో వాదించడానికి సాహసించలేదు. ఆలయ ధర్మాధికారి, అప్పటికి లబ్ధప్రతిష్ఠులైన శ్రీవేంకటనాథ దేశికులకు ఆహ్వాన పత్రికను పంపినాడు. వార్తాహరులవెంట దేశికులు శ్రీరంగం చేరినారు. సభలో చాలా రోజులు వాదోపవాదాలు చెలరేగాయి. తుదకు ప్రత్యర్థులు పరాజితులై పాదాక్రాంతులైనారు.

శ్రీవేంకటనాథదేశికులు, అమితోత్సాహపరులైన ధర్మాధికారి, ఆచార్య పురుషులు, అర్చకస్వాములు మొదలైన భాగవతోత్తములతో కలసి అధ్యయనోత్సవాన్ని వైభవంగా జరిపించారు. ఈ వాదాల సారాంశమే తర్వాత 'శతదూషణి' అనే ప్రౌఢమైన వేదాంత వాద గ్రంథంగా దేశికులచే ఆవిష్కృతమయింది. శ్రీవేంకటనాథదేశికులవారు కొంతకాలం అళగిర్‌కోవిల్,మధురై, శ్రీవిల్లి పుత్తూర్, ఆళ్వార్ తిరునగరి, వానమామలై, త్రివేండ్రం, గోపపురం (తిరుక్కోవలూర్) ఇత్యాది దక్షిణ దివ్య దేశాలను సందర్శిస్తూ, 'దేహళీశస్తుతి' మొదలైన స్తోత్రాలను రచించారు. క్రమంగా ఉత్తర భారతదేశంలోనూ 'మధుర బృందావనం, ద్వారక,అయోధ్య, గయా, ప్రయాగ, హరిద్వార్, బదరీత్యాది దివ్య తీర్థ క్షేత్రాలను సందర్శించి, యాదవాభ్యుదయం, హంససందేశకావ్యాలను నిర్మించారు. తిరుమలకు వేంచేసి శ్రీనివాసుని సేవించి 'దయాశతకం' రచించారు. శ్రీ పెరుంబూదూరులో భగవద్రామానుజమూర్తిని సందర్శించి యతిరాజసప్తతిని, కంచిలో వెలసియున్న భగవన్మూర్తుల విషయంగా 'వరదరాజ పంచాశత్, వేగాసేతు' స్తోత్రాదులను రచించారు. శ్రీరంగంలో వేంచేసియున్నప్పుడు శ్రీస్తుతి, భూస్తుతి, దశావతారస్తోత్రం, భగవద్ధ్యానసోపానం, శ్రీరంగనాథపాదుకాసహస్రమ్' మొదలైన స్తోత్ర కావ్యాలనే కాక 'మీమాంసాపాదుకా, సేశ్వరమీమాంస, న్యాయ పరిశుద్ధ, న్యాయ

సిద్ధాంజనమ్' ఇత్యాది శాస్త్ర గ్రంథాలను రచించారు. అమృతరంజని, అమృతాస్వాదిని, పరమపదసోపానమ్ మొదలైన ద్రావిడ ప్రబంధాలనూ నిర్మించారు. భగవద్రామానుజ సిద్ధాంతమని ప్రసిద్ధి చెందిన ప్రాచీన విశిష్టాద్వైత సిద్ధాంతాన్నే తమ ప్రాకృత, సంస్కృత,ద్రవిడ ప్రబంధాలలో అద్భుతంగా ప్రతిపాదించారు.

విద్వత్పరిషత్తు దేశికులను 'కవితార్కికసింహ' అనే బిరుదునిచ్చి ప్రశంసించింది. అధీతి బోధాచరణ ప్రచారణల ద్వారా వేద మార్గ ప్రతిష్ఠాపనాచార్యులైనారని శ్రీరంగనాథుడు, 'వేదాంతాచార్యులు' అనే బిరుదును, శ్రీరంగనాయకి, సర్వతంత్ర స్వతంత్రులు' అనే బిరుదును వీరికి అనుగ్రహించారు.

శ్రీభాష్యసారార్థమైన ఐదువందల స్రగ్ధరావృత్తాలతో కూడిన 'అధికరణ సారావళి' అనే గ్రంథారంభంలో "**విశ్వస్మిన్నామరూపాణ్యనువిహితవతా తేన దేవేనదత్తామ్। వేదాన్తాచార్య సంజ్ఞామవహితబహువిత్ సార్థమన్వర్థయామి॥**" ఈ రచనతో పెరియపెరుమాండ్లు ప్రసాదించిన బిరుదును అన్వర్థీకరించుకొంటున్నాను) అని దేశికులు ప్రకటించుకొన్నారు. ఈ ప్రబంధానికి తాత్పర్య వివరణ రూపమైన "అధికరణదర్పణ" మనే గ్రంథాన్ని వీరే రచించారు.

కంచిలోనే జ్ఞాన వైరాగ్యభూషణులై ఉంఛవృత్తితో కాలక్షేపం చేస్తున్నప్పుడు, వేదాన్తదేశికులకు 48వయేట, శ్రీవరదరాజస్వామి కృపవల్ల 'కనకవల్లితాయర్'కు పుత్రుడు ఉదయించాడు. అదినళనామసంవత్సరం.అవణి మాసం. రోహిణీ నక్షత్రం. (తేది 11 ఆగస్టు 1316 ఎ.డి.) దేశికస్వామి తన పుత్రునికి 'వరదాచార్యులు' అని నామకరణం చేశారు. వరదాచార్యులు తండ్రి గారి వద్దనే విద్యనభ్యసించి సకలశాస్త్ర పారంగతుడైనాడు.

పిత్రేబ్రహ్మోపదేష్ట్రే మే గురవే దైవతాయచ।
ప్రాప్యాయ ప్రాపకాయాస్తు వేంకటేశాయమంగళమ్॥ (దేశికమంగళాశాసనమ్)

'జనకుడు, బ్రహ్మోపదేష్ట, గురువు,దైవం, ప్రాప్య, ప్రాపకులు కూడా తమ తండ్రిగారే' అని (కుమారవేదాన్తాచార్యులు) శ్రీవరదనాథనయినారాచార్యులు" శ్రీవేదాన్తదేశిక మంగళాశాసనం" లో అనుసంధించారు.

ఆచార్యులను ఆశ్రయించి ఉజ్జీవించాలనుకొని "సర్వజ్ఞసింగప్ప" శ్రీవేదాన్తదేశికుల వారిని తన నగరమైన "వేంకటగిరి" కి వేంచేయవలసిందిగా

ప్రార్థించాడు. కాని దేశికులు మాత్రం ఆ పరమాస్తికుని నగరానికి వెళ్ళలేదు. కృపాప్రసన్నులైన ఆచార్యులు కాబట్టి, 'సుభాషితనీవి' అనే నీతికావ్యాన్ని, తత్త్వసందేశం, రహస్యసందేశం,రహస్య సందేశ వివరణం' అనే మరోమూడు గ్రంథాలను మణిప్రవాళ శైలిలో వ్రాసి ఒక శిష్యునితో పంపి సర్వజ్ఞసింగప్పకు అందజేశారు.

క్రీ.శ. 1327 వ ప్రాంతంలో మహమ్మదీయుల దండయాత్ర దక్షిణభారతదేశానికి కూడా విస్తరించింది. 'ఢిల్లీ సుల్తాన్' సేనానియైన 'మాలికాఫర్' శ్రీరంగం, మధురపై దాడి చేశారు. ఆ సమయాన ఆచార్య పురుషులు సమావేశమై శ్రీరంగ మందిర సంరక్షణ కోసం మూడు వర్గాలుగా ఏర్పడ్డారు. వృద్ధులైన శ్రీ పిళ్ళైలోకాచార్యులవారు శ్రీరంగనాథుని ఉత్సవ మూర్తులను పల్లకిలో వేంచేపించి రహస్యంగా కావేరి దాటి దక్షిణదిశకు పయనించారు.

విశిష్టాద్వైత సిద్ధాన్త సర్వస్వమైన "శ్రుతప్రకాశికా" శ్రీభాష్యాన్ని చక్కగా విని వ్యాఖ్యానించిన గ్రంథకర్తయైన శ్రీసుదర్శనభట్టర్ మందిర సంరక్షణకు పాటుపడదలచారు. వారు 'శ్రుతప్రకాశిక'నూ, తన ఇద్దరు పుత్రులనూ భద్రంగా కాపాడుమని అప్పగించినందువల్ల, దేశికులు వారిని వెంటపెట్టుకొని, వాయవ్యదిశకు పయనించారు.

మందిర ద్వారాలను పెద్దబండరాళ్ళతో ఆచ్ఛాదించి ప్రాకార రక్షణకోసం పాటుపడుతున్న శ్రీసుదర్శనసూరి మహ్మదీయుల పాశవికశక్తికి బలియైనారు.

దేశిక స్వామి దారిలో బాలురనిద్దరిని రాత్రి పూట పడుకోపెట్టి, వారిపై ఆకులు, కొమ్మలు కప్పి; కొంత దూరాన వ్యాఖ్యాన సహితశ్రీభాష్య గ్రంథాన్ని క్రిందపెట్టి, దానిపై తానూ, శవాల నడుమ పడుకొన్నాడట.

"శ్రీరంగేనగరే ధరాజకహతే నష్టేషుసైద్ధాంతిక
గ్రంథేష్వేష్వఖిలేషు ఘోరమయితే శ్రీవైష్ణవానాం హతే।
ఆచ్ఛాద్యస్వతనుంశవైశ్చతదథః సంస్థాప్యతత్పుస్తకం
వేదాన్తార్యగురూ రరక్షచ పునస్సంచారయామాసతత్॥"

ఆఘోర విపత్తులో, ఆపద్ధర్మంగా ప్రాణాలనూ, విశిష్టాద్వైత సిద్ధాన్తగ్రంథాన్నీ రక్షించి తర్వాత ప్రచారం చేశారని సుశ్లోకితం.

ప్రభాతకాలానలేచి గ్రంథాన్నీ, బాలురనూ తీసుకొని కొన్ని దినాలు ప్రయాణం చేసి, కర్ణాటక రాష్ట్రంలోని 'సత్యకాలం' (ఇప్పుడు సత్యమంగళం) అనే గ్రామానికి చేరుకొన్నారు దేశికులు. ఆ గ్రామంలో చిరకాలం నివసించారు. బాలురకు యథావిధి ఉపనయనం చేశారు. విద్యనూ బోధించారు. అక్కడనే దేశికుల పుత్రుడునూ, శ్రీ బ్రహ్మతంత్ర స్వతంత్రస్వాములూ (మైసూరు పరకాలమఠయతిగురువులు) దేశికులవారి సన్నిధిలో శాస్త్రాధ్యయనం చేశారు. తురుష్కులదాడి అంతరించి, దేశంలో శాంతి రాజ్యము దయించడానికి, శ్రీరంగనాథుడు యథాస్థానంలో నెలకొనడానికి దేశికులు నిరంతరం ప్రార్థించారు. ఆ విధంగా సాగినదే 'అభీతిస్తవం'. ('సత్యకాలం' లోనే నిలబడినట్లున్న దేశికుల విగ్రహం ఉంది)

అక్కడినుంచి తిరునారాయణపురం (మేల్కోటె) చేరి, శెల్వప్పిళ్ళై పెరుమాళ్ళను సేవించారు. శ్రీరామానుజసిద్ధాన్తనిర్ధారణ సార్వభౌములుగా వాసిగాంచారు. ఆత్రేయ రామానుజ దయాపాత్రులు కాబట్టి వీరిని బ్రహ్మతంత్ర స్వతంత్రస్వాములవారు ఆశ్రయించి, **"రామానుజదయాపాత్రం జ్ఞానవైరాగ్యభూషణమ్।**

శ్రీమద్వేంకటనాథార్యం వందేవేదాన్తదేశికమ్॥"

అనే తనిశ్లోకాన్ని వ్రాసి సమర్పించారు.

కాంచీ నగర శిక్షాకేంద్రంలో దేశికులకు సహపాఠియైన శ్రీవిద్యారణ్యస్వామివారు యవనులను పరిమార్చి, విజయనగర రాజ్యస్థాపకుడైనాడన్న వార్తను విన్నారు. ఆ సమయాననే తన ప్రార్థన సఫలమైనట్లూ, జింజికోట దళనాయకుడైన గోపనార్యుడు తురుష్కముష్కరులను తరిమివేసి, ఆనాటికి తిరుమలలో పూజింపబడుతున్న శ్రీరంగనాథుని ఉత్సవమూర్తులను అతివైభవంగా శ్రీరంగక్షేత్రానికి తీసుకొని వచ్చాడన్న వార్తనూ దేశికులు విన్నారు. వెంటనే శ్రీరంగం చేరుకొన్న వేదాన్త దేశికులవారి సమక్షాన శ్రీరంగనాథుడు పునఃప్రతిష్ఠితుడైనాడు.

గోపనార్యుని భక్తిని ప్రశంసిస్తూ దేశికులు ఆశువుగా చెప్పిన రెండు శ్లోకాలు దేవాలయాంతర్భాగాన తూర్పుగోడపైన చెక్కబడి, నేటికీ కనబడుతున్నవి.

అప్పటినుంచి శ్రీరంగంలోనే స్థిరంగా ఉన్నారు. శిలావృత్తిచే జీవిస్తు భగవత్కైంకర్యధురంధరులై అనేక గ్రంథాలను రచించారు.

ఆ సందర్భంలో శ్రీవిద్యారణ్యస్వామివారు దేశికులను సన్మానింపదలచి, విద్యా

నగరచక్రవర్తికి ఆచార్యులమహిమను వినిపించారు. రాజభటులద్వారా దేశికులకు ఆహ్వానపత్రాన్ని పంపించారు. విద్యారణ్యుల అభిప్రాయాన్ని దేశికులు గమనించారు.

(ఉంఛవృత్తిచే జఠరాగ్నిని శమింపజేయుశక్యంకాదా? ఉదరంలో అగ్నిమండినమండుగాక! మల్లెపూల పరిమళాన్ని వెదజల్లేమాటలతో క్షుద్రమహీపతులను గడ్డిపరకకైనా యాచించను. పిత్రార్జితమూ లేదు. నేనార్జించిన ధనమూ లేదు.(పైతామహం) చతుర్ముఖ బ్రహ్మను కన్న తండ్రి-కంచి వరదరాజ పెరుమాండ్లే నాకు ధనం. ధనంజయస్యందనభూషణమేధనం- ఈ తాత్పర్యమున్న)

“సిలంకిమనలంభవే దనల మౌదరంబాధితుం” అనే శ్లోకాలను ‘వైరాగ్య పంచకం’ వ్రాసి దేశికులు ఆ భటులతోనే పంపించారు.

ఆచార్యుల విశుద్ధ వైరాగ్యానికి విద్యారణ్యస్వామివారాశ్చర్యపడి,-

“విద్యారణ్యో వివిధం- వేంకటసూరే ర్విశోధ్యవైరాగ్యమ్।
యం విష్ణోరవతారం మేనే, సేవే తమాగమాంతగురుమ్॥”

నిగమాంతగురువులు సాక్షాత్తుగా విష్ణువతారులే అని గుర్తించి ప్రశంసించారు.

సామాన్య జీవితం గడిపిన నిగమాన్త దేశికులు **అద్భుత మహిమ** కలవారు.

దేశికులు ‘కంచి’లో ఉన్నప్పుడు ఒక తాంత్రికుడు తనతో వాదించడానికి ఆహ్వానించాడు. వాదనలో ఓడించి అతని మనస్సును నొప్పించలేక స్వామి అంగీకరించలేదు. అతడు చెరువులోని నీటిని త్రాగడం ఆరంభించాడు.స్వగృహంలోనే ఉన్న దేశికుల కడుపు ఉబ్బడం మొదలయింది. ఇది తాంత్రికుని కృత్యమే అని గమనించిన స్వామి తన ప్రక్కన ఉన్న గోడను గోళ్ళతో గీకాడు. దాని వెంట నీళ్ళు కారుతూ వీధిలోకి ప్రవహించాయి. చెరువులో నీళ్ళు తగ్గుతున్నా, తాంత్రికుని కుట్ర ఫలించలేదు. వెంటనే అతడు వచ్చి దేశికుల పాదాల మీద సాష్టాంగపడి, క్షమించుమని ప్రార్థించాడు. ‘నీవు చాలా మంచి పని చేశావయ్యా! నీ వల్లనే కదా వాననీరులేకున్నా నగర వీధులన్నీ శోధింపబడ్డాయి. ఇక ముందు ఎవరినీ నీకంటె తక్కువవారని తలచక, చక్కగా జీవించుమని దేశికులు ఆదేశించారు.

ఒకనాటి తొలిప్రొద్దున దేశికులు స్నానం చేసి, సూర్యోపస్థానం చేస్తుండగా, ఒక వ్యాళగ్రాహి ఒక విష సర్పాన్ని విడిచాడు. ఆ భుజంగం బుస్సుమంటూ తనను కాటువేయడానికి వచ్చి పడగను ఎత్తేలోపల, ఆచార్యులు తన చుట్టునేలమీద ఒక

వృత్తరేఖను గీసారు. పన్నగం ఆ గీతను దాటి రాలేక దాని చుట్టూ తిరుగుతుండింది. ఆచార్యులు గరుడ దండంకంలోని మూడవపాదం పఠించేసరికి పక్షిరాజు తుర్రున వచ్చి ఆ పామును గిర్రున ఎత్తుకొనిపోయాడు. పక్షి పాదాల్లో చిక్కుకొని విలవిలలాడే విషధరాన్ని చూచిన అహితుండికుడు ఆచార్యుల పాదాల మీద పడి, తన అపచారాన్ని క్షమించుమని ఏడ్చాడు. దేశికులు ఆకాశం వైపు చూచాడు. ఆ పక్షి పామును జారవిడిచిపోయింది. నేలమీద పడి గిలగిలలాడే ఆ పామును అతడు పట్టి బుట్టలో పెట్టుకొని పారిపోయాడు.

తిరువహీంద్రపురంలో బ్రహ్మోత్సవం జరుగుతున్నప్పుడు దేశికులు తైర్థికునిగా అక్కడికి వేంచేశారు. నాటి రాత్రి ఎప్పుడూ తన వెంట ఉండే శ్రీహయగ్రీవమూర్తికి తిరువారాధనను సమర్పించారు. కాని తన దగ్గర ఏమీలేనందువల్ల నైవేద్యం పెట్టక విచారంతో ఉన్న ఆ రాత్రి నాల్గవజాముున, ఒక రైతు వచ్చి దేశికులతో మొరపెట్టుకున్నాడు. "స్వామీ! అర్ధరాత్రి ఒక తెల్లని గుర్రం వచ్చి నా పంట చేను మేసి, తిరిగి మీరున్నచోటుకే వచ్చింది. ఇదేమి న్యాయమండి?" అంటూ ఇంక ఏదో అనబోయాడు. కాని, అంతలోనే దేశికస్వామి చిన్నగా నవ్వుతూ," ఓరైతన్నా! దేవుడు నిన్నూ,నన్నూ అనుగ్రహించాడు. బాధపడకు.పంట బాగా పండుతుంది, పొమ్మన్నాడు. ప్రొద్దున్నే ఆ రైతు తన పొలానికి గబగబా పోయాడు. పిల్ల తెమ్మెరల ప్రేరణచే స్వేచ్ఛగా నర్తిస్తున్న ఆ పసుపు పచ్చని పైరులచ్చి, వెన్నుల బరువుతో తలవంచి తనకు స్వాగతం చెబుతుంటే "ఆహా! స్వామి మహిమ ఎంతగొప్పది!" అనుకొంటున్న ఆ రైతు డెందం ఆనందంతో చిందులాడింది.

ఒకనాడొక యువకుడైన బ్రహ్మచారి దేశికుల సన్నిధికి వచ్చి "పెండ్లి చేసుకొంటాను. ధన సహాయం చేయండి స్వామీ!" అని యాచించాడట. పెండ్లి కోసం వెంపర్లాడే ఆ బ్రహ్మచారి దైన్యానికి దేశికుల ఒడలంతా జలదరించింది. వెంటనే ఆశువుగా "శ్రీస్తుతి" చేసి, ఆ బ్రహ్మచారికి బోధించాడు. అతడు శ్రీమహాలక్ష్మి పాదాలనెదలో నిల్పుకొని 'శ్రీస్తుతి'ని పఠించగా కోరుకొన్న ధనం కుప్పలు కుప్పలుగా కురిసిందట.

జ్ఞానలక్ష్మి, వైరాగ్యసంపద, వాగ్వైభవం ఎంత ఉన్నా, వినయ సంపద మాత్రం లేకపోతే ఏదీ రాణించదు. కలికాలప్రభావం వల్ల అసూయగల కొందరు వైష్ణవులు

దేశికులను అవమానించడానికి రాత్రిపూట వీరి గృహ ద్వారానికి తోరణంగా చెప్పుల దండలను కట్టారు. ఉదయాన ఆచార్యులు ద్వారాన్ని తెరచుకొని వెలుపలికి వస్తుంటే ఆ దండలు వీరి తలకు తగిలాయి. చాటుగా ఉండి చూచిన ధూర్తులు చప్పట్లు కొట్టారు. ఆ సవ్వడి విన్న దేశికులు కడు వినయంతో "కొందరు కర్మావలంబకులైతే మరికొందరు జ్ఞానావలంబకులు కదా! మేము మాత్రం హరిదానుల పాదరక్షావలంబకులం" (కర్మావలంబకాఃకేచిత్, కేచిత్ జ్ఞానావలంబకాః। వయంతు హరిదాసానాం పాదరక్షావలంబకాః॥) అనే శ్లోకాన్ని అశువుగా విన్నవించారట. ఆఖర్వ గర్విష్టులైన వారందరు నేలగీతలు గీశారట. ఒకనాటి సాయం సమయాన శ్రీరంగనాథుని సన్నిధిలో ఏర్పడిన విద్వత్పరిషత్తులో ఒక విద్వత్కవి 'శ్రీరంగనాథ పదకమల సహస్రమ్' రచించడానికి ప్రతిజ్ఞ చేయగా, దేశికులు 'పాదుకా సహస్ర' రచనకు ప్రతిజ్ఞ చేశారు. అదే రాత్రి దేశికులు 1008 (వేయి ఎనిమిది) శ్లోకాలను రచించి, ఉదయాన పరిషత్తులో ఆ గ్రంథాన్ని చదివి శ్రోతలనానందపరచారు. 'పదకమలసహస్ర' రచనకు ప్రతిజ్ఞ చేసిన ప్రత్యర్థి 300 (మూడు వందల) శ్లోకాలను మాత్రమే రచించగలిగాడని అభియుక్తోక్తి.

శ్రీమద్వేదాన్త దేశికుల కవితా ప్రతిభకు 'శ్రీరంగనాథ పాదుకాసహస్రమ్' విజయధ్వజవైజయన్తీ పతాకంలాంటిదని పండితులెందరో ప్రశంసించారు.

"వితస్తిమాత్రే దారుఖండే సహస్రం వివరాణి రచితవాన్ వేంకటనాథగురురేవకవిః, అన్యేతు కపయ ఏవ" జిట్టెడున్న కట్టెముక్క మీద వేయిఛిద్రాలను కల్పించిన వేంకటనాథ గురువే కవి. ఇతరులు మాత్రం కపులే' అని ఉద్దండ పండితులైన అప్పయ దీక్షితులు కొనియాడారు.

భగవద్రామానుజుల తర్వాత అవతరించిన శ్రీవైష్ణవ సిద్ధాన్తప్రవర్తకులైన ఆచార్యులలో జ్ఞానానుష్ఠాలచేతనూ, వైరాగ్య సంపత్తిచేతనూ, వాగ్వైశద్యం చేతనూ మళ్ళీ రామానుజులవంటి ప్రాధాన్యాన్ని ఆక్రమించినవారు, సర్వతంత్ర, కవితార్కిక కేసరీ, వేదన్తాచార్యాది బిరుదులతో భూషితులైన శ్రీవేంకటనాథాచార్యులొక్కరే అనడం పండిత ప్రముఖులు అంగీకరించిన విషయమే. వీరు శతాధిక గ్రంథకర్తలుగా ప్రసిద్ధులు.

దేశికుల రచనలు :

కావ్యాలు :

1. యాదవాభ్యుదయం
2. హంససందేశం
3. సుభాషితనీవి
4. సమయసాహస్రి
5. సంకల్ప సూర్యోదయం (నాటకం)

స్తోత్రాలు :

6. అచ్యుత శతకం (ప్రాకృతభాషామయం)
7. అపర్యాప్తామృతస్తుతి
8. అభీతిస్తవం
9. అష్టభుజాష్టకం
10. కామాసికాష్టకం
11. గరుడదండకం
12. గరుడ పంచాశత్
13. గోపాలవింశతి
14. దయాసహస్రమ్
15. దయాశతకమ్
16. దశావతారస్తోత్రం
17. దివ్యదేశమంగళాశాసన పంచకం
18. దేహళీశస్తుతి
19. న్యాస తిలకం
20. న్యాస దశకం
21. న్యాసవింశతి, తద్వ్యాఖ్య
22. పరమార్థస్తుతి
23. భగవద్ధ్యానసోపానం
24. భూస్తుతి
25. యతిరాజసప్తతి
26. రఘువీరగద్య
27. వేగాసేతుస్తోత్రం
28. వైరాగ్య పంచకం
29. శరణాగతి దీపిక
30. శ్రీగోదాస్తుతి
31. శ్రీదేవనాయకపంచాశత్
32. శ్రీరంగనాథపాదుకా సహస్రమ్
33. శ్రీవరదరాజ పంచాశత్
34. శ్రీస్తుతి
35. షోడశాయుధస్తోత్రమ్
36. సుదర్శనాష్టకం
37. శ్రీహయగ్రీవస్తోత్రమ్

అనుష్ఠాన గ్రంథాలు :

38. యజ్ఞోపవీతప్రతిష్ఠావిధి
39. భగవదారాధన విధి
40. హరిదిన తిలకమ్
41. శిల్పార్థసారః (శిల్పశాస్త్రం)
42. రసభౌమామృతం (వైద్యశాస్త్రం)
43 వృక్షభౌమామృతం (వైద్యశాస్త్రం)
44. భూగోళనిర్ణయమ్

వేదాంత గ్రంథాలు :

45. ద్రవిడోపనిషత్తాత్పర్యరత్నావళిః
46. ద్రవిడోపనిషత్సారః

47. మీమాంసాపాదుకా
48. సేశ్వరమీమాంసా
49. శతదూషణీ
50. అధికరణసారావళిః
51. తత్త్వటీకా
52. న్యాయపరిశుద్ధిః
53. న్యాయసిద్ధాంజనమ్
54. తత్త్వముక్తాకలాపః(తద్వ్యాఖ్యా-సర్వార్థసిద్ధిః)
55. గీతాభాష్యతాత్పర్యచంద్రికా
56. గీతార్థ సంగ్రహః
57. శ్రీపాంచరాత్ర రక్షా
58. సచ్చరిత్రరక్షా
59. నిక్షేపరక్షా
60. చతుశ్శ్లోకే భాష్యమ్
61. స్తోత్రరత్నభాష్యమ్
62. గద్యత్రయభాష్యమ్
63. ఈశావాస్యోపనిషద్భాష్యమ్
64. అధికారదర్పణమ్

రహస్య గ్రంథాలు :

65. సంప్రదాయపరిశుద్ధిః
66.తత్త్వపదవీ
67. రహస్యపదవీ
68. తత్త్వనవనీతమ్
69. రహస్యనవనీతమ్
70. తత్త్వమాతృకా
71. రహస్యమాతృకా
72. తత్త్వసందేశః
73. రహస్యసందేశః
74. రహస్యసందేశవివరణమ్
75.తత్త్వరత్నావళిః
76. తత్త్వరత్నావళీ ప్రతిపాద్యసంగ్రహః
77. రహస్యరత్నావళిః
78. రహస్యరత్నావళీహృదయమ్
79. తత్త్వత్రయచుళకమ్
80. రహస్యత్రయచుళకమ్
81. రహస్యశిఖామణిః
82. అభయప్రధానసారః
83. అంజలివైభవమ్
84. ప్రధానశతకమ్
85. ఉపకారసంగ్రహః
86. సారసంగ్రహః
87. చకారసమర్థనమ్
88. మునివాహనభోగః
89. మధురకవిహృదయమ్
90. శ్రీమద్రాహస్యత్రయసారః
91. సారసారః
92. విరోధపరిహారః

ద్రావిడ ప్రబంధాలు :

93. అమృతరంజనీ
94. అధికార సంగ్రహః
95. అమృతాస్వాదినీ
96. పరమపదసోపానమ్
97. పరమతభంగః
98. హస్తిగిరిమహాత్మ్యమ్

99. అడైక్కలప్పత్తు
100. అర్థ పంచకమ్
101. శ్రీవైష్ణవదినచర్యా
102. తిరుచ్చిన్నమాలై
103. పన్నిరునామమ్
104.తిరుమంత్రచ్చురుక్కు
105. ద్వయచ్చురుక్కు
106. చరమశ్లోకచ్చురుక్కు
107. ముమ్మణిక్కోవై
108. నవమణిమాలై
109. ప్రబంధసారః
110. ఆహారనియమః
111. నిగమపరిమళః
112. వందు
113. కళల్
114. అమ్మానై
115. ఊశల్
116.ఏశల్

లుప్తమైన గ్రంథాలు ఎన్ని ఉండినవో కదా! వీరి గ్రంథాలన్నిట్లో భగవద్రామానుజ సిద్ధాంతమే ప్రతిపాదింపబడింది.

విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని బలపరచినవారు కాబట్టి, దేశికులవారిని 'రామానుజ సిద్ధాన్త నిర్ధారణ సార్వభౌములు' అని ప్రపన్నులు కీర్తిస్తుంటారు.

"నిగమాంతగురుప్రోక్తంగ్రంథంకంచిత్పఠంతియే
విమతస్థాన్ సమస్తాంశ్చ తేజయంతినసంశయః।"

వేదాంతాచార్యులు రచించిన ఏదో ఒక గ్రంథాన్ని ఎవరు చదువుతారో, వ్వారు, ఇతరులు అవలంబించిన ఆచార సంప్రదాయాలలోని గుణదోషాలను విమర్శించి, వారికి స్వసంప్రదాయంలోని వైశిష్ట్యాన్ని బోధించి, పాటింపజేయగల సమర్థులై రాణిస్తారని శ్లోక తాత్పర్యం.

"వేదాన్తాచార్య రచిత ప్రబంధాస్సారదర్శినః।
పర్యాప్తమావయోఃశ్రోత్రోః, కింవాగ్రంథాంతరాయుతైః॥"

వేదాన్తాచార్యులు అనేక గ్రంథాలను రచించారు. వాటిలోని ముఖ్యమైన విషయాలను శ్రద్ధతో పరిశీలించినవారూ, విన్నవారూ పూర్ణజ్ఞాన సంపన్నులవుతారు. వేలకొలది వేరే గ్రంథాలతో ప్రయోజనమేమి? అని, తామనుభవించి తెలుసుకొన్నవారు చెప్పిన వాక్కులు.

"వేదే సంజాతభేదే మునిజనవచనే ప్రాప్తనిత్యావమానే
సంకీర్ణే సర్వవర్ణే సతి తదనుగుణే నిష్ప్రమాణే పురాణే।
మాయావాడే సమోదే కలికలుషవశాచ్ఛూన్యవాదే వివాదే
ధర్మత్రాణాయ యోభూత్ సజయతు భగవాన్ విష్ణుఘంటావతారః"

"కలికాల ప్రభావం వల్ల వేదాలకు అపార్థాలను కల్పించడమూ, పెద్దల మాటలను పాటించకపోవడమూ, సకల వర్ణాలు సంకీర్ణమవడమూ, శూన్యవాదం, మాయావాదం ప్రబలిపోయి, ప్రజలకు తమ సంప్రదాయ స్వరూపమేదో తెలియక,సంఘ విచ్ఛిత్తికి దారి తీస్తున్న సమయాన వైదిక ధర్మ రక్షణ కోసం శ్రీ వేంకటేశ్వర స్వామి ఘంటయే శ్రీ వేంకటనాథాచార్యులుగా అవతరించడమయింది. ఆ ఆచార్యులకు జయమగుగాక"-అని డిండిమకవి (14 వశతాబ్ది) వయసులో చిన్నవాడైనా, సమకాలీనుడైనందువల్ల దేశికుల ప్రభావాన్ని ప్రశంసించాడు.

దేశికులు రచించిన 'యాదవాభ్యుదయ' మహా కావ్యానికి అప్పయదీక్షితులు వ్యాఖ్యానం వ్రాశారు. అందు ప్రస్తావనగా దీక్షితులు, దేశికుల రచనలు లలిత పదాలు కలవై పరమార్థంతో కూడి యున్నవి, అన్నారు.

"ఇత్థం విచింత్యాస్సర్వత్రభావాస్సంతిపదే పదే
కవితార్కిక సింహస్యకావ్యేషులలితేష్వపి॥"

వాస్తవంగా, కవితార్కిక కేసరి రచనలను మొదటిసారి చదివినప్పుడు అవి నారికేళపాకమనిపిస్తాయి. వాటిని రెండవసారి చదివితే, అవి సులభగ్రాహ్యమై ద్రాక్షాపాకం కలవే అనగలుగుతారు పాఠకులు.

ప్రతివాది భయంకరంఅణ్ణన్ (1300-1400 ఎడి) దేశికులనాశ్రయించి బాల్యంలోనే సకలశాస్త్రప్రవీణులైన ప్రతిభాశాలురు. ఒక గొప్ప అద్వైతవేదాంతసిద్ధాంతి కాంచీపురానికి వచ్చి వాదానికి ఆహ్వానించాడట. వాదంలో ఒకరి మనస్సును నొప్పించడానికి ఇష్టపడని దేశికుల వద్ద "గురువర్యా! వాదించడానికి నేను పోతాను' ' అని ఉత్సాహంతో పలికిన ఆ బాలుడు, అనుమతిని పొంది ఆ సిద్ధాంతితో వాదించాడట. ("యేనాసీత్ సహసాసముద్రిత ముఖోవాదీ గతా హంకృతిః) ఓడిపోయిన ఆ సిద్ధాంతి విశిష్టాద్వైత మతాన్ని స్వీకరించి, సంతోషంతో ఆ బాలునికి తన

ఉపాస్యదైవమైన సువర్ణ నృసింహ విగ్రహాన్ని సమర్పించాడట. వేదాంతోదయన సంప్రదాయ ప్రవర్తకులైన దేశికులు, ఆ విధంగా జయించి వచ్చిన బాలుణ్ని ఆలింగనం చేసి హర్షపులకితాంగులై 'ప్రతివాది భయంకరం అణ్ణనే' (ప్రతిపక్షులకు భయంకరమైన నా తండ్రీ) అని పేర్కొన్నారట. ఆ బాలుడు ఈ (బిరుదు) నామంతోనే వ్యవహరింపబడుతూ ప్రసిద్ధి పొందాడట. ఆ 'ప్రతివాది భయంకరంఅణ్ణన్' స్వామివారు 'చతుర్విధపురుషార్థాలలో తురీయ పురుషార్థమైన మోక్ష సామ్రాజ్యాన్ని పొందగోరేవారు దేశికుల పట్ల అత్యంత భక్తి కలిగి ఉండాలి.

"గురౌవాది హంసాంబుదాచార్యశిష్యే, జనా భక్తిహీనాయతీంద్రా ప్రియాఃస్యుః।
యతీంద్రా ప్రియా విష్ణు కారుణ్యదూరాఃకుతోముక్తివార్తాహితాదృగ్విధానామ్॥"

అని ప్రతిపాదించారు. అంతేకాదు; దేశికుల విషయమై వారు "సప్తతిరత్నమాలికా" స్తోత్రం కూడా రచించారు.

"వీతరాగా విశిష్టార్థవేదాన్తాచార్యసప్తతిః।
వైష్ణవైః సాదరంగ్రాహ్యా విద్వద్భిర్వీతమత్సరైః॥"
"ప్రతివాదిభయంకరేణ సా సుధియాసప్తతిరత్నమాలికా।
నిగమాంతగురౌ సమర్పితా హృదయే తం భజతాస్వయాధియా॥"

శ్రీబ్రహ్మతంత్ర స్వతంత్ర (పరకాలమఠం) స్వామివారు దేశికులవారిని ఆశ్రయించి,

"బ్రహ్మతంత్ర చతురాయయోగినే సర్వతంత్ర చతురో గురూత్తమః।
వేదమౌళియుగళం హ్యాపాదిశత్, వాది సింహమనఘంతమాశ్రయే॥"

అనే శ్లోకం చేత 'ఉభయవేదాంతోపదేశం' పొందినట్లు విశదమవుతున్నది. ఈ బ్రహ్మతంత్ర స్వతంత్రస్వామివారు, దివ్యప్రబంధానుసంధానారంభంలో పఠింపదగిన "రామానుజ దయాపాత్రం" అనే శ్లోకాన్నే కాక, మరొక శ్లోకాన్ని కూడా నిర్మించారు.

"నమఃపదమిదం భూయాత్ తస్మై వేంకటసూరయే।
యద్వాగమృతసేకేన సంజీవితమిదంజగత్॥"

"ఎవరివాగమృతసేచనంచేత ఈ లోకం జీవించిందో, అట్టిశ్రీవేంకటసూరికొరకు ఈ (నా) నమస్కృతి" అనే శ్లోకార్థం.

షోళంగిపురం శ్రీకందాళదొడ్డయాచార్యులకు ఒకప్పుడు అప్పయదీక్షితులతో వాదం సంభవించిందట. విచారమధికమయింది. స్వగృహమందే దైవసన్నిధిలో ప్రపత్తి చేసి పవళించారట. స్వప్నంలో భగవంతుడు "వేదాంతాచార్య కృతాంశత దూషణీ మధీష్వ, జేష్యసి" అని అనుగ్రహింపగా, శతదూషణిని అధ్యయనం చేసి దీక్షితులను వాదంలో జయించారట. అప్పటి నుంచి దొడ్డయాచార్యులు దేశిక భక్తాగ్రగణ్యులై "శతదూషణి" కి "చండమారుతం" అనే వ్యాఖ్యానాన్ని రచించారు. ఆ వ్యాఖ్యానమందు

"బాహ్యాదిభిశ్చిర నిరుద్ధనిజప్రకాశే పాణింధమీభవతి వేదపథేసమీచి।
శ్రీమద్యతీంద్ర కృతిరత్న రుచిప్రచారైః సంచారయన్ జయతి సఃకవివాది సింహః"

దేశికులు 'వేదమార్గప్రతిష్టాపకులు' అని ప్రతిపాదించారు ఘరొకటి.

"అపరిచిత సంప్రదాయై రవిదితయతిరాజసూక్తితాత్పర్యైః।
అశమితకుదృష్టిగర్వై రలమలమన్యై రనాగమాంతార్యైః॥"

విశిష్టాద్వైత సంప్రదాయమూ, రామానుజ యతీంద్రుల శ్రీసూక్తులూ తెలియని వ్యక్తులతో ప్రయోజనమేమి? అంటూ, దేశికులను స్తోత్రం చేస్తూ "వైభవ ప్రకాశికా స్తోత్ర" గ్రంథాన్ని నిర్మించారు శ్రీకందాళదొడ్డయాచార్యులు.

వయోజ్ఞాన వృద్ధులైన శ్రీ పిళ్ళలోకాచార్యులవారు దేశికుల రచనలను ప్రశంసించిన ఒక పాశురం 'అధికార సంగ్రహం' అనే దేశిక ప్రబంధారంభంలో 'తనియ' గా అనుసంధింప బడుతున్నది.

"శీరొన్ఱుతూప్పుల్ తిరువేంకటముడైయాన్, పారొన్ఱచ్చొన్న పళమొళియుళ్;
ఓరొన్ఱు తానే యమైయాదో తారణియిల్ వాళ్వార్క్కు, వానేఱప్పోమళవుమ్ వాళ్వు"

ఈ భూమండలంలో నివసించే ప్రపన్నులకు పరమపదాన్ని చేరేంతవరకు గల ఉజ్జీవనం కోసం గొప్ప కల్యాణగుణాలు కలిపి అద్వితీయమైనది కాబట్టి, తూప్పుల్ అనే దివ్య క్షేత్రంలో ఆవిర్భవించిన శ్రీదేశికులు భూలోకవాసులందరు ప్రావీణ్యాన్ని పొందే రీతిగా అనుగ్రహించిన పలు ప్రాచీన దివ్య సూక్తులలో ఏదో ఒక్క సూక్తియే చాలదా?" అని పాశురార్థం. ఏదో ఒక సూక్తిలోని మాధుర్యాన్ని అనుభవించడం చేత జన్మ సఫలమవుతుందనడం వల్ల, సూక్తివైభవం సూచితం. 'పళమొళి' (ప్రాబల్యు-వేదం)

అనడం వల్ల, దేశికుల సూక్తులకు వేదసామ్యం ధ్వనిస్తున్నది.

శ్రీకుమార వరదాచార్యులు "పిళ్ళైయన్దాది" ప్రబంధంలో దేశికులను స్తుతించిన ఒక పాశురమిది.

"అన్ఱివ్వులగినై యాక్కియరుమ్పొరుళ్ నూల్విరిత్తు
నిన్ఱుతన్నీళ్ పుగళ్వేంగడమామలైమేవియుమ్పిన్,
వెన్ఱిప్పుగళ్ త్తిరువేంగడనాదనెనుమ్గురువాయ్
నిన్ఱునిగళ్న్దుమణ్మేల్నిన్ఱనోయ్గళ్తవిరత్తననే॥"

పూర్వం భగవానుడు విశ్వాన్ని సృష్టించాడు. వేదశాస్త్రాలను అద్భుతంగా ప్రకాశింపచేశాడు. తానే ప్రసిద్ధి పొందిన తిరుమలైలో శ్రీవేంకటేశ్వరస్వామిగా వెలిశాడు. తర్వాత కలియుగంలో శ్రీవేంకటనాథ గురువుగా తానే అవతరించి ప్రపంచ ప్రఖ్యాతిని పొందిన ప్రజ్ఞావిశేషం చేత లోకంలో వ్యాపించిన ధర్మ విరుద్ధమైన పద్ధతులను రూపుమాపాడు, సామాజిక రుగ్మతలను ఉపశమింపచేశాడు అని పాశుర సారార్థం.

"శ్రీమదాంధ్రవాల్మీకిరామాయణం (మందరం)"లో కృతికర్తయైన శ్రీమాన్ వావిలికొలను సుబ్బారావు(వాసుదాసస్వామి) శ్రీవేదాన్తదేశికులను స్తుతించారు.

"ఏసత్కవీంద్రువాచాసముజ్జృంభణ వింతతాలమునేర్పు వేధసతికి
నేవాక్ప్రతిపటిష్ఠవావదూకతతార్కిక గజకోటికి సింహగర్జనంబు
ఏ మహామహామతి రామానుజాచార్యమత మహీసితపోత్రిమహితదంష్ట్ర
యే వైష్ణవాగ్రణి భావమార్గము ముక్తిభామినీ సౌధసోపానపంక్తి
యట్టికవితార్కికోగ్రపంచాస్యమూర్తి
సాధునుతకీర్తి వైష్ణవ చక్రవర్తి
ధీసురాచార్య్య వేదాంత దేశికార్య్య
వేంకటాచార్య్యగొలుతువేవేలగతుల
కవికేసరి యన దేశిక
కవికే సరిగాక యితర కవియుంగవియే?
పవిసఖనఖముఖ భయదవ
పువు పులియుం బులియు నీగపులియుంబులియే? (బా.10,11)

దేశికుల వాగ్విలాసం సరస్వతికే కొత్త తాలం నేర్పిందనడానికి ఒక ఐతిహ్యం కలదని వారే దాన్ని వివరించారు.

'కంచుఢక్కా' బిరుదం గల డిండిమభట్టకవి దేశికులతో వాదానికి వచ్చి "ఈ ఢక్కా నీవు వాయించు, నేను కవిత్వం చెబుతాను, నేను వాయించితే నీవు కవిత్వం చెప్పు' 'మని పందెంచఅచాడట. దేశికులు ఆఢక్కాను తీసుకొని వివిధ తాలాలు శాస్త్ర ప్రకారం వాయించగా, ఆధాటికి సరిగా డిండిమభట్టు చెప్పలేక తికమకలాడాడట. తర్వాత డిండిమభట్టు ఢక్కా తీసుకొని శాస్త్ర పద్ధతిని విడిచి తారుమారుగా వాయింప సాగుతుంటే, దేశికులు దానికి తగినట్లే సాగించిన కవిత్వం 'రఘువీర గద్య' మని పేర్కొనబడిందట.

వజ్రాయుధంతో సమానమైన గోళ్ళ చేత భయంకరమైన దేహం గల పులికే పులియనే పేరు సార్థకం కాని సాలె పురుగుకు ఆ పేరు తగదు కదా! అలాగే కవికేసరి యనే బిరుదు దేశికుల యందే సార్థకం కాని ఇతర కవులకు, ఆ పేరు పెట్టుకొన్నా తగదని తాత్పర్యం

వర్ణాశ్రమ ధర్మాలను పాటిస్తూ, శ్రీ భాష్యకారుల సిద్ధాంతాన్నే శిరసావహిస్తూ, అనుష్ఠానం, ఉపదేశం, రచనలు అనే మూడు ప్రక్రియల ద్వారా శ్రీవైష్ణవ సంప్రదాయంలోని ఔచిత్యానౌచిత్యాలను గమనింపచేస్తూ "గృహమేవతపోవనమ్" అన్నట్లు గృహస్థాశ్రమంలోనే ఉండి విలక్షణమైన వైరాగ్య జీవితాన్ని గడిపిన శ్రీవేదాంతదేశికులు "శతాయుఃపురుషః" అన్నట్లు పూర్ణాయుష్మంతులై, 1369 వ సంవత్సరం, కార్తీకమాసంలో పరమపదించారు. శ్రీవేంకటేశ్వరస్వామి అవతరించిన దిన మందు అవతరించి "తిరుమంగైయాళ్వార్" అవతరించిన దినమందు అంతర్థానం చెందారు, అని వీరి చరిత్ర వల్ల తెలుస్తున్నది.


ఆచార్య పురుషుల చరిత్ర అందరికీ ఆదర్శం కదా!
కవితార్కిక సింహాయకల్యాణ గుణశాలినే
శ్రీమతే వేంకటేశాయ వేదాన్తగురవే నమః॥

భాగవత చరణరేణువు,

కె.వి. రాఘవాచార్యులు

తేది 10-7-2003, స్వభాను శయనైకాదశి
C/o శ్రీ కె.వి.రమణాచారి, IAS
B.H. 3/6, IAS Quarters, రోడ్ నం. 10,
బంజారాహిల్స్, హైద్రాబాద్. ఆం.ప్ర.
ఫోన్ : 040-23350258

శ్రీ వేదాన్త దేశికుల వంశవృక్షాదికం



శ్రీమతే నారాయణాయనమః

ఆళ్వారెంబెరుమానార్ తిరువడిగళేశరణమ్
శ్రీమతేనిగమాన్తమహాదేశికాయనమః

ద్రవిడోపనిషత్తాత్పర్యరత్నావళిః

శ్రీమాన్వేంకటనాధార్యః కవితార్కికకేసరీ।
వేదాన్తాదాచార్యవర్యోమే సన్నిధత్తాం సదాహృది॥

1. సారస్సారస్వతానాం శఠరిపుభణితిశ్శాన్తిశుద్ధాన్తసీమా
మాయామాయామినీభిః స్వగుణవితతిభిర్బన్ధయన్తీంధయన్తీ।
పారం పారంపరీతోభవజలధిభవన్మజ్జనానాంజనానాం
ప్రత్యక్ ప్రత్యక్షయేన్నఃప్రతినియతరమాసన్నిధానంనిధానమ్॥

అర్థం :- సారస్వతానాం=సరస్వతీవిలాసాలలో,సారః=శ్రేష్ఠమైనట్టి, శాన్తిశుద్ధాన్తసీమా= శాంతిరసానికి వాసభూమియైనట్టి, ఆయామినీభిః = విస్తారమైన, స్వగుణవితతిభిః= తనగుణసమూహాలచేత (సత్త్వరజస్తమోగుణాలచేత), బన్ధయంతీం=(లోకాలను) బంధిస్తున్న,మాయాం=మూలప్రకృతిని,ధయన్తీ=పానం చేయునట్టి, పారంపరీతః=పరంపరగా, భవజలధిభవత్+మజ్జనానాం=సంసారమనే సాగరాన ఉండి మునిగిపోతున్న, జనానాం=జనులకు, పారం= తీరమైన, శఠరిపు భణితిః=నమ్మాళ్వార్ల శ్రీసూక్తి, నః=మనకు, ప్రత్యక్= మిక్కిలిప్రకాశంతో కూడిన, ప్రతినియత రమాసన్నిధానం= సర్వకాలాన(ఎల్లప్పుడు) లక్ష్మితో కూడియున్న, నిధానం=నిధియైన శ్రియఃపతిని, ప్రత్యక్షయేత్=సాక్షాత్కరింపజేస్తుంది.

తా॥ సర్వశాస్త్రాలసారమైన, శాంతిరసానికి నివాస స్థానమైన, విస్తారమైన తన సత్త్వరజస్తమోగుణాలచే సకలప్రాణులను బంధించే మూలప్రకృతిని నిర్మూలనం చేస్తున్న శ్రీశఠకోపదివ్యసూరిశ్రీసూక్తి(తిరువాయ్ మొళి) చిరకాలం నుంచి సంసారాకూపారంలో ఉంటూ మునిగిపోతున్న జీవులకు ఉత్తారకుడైన శ్రీమన్నారాయణుణ్ని ప్రత్యక్షీకరింపజేస్తుంది.

అవతారిక :- సాక్షాన్నారాయణోదేవఃకృత్వామర్త్యమయీంతనుమ్।
మగ్నానుద్ధరతేలోకాన్కారుణ్యాచ్ఛాస్త్రపాణినా॥

శ్రియఃపతి, నిఖిలహేయప్రత్యనీక కల్యాణగుణస్వరూపుడైన శ్రీమన్నారాయణుడు, అనాదియైన సంసార సముద్రంలో పడి అనేక దుఃఖాలకు పాత్రులైన జనులను ఉద్ధరించడం కోసం, కృపాళుడై హంస, మత్స్య, హయగ్రీవ, నరనారాయణాది రూపంగా అవతరించి, తనను ఉపాసించే విధానాన్ని తెలిపే శాస్త్రాలను ప్రవర్తింపజేశాడు.

"యోబ్రహ్మాణం విదధాతిపూర్వం, యోవైవేదాంశ్చప్రహిణోతితస్మై॥

ఉభయవిభూతినాయకుడైన పరబ్రహ్మ మొట్టమొదట చతుర్ముఖ బ్రహ్మను సృష్టించాడు. అండాంతర్వర్తియైన దేవమనుష్యాది సృష్టిని చేయదగిన జ్ఞానాన్ని కలిగించడానికి బ్రహ్మకు వేదాలనూ ఉపదేశించాడు.

"పీతకవాడై పిదానార్ పిరమగురువాకి వన్దెన్నుమ్" (పెరియాళ్వార్‌తిరుమొళి, 5-2-8) 'పీతాంబరధారియై మహోపకారకుడైన శ్రియఃపతి బ్రహ్మకు గురువుగా అవతరించా'డని శ్రీ భట్టనాథుల శ్రీసూక్తి.

తాను విజాతీయుడైనందువల్ల ఎంత ప్రయత్నించినా లోకులుతనను అనుసరింపకున్నారు. కాబట్టి సజాతీయులనవతరింపజేసి వారిని వశపరచుకోవలెనని సర్వేశ్వరుడు సంకల్పించుకున్నాడు. తత్ఫలితంగా, లీలావిభూతిలో భగవత్పారిషదాంశలచేత ఆళ్వార్లూ, క్రమంగా ఆచార్యులూ అవతరించారు.

క్రీ.శ. 1268 ఎ.డి. విభవనామ సంవత్సరం, (పురటాశి)అశ్వీజ శుద్ధ ఏకాదశి నాడు, శ్రీ వేంకటేశ్వరస్వామి చక్రతీర్థోత్సవం నాడు, శ్రీ అనంతసూరి, తోతాద్ర్యంబ అనే పుణ్యదంపతులకు, శ్రీ వేంకటేశుని ఘంటాంశచే శ్రీ వేంకటనాథ దేశికులు ఆవిర్భవించారు. "ఘంటాహరేస్సమజనిష్టయదాత్మనేతి" (సంకల్పసూర్యోదయం) వీరు ఇరువది యేండ్ల ప్రాయంవరకే సకలశాస్త్రాలను అభ్యసించారు. "వింశత్యబ్దే విశ్రుతనానా విధ విద్యః"(సం. సూ)శ్రీభాష్యాన్ని ముప్పదిసార్లు శిష్యులకు ప్రవచనం చేశారు. "త్రింశద్వారం శ్రావిత శారీరక భాష్యః" (సం.సూ)శతాధిక గ్రంథకర్తలు.

శ్రీ రంగరాజ దివ్యాజ్ఞచే లబ్ధమైన 'వేదాన్తాచార్య' తిరునామంకలిగినవారు. 'సర్వతంత్రస్వతంత్ర' అనే బిరుదును (పెరియపిరాట్టి) శ్రీరంగనాయకి వీరికి ప్రసాదించింది. శ్రీరంగనాథుని పరిషత్తులో పరమభాగవతోత్తములచేత 'కవితార్కికకేసరి' అనే బిరుదును పొంది శ్లాఘనీయవైభవం కలవారు వీరు.

మహామహిమ కల్గిన శ్రీవేదాన్తదేశికులవారు నూట ఒక్క వసంతాలు (1369 ఎ.డి.) భారత భూమండలాన్ని అలంకరించారు.

"మయర్వఱ మదినలమ్" 'అజ్ఞానాన్ని నశింపజేసే భక్తి రూపాపన్నజ్ఞానం' తో సర్వేశ్వరుని స్వరూప, రూప, గుణ,విభూతులను వైభవంగా గానం చేసిన నమ్మాళ్వార్ల 'తిరువాయ్ మొళి' యొక్క తాత్పర్యాన్ని, లోకులు సుఖంగా అనుసంధించుకోవడానికి, సంస్కృతంలో సంగ్రహించి, ఈ స్తోత్రరూపంగా అనుగ్రహించారు దేశికులవారు.

ప్రకాశికావ్యాఖ్య:-

'శ్రీశఠారిసూక్తి'అనే వస్తు నిర్దేశరూప మంగళాచరణశ్లోకమిది.

సారఃసారస్వతానాం శఠరిపు ఫణితిః:- నమ్మాళ్వార్లశ్రీసూక్తిసారస్వతసారం. సరస్వతీవిలాసమంతాసారస్వతమే. 'సరస్వతి' అంటె సర్వత్రవ్యాప్తికలిగిన వాగ్దేవత. " సరఃప్రసరణం సర్వత్రఅస్తీతి సరస్వతీ" లేదా "బ్రహ్మలోకే బ్రహ్మసరః ఆశ్రయత్వేన అస్యాఅస్తీతివా సరస్వతీ" బ్రహ్మలోకంలో బ్రహ్మ సరస్సును ఆశ్రయించినదీ రూపంగా ప్రవహించేది- అని (నామలింగానుశాసనం) వ్యుత్పత్తి. "బ్రహ్మ జలధారణ ప్రశ్చ్యోతనాభ్యాంవేదాఃసరాంసి, తన్మయత్వాత్, తద్వతీ సరస్వతీ"(యాజ్ఞిక్యుపనిషత్-శంకరభాష్యం)బ్రహ్మమనే జలాన్ని ధరించి, దాన్ని తగిన అధికారులకు ప్రవహింపజేయడం వల్ల వేదాలు సరస్సులు, అవి కలది సరస్వతి అని అర్థం.

ప్రప్రథమంగా వేదరాశి పరమపదనాథుణ్ని స్తుతించింది. ఆయన వ్యూహావతారమెత్తినప్పుడు అది పాంచ రాత్రశాస్త్రమై నుతించింది. తర్వాత ఆయన విభవంలో రామునిగా అవతరిస్తే "వేదఃప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా" (స్కాంధపు) అన్నట్లు వేదం రామాయణమై ఆయన చరిత్రను శ్లాఘించింది. అది దేవుడే దివ్య తిరుపతులలో అర్చావతారుడై వెలయగా, ఆ వేదాలే ద్రవిడప్రబంధాలై స్వామిని స్తోత్రం చేశాయి. ఋషిప్రోక్తమైన స్మృతీతిహాస పురాణాదులకంటె ద్రవిడవేదం సర్వోపాదేయశాస్త్రాలసారమై సర్వజనోపభోగ్యమయింది. 'వేదరూప మిదంకృతమ్' (పాద్మపు)"ద్రావిడీంబ్రహ్మసంహితామ్" (శఠకోపాష్టకం) "వేదం తమిళ్శెయ్దమాఱన్' ' (కణ్ణి-తని) అన్నట్లు సంస్కృత వేదరాశితో ద్రవిడ వేదరాశి సమానమైనదని విజ్ఞులు వెల్లడించారు కదా! పెద్దలు వారి వారి మతానుగుణంగా వేదాలకు అర్థాలను చెప్పినందువల్ల, అవి నదీ కలుష జలాల్లాగా పదార్థాలను స్పష్టంగా ప్రకాశింప జేయడంలేదు. కాని ద్రవిడ వేదాలు మడుగులలో ఉండే స్వచ్ఛమైన తీర్థంలాగా

నిష్కృష్టార్థాలను స్పష్టంగా గోచరింపచేస్తున్నాయి. వేదవ్యాసుని బ్రహ్మ సూత్రాలకు, ఆయన శిష్యుడైన జైమిని రచించిన సూత్రాలకు పరస్పర విరోధం కనబడుతుంది. కాని ఆళ్వార్ల శ్రీసూక్తిని "పేశిత్తే పేశలల్లాల్" తక్కిన ఆళ్వార్లు తమ శ్రీసూక్తులచేత ధృఢపరచారే తప్ప విరోధించనే లేదు. "యత్సారభూతం తదుపాదధీత" ."భజేత్సారతమంశాస్త్రం" అన్నట్లు ద్రవిడవేదాన్తశాస్త్రం శ్రేష్ఠమైనది కాబట్టి అది అందరు సేవింపదగిన 'భగవద్విషయ'మని ఖ్యాతిని పొందింది.

శాన్తి శుద్ధాన్తసీమా :- దివ్యసూరిశ్రీసూక్తి శాంతిరసానికి ఆవాస భూమి. కొందరు లాక్షణికులు శాంతంరసం కాదని ఎనిమిది రసాలనే "అష్టారసాః" చెప్పినారు. భట్టోద్భటుడు తన కావ్యాలంకారసారసంగ్రహం'లో తొమ్మిది రసాలను ఉదాహరించాడు.

"శృంగార హాస్యకరుణ రౌద్ర వీర భయానకాః।
భీభత్సాద్భుతశాంతాశ్చనవ నాట్యే రసా స్మృతాః
రతిర్హా సశ్చశోకశ్చ క్రోధోత్సాహోభయంతథా।
జుగుప్సా విస్మయశమాఃస్థాయిభావాఃప్రకీర్తితాః॥"

శాంతం రసమే, అనీ శమమే దానిస్థాయి భావమనీ నిర్ధారించాడు. ఆనంద వర్ధనుడు, అభినవగుప్తుడు తమయుక్తులచేత శాంతరసాన్ని సిద్ధానీకరించారు. "శాంతోరసశ్చముఖ్యతయా వివక్షా విషయత్వేన" అనే ధ్వన్యాలోకపంక్తిలోని 'ముఖ్యతయా' అనే పదాన్ని అభినవగుప్తుడు "లోచనం"లో వివరించాడు. (మహాభారతచర్చ) "యద్యపి ధర్మేచార్థేచకామేచమోక్షేచేత్యుక్తం తథాపిచత్వారాశ్చకారా ఏవమాహుః-యద్యపి ధర్మార్థకామానాం సర్వస్వం తాదృక్నాస్తి యదన్యత్రనవిద్యతే, తథాపి పర్యంత విరసత్వమత్రై వావలోక్యతాం. మోక్షేతుయద్రూపం తస్యసారత్వాత్రైవ విచార్యమితి".

ధర్మార్థకామాల సర్వస్వం అన్యత్రలేనిది 'భారతం'లో లేదు. కాని పర్యంత విరసత్వం కలిగిన ఈ గ్రంథంలోనే మోక్షలక్షణ పురుషార్థాన్ని విచారించాలి'. అని లోచనకారుడైన అభినవగుప్తుడు వ్రాశాడు కదా!

శాస్త్రేతిహాసపురాణాలకంటె శ్రేష్ఠమైన దివ్యప్రబంధంలో భగవద్వ్యతి రిక్తమైనదంతా అనిత్యమే కాబట్టి "వీడుమిన్ ముత్తవుమ్" 'సర్వం త్యజించండి' అనీ మోక్షలక్షణమైన పురుషార్థమే శాస్త్రమార్గం కాబట్టి, "ఈదిలవణ్ పుగళ్నారణన్ తిణ్కళల్

శేరే” అనంత కల్యాణగుణాలు కలిగి మోక్షనిర్వాహకుడైన శ్రీమన్నారాయణుని దృఢమైన పాదాలను ఆశ్రయించండి’ అని శ్రీసూక్తులు.

ధర్మార్థకామాలతో అనుగమిస్తున్న మోక్షలక్షణ పురుషార్థమూ దీనిలో వివక్షితమే. పారమార్థికమైన అంతస్తత్వం యొక్క అపేక్షలేకయే అంగభూతమైన శరీరం రమణీయంగా గోచరిస్తున్నట్లు. అంగభూత శృంగారాది రసాలూ, ధర్మాది పురుషార్థాలూ చారుత్వాధాయకాలే. తిరువాయ్ మొళిలో సర్వపురుషార్థ ప్రబోధహేతుత్వమూ, సర్వరసగర్భత్వమూ స్వశబ్దనివేదితాలై ఉన్నాయి.

ఆళ్వార్ల ప్రబంధం శాంతిరసప్రధానమైనది. దీనిస్థాయిభావం శమం. వర్ణ్యాధిదేవత శ్రియఃపతి. “పుగళ్నల్లొరువన్” అన్నట్లు సకలజగచ్ఛరీరుడైన పరబ్రహ్మ స్వరూపమే ఆలంబన విభావం. దివ్యక్షేత్ర, తీర్థ, రమ్యవన, పరమభక్తుల సాంగత్య, దౌత్యకృత్యాలు ఉద్దీపన విభావాలు. సంశ్లేషజనిత రోమాంచ, సంతోషాలు అనుభవాలు. విశ్లేషాదులచే నిర్వేద, స్మృతి, మతీత్యాదులు వ్యభిచారిభావాలు. ఉత్తమ నాయకత్వం వల్ల “రసోవైసః, రసగ్గ్హేవాయం లబ్ధ్వాऽనందీభవతి” అన్నట్లు బ్రహ్మానందమే. కాబట్టి ఇది శుద్ధాన్తసీమ”. అంటే “శాన్తియానదు ఆళ్వారుడైయ శ్రీసూక్తియైవిట్ట న్యత్ర చలియాతు” శాన్తి అనేది దివ్యసూరిశ్రీసూక్తిని విడిచి మరొక చోటికి కదలదు-అని సూచింపబడింది.

మాయాం-ధయన్తీ:- విస్తారమైన తన సత్త్వరజస్తమోగుణాలచే ప్రాణులను బంధించే ప్రకృతిని తొలగించేది నమ్మాళ్వార్లశ్రీ సూక్తి. ‘మాయ’ అంటే ప్రకృతి. ‘మాయి’ అంటే సర్వేశ్వరుడు.

“మాయాంతు ప్రకృతింవింద్యాత్ మాయినంతుమహేశ్వరమ్। (శ్వే 4-10)

ప్రకృతిచేత పరమాత్ముడు ప్రపంచాన్ని సృజిస్తున్నాడు. దానిలో మరొకడు అంటే జీవాత్ముడు మాయచే కట్టబడియున్నాడు అని ఉపనిషద్వాణి. “అస్మాన్మాయీసృజతే విశ్వమేతత్,తస్మింశ్చాన్యోమాయయాసన్నిరుద్ధః” (శ్వే4-9) దీనివల్ల చిత్తు(జీవుడు) అచిత్తు (ప్రకృతి) ఈశ్వరుడు స్వరూపంచే భిన్నులని తెలుస్తుంది కదా!

“సత్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతి సంభవాః।
నిబధ్నన్తిమహాబాహో! దేహే దేహినమవ్యయమ్॥ (భ.గీ. 14-5)

ప్రకృతికి సత్త్వరజస్తమోగుణాలు స్వరూపసిద్ధ స్వభావ విశేషాలు. అవి విస్తారమైన మహదాది ప్రకృతి వికారాలచే నిర్మితమైన దేవమనుష్యాది దేహాలలో స్వయంగా గుణ సంబంధంలేని ఆత్మ(ల)ను బంధిస్తున్నాయి. సత్త్వగుణం పురుషునికి జ్ఞాన, సుఖసంగాన్ని కలిగిస్తుంది. దానివల్ల అతడు కొన్ని సత్కర్మలను చేస్తాడు. ఆ కర్మ ఫలాన్ని అనుభవించడానికి సాధనాలైన యోనులందు పుడ్తాడు. అంటే సత్త్వం జ్ఞాన సుఖ సంగతమూలాన పురుషుణ్ని (ఆత్మను దేహంలో) బంధిస్తుంది. రజోగుణం స్త్రీ పురుషులకు అన్యోన్యంగా రాగతృష్ణా సంగజనకమై, తద్వారా పాపపుణ్యకర్మలను ఆచరించే పురుషుణ్ని తత్ఫలానుభవసాధనమైన దేహంలో బంధిస్తుంది. తమోగుణం విపరీతజ్ఞానహేతువై, పాపిష్ఠ జన్మరూప బంధాన్ని కలిగిస్తుంది. కాబట్టి జీవులను హింసించే మూల ప్రకృతిని నిర్మూలించేది ఆళ్వార్లశ్రీసూక్తి. "అవావిలన్దాదికళాలివైయాయిరముమ్" అన్నట్లు పరమభక్తిచే అన్దాది రూపంగా ప్రవహించిన సహస్రగాథాత్మక దివ్య ప్రబంధాన్ని అధ్యయనం చేసినవారు ప్రకృతి పరవశులు కాలేరు.

పారం -మజ్జనానామ్:- పరంపరగా సంసారమనే సముద్రంలోపడి దరిదాపు దొరకక నిత్యం మునకలు వేస్తూ ఊపిరాడక బహుయాతనను అనుభవిస్తున్న ప్రాణులందరిని దరికి చేర్చేది ద్రావిడవేదం.

ప్రత్యక్ నిధానమ్ : లక్ష్మీదేవిని విడువక ఎల్లప్పుడు ఎదలో భద్రంగా నిల్పుకొన్న నీరజాక్షుడు ఒక నిధివంటివాడు. "హిరణ్యనిధింనిహితం క్షేత్రజ్ఞాఉపర్యు పరిసంచరంతోనవిందేయుః" (ఛాం. 8-3-2) భూమిలోదాచిన నిధిని తెలుసుకోలేని జనులు దాని మీదనే రేయింబవళ్ళు సంచరిస్తున్నా దాన్ని పొందలేరు కదా! "వైత్తమానిదియామ్ మదుశూదనై"(తి.వా. 6-7-11)అలాగే ఆళ్వార్లు అనుసంధించారు. "యో వేద నిహితంగుహాయామ్" (తై.ఉ.)డెందంలో ప్రకాశించే నిధి ఇది. బాహ్యవస్తువులను తెలుసుకొన్నట్లు ప్రత్యగాత్మయైన భగవంతుణ్ని తెలుసుకోవడం సాధ్యం కాదు. "ప్రతీపం అంచతీతి=ప్రత్యక్॥ ఇంద్రియాలకూ, మనస్సుకూ గోచరించక ప్రకాశించే నిధి. భక్తి సిద్ధాంజనం చేతనేకనదగిన నిధి. 'తిరువాయ్ మొళి' ని అభ్యసించిన సంప్రదాయస్థులకు శ్రీమన్నారాయణుడు నిత్యసూరులకువలె తన దర్శనభాగ్యాన్ని అనుగ్రహిస్తాడని శ్రీవేదాన్తదేశికులు ఈ స్తోత్రారంభంలో వస్తు నిర్దేశరూపమైన మంగళాచరణాన్ని సుశ్లోకించారు.

2. ప్రజ్ఞాఖ్యేమన్థశైలే ప్రథిత గుణరుచిం నేత్రయన్సంప్రదాయం
తత్తల్లబ్ధిప్రసక్తై రనుపధి విబుధై రర్థితో వేంకటేశః।
తల్పం కల్పాన్త యూనఃశరజి దుపనిషద్దుగ్ధసింధుం విమథ్నన్
గ్రథ్నాతిస్వాదుగాథాలహరిదశశతీనిర్గతంరత్నజాతమ్॥

అర్థం : తత్+తత్+లబ్ధిప్రసక్తైః=ఆయాగాథల అర్థాలను తెలుసుకోవడానికి ఆసక్తులైన/ఆయా పదార్థాలను అనుభవించడానికి ఆసక్తులైన, విబుధైః= దేవతలచేత/మహాత్ములచేత (పండితులచేత), అర్థితః=ప్రార్థింపబడిన, వేంకటేశః=వేంకటేశభగవానుడు,వేంకటనాథ దేశికులు; ప్రజ్ఞా+ఆఖ్యే= భక్తి రూపాపన్నజ్ఞానమనే; మన్థశైలే=మందర పర్వతమందు, ప్రథితగుణ రుచిం= ప్రసిద్ధగుణాలశోభకలిగిన, సంప్రదాయం= సంప్రదాయాన్ని, నేత్రయన్= ధారంగా చేస్తూ, కల్పాంత యూనః= నిత్యుడైనందువల్ల ఎల్లప్పుడూ యువకుడైన సర్వేశ్వరుని యొక్క, తల్పం= పడకయైన, శరజిత్ + ఉపనిషత్+దుగ్ధసింధుం=నమ్మాళ్వార్ల ద్రవిడోపనిషత్తు అనే క్షీరాబ్ధిని, విమథ్నన్= మథిస్తూ, గాథాలహరి దశశతీ నిర్గతం= పాశురాలు అనే వేయికెరటాలయందు ఉత్పన్నమైన, స్వాదు = మనోజ్ఞాలైన, రత్నజాతం= రత్న సమూహాన్ని, అనుపధి= అందరు హృదయమందు ధరించేవిధంగా, గ్రథ్నాతి=మాలారూపంగా కూర్చుతున్నాడు.

తా॥ శ్రీవేంకటేశ భగవానుడు పూర్వం దేవతలచే ప్రార్థితుడై క్షీరసముద్రాన్ని చిలికి, అందు ఉత్పన్నమైన అమృతాన్ని వారికి ప్రసాదించాడు. అలాగే శ్రీ వేంకటనాథ దేశికులవారు పండితులచే ప్రార్థితుడై తిరువాయి మొళి అనే పాలకడలిని మథించి, దాని యందు ఉత్పన్నమైన పదార్థాలు అనే రత్నాలను సంప్రదాయమనే దారంతో కూర్చి, ఈ లోకంలో జనులందరు ఎదలో దాల్చే రీతిగా రత్నమాలను ప్రసాదిస్తున్నారు.

ప్రకాశికావ్యాఖ్య : కవికేసరి కృషినీ, ఆశయాన్ని ప్రకటిస్తున్న శ్లోకమిది.

ఇంద్రాదిదేవతాగణాలు బ్రహ్మరుద్రులను పురస్కరించుకొని,

"ప్రణామప్రవణానాథ దైత్యసైన్యైఃపరాజితాః।
శరణం త్వామనుప్రాప్తాఃసమస్తాదేవతాగణాః॥" (వి.పు.1అం.9-65)

అసుర సైన్యాలచే పరాజితులమైన మేమందరం ఓ రక్షకా! సర్వలోక నియామకా! నిన్ను ప్రణామ ప్రవణులమై శరణు పొందాము" అని శ్రీ మహావిష్ణువును ప్రార్థించారు.

సర్వేశ్వరుడు ప్రసన్నుడై దేవతలను తేజోమయులుగా చేయదలచి ఇలా ఆదేశించాడు.

"మంథానం మందరం కృత్వా నేత్రం కృత్వాచవాసుకిమ్।
మథ్యతామమృతం దేవాఃసహాయేమయ్యవస్థితే"॥ (వి.పు.1-9-78)

మీరు-సురాసురులందరు కలిసి ఓషధులను తెచ్చి పాలకడలిలో వేసి, మందర పర్వతాన్ని కవ్వంగానూ, వాసుకి అనే సర్పాన్ని త్రాడుగానూ చేసి అమృతం కోసం నా సహాయంతో క్షీరాబ్ధిని చిలుకండి" అన్నాడు.

"నేత్రం పాదపమూలేస్యాత్స్యందనే లోచనేపిచ। వస్త్రే మథిగుణే
నాడ్యాం నేత్రం నేతరితుత్రిషు॥" ప్రతాపనిఘంటువు నేత్ర శబ్దానికి ఉన్న నానార్థాలలో 'దారం, కవ్వపుత్రాడు' అర్థాలూ ఉన్నాయి. "మథిగుణః=మంథానస్యాకర్షణరజ్జుః" అని వ్యాఖ్య.

శ్రీమహావిష్ణువు కూడా క్షీరసముద్రాన్ని మథించాడు.

"రూపేణాన్యేనదేవానాం మధ్యే చక్రగదాధరః। చకర్షనాగరాజానం దైత్య మధ్యేఽ పరేణ చ॥ (వి.పు. 1-9-89) దేవతలలోను ఒకడై, రాక్షసులలోనూ ఒకడై వాసుకిని-కవ్వపుత్రాడును-లాగినాడు విష్ణువు ఒక్కటేమిటి? అనేక రూపాలలో హరిలీల ప్రకటితమయింది.

తరిగాంౘ్రలోన నొకడట
తరికడవకు కుదురునాక త్రాడును చేరుల్
తరికవ్వంబును తానట
హరి హరి హరిచిత్రలీల హరియే యెరుగున్ ॥ (ఆం.భాగ 8-205)

పాలకడలిని మథించగా అందు ఉద్భవించిన అమృతకలశాన్ని దైత్యులు ధన్వంతరి చేతిలోనుంచి లాగుకొన్నారు. శ్రీహరి స్త్రీ రూపధారియై దైత్యులను మోహింపజేసి, వారి నుంచి అమృత కలశాన్ని తీసుకొని, ఇంద్రాది దేవతలకు ప్రసాదించగా వారు అమృతాన్ని పానం చేశారు.

"మాయయామోహయిత్వా తాన్విష్ణుఃస్త్రీరూపసంస్థితః।
దానవేభ్యస్తదాదాయదేవేభ్యఃప్రదదౌప్రభుః।
తతఃపపుఃసురగణాఃశక్రాద్యాస్తత్తదాఽమృతమ్॥ (వి.పు.1-9-110)

శ్రీవేంకటేశభగవానుడు క్షీరాబ్ధిని చిలికి దేవతలకు అమృతాన్ని ప్రసాదించిన విషయం ఈ శ్లోకంలో ఉపమానంగా చెప్పబడింది.

దేవతలు భగవంతుణ్ని ప్రార్థించినట్లే పండితులు శ్రీవేంకటనాథదేశికస్వామిని ప్రార్థించారు. దేశికుల ప్రజ్ఞ అనేది మన్దరాద్రి. ప్రసిద్ధ గుణశోభకల సంప్రదాయమనేది త్రాడు (మధిగుణం). భగవానుడు నిత్యయువకుడు. "యువాకుమారః"అని శ్రుతి. "నిత్యనిరవద్యనిరతిశయౌజ్జ్వల్య సౌందర్యసౌగంధ్యసౌకుమార్యలావణ్యయౌవనాద్యనన్త గుణనిధి దివ్యరూప!"(భగవద్రామానుజుల శరణాగతిగద్యం)- నమ్మాళ్వార్ల ద్రవిడోపనిషత్తు - తిరువాయిమొళి-అనేది నిత్యయువకుడైన భగవానునికి పడకటిల్లుగా ఉన్న పాలకడలి. దీన్ని మధించగా మధుర పాశురాలు (గాథలు) అనే తరంగాల నుంచి జనించిన పదార్థాలనే భగవత్కల్యాణగుణాలేరత్నాలు.

"యథారత్నానిజలధే రసంఖ్యేయాని పుత్రక।
తథా గుణాహ్యనంతస్యాప్యసంఖ్యేయా మహాత్మనః॥" (మత్స్యపురాణం)

సముద్రం రత్నాకరం కదా। అలాగే భగవంతుడు, జ్ఞాన బలైశ్వర్యవీర్యశక్తి తేజ స్సౌశీల్యవాత్సల్య మార్దవార్జవ సౌహార్ద సామ్య కారుణ్య మాధుర్య గాంభీర్యౌదార్య చాతుర్యస్థైర్య ధైర్యశౌర్య పరాక్రమాది గుణాలు లెక్కకు మిక్కిలిగా కలవాడు.

సంఖ్యాతుం నైవశక్యంతే గుణా దోషాశ్చశార్జ్గిణః।
ఆనంత్యాత్ ప్రథమోరాశిః, అభావాదేవ పశ్చిమః॥

సర్వేశ్వరునికి కల్యాణగుణాలు అనంతంగా ఉన్నాయి. హేయగుణాలు లేనేలేవు. కాబట్టి ఆయన గుణాలను గానీ దోషాలను గానీ లెక్కింపనెవరి తరమూ కాదు. "గుణానా మాకరో మహాన్" అభిరామగుణాకరుడు నారాయణుడు.'తిరువాయ్ మొళి' పాశురాల యందలి భగవద్గుణాలనే రత్నాలను జనులందరు తమ హృదయమందు ధరించి, మనోహరంగా అనుభవించే రీతిగా దేశికులు మాలారూపంగా కూర్చి" ద్రవిడోపనిషత్తాత్పర్యరత్నావళి" ని ప్రసాదిస్తున్నారు.

భగవత్స్వరూప రూప గుణవిభూతులను అనుభవించేవారికి అమృతం లభిస్తుంది. " అమృతం మోక్షే దేవాన్నే" (నిఘంటు) 'అమృత' శబ్దానికి ప్రధాన అర్థం. 'మోక్ష'మనీ, తర్వాత 'దేవతల ఆహారం' అని నిఘంటువునొక్కి చెబుతుంది. ఈ శ్లోకం శ్లేష, ఉపమా రూపకాలంకారాతో సజ్జితం. స్రగ్ధరావృతం

3 **పాంచాలీగాత్రశోభా హృతహృదయవధూవర్గ పుంభావనీత్యా**
పత్యౌ పద్మాసహాయే ప్రణయిని భజతః ప్రేయసీ పారతంత్ర్యమ్
భక్తిః శృంగార వృత్త్యా పరిణమతి మునేర్భావబంధ ప్రథిమ్నా
యోగాత్ ప్రాగుక్త భావస్థితి రిహ విర హో దేశికాస్తత్రదూతాః॥

అర్థం : పాంచాలీ - నీత్యా! పాంచాలీ = ద్రౌపది యొక్క, గాత్రశోభా= శరీర కాంతిచే, హృత = హరింపబడిన, హృదయ= మనస్సు కల, వధూ వర్గ= స్త్రీల సమూహం యొక్క, పుంభావ నీత్యా= పురుష భావ న్యాయం చేత; పద్మా సహాయే= శ్రియఃపతియైన; ప్రణయిని=ప్రీతియుక్తుడైన, పత్యౌ=జగన్నాథుని యందు; ప్రేయసీ పారతంత్ర్యం= స్త్రీల వలె పరాధీనతను; భజతః= పొందిన;మునేః=శ్రీశఠకోపముని యొక్క; భక్తిః= భక్తి రూప జ్ఞానం; శృంగార వృత్త్యా= సింగారపు చేష్టచేత; పరిణమతి= పరిపక్వమవుతున్నది. యోగాత్= తపస్సు చేత, భావబంధ ప్రథిమ్నా= భావ బంధం యొక్క అధిక్యం చేత; ప్రాక్+ఉక్త, భావ స్థితిః= మొదట చెప్పబడిన భావబంధం; ఇహ= ఈ మునికి; విరహః = విరహం, తత్ర= విరహావస్థయందు; దేశికాః= ఆచార్యులు; దూతాః=దూతలవుతున్నారు.

తా॥ అతి సుందరమైన ద్రౌపది యొక్క దేహకాంతిని చూచి పురుషభావాన్ని ఆశ పడిన స్త్రీల న్యాయాన్ని అనుసరించి శ్రీ శఠకోపదివ్యసూరులు, సకలజీవవర్గాల యందు మిక్కిలి ప్రీతి కలిగి నియామకుడైన శ్రియఃపతియందు స్త్రీలవలె అత్యంత పారతంత్ర్యాన్ని పొందారు. తర్వాత ఆళ్వార్ల భక్తి రూపాపన్న జ్ఞానం శృంగార వ్యాపారంగా పరిణమించింది. తత్ఫలితంగా మానస సాక్షాత్కారం కలిగింది. బాహ్య సంశ్లేషాన్ని అపేక్షించినా వీరికది లభింపనందువల్ల కలిగిన అవస్థయే వీరి యొక్క విరహం. ఆ విరహావస్థలో వీరిచే పంపబడిన హంస సారసాది పక్షులే ఆచార్యులై దూతలుగా వ్యవహరింపబడుతున్నారు.

ప్ర. వ్యాఖ్య :- నమ్మాళ్వార్ల భక్తి శృంగారవృత్తిగా పరిణమించిందని సుశ్లోకితం.

"భజ-సేవాయామ్" అనుధాతునిష్పన్నమైన పదం 'భక్తి'. "ప్రేమ పూర్వమనుధ్యానం భక్తిరిత్యభిధీయతే" అని, "మహనీయ విషయిణీ ప్రీతిః భక్తిః" అని భక్తి నిర్వచింపబడింది. భగవానుని స్వరూప రూప గుణ విభూతులను ప్రేమ పూర్వకంగా నిరంతరం అనుసంధించడమే భక్తి. "శ్రోతవ్యో మంతవ్యో నిధిధ్యాసి

తవ్యః" జగత్కారణమైన పరమాత్మనే ధ్యానం చేయడం ఆత్మకు స్వరూపానుగుణమని శ్రుతిబోధిస్తున్నది. "తమేవం విద్వాన్ అమృత ఇహ భవతి"అనీ "తత్త్వజ్ఞానాన్మోక్షః" అని వేదాంతశాస్త్రం, మోక్ష ఫల ప్రాప్తి జ్ఞానం వల్ల కలుగుతుందని తెల్పగా, "ఒణ్తామరైయాళ్ కేళ్వన్ ఒరువనైయేనోక్కుముణర్వు" ఆ జ్ఞానమే శ్రియఃపతిని విషయంగా కలిగినదై ఉండాలి, అని ఆళ్వార్లు స్పష్టీకరించారు."జ్ఞానమ్ కనిన్దనలమ్", అనీ "శేముషీభక్తి రూపా" అని చెప్పబడిన రీతిగా జ్ఞానం భక్తి రూపమై పర్యవసించాలి కదా!

భక్తుడు భగవంతుణ్ని ఉపాసించే దశలు రెండు విధాలు. 1) జ్ఞాన దశ 2) ప్రేమ దశ. పర స్వరూప, స్వ స్వరూప జ్ఞానం కలవాడై, శ్రియఃపతియే తనకు రక్షకుడని భావిస్తూ, ఉపాసించే విధం 'జ్ఞాన దశ'.ఈ దశ కంటే ఉత్తమమైన ప్రేమ దశను పొందిన భక్తుడు భక్తి పారవశ్యం చేత తన స్థితిని మరచిపోతాడు. అంటే, తాను రక్ష్య కోటిలోనికి చేరినవాడని భావించక, భగవంతుని రూపగుణాదులకు మంగళాశాసనం చేస్తాడు. అంతేకాదు, తనను నాయకిగా, స్వామిని నాయకునిగా భావిస్తాడు. నాయకుని విశ్లేషించిన నాయకి పొందే దశనూ పొందడం, ఆ విరహ దశకు అనుగుణంగా మాటాడడమూ సంభవమే. ఈ విషయాన్నే "జ్ఞానత్తిల్ తమ్‌పేచ్చు, ప్రేమత్తిల్ పెణ్‌పేచ్చు" అని 'ఆచార్యహృదయం'లో ఆ గ్రంథకర్తయైన "అళగియమణవాళ ప్పెరుమాళ్ నాయనార్" తేటపరచారు.

ఇట్టి పరిణత దశ భగవత్కృప వల్ల, భక్తి రూపాపన్న జ్ఞానాన్ని పొందిన దివ్య సూరులకు కలిగింది.

లోకంలో స్త్రీత్వ పురుషత్వాది దశలు సోపాధికాలు. భగవత్కటాక్షం వల్ల ఉపాధి తొలగిపోతే ఆత్మకు సహజసిద్ధమైన స్త్రీత్వ లక్షణం ప్రకాశిస్తుంది.

ఆత్మకు శేషత్వ, పారతంత్ర్యాలు స్వరూప ధర్మాలు. పైపైన ఒకటిగా తోచినా ఆ రెండింటి మధ్య భేదం ఉంది. శేషత్వమంటే ఇష్ట వినియోగార్హతామాత్రం. పారతంత్ర్యమంటే శేషికి ఇష్టమైన పద్ధతిలో ఉపయోగపడడం. ముద్దబంగారంలాంటిది శేషత్వం, ఆభరణంగా మారిన బంగారం లాంటిది పారతంత్ర్యం అని 'ఆచార్య హృదయు'మనే గ్రంథానికి శ్రీమణవాళ మామునులు రచించిన వ్యాఖ్యలో సోదాహరణంగా వివరింపబడింది.

జీవదేవుల సంబంధం నైసర్గికం. 'స్త్రీత్వం' అంటే 'అనన్యార్హశేషత్వం' పతిని కాక మరొకరిని మనసులో కూడ స్మరించని యోగ్యత కలిగియుండడం. జీవాత్మతో గల సహజ సంబంధ, సర్వ విధ రక్షకత్వాల కారణంచేత భగవానునికి 'పుంస్త్వం' సర్వశాస్త్రాలస్వాపదేశార్థం.

"పతిం విశ్వస్య". "భర్తాసన్ భ్రియమాణో బిభర్తి" అనేవి శ్రుతి వాక్యాలు.

"స ఏవ వాసుదేవోఽసౌ సాక్షాత్ పురుష ఉచ్యతే। స్త్రీ ప్రాయ మితరత్సర్వం జగద్బ్రహ్మ పురస్సరమ్॥ వాసుదేవుడే పురుషుడనీ, బ్రహ్మ మొదల్కొని చరాచర ప్రపంచమంత స్త్రీ ప్రాయమని శ్లోకార్థం. "స్వామి త్వాత్మత్వశేషిత్వ పుంస్త్వాద్యాఃస్వామినోగుణాః। స్వేభ్యోదాసత్వ దేహత్వ శేషత్వస్త్రీత్వ దాయినః।" అని, "పుమానేకో వ్యవస్థితః" అని, "ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః" అనేవి దేవునికీ, జీవునికీ భర్తృభార్యా సంబంధాన్ని ప్రకాశింపజేసే ప్రమాణాలు. "ఉకారపదత్తాలే భర్తృభార్యా సంబంధం శొల్లి"- అష్టాక్షరిలోని ప్రణవంలో ఉన్న 'ఉకారం' యొక్క అర్థం అనన్యార్హశేషత్వం గల ఆత్మను బోధిస్తుంది, అని పెరియవాచ్చాన్ పిళ్ళై 'నిగమనప్పడి' అనే గ్రంథంలో తెలిపారు.

"సతీనాం యోషితాం దేహో యధో పకరణం భవేత్।
భర్తౄణాం భగవద్భక్త దేహస్త ద్వజ్జగద్గురోః॥" (శాండిల్య స్మృతి)

పతికి సతీ దేహం లాగా, భగవంతునికి భక్తుని దేహం ఉపకరణమని ఈ స్మృతి వాక్యార్థం.

నమ్మాళ్వార్లు అనుగ్రహించిన ప్రబంధం 'పొయ్యిల్ పాడల్ - అసత్యరహిత ప్రబంధం. "కాదల్ కడల్ పురైయ విత్త" అన్నట్లు భగవానుడు సముద్రాన్ని మించే విధంగా ప్రేమను వృద్ధి పొందించాడు. ఆళ్వార్ల భక్తి భావం మరెంతో వృద్ధి చెంది, శృంగారరసంగా పరిణమించింది. ఆళ్వార్ల సూక్తులు స్వాపదేశార్థాలు, అన్యాపదేశార్థాలు అని రెండు రీతులలో కనబడుతుంటాయి. "స్వస్య అపదేశేన అర్థాః= స్వాపదేశార్థాః, తన నెపంతో చెప్పబడిన-తాను స్వయంగా పల్కిన-మాటల వల్ల ఏర్పడిన ధ్వన్యర్థాలకు స్వాపదేశార్థాలని పేరు. "అన్యస్య అపదేశేన అర్థాః= అన్యాపదేశార్థాః ఇతరుల యొక్క మిషతో ఉపదేశింపబడిన-భక్త్యతిశయంచేత నాయికాభావాన్ని పొందిన ఆళ్వార్ల మాటలవల్ల కలిగినధ్వన్యర్థాలకు అన్యాపదేశార్థాలని పేరు. ఇట్టి స్వాప దేశ, అన్యాపదేశాలను ఆళ్వార్లు సంశ్లేష, విశ్లేష దశలలో తెలియజేశారు. ఈ రెండు దశలను

కలిగించి, వారికి భగవానుడు తన స్వరూప జ్ఞానాన్ని సంపూర్ణంగా అనుగ్రహించాడు. యోగ సమాధిలో ఆళ్వార్లకు భగవానునితోటి సంశ్లేషం, అంటే ప్రత్యక్ష సమానాకారమైన మానసానుభవం కలిగింది. దానిచే ఆళ్వార్లు బాహ్య సంశ్లేషాన్ని అపేక్షించారు. కాని అది లభించలేదు. తత్ఫలితంగా విశ్లేష దశ ఏర్పడింది. 'విశ్లేషం' అంటే బాహ్యానుభవం లభింపనందువల్ల కలత చెందిన అంతఃకరణశైథిల్యం. ఇదే విరహావస్థ.

సర్వవిధ బంధువుగా-ఏడుగడగా-ఉన్న పురుషోత్తమునిచే సంశ్లేష దశలో సుఖమూ, విశ్లేష దశలో దుఃఖమూ నిర్వహింపబడడం స్త్రీ ధర్మమే కదా! ఈ విరహ దశలో ఆళ్వార్లకు మూడవస్థలు సిద్ధించాయి.

1. తోళిమారవస్థ :- సఖీభావమిది. తిరువాయ్ మొళిలో 3 దశకాలున్నాయి.

2. తాయ్ మారవస్థ :- మాతృ భావం. తిరువాయ్ మొళిలో 7 దశకాలున్నాయి.

3. మకళవస్థ :- దుహిత్రవస్థ లేదా నాయికావస్థ. తిరువాయ్ మొళిలో 17 దశకాలున్నాయి.

ఈ మూడు దశల తాత్పర్యాన్ని "ఆచార్య హృదయం". ఒక సూత్రమందు వివరించింది. "సంబంధోపాయ ఫలంగళఱత్ ఉణర్తి తుణివు పదమాకిఠ ప్రజ్ఞావస్థైకళుక్కు తోళి తాయార్ మకళెన్ఱుపేర్"

సంబంధ జ్ఞానమైన ప్రజ్ఞావస్థ తల్లిగానూ, అనన్యార్హశేషత్వాది ఉపాయాధ్యవసాయ జ్ఞానమైన ప్రజ్ఞావస్థ తల్లిగానూ, ప్రాప్యత్వరా రూపమైన ప్రజ్ఞావస్థ నాయికగానూ చెప్పబడినాయి. " ప్రజ్ఞా త్రైకాలికీమతా" అంటే నాయికాభావన కలిగినప్పుడు సఖీభావన, మాతృభావనలు, అలాగే సఖీ, మాతృ భావనలలోనూ నాయికాభావన అనువర్తిస్తుంటాయి. ఈ మూడు భావనలు ఎల్లప్పుడు "పరస్పర సాపేక్షాలు."

ఆళ్వార్ల స్త్రీ భావన వారికి స్త్రీలతో గల ఆకార సామ్యం వల్ల కలిగింది కాదు. స్వభావగతమే. పురుషునిపట్ల,స్త్రీలకు కలిగే అనురాగ విశేష రూప భావనయే ఇది. నాయిక యొక్క అవయవాది వర్ణనలు కూడ భౌతికాలు కావు. పారమార్థికాలే అని ఆచార్యుల సిద్ధాంతం.

ఇలా పురుషుడు మరొక పురుషుని పట్ల స్త్రీ భావనను పొందడం-సజాతీయ

విషయంలో విజాతీయ బుద్ధిని పొందడమనేది సంభవమా? అనే ప్రశ్నకు సమాధానంగా దేశికులు పాంచాలీ వృత్తాంతాన్ని ఉదాహరణంగా చూపి సమర్థించారు.

"పాంచాల్యాః పద్మపత్రాక్ష్యాఃస్నాయంత్యాఃజఘనం ఘనమ్।
యాఃస్త్రియో దృష్టవత్యస్తాఃపుంభావం మనసా యయుః" (భారతం)

స్నానం చేస్తున్న పద్మదళాక్షియైన ద్రౌపది యొక్క జఘన సౌందర్యాన్ని చూచిన స్త్రీలు తమను పురుషునిగా భావించే స్థితిని - విజాతీయ భావనను పొందారు. అని శ్రీ వ్యాస భగవానుడు పలికారు. ఒక ప్రాకృత స్త్రీ రూపానికే ఇంతటి శక్తి ఉంటే, అప్రాకృతమైన భగవంతుని అద్భుత రూప సౌందర్యానికి ఇంక ఎంతటి ప్రభావం ఉంటుంది? ఆ సౌందర్యాన్ని దర్శించిన భక్తులు తమను స్త్రీ (నాయకి)గా భావించడంలో ఆశ్చర్యమేమి? అట్టి భావనను కలిగింపని స్వామి సౌందర్యమూ, అట్టి భావనను పొందని భక్తుని భక్తి భావమూ రసహీనం, అకించిత్కరం అవుతుంది కదా!

స్త్రీ సౌందర్యాన్ని చూచి స్త్రీలే పుంభావాన్ని పొందినారని భారతం చెప్పితే, పురుషుని అందాన్ని చూసి పురుషులే స్త్రీ భావాన్ని పొందినారని రామాయణం చెప్పింది.

"రూపౌదార్యగుణైః పుంసాం దృష్టి చిత్తాపహారిణమ్" అనే వాల్మీకి సూక్తిని గోవిందరాజీయకారులు" పుంసామపి రామంపశ్యతాం స్త్రీ భూత్వాఽహమనుభవేయ మిత్యభిలాషోభవతి". శ్రీరామచంద్రస్వామిని జూస్తున్న పురుషులకు కూడా నేను స్త్రీని అయ్యి అనుభవిస్తాననే కోరిక కలుగుతున్నది-అని వివరించారు.

"రూపసంహననం లక్ష్మీం సౌకుమార్యంసువేషతామ్। దదృశు ర్విస్మితాకారాః రామస్య వనవాసినః" జితేంద్రియులైన దండకారణ్యంలోని మహర్షులు కూడా శ్రీరామచంద్రుని దివ్య రూపానికి అబ్బురపడినారన్న వాల్మీకి వాగ్విలాసం గూఢమైనది కదా.

ఆ మహర్షులు స్త్రీ భావాన్ని పొందినవారై శ్రీరాముని దివ్యరూపాన్ని అనుభవించాలని ఆశపడి 'ఆలింగామోభవంతం' మిమ్మాలింగనం చేసుకొంటాం స్వామి। అన్నారు. "భవాంతరే కృష్ణావతారే యూయంగోపికాభూత్వామామాలింగథ" శ్రీ కృష్ణావతారంలో మీరు గోపికలుగా జన్మించి నన్ను ఆలింగితుని చేయండి, అన్నాడు. (అథర్వణిక కృష్ణోపనిషత్తు). మహర్షులు, స్త్రీ భావనను పొందినా, అట్టి అనుభవాన్ని

పొందడానికి మరొక జన్మవరకు వేచియుండవలసి వచ్చింది. కాని "ఆళ్వార్‌కళ్ అప్పడియన్ఱియే, అప్పోదే పెణ్మైయైయడైన్దు పురుషోత్తమనై అనుభవిక్కక్కా దలిక్కిన్ఱనర్". దివ్య సూరులు ఆ జన్మలోనే స్త్రీ భావనతో పురుషోత్తముని మానసికంగా అనుభవింపగోరడమూ, అనుభవించడమూ విశేషం- అని కాంచీ మహా విద్వాన్ శ్రీ ప్ర.భ. అణ్ణస్వామివారు తమ తిరువాయిమొళి వ్యాఖ్యానమైన 'దివ్యార్థ దీపిక'లో "ఆఙ్ఙిఱైయ" అనే దశక వ్యాఖ్యాన ప్రవేశమందు తెలిపారు.

"తాసామావిరభూత్ శౌరిః స్మయమానముఖాంబుజః। పీతాంబరధరః స్రగ్వీ సాక్షాన్మన్మథ మన్మథః" (భాగవతం) "మనః మథ్నాతీతి మన్మథః" సాక్షాత్ మన్మథుని మనస్సును సైతం మథించువాడు స్వామి అని అర్థం కదా। స్వామిరూపం మన్మథుని మనస్సును కూడా కలతను పొందేవిధంగా చేయడం,అంటే మన్మథుడుకూడా స్త్రీభావనను పొందడమే ఈ సూక్తిని శ్రీధరీయ వ్యాఖ్య"జగన్మోహనస్యకామ స్యాపిమనస్యుద్భూతః కామః, సాక్షాత్ తస్యాపిమోహకః ఇత్యర్థః" అనీ, శ్రీవీరరాఘవీయ వ్యాఖ్య"జగన్మోహకస్య కామస్యాపి మోహకః " జగత్తునూ మోహింపజేసె మన్మథుణ్నికూడా మోహింపజేసేవాడు స్వామి అని వివరించడం స్మరణీయం.

ఆత్మస్వరూపాన్ని నిష్కర్షించడానికి దివ్యసూరులు ఇలాంటి ప్రక్రియను ఎందుకు ఆదరించారు? అనే ప్రశ్నకు సమాధానం శ్రీఅరుంబదకారుల సూక్తి. "గుడ జిహ్వికాన్యాయేన విషయప్రవణరాన సంసారికళ్ పరిగ్రహిత్తు జీవిప్పవర్‌కళ్ ఎన్నుమత్తాలుమ్". వేదాంతశాస్త్రం విధించిన భగవదుపాసన అందరికి ఆచరణ సాధ్యంకాదు కదా। కాబట్టి దాన్ని పరదుః ఖాసహిష్ణులూ, పరోపకార పరాయణులూ అయినా ఆళ్వార్లు గుడ జిహ్వికాన్యాయంగా తెలిపారు. లోకంలో వైద్యుడు, తినడానికి ఇష్టపడని చేదుగా ఉండే ఔషధాన్ని బెల్లంతో కలిపి రోగికి ఇస్తే, అతడు తియ్యగా ఉండే మందు గుళికలను నాలుకతో ప్రియంగా చప్పరిస్తు మ్రింగి, స్వస్థతను పొందడం పరిపాటి. ప్రాణికోటికి శృంగార ప్రక్రియ ప్రియమైనది కదా! కాబట్టి ఆళ్వార్లు హితమైన భగవద్విషయాన్ని ప్రియమైన లౌకిక శృంగార ప్రక్రియతో మేళవించి బోధించారు. "సత్యంబ్రూయాత్ ప్రియంబ్రూయాత్" అన్నట్లు హితాన్ని ప్రియంతో కలిపి ఉపదేశించారు దివ్యసూరులు.

"రాజర్షి బ్రహ్మర్షియాన పిన్బుṃక్షత్రియత్వమ్ పిన్నాట్టి త్తిల్లైయితే." రాజర్షియైన విశ్వామిత్రుడు బ్రహ్మర్షి త్వాన్ని పొందిన తర్వాత పూర్వపు క్షత్రియత్వం ఆయనను

అనువర్తించలేదు. అంటే దివ్యసూరులు స్త్రీత్వ భావనను పొందినప్పుడు, ఎంతోకాలంనుంచి ఉన్న పుంస్త్వ భావనవారిని అనువర్తించలేదు. "మహీఘటత్వం ఘటతఃకపాలికా, కపాలికాత్ చూర్ణరజస్తతోఽణుః (వి.పు) కుండ, చిప్ప, చూర్ణం, అణువులు అనే రూపంలో ఉన్నా, మట్టియొక్క స్వరూపం మారనట్లే, స్త్రీభావనను పొంది భక్తుడు శృంగారాత్మకంగా పల్కడం ఆత్మయొక్క అనన్యార్హశేషత్వాన్నే సూచిస్తుందని, స్వరూపంలో ఎలాంటి మార్పుకలుగదని ఆచార్యులు విశదీకరించారు.

వియోగదశలో నాయకీనాయకులిర్వురు ఒకరివద్ద మరొకరు సందేశాన్ని పంపుతూ, తమ ఆర్తిని తెల్పడం ప్రసిద్ధం. హనుమద్దౌత్యం, మేఘసందేశం ఇలాంటివే కదా! అలాగే దివ్యసూరులు నాయకీ భావాన్ని పొందినప్పుడు నాయకునిగా భావించిన భగవంతుని వద్దకు పక్షులను దూతలుగా పంపుతూ, తమ ఆర్తిని ప్రకటించుకొన్నారు.

"శేర్న్దారై పక్షికళాక్కి, జ్ఞానకర్మంగళైచ్చిఱకెన్ఱు గురసబ్రహ్మచారి పుత్ర శిష్యస్థానే పేశుమ్" (ఆచార్య హృదయం 3 ప్ర.1సూ) పక్షులను దూతలుగా పంపడం సంకేతాత్మకమే. భగవద్విషయంలో ఘటకులైన ఆచార్యులను పక్షులుగా నిర్దేశిస్తూ దూతలుగా పంపినట్లు గోచరిస్తుంది.

"ఉభాభ్యామేవ పక్షాభ్యాం యథాఖే పక్షిణాంగతిః। తథైవ జ్ఞాన కర్మభ్యాంప్రాప్యతే పురుషోత్తమః॥" పక్షులు గమన సాధనాలైన రెండు రెక్కలతో ఆకాశాన సంచరింపగలుగుతాయి. అట్లే, ఘటకులు మోక్షప్రాప్తి సాధనాలైన జ్ఞాన, కర్మల ద్వారా పరమాకాశమైన పరమ పదాన్ని చేరుకోగలరు. ఈ కారణం వల్ల"దేశికాస్తత్రదూతాః" అన్నారు శ్రీమన్నిగమాంతమహాదేశికులు. ఇది హేత్వలంకారం.

అప్రస్తుతమైన నాయకీనాయకుల వృత్తాంత కథనం, ప్రస్తుతమైన ఆత్మ పరమాత్మల స్వరూప కథనమందు పర్యవసిస్తున్నది. కాబట్టి, ఇది అప్రస్తుత ప్రశంసాలంకారం. స్రగ్ధరావృత్తశ్లోకం.

4. భాషాగీతిఃప్రశస్తా భగవతి వచనాత్ రాజవచ్చోపచారాత్
సాచాగస్త్యప్రసూతాత్వితి పరిజగృహేభూమికాభేదయోగ్యా।
యత్తత్కృత్యంశ్రుతీనాం మునిగణవిహితైః సేతిహాసైఃపురాణై
స్తత్రాసౌ సత్త్వసీమ్నః శఠమథనమునేః సంహితాసార్వభౌమీ॥

అర్థం : భగవతి=భగవద్విషయమందు; భాషాగీతిః=సంస్కృతం కంటె వేరే

భాషలయందు గానం; వచనాత్= పురాణవచనంవల్లనూ; రాజవత్=రాజువలె; ఉపచారత్, చ=భగవంతుణ్ని ఉపచరించడం వల్లనూ; ప్రశస్తా=శాస్త్ర ప్రసిద్ధమై ఉన్నది. అగస్త్యప్రసూతా=అగస్త్యమహర్షిచే ప్రణీతమైన; సా,తు= ఆ ద్రావిడ భాష మాత్రం; భూమికా భేద యోగ్యా=బ్రాహ్మణులు మొదలైన సకల వర్ణస్థులకును అధ్యయన యోగ్యమైనది; ఇతి= అని;(పూర్వాచార్యులచేత) పరిజగృహే=పరిగ్రహింపబడెను. మునిగణవిహితైః= అనేక ఋషులచే రచింపబడిన; సేతిహాసైః= ఇతిహాసాలతో కూడిన; పురాణైః= పురాణాల చేత; శ్రుతీనాం= వేదాల యొక్క; యత్=ఏ; కృత్యం=వ్యాపారం-ఉపబృంహణం-చేయబడెనో; తత్= అది; తత్ర= ఆ ఉపబృంహణ కార్యమందు; సత్త్వసీమ్నః=సత్త్వ గుణానికి అవధియైన; శఠమథన మునేః= శ్రీశఠకోపముని యొక్క;అసౌ= ఈ, సంహితా= శ్రీసూక్తి; సార్వభౌమీ=మూర్ధాభిషిక్తయై ఉన్నది.

తా॥ భగవద్విషయమై సంస్కృతేతరభాషలయందు స్తోత్రం చేయడం, పురాణ వాక్యం చేతనూ, రాజును వలె సర్వేశ్వరుణ్ని ఉపచరించడం చేతనూ శాస్త్రవిహితమైనదే. ఆ ద్రావిడ భాష అగస్త్య మహర్షి నిర్మితమవడం వల్ల, సకల జనులు భగవత్ప్రీత్యర్థం స్తుతింపయోగ్యమైనది. కాబట్టి మనపూర్వాచార్యులందరు ఆ భాషను పరిగ్రహించినారు. సత్త్వగుణనిధియైన శ్రీ శఠకోపదివ్యసూరి యొక్క శ్రీ సూక్తులు, ఇతిహాస పురాణాల వలె వేదోపబృంహణాలే.

ప్రకా-వ్యాఖ్య : ద్రావిడ సంహితా ప్రాశస్త్య కథనం.

వేద, ఇతిహాస, పురాణాలన్నీ సంస్కృత భాషలోనే ఉన్నవికదా! బ్రాహ్మణులు సంస్కృత భాషతోనే భగవంతుణ్ని స్తుతించాలి కాని తదితర భాషలచే కీర్తించడం నిషిద్ధం కాదా? అనే శంకను పరిహరించేశ్లోకమిది.

"హరికీర్తిం వినైవాన్యత్ బ్రాహ్మణేన నరోత్తమ। భాషాగానంనగాతవ్యం తస్మాత్ పాపం త్వయాకృతమ్॥" బ్రాహ్మణుడు భగవద్వ్యతిరిక్త విషయంలో వేరే భాషలను ఆదరించడం పాపకార్యమే. భగవంతుని స్వరూప రూప గుణ విభూతులను వెల్లడించేవిగా ఉంటే వేరే భాషలను కూడా గౌరవించవచ్చును, అని మత్స్య పురాణం బోధిస్తున్నది. భగవంతుని వైభవాన్ని స్తుతింప కలిగినప్పుడే ఏ భాషకైనా విలువ ఉంటుంది. లేకపోతే ఆ భాష విలువ లేనిదే అవుతుంది అని భావం.

మాత్స్యపురాణత్తిలే, భాషాన్తరత్తాలే పాడా నిన్ఱుళ్ళకైశికాది కళైత్తన్నాట్టి

నిన్నుమ్ పోకవిట్ట రాజావైక్కుదిత్తు " హరికీర్తింవినైవ-కృతమ్", ఎన్దుయమవ చనత్తిన్పడియే" (ఈడు-అవతారిక)

సంస్కృతం కన్న భిన్న భాషలో పాడినవారు శిక్షార్హులని భావించిన రాజు, దేశ భాషలో భగవద్గానం చేసిన కైశికుడు మొదలైన వారిని తన దేశం నుంచి బహిష్కరించాడు. తర్వాత మరణించిన ఆ రాజును యముడు శిక్షించాడు. ఆ రాజును శిక్షించడానికి ఆయన చేసిన పాపమేమిటని అనే విషయాన్ని మత్స్యపురాణంలో యమధర్మరాజు తెల్పిన మాట ఇది. " భగవంతుణ్ని ఏ భాషలో కీర్తించినా వారు ఆదరణీయులే. అలాంటివారిని దండించిన నీవు శిక్షార్హుడవు" అన్నాడు. ఈ మత్స్యపురాణ వచనాన్ని బట్టి, భగవద్వ్యతిరిక్తభావంలో మాత్రమే భాషా నిషేధం పాటించాలని తెలుస్తుంది. భాషను బట్టి మాత్రమే ప్రబంధాలను ఆదరించడమో, పరిత్యజించడమో చేస్తే, సంస్కృత భాషలో ఉన్న వేదబాహ్యాశాస్త్రాలను స్వీకరింపవలసి యుంటుంది.(ఇల్లా 'ఈడు-అవతారణ' లో చర్చ విపులంగా ఉంది)

రాజువచ్చేపచారాత్:- 'రాజన్' శబ్దం సామాన్యంగా లోకానికంతటికీ మోదాన్ని కలిగించే వ్యక్తిని సూచిస్తుంది. "రాజా ప్రజాపతి సమోజనకఃపితా తే" (ఉత్తరరామచరితం 1-9) అన్న చోట 'రాజ తే దీప్యతే ఇతిరాజా' కనిన్యు కృషి తక్షిరాజే "త్యాదినా కనిన్ప్రత్యయః"- "యద్వా, రంజయతీతి రాజా, ధాతూనామనేకార్థత్వాద్రంజనేవృత్తిః తదుక్తమ్-రాజా ప్రకృతిరంజనాత్' ఇతి శ్లోకవ్యాఖ్యానే మహోపాధ్యాయమల్లినాథేన ధాతూనామనేకా ర్థాత్వాదితి" అని శ్రీ వాధూల వీర రాఘవాచార్యులు 'భవభూతి భావతల స్పర్శినీ వ్యాఖ్యల్లో తెల్పినట్లే, రఘువంశంలో 'రాజాప్రకృతి రంజనాత్ (4-12) అనే మాటను "యద్య' పి రాజశబ్దో రాజతేః దీప్త్యర్థత్వాత్ కనిన్ ప్రత్యయాంతో, నతురంజేః, తథాపిధాతూనా మనేకార్థత్వాత్ రంజనాత్ రాజేత్యుక్తం కవినా". అని శ్రీ మల్లినాథసూరి వ్యాఖ్యానించాడు. కాబట్టి 'రాజృ' ధాతువుకు రంజనార్థం ప్రసిద్ధం. రాజును సంతోషింపజేయడానికి రాజసేవకులు సకలోపచారాలుచేస్తూ తమ దేశభాషలో స్తోత్రం చేస్తున్నట్లే "పతిం విశ్వస్య" అన్నట్లు అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడైన సర్వేశ్వరునికి "రాజవదర్హణీయమ్" అనే రీతిగా చేతనులు నిత్యకైంకర్యం చేయాలని శాస్త్రాలు బోధిస్తున్నాయి.

"పితాచ రక్షకఃశేషీ భర్తాజ్ఞేయో రమాపతిః।స్వామ్యాధారో మమాత్మాచ భోక్తా చాద్య మనూదితః" అని ఆత్మకు భగవంతునితో నవ విధ సంబంధాలను అష్టాక్షరి

తెల్పుతుంది. పిళ్ళైలోకాచార్యుల నవవిధసంబంధమనే రహస్య గ్రంథంలో భక్తులీ సంబంధాలను భావిస్తూ గేలిచేస్తారు.

శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనమ్। అర్చనం వందనందాస్యం సఖ్యమాత్మనివేదనమ్॥" (భాగవతం)అనే తొమ్మిది విధాల భక్తి ఉపాసనలను వర్ణించడం గమనార్హమ్.

స్వామికి భగవద్భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు సుప్రభాతం, దంతధావనం, స్నానం, భోజనం, పిపాసోపశమనం, తాంబూలం, ఊంజల్ సేవాద్యుపచారాలను ఆయా సమయాల్లో నోరార స్తోత్రం చేస్తూ సమర్పిస్తుంటారు. పత్రపుష్పాదులచేత సులభంగా ఆరాధింపబడుతూ, ఆశ్రితులకు పరతంత్రుడై వారి ఇష్టప్రకారమే భోజనశయనాదులను స్వీకరించి అనుగ్రహిస్తుంటాడు. సమస్త కల్యాణ గుణాత్మకుడైన శ్రియఃపతి అనుగ్రహించి దర్శింపజేసిన విషయాలనన్నిటినీ ఆళ్వార్లు దర్శించి తమ దివ్య ప్రబంధంలో తెలియజేశారు.

"అగస్త్యో భగవాన్ సాక్షాత్తస్యవ్యాకరణంవ్యదాత్" అగస్త్యమహర్షిచే ద్రావిడభాష నిర్మింపబడింది. పాణిని మహర్షి దేవ భాషను సంస్కరించినట్లే, అగస్త్యుడు వ్యాకరణ శాస్త్రంచేత ద్రవిడ భాషను సంస్కరించాడు. సంస్కృత భాషలో ఉన్నట్లే, ద్రవిడ భాషలోనూ ఛందశ్శాస్త్ర ప్రక్రియలున్నాయి."సంస్కృతస్యయుదానంతి ద్రావిడస్యాపిభూతలే"(మార్కండేయ పురాణం) అన్నట్లు ఇతిహాస పురాణాలవలె దివ్యసూరుల సూక్తులు కూడ వేదోప బృంహణాలై వ్యాప్తి చెందినవే కదా! మట్టి కుండవలె సంస్కృత వేదం అన్యుల స్పర్శను సహించదు. బంగారుబిందెలాగ ద్రావిడవేదం మహార్ఘమై, సర్వజనులచే స్పర్శింపయోగ్యమైనది. ఆళ్వార్ తమ్మడైయకృపాతిశయత్తాలే వేదత్తిలనధికారికళాన స్త్రీ శూద్రాది కళుమిళవాతపడి వేదార్థత్తై ద్రావిడ భాషైయాలే అరుళిచ్చెయ్‌కైయాలుమ్" (ఈడు) నమ్మాళ్వార్లు తమ కృపాతిశయంచేత వేద పఠనమందు అధికారులు కానట్టి స్త్రీ శూద్రాదులు చెడిపోకుండే రీతిగా వేదాల అర్థాన్ని ద్రావిడ భాషలో అనుగ్రహించారు.

కాబట్టి "అధ్యేతవ్యం ద్విజశ్రేష్ఠైః వేదరూపమిదంకృతమ్।
స్త్రీభిఃశూద్రాదిభిశ్చైవ తేషాంముక్తిఃకరేస్థితా॥"

అన్నట్లు సర్వకాలాల్లోనూ, సర్వజనులకూ సర్వరసాలతో ఉపజీవ్యంగాఉన్న ఈ

ద్రవిడోపనిషత్తు-దివ్య ప్రబంధం- భగవంతుని ముఖోల్లాసంకోసం అనుసంధింప యోగ్యమైనదని పూర్వాచార్యులచేత పరిగ్రహింపబడినది.

సత్వగుణసంపన్నుడైన శ్రీశఠకోపదివ్యసూరి యొక్క శ్రీసూక్తి (సార్వభౌమీ) సర్వోత్కృష్టమై రాణిస్తున్నది కదా!

5. ఆదౌశారీరకార్థక్రమమిహ విశదం వింశతి ర్వక్తిసాగ్రా
సంక్షేపోసౌ విభాగం ప్రథయతిచఋచాం చారుపాఠోపపన్నమ్।
సమ్యగ్గీతానుబద్ధం సకలమనుగతం సామశాఖాసహస్రమ్
సంలక్ష్యం సాభిధేయైర్యజురపి దశకై ర్భాత్యధర్వారసైశ్చ॥

అర్థం : ఇహ= ఈ తిరువాయ్ మొళియందు; ఆదౌ=మొదట; సాగ్రా=అగ్రంతో కూడియున్న; వింశతిః=ఇరువైపాశురాలు; శారీరకార్థ=శారీరక మీమాంసశాస్త్రక్రమాన్ని; విశదం=స్పష్టంగా; వక్తి = చెబుతున్నది. అసౌ=ఈ; సంక్షేపః=సంగ్రహం; చారుపాఠ+ఉపపన్నం=నిర్దుష్టమైన పాఠాలతో కూడియున్న; ఋచాం=ఋగ్వేదాల యొక్క; విభాగం=అంశాన్ని; సమ్యక్= చక్కగా; ప్రథయతి=ప్రసిద్ధపరుస్తున్నది. గీత+అనుబద్ధం=గానంతో కూడుకొన్న; సకలం=సంపూర్ణమైన; సామశాఖా సహస్రమ్=సామవేద సహస్రశాఖలును, అనుగతం= సహస్రపాశురాలచే అనుసరింపబడియున్నవి. సాభిధేయైః=అర్థంతో కూడియున్న; దశకైః= తిరువాయ్ మొళి దశకాలచేత; యజురపి=యజుర్వేదం కూడా; సంలక్ష్యం=కనబడుతున్నది. రసైః=శృంగారాద్యష్టరసాలచే; అధర్వా,చ=అధర్వణ వేదం కూడా; భాతి= ప్రకాశిస్తున్నది.

తా॥ ఈ తిరువాయ్ మొళి యందు ప్రబంధంలో-మొదట ఉన్న (21) ఇరువై యొక్క పాశురాలచే వేదన్తార్థాలూ, ఇరువై యొక్క శాఖలుగా పఠింపబడిన ఋగ్వేద భేదాలూ గోచరిస్తున్నాయి. దీని యందలి సహస్రపాశురాలచే గానంతో కూడిన సామవేద శాఖా సహస్రమూ, దశకాల చేత ఏక శతశాఖలు గల యజుర్వేదమూ, శాంతి రస ప్రధానమైన ఈ ప్రబంధంలో ఇతరమైన అష్టరసాలున్నందువల్ల అష్టశాఖలు గల అధర్వణవేదమూ భాసిస్తున్నది. కాబట్టి, తిరువాయ్ మొళి ప్రబంధం వేదోపబృంహణ మాత్రమే కాదు. వేధాలకు సమానమైనది.

ప్రకా-వ్యాఖ్య :- వేద సదృశమైన ప్రబంధం తిరువాయ్ మొళి.

తిరువాయ్ మొళి ప్రబంధంలో మొదటి రెండు దశకాలు- ఇరువై యొక్క గాథలు- (ఉయర్వఱ, వీడుమిన్) బ్రహ్మసూత్రార్థాలను విశదపరుస్తున్నాయి. ఈ సంఖ్య వల్ల ఇరువై యొక్క శాఖలున్న ఋగ్వేద విభాగం సూచింపబడుతుందన్నారు దేశికులు.

"తత్త్వపరమాయుమ్ ఉపాసన పరమాయుమితే మోక్షశాస్త్రమ్తానిరుప్పతు, అతిల్ తత్త్వ పరమాక చ్చొల్లవేణ్డువతెల్లామ్శొల్లిత్తుకీళ్త్తిరువాయ్ మొళియిలే; ఉపాసన పరమాకచ్చొల్లవేణ్డుమ్ అత్తుక్కెల్లామ్ సంగ్రహమాయిరుక్కిఅతి త్తిరువాయ్మొళి" అని 'వీడుమిన్" అనే రెండవ తిరువాయ్ మొళికి నంబిళ్ళైగారి 'ఈడు' వ్యాఖ్యానప్రవేశ పంక్తులివి.

మోక్షశాస్త్రం తత్త్వపరమనీ, ఉపాసన పరమనీ రెండు విధాలు. దానిలో తత్త్వపరంగా చెప్పవలసినదంతా మొదటి (ఉయర్వఱ)తిరువాయ్ మొళిలో చెప్పబడింది. ఉపాయపరంగా చెప్పవలసినదాన్ని ఈ (పీడుమిన్) తిరువాయ్ మొళి. సంగ్రహంగా చెబుతున్నదని అర్థం. మోక్షశాస్త్రమైన బ్రహ్మసూత్రాలు 545 ఉన్నాయి. ఇవి విషయభేదం చేత 156 అధికరణాలుగా, నాలుగు అధ్యాయాలుగా విభజింపబడినాయి. ఒక్కొక్క అధ్యాయంలో నాలుగు పాదాలున్నాయి. నాలుగు అధ్యాయాలలో 4×4=16 పాదాలున్నాయి. మొదటి రెండు అధ్యాయాలకు 'పూర్వ ద్వికమనీ, తరువాతి రెండు అధ్యాయాలకు 'ఉత్తర ద్విక'మని పేరు.

పూర్వద్వికమందు సమన్వయం, అవిరోధం అనే విషయాలు చెప్పబడినాయి. అంటే, మొదటి అధ్యాయంలో నమన్వయం- నర్వవేదాంతవాక్యాలు సర్వజగత్కారణమైన బ్రహ్మను మాత్రమే తెలుపుతున్నాయనే విషయం-ప్రతిపాదితం. రెండవ అధ్యాయంలో అవిరోధం-అట్టి బ్రహ్మతత్త్వానికి వేదబాహ్యులవల్లగానీ, కుదృష్టులవల్లగానీ బాధింపబడే అవకాశం లేదు (అబాధిత్వం) అనే విషయం విచారింపబడింది.

ఈ రెండు విషయాలను నమ్మాళ్వార్లు మొదటి తిరువాయ్ మొళిలో తెలిపారు.
"భక్తామృతాద్యగాథాయాఃచతుస్సూత్ర్యేకకంఠతా।
నిరూపితావేదమౌళిద్వయనిష్ఠసతాంముదే॥" (సంగ్రహకారిక)

తిరువాయిమొళిలో మొదటి శతకంలోని మొదటి దశకం యొక్క మొదటి పాశురంలో ఉన్న నాలుగు చరణాలకు బ్రహ్మసూత్రాలలోని ప్రథమాధ్యాయ ప్రథమ

పాదమందలి మొదటి నాలుగు సూత్రాలతో సమానమైన అర్థాన్ని ఉభయవేదాన్తుల ప్రీతికోసం నిరూపిస్తుందని అర్థం.

ఇలా మొదటి దశకంలోని ఏడు పాశురాలలో 'సమన్వయం' సూచితం. తర్వాతి పాశురాలలో 'అవిరోధం లేదా అబాధిత్వం' తెల్పబడింది.

ఉత్తర ద్వికమందు అంటే, మూడవ అధ్యాయంలో ఉపాయస్వరూపం, నాల్గవ అధ్యాయంలో ఫలస్వరూపం నిర్ణయింపబడింది. ఈ రెండు విషయాలను మొదటి శతకంలోని రెండవదశకం తెల్పుతుంది. ఐదువందల సూత్రాలు కలిగి, అధ్యాయ చతుష్టయాత్మకమైన శారీరక మీమాంసాశాస్త్రానికీ, ఇరువై పాశురాలు మాత్రం కలిగియున్న తిరువాయ్ మొళి. రెండు దశకాలకూ ఐకమత్యం నిర్వహింపబడిందని శ్రీమద్వేదాంతదేశికులవారు ఈ శ్లోకంలో ముక్తకంఠంగా వ్యక్తీకరించారు.మిగిలిన ప్రబంధమంతా ఈ రెండు దశకాలకు వివరణమనే విషయం గమనార్హమే కదా!

చత్వారోవేదాఃసాంగా సరహస్యాబహుధాభిన్నాః। ఏకశతమధ్వర్యుశాఖాః। సహస్రవర్త్మా సామవేదః। ఏకవింశతిధాబాహ్వృచ్యమ్। నవధాఽథర్వణో వేదః॥'' (పస్పశాహ్నికమ్) నాల్గు వేదాలు సాంగ, సరహస్యాలై అనేక విధాలుగా ఉన్నాయి. యజుర్వేదం నూట ఒక శాఖలు కలది. సామవేదంలో వేయి శాఖలు, ఋగ్వేదంలో ఇరువైశాఖలు, అథర్వణవేదంలో తొమ్మిది శాఖలున్నాయని పతంజలి, మహాభాష్యకారులన్నారు. తిరువాయ్‌మొళిలో వేదాన్తార్థాలను సంగ్రహంగా వివరించే మొదటి ఇరువై యొక్క (21) గాథలు ఇరువైశాఖలుగా పఠింపబడే ఋగ్వేద విభాగాన్ని ప్రకాశింపజేస్తున్నాయి. ఈ ప్రబంధం వేయిపాశురాలుకలది-సహస్రగీతి-కాబట్టి సమగ్రమైన సామశాఖా సహస్రంగా వ్యవహరింపబడుతుంది. ప్రతిపాద్యమాన అర్థంతో కూడిన దశకాలచేత ఏక శతశాఖలున్న యజుర్వేదం సంలక్షితం ఈ ప్రబంధమందు, ప్రధానమైన శాంతిరసానికి ఉపయుక్తమైన ఎనిమిది రసాల చేత, అధర్వణవేదం కూడా భాసిస్తున్నదన్నారు దేశికులు. కాబట్టి ఈ దివ్యప్రబంధానికి సర్వవేద సామ్యం ప్రతిపాదితం.

"ప్రబంధశ్చరమశ్ఛందస్సామగానరసాత్మకః। పరబ్రహ్మాపరత్వాదిపంచావస్థా ప్రకాశకః॥ గానకర్మోచితశ్రావ్యో రసపోషనిరంతరః। ముక్త బంధముముక్షూణాంచిత్తానంద వివర్ధనః। కాండానువాక పంచాశత్‌స్థానేషు కలితాఃక్రమాత్। సంఖ్యాఃశత

దశైకానాంగాథానాం కలుషచ్ఛిదామ్॥ ఏవంద్రావిడగాథానాం సహ స్రేణ వినిర్మితః॥ప్రబంధఃకురుతేసాక్షాత్ పరతత్త్వ ప్రకాశనమ్॥ (4 సర్గ 76-79)

నమ్మాళ్వార్లనుగ్రహించిన ప్రబంధ చతుష్టయంలో ఈ చివరిప్రబంధం సామ వేదార్థసారమే; సామవేదంలా గానయోగ్యమూ, భావగమ్య భగవానుని పరవ్యూహ, విభవాంతర్యామ్యర్చావతారాలనే ఐదవస్థల ప్రకాశకమూ, విభావానుభావ సంచారీ భావ పుష్టిచేత రసభరితమూ ముక్త బద్ధ,ముముక్షువుల హృదయానందవర్ధకమూ, వేదంలో కాండలు, అనువాకాలు 'పంచాశత్' అన్నట్లే, శతక, దశక సంఖ్యాత్మకమూ అయ్యి, సహస్రగాథలతో పరతత్త్వాన్ని ప్రకాశింపజేస్తున్నదని శ్రీగరుడవాహన పండిత ప్రణీతమైన శ్రీ దివ్యసూరిచరితమనే మహాకావ్యం ప్రశంసించింది. అంతేకాదు, వేదాధ్యయనమప్పుడు మొదట,చివరనూ ఉచ్చరింపదగిన ఓంకారం సర్వ వేదోత్పత్తికి కారణమైనది కదా! ఆ ప్రణవం (ఓమ్) లోని అ,ఉ,మ అనే అక్షరాలు తిరువాయ్ మొళి ఆరంభపాశురంలో నిబద్ధమైనాయనీ ప్రస్తుతించింది.

"తత్ర సర్వాగ మోత్పత్తికారణ ప్రణవాత్మకా।
అద్య పద్యత్రిపాదేషు పృథగుక్తాక్షరత్రయీ॥ (ది.సూ.చ. 4-80)

సర్వ వర్ణస్థులూ అధికరించడం కోసం ఆ మూడక్షరాలు మొదటిపాశురంలో, మూడు పాదాల మొదట 'ఉ,మ,అ' అని తారుమారుగా సంఘటితాలు. ప్రబంధమే 'ఉ'తో అరబ్ధమై ఉయర్న్తే' అనితకారంతో ముగిసింది. కాబట్టి 'ఉత్' (ఉద్గీథరూపం) అనే ప్రణవంగా పరిణమించింది. సామవేదానికి నంబంధించిన ఉపనిషత్తు ఛాందాగ్యోపనిషత్తు. " శ్రియఃపతిస్సామవేదః ఛాందోగ్యం తస్యమస్తకమ్" అన్నమాట ప్రసిద్ధం కదా!

భగవద్రామానుజ యోగీంద్రులు ఈ సంప్రదాయ సిద్ధమైన మార్గాన్ని అనుసరించి శ్రుతిస్మృతి సూత్రాలలోని పరస్పర విరోధాభాసాలను పరిహరించి, సమన్వయ సిద్ధాన్త ప్రవర్తకులయ్యారు. "తస్మైరామానుజార్యాయ నమఃపరమయోగినే। యఃశ్రుతి స్మృతి సూత్రాణామంతర్జ్వరమశీశమత్॥ అని పూర్వాచార్యులు సంస్తుతించారు.

"ఇత్యుక్త్వా విరచితరంగికార్యముద్రా నిర్వాహఃశఠరిపు పూర్వసూరిక్లప్తైః
సార్థం ద్రామిడనిగమాదిభిఃప్రబంధైః వ్యాకుర్వన్నిగమశిఖార్థమాస్త తత్ర" (18-49)

శ్రీయతిరాజులు శ్రీరంగనాథభగవానునికి సేవాకార్యాలను నిర్వహిస్తూ, శాస్త్రాన్ని వ్యాఖ్యానిస్తూ అక్కడనే విరాజిల్లుతుండిరి, అని దివ్యసూరిచరిత్రలో ఉట్టంకింప బడింది."భాష్యకారర్ ఇదుకొణ్ణు సూత్ర వాక్యంగళ్ ఒడుఙ్ఞవిడువర్"-భాష్యకారకులు ఈ దివ్య ప్రబంధాన్ని బట్టి సూత్ర వాక్యాలను, విరోధపరిహారాదులను చేస్తూ, సమన్వయించారు.అని ఆచార్య హృదయకారులు ప్రతిపాదించారు. భగవద్విషయానికీ, శ్రీభాష్యానికీ ఐకకంఠ్యాన్ని పూర్వాచార్యులు అంగీకరించడం వల్ల శ్రీపరాశభట్టరువారు తిరువాయ్ మొళి 'తనియ'లో సరసంగా తెలిపారు. "ఈన్దముదల్తాయ్ శడగోపన్, మొయ్మ్బాల్ వళర్తఇతత్తా యిరామానుశన్" తిరువాయ్ మొళి దివ్య ప్రబంధాన్ని కన్న తల్లి నమ్మాళ్వారులనీ, దాన్ని తమగ్రంథ రచనాపాటవం చేత పెంచి,పెద్దగచేసిన హితమైన తల్లి భగవద్రామానుజులు -అని తెలిపారు. దీన్నే 'అచ్చాన్పిళ్ళై'అద్భుతంగా వివరించారు.

"పురాసూత్రై ర్వ్యాసః శ్రుతిశతశిరోర్థంగ్రథితవాన్। వివవ్రేతం శ్రావ్యం వకుళధరతామేత్య సపునః।ఉభావేతౌగ్రంథౌఘటయితుమలం సూక్తిభిరసౌ। పునర్జజ్ఞే రామావరజ ఇతి సబ్రహ్మ ముకురః॥

పూర్వశ్రీవ్యాసమహర్షి ఉపనిషత్తుల అర్థాన్ని పోషిస్తూ బ్రహ్మసూత్రాలను రచించాడు. తర్వాత ఆ వ్యాసుడే నమ్మాళ్వారుగా అవతరించి 'తిరువాయ్ మొళి' ప్రబంధాన్ని ప్రసాదించి, దాన్నే శ్రావ్యంగా వివరించాడు. మళ్లీ ఆ వ్యాసమహర్షియే ఈ రెండు గ్రంథాలను సమన్వయపరచే శ్రీభాష్యం రచించడానికి రామానుజులుగా అవతరించారు. కాబట్టి 'శ్రీభాష్యకారులు' భగవానుని యథార్థంగా ప్రతిబింబించిన స్నిగ్ధమైన అద్దమనీ సమర్థించారు. "కాసారాదిమ దివ్యసూరి కృతిసత్సోపానబద్ధాం ద్వయ, శ్రీమన్త్రోభయపార్శ్వ దండ ఘటితం శ్రీ భాష్య కీలస్థిరామ్। నిశ్రేణీం నిఖిలో జనశ్చపరమవ్యోమస్థలీప్రాపికాం, స్వస్వాచార్యనిరూపితాధ్వవశతః ప్రాప్యాధిరోహత్సదా॥ (ది.సూ.చ.18-96)- దివ్యసూరుల ప్రబంధాలు అనే మెట్లను ద్వయం, అష్టాక్షరమంత్రాలనే రెండు కఱ్ఱలకు శ్రీభాష్యసూక్తులు అనే మేకుల చేత స్థిరంగా నిర్మింపబడింది. 'ఉభయవేదాంతం' అనే నిచ్చెన. స్వాచార్యులు చూపిన దారిలో నడిచి, ఈ నిచ్చెనను ఎక్కి శ్రియః పతియైన పరమపదనాథుని కృపను పొందండి- అని భగవద్రామానుజ సంయమీంద్రులు తమ చరమదశలో శిష్యజనానికి ఆదేశించారట. దేశికులు, ఉభయవేదాన్తాల ఐకకంఠ్యాన్ని, చెప్పిన ఈ (ద్ర.తా.ర.)

శ్లోకం సుప్రసిద్ధం. తిరువాయ్ మొళి ప్రబంధాన్ని అనేక విధాలుగా వర్ణించినందువల్ల ఈ శ్లోకం ఉల్లేఖాలంకార సజ్జితం. వృత్తం స్రగ్ధర.

6. ప్రాచ్యే సేవా నుగుణ్యాత్ ప్రభుమిహశతకే ఽమంస్తముక్తేరుపాయం
ముక్తప్రాప్యంద్వితీయే మునిరనుబుబుధే భోగ్యతా విస్తరేణ।
ప్రాప్యత్వోపాయభావౌశుభసుభగతనోరిత్యవాదీత్తృతీయే
నన్యప్రాప్యశ్చతుర్థే సమభవదితరైరప్యనన్యాద్యుపాయః॥

అర్థం:- మునిః=శ్రీశఠకోపముని; ఇహ=ఈ ప్రబంధమందున్న; ప్రాచ్యే=మొదటిదైన; శతకే=పత్తునందు; సేవానుగుణ్యాత్=సేవకుయోగ్యమవడంవల్ల; ప్రభుం=శ్రియఃపతిని; ముక్తేః=మోక్షానికి; ఉపాయం=సాధనంగా; అమంస్త= తలచెను. ద్వితీయే= రెండవ పత్తులో; భోగ్యతావిస్తరేణ= భోగ్యతావిశేషంచేత; ముక్తప్రాప్యం= ముక్తులకు పొందదగినవాడుగా, అనుబుబుధే=నిష్కర్షించెను. తృతీయే=మూడవపత్తులో; ప్రాప్యత్వ+ఉపాయభావౌ= ఫలత్వ సాధనత్వాలు; శుభసుభగతనోః(ఏవ)= మంగళకరమై మనోహరమైన శరీరంతోకూడిన భగవంతునికే; ఇతి= అని; అవాదీత్=చెప్పెను. చతుర్థే= నాల్గవశతకమందు; అనన్యప్రాప్యః= తాము భగవానుని తప్ప ప్రాప్యాన్తరం కలవారు కారు; ఇతి =అని; అవాదీత్=ప్రసాదించెను. ఇతరైః=తక్కిన పత్తులచేత; అనన్య+ఆది+ఉపాయః=అనన్యోపాయత్వం మొదలైనవి; సమభవత్= సంభవించెను; ఇతి= అని; అవాదీత్=పలికెను.

తా॥ శ్రీనమ్మాళ్వార్లు తిరువాయ్ మొళి ప్రబంధమందలి ప్రథమశతకంలో సేవ్యత్వానుగుణంగా శ్రియఃపతిని మోక్షప్రాపకుడనీ, ద్వితీయ శతకంలో సర్వేశ్వరుని భోగ్యతను విస్తరిస్తూ ముక్తులకు ప్రాప్యుడనీ; తృతీయ శతకమందు ఉపాయత్వం, ప్రాప్యత్వం, రెండూ సర్వేశ్వరునికే కలవు అనీ, చతుర్థశతకంలో తమ ప్రాప్యాంతర రాహిత్యాన్నీ, మిగిలిన ఆరు శతకాలలో తమ అనన్యోపాయత్వాదులను ప్రసాదించారు.

ప్రకా-వ్యాఖ్య:- దివ్యప్రబంధంలో శ్రియఃపతి యొక్క ఉపాయత్వ, ప్రాప్యత్వాలను, తమ యొక్క అనన్యోపాయత్వ, అనన్య ప్రాప్యత్వాలను నమ్మాళ్వార్లు ప్రకటించారని వివరించే శ్లోకమిది.

నమ్మాళ్వార్లు అనుగ్రహించిన తిరువాయ్ మొళి అనే ఈ ప్రబంధం నిరవధిక వైభవం కలది. దీనిలోని పదకొండు(11) పాశురాలకు (దశకం) కూడా తిరువాయ్

మొళి అని పేరు. అట్టి పది 'తిరువాయ్ మొళి'లు(దశకాలు) ఉన్నదాన్ని 'పత్తు' (పది శతకం) అంటారు. పది పత్తులు (పదులు లేదా శతకాలు) కలసి ఉన్న ఈ ప్రబంధంలో మొత్తం 1102 పాశురాలున్నాయి. పాశురాలకు గాధలనే పేరూ ఉంది. కాబట్టి ఈ ప్రబంధాన్ని 'సహస్ర గీతి' అని కూడ అంటారు. లక్ష్మీ విశిష్టుడైన నారాయణుడు అనంతకల్యాణగుణాలు కలవాడు. హేయప్రత్యనీకుడు. హేయమంటేదోషం. సమస్త దోషాలకు ప్రతిభటుడుస్వామి. ప్రత్యనీకత (1)బాధ్య బాధకభావం (2)సహానవస్థానరూపం.

(1) బాధ్యబాధకభావం :- ఒకటి ఉంటే రెండవది బాధింపబడుతుంది.

ఉదా:- అగ్గిపడిన దూది బుగ్గి అవుతుంది.

(2) సహానవస్థాన రూపం :- ఒకటి ఉన్నప్పుడు రెండవది ఉండదు.

ఉదా:- వెలుగు ఉన్నప్పుడు చీకటి ఉండదు. ఈ రెండు రకాలైన ప్రత్యనీకత స్వామికి ఉన్నది. భగవంతుడు దోషాలలో కలిసి ఉండడు. స్వామి ఉన్న చోట దోషాలకు తావులేదు. అంతేకాదు, ఆశ్రయించినవారి దోషాలను పోగొట్టుతాడు. ఇది సహానస్థానరూపం. కాబట్టి ఇది బాధ్య బాధక రూపమైన ప్రత్యనీకత్వం.

మూడు విధాల జీవాత్మలకు మూడు రకాల దోషాలున్నాయి.

1. బద్ధులు : సంసారంలో ఉండే జీవులు. వీరికి క్లేశ పంచకం ఉంటుంది.

క్లేశ పంచకం :-

(1) అవిద్య అంటే నిత్యమూ, పవిత్రమూ సుఖరూపమూ అయిన ఆత్మ అనిత్యం, అపవిత్రం, దుఃఖంకలదని భాసింపజేసే అజ్ఞానం.

(2) అస్మిత, అంటే దేహమే ఆత్మ లేదా శరీరమే నేను అనే అభిమానం.

(3) రాగం, అంటే ఇష్టమైన దానిమీద మక్కువ.

(4) ద్వేషం, అంటే ఇష్టపడనిదాన్ని తనకు దూరంగా ఉంచడం.

(5) అభినివేశం, విషయాలను పొందితేనే కాని నిలువలేకపోవడం. ఈ హేయాలకు ప్రత్యనీకుడు పరమాత్ముడు.

2. ముక్తులు :- కొన్ని జన్మలవరకు ఉన్న సంసారబంధం తెగిపోయి పరమపదంలో

ఉన్న జీవులు. వీరికి దోష సంబంధం కొంతకాలం ఉండి తొలగింది. ఈ దోషసంబంధమూ లేనివాడు పరమాత్ముడు.

3. నిత్యులు : - జననమరణాలు లేకుండా నిత్యం పరమపదనాథుని సన్నిధిలో సేవచేస్తున్న జీవులు. అణుత్వం, పరతంత్రత నిత్యులకున్న దోషాలు. ఈ దోషాలకు ప్రత్యనీకుడు సర్వేశ్వరుడు.

ఆత్మలకు సహజలక్షణాలైన అణుత్వపారతంత్ర్యాలు జీవులకు దోషాలు కావు. ఈ లక్షణాలు దేశకాలవస్తు పరిచ్ఛేదంలేని, విభువైన సర్వేశ్వరునికి ఉంటే దోషాలవుతాయి. విభువు, అంటే చరాచరప్రపంచమంతటా వ్యాపించి ఉండే పరాత్పరునికి అణుత్వం దోషం. స్వతంత్రుడైన సర్వశేషికి పరతంత్రత దోషం. ఇంతులకు చనుబంతులు ఉద్భవించడం సహజమే. అవి పురుషునికి కలిగితే దోషమనడం పరిపాటి. అంతే కాదు; ఎప్పుడూ మార్పు చెందే ప్రకృతికి ఉన్న దోషానికి కూడా సదైక రూపరూపుడైన శ్రియఃపతి ప్రత్యనీకుడే. కాబట్టి శ్రియఃపతి అఖిలహేయప్రత్యనీక, కల్యాణగుణైకతానుడు. స్వేతరసమస్తవస్తువిలక్షణుడు. "యథార్థ దర్శిత్వేసతి యథా దృష్టార్థవాదిత్వం= అప్తతమత్వమ్". నిస్సమాభ్యధికుడైన శ్రీయఃపతి, కృపచేత చిదచిదీశ్వరుల స్వరూప స్వభావాలను దర్శింపజేయగా దర్శించిన యథార్థాన్ని ఇతరులకు తెలియజేసిన అప్తతములు నమ్మాళ్వార్లు. వారు ఈ తిరువాయ్ మొళిలోని మొదటి పత్తులో శ్రీమన్నారాయణుడే సకలజీవులచేత కైంకర్యం చేయదగినవాడు, కాబట్టి మోక్షప్రాపకుడు కూడా ఆ ప్రభువే, అని తలచారు. ఉపాయమంటే సాధనం. ప్రాపకుడు అంటే పొందజేసేవాడు. కర్మజ్ఞాన భక్తి ప్రపత్తులు ముక్తిని భగవంతుడు కలుగజేయడానికి ఉపాయాలు. జీవాత్మకు శేషత్వమే-దాస్యమే-స్వరూపం కాబట్టి తనకువిహితమైన నిత్యానుష్ఠానాన్ని-కర్మజ్ఞానభక్త్యాదిప్రక్రియను- 'నమః' పదార్థాన్ని (అఖండ-సఖండంగా) భావిస్తూ భగవత్ప్రీత్యర్థం ఆచరించాలి, అన్నారు.

"మయర్వఱమతినలమరుళినన్" భగవదనుభవానికి ఉపకరణమైన భక్తి ప్రపత్తులు తమంతతామేకలుగవు, అజ్ఞాన నివృత్తి పూర్వకమైన జ్ఞానాన్ని భగవంతుడే ప్రసాదించాడు కాబట్టి భక్త్యాదులు పుట్టుట కూడా శ్రియఃపతి కృప వల్లనే అన్నారు. దాస్యానికి అహంకార మమకారాలు విరోధులు కాబట్టి అవి పోవడానికీ, కైంకర్యం అంటే ముక్తి కల్గడానికీ సర్వేశ్వరుని పాదాలే ఉపాయమనీ, శరణమనీ నిష్కర్షించారు. అయా శబ్దార్థాన్ని మనోవాక్కాయాలచే దాస్యం చేసే రీతిని విశదీకరించారు. "ఉపాయే

గృహరక్షిత్రోఃశబ్దఃశరణమిత్యపి। వర్తతేసాంప్రతంచైషఉపాయార్థైకవాచకః॥" అనే నిఘంటువును బట్టి, శరణ శబ్దం గృహాన్ని, రక్షకుణ్ని బోధించినా, ఇక్కడ ఉపాయాన్నే సూచిస్తుంది. ఉపాయం సిద్ధమైనా, భగవంతుని స్వీకారం లేనప్పుడు జీవించడం పొసగదు. కాబట్టి, "అకించనోనన్యగతిఃశరణ్యం,త్వత్పాదమూలం శరణంప్రపద్యే" (ఆళవందార్‌స్తోత్రరత్నం) అన్నట్లు సిద్ధో పాయస్వీకారానికి మహా విశ్వాసంతో భగవంతుణ్ని ప్రార్థించవలసిందే. స్వీకార సిద్ధి భగవత్పాదపద్మాలను ఆశ్రయించే కోరిక కూడా శ్రియఃపతి యొక్క నిర్హేతుక కృపవల్లనే కలుగుతుందని భావించారు. ప్రపత్తియే ఉపాయమని ఆళ్వార్లు సిద్ధాన్తీకరించారు. కాబట్టి మొదటి పత్తులో సేవార్థతను బట్టి శ్రియఃపతియే మోక్షోపాయభూతుడనినమ్మాళ్వార్లు అధ్యవసించారు.

రెండవ పత్తులో కైంకర్యానికి విరోధియైన ప్రకృతి సంబంధాన్ని తెంచివేసి, సత్త్వమయ జ్యోతీరూపియై,కైంకర్యానికి దేశికులైన నిత్యసూరులతో చేరి భగవదనుభవ భోగాన్ని అనుభవించేదెప్పుడో అని ఆళ్వార్లు ప్రార్థించారు. ముక్తులకూ ప్రాప్యుడు-పొందదగినవాడైన సర్వేశ్వరుడు వీరికి ఎల్లప్పుడు కైంకర్యం లభించే పరమపదమందే దృష్టి ఉన్నదని, పరమపదాన్ని అనుగ్రహించడానికి సిద్ధపడ్డాడు. "భగవత్పాద కమలసేవయే మోక్షం కదా।" ఆ పరమపదాన్ని నా కొరకే అని అనుగ్రహిస్తే "ఎమ్మా వీట్టుత్తిఱముమ్‌శెప్పమ్" అన్నిటా విలక్షణమైన మోక్షం నాకు అక్కర లేదు అని ఆళ్వార్లు కచ్చితంగా తెల్పారు."తనక్కే యాక వెనైక్కొళ్లుమీతే" (తన కోసమే నన్ను అంగీకరించడం, ఇంతే "స్వతంత్రుడవైన నీవు, కావాలి అని ఆజ్ఞాపించి నాతో చేయించుకొన్నప్పుడు మాత్రమే ఆ కైంకర్యం నాకు ఇష్టం" అని నమ్మాళ్వార్లు స్పష్టపరచారు. భగవంతుడు తన కోసమని నన్ను స్వీకరించాలని అనుభవించే దశలో కూడా ఆ అనుభవం నాది, నా కోసం అనే స్వభోగ్యతాబుద్ధిని తొలగింపజేసేది 'నమః' శబ్దార్థం. ఇక మూడవ పత్తు "ద్వయమంత్రం" యొక్క ఉత్తరార్థం. (శ్రీమతే నారాయణాయ నమః) కైంకర్య పురుషార్థాన్ని బోధిస్తుంది. భగవత్కైంకర్యం భాగవతకైంకర్యం వరకు కొనసాగాలి, అని తెల్పుతుంది.

మూడవ పత్తులో ఆళ్వార్లకున్న సేవాభినివేశాన్ని కనిపెట్టిన భగవానుడు తిరుమలలో ని తన ఉనికిని చూపించగా చూచాడు. "వసవిలావడిమైశెయ్యవేండు నామ్" నిరంతరం కైంకర్యం చేయాలి మనం" అని ప్రార్థించారు. ప్రార్థించిన రీతిగా భాగవత శేషత్వపర్యంతం వాచిక కైంకర్యం చేసినట్లు తెల్పబడింది. దివ్యమంగళ

విగ్రహ విశిష్టుడైన (అర్చారూపుడైన) సర్వేశ్వరునికే ఫలత్వ సాధనత్వాలు కలవు. 'ఫలం' అంటే పొందే లాభం, ప్రాప్యం, ఉపేయం, మోక్షం, భగవత్కైంకర్యం అనే శబ్దాలు ఫలశబ్ద పర్యాయ పదాలు. ఉపాయోపేయాలు. ప్రాప్యప్రాపకాలు,సాధన ఫలాలు శ్రియః పతి అనుగ్రహంవల్ల కలుగవలసినవే అని విశదతమంగా మూడవ పత్తులో ప్రసాదించారాళ్వార్లు.

నాల్గవ పది(పత్తు)లో భగవత్కైంకర్య పురుషార్థానికి శ్రీమన్నారాయణుని పాదాలే (తిరునారణన్‌తాళ్) ఉపాయం, దీనికి భోగ్యమైన స్వర్గమూ, సంకుచిత మోక్షమూ-ఐశ్వర్య కైవల్యాలు, ఈరెండు -విరోధులు అన్నారు. కాబట్టి శ్రియఃపతిని తప్ప వేరే ప్రయోజనాలు కోరతగనివి అని అనుసంధిస్తూ, ఆళ్వార్లు తమ అనన్య ప్రాప్యత్వాన్ని వెల్లడించారు.

ఐదవ పత్తు మొదల్కొని మిగత ఆరుపత్తుల యందు "అఱెనక్కునిన్‌పాతమే శరణాక త్తన్దొళిన్ధాయ్" ఇష్టప్రాప్తికీ, అనిష్టనివృత్తికీ నీ పాదాలనే నాకు రక్షకంగా ప్రసాదించావు-అని భగవచ్ఛరణాలనే ఉపాయంగా తాము స్వీకరించి, తమ అనన్యోపాయత్వాది విషయాలను విశేషంగా తెల్పారు.

7 **దేవఃశ్రీమాన్‌స్వసిద్ధేఃకరణమితి వదన్నేకమర్థం సహస్రే**
సేవ్యత్వాదీన్ దశార్థాన్ పృథగిహ శతకైర్వక్తితత్‌స్థాపనార్థాన్।
ఐకైకశ్యాత్ పరత్వాదిషు దశకగుణే ష్వాయతన్తే తథాతే
తత్తద్గాథా గుణానా మనువిదధతి తత్పంక్తయఃపంక్తి సంఖ్యాః॥

అర్థం :- (మునిః= నమ్మాళ్వార్లు) సహస్రే=వెయ్యి పాశురాల రూపమైన; ఇహ=ఈ తిరువాయ్ మొళి ప్రబంధమందు; శ్రీమాన్= లక్ష్మీదేవి సన్నిధానం గల; దేవః= నారాయణుడు; స్వసిద్ధేః= తన ప్రాప్తికి; కరణం= సాధనం; ఇతి=అని; ఏకం= ఒక; అర్థం= అర్థాన్ని; వదన్= చెబుతూ; తత్+స్థాపన+అర్థాన్= ప్రధాన అర్థ సాధకాలైన; సేవ్యత్వ+అదీన్= సేవ్యత్వమూ మొదలైన; దశ+అర్థాన్= పది అర్థాలను; శతకైః= పది పత్తుల చేత; పృథక్=వేర్వేరుగా; వక్తి= ప్రసాదిస్తున్నారు; తే=ఆ సేవ్యత్వం మొదలైన గుణాలు; పరత్వ+ఆదిషు=పరత్వం మొదలైన; దశక గుణేషు= (పదిపత్తులయందు) నూరుతిరువాయ్‌మొషులయందు ప్రతిపాదితగుణాలలో, ఐక+ఐకశ్యాత్=(ఏకైకశః) ఒక్కొక్కటిగా; ఆయతంతే=విస్తరిస్తున్నారు. తథా= ఆ విధంగా; పంక్తి సంఖ్యాః= పది

సంఖ్యలు గల; తత్ పంక్తయః= ఆ పరత్వం మొదలైన నూరు గుణాలు, తత్+ తత్+గాథా గుణానాం= ఆయా పాశురాలచే ప్రతిపాదింపబడిన గుణాలను; అనువిదధతి= అనుసరిస్తున్నాయి.

తా॥ వేయి పాశురాలచేత ప్రసాదింపబడిన నిస్సీమోద్యద్గుణత్వం మొదలైన వేయిగుణాలు నూరుతిరువాయ్ మొళుల (దశకాలలో) యందు పరత్వాదులైన నూరుగుణాలను స్థాపిస్తున్నాయి. నూరు దశకాలలో ప్రతిపాదితాలైన పరత్వం మొదలైన నూరు గుణాలు పదిపత్తుల (శతకాల) యందు సేవ్యత్వాదులైన పది గుణాలను స్థాపిస్తున్నాయి. పది పత్తులచే ప్రతిపాదిత సేవ్యత్వం మొదలైన పదిగుణాలు శ్రియఃపతి తన ప్రాప్తికి తానే ఉపాయభూతుడనీ ప్రధానమైన అర్థాన్ని ఈ ప్రబంధమందు సాధిస్తున్నాయి.

ప్రకా-వ్యాఖ్య:- శ్రీమన్నారాయణుని సన్నిధానాన్ని పొందడానికి ఆయనయే సాధనం.

నమ్మాళ్వార్లు తిరువాయ్ మొళి ప్రబంధంలో సిరిటెంకియైన భగవానునికి సేవ చేసే ఫలం-మోక్షం-సిద్ధించాలంటే ఆ భగవానుడే సాధనం అనే ముఖ్యమైన అర్థాన్ని ప్రతిపాదించారు. ఈ ముఖ్యార్థాన్ని సాధించే సేవ్యత్వం మొదలైన పది గుణాలను పదిశతకాలలో వేర్వేరుగా వివరించారు. ఈ సేవ్యత్వాది దశగుణాలు నూరుదశకాలలో దశకానికి ఒక్క గుణం చొప్పున పరత్వం మొదలైన నూరుగుణాలుగా విస్తరిస్తున్నట్లు ప్రసాదించారు. ఈ పరత్వాది శతగుణాలు వేయిపాశురాలలో అనంతగుణాలకు సంకేతాలైన నిస్సీమోద్యద్గుణత్వం మొదలైన వేయి గుణాలుగా ప్రతిపాదింపబడినాయి.

ఆళ్వార్లు వేయిపాశురాలను నూరు పదులుగానూ, పది పత్తులుగానూ ప్రబంధీకరించారు కదా! శ్రీమన్నారాయణుని అనంతకల్యాణగుణాలు నిస్సీమోద్యద్గుణత్వాది సహస్ర గుణాలుగా ప్రతిపాదింపబడినాయి. ఈ వేయిగుణాలు నూరు పదులలోని పరత్వాది శతగుణాలను స్థాపిస్తున్నాయి. ఈ నూరుగుణాలు పదిపత్తులలోని సేవ్యత్వాది దశగుణాలను అనువర్తిస్తున్నాయి. ఈదశ గుణాలు ఒకే ఒక ముఖ్యార్థాన్ని సాధించిన దివ్యగేయకవితా ప్రబంధం 'తిరువాయ్ మొళి' అన్నారు శ్రీవేదాన్త దేశికులు.

ఈ శ్లోకం యధాసంఖ్యాలంకారాలంకృతం.

8. సేవ్యత్వాత్భోగ్యభావాత్ శుభతనువిభవాత్సర్వభోగ్యాధికత్వాత్
శ్రేయస్తద్ధేతుదానాత్శ్రితవివశతయాస్వాశ్రితానిష్టహృత్త్వాత్।
భక్తచ్ఛందానువృత్తేర్నిరుపధికసుహృద్భావతస్తత్పదవ్యాం
సాహాయ్యాచ్చస్వసిద్ధేఃస్వయమిహకరణంశ్రీధరఃప్రత్యపాది।

అర్థం:- సేవ్యత్వాత్=సేవకు అర్హుడైనందువల్లనూ, భోగ్య భావాత్=భోగ్యత్వం వల్లనూ, శుభతనువిభవాత్=మంగళశరీరవైభవం వల్లనూ; సర్వభోగ్యాధికత్వాత్=సకల జనులకు మిక్కిలి భోగ్యుడైనందువల్లనూ; శ్రేయస్తద్ధేతుదానాత్= పురుషార్థోపాయత్వం వల్లనూ; శ్రిత వివశతయా=ఆశ్రిత పారతంత్ర్యం వల్లనూ; స్వ+ఆశ్రిత+అనిష్టహృత్త్వాత్= తనను ఆశ్రయించిన వారి అనిష్టాలను పోగొట్టడంవల్లనూ; భక్త +ఛంద+అనువృత్తేః=భక్తుల అభిప్రాయాలను అనుసరించడం వల్లనూ; నిరుపధిక సుహృత్+భావతః=నిర్హేతుకమైన మిత్రభావం వల్లనూ; సత్పదవ్యాం=సన్మార్గమందు; సాహాయ్యాత్, చ=సహాయుడవడం వల్లనూ; శ్రీధరః= లక్ష్మీపతి; స్వసిద్ధేః= తనప్రాప్తికి; స్వయం=తానే; కరణం=సాధనం; ఇతి=అని; ఇహ=ఈ ప్రబంధంలో; ప్రత్యపాది=ప్రతిపాదింపబడింది.

తా॥ ఈ దివ్యప్రబంధమందున్న మొదటి పత్తులో (1)సేవ్యత్వం; రెండవపత్తులో (2) భోగ్యత్వం; మూడవ పత్తులో (3) దివ్య విగ్రహ యోగం; నాల్గవ పత్తులో (4) నిఖిల జన భోగ్యత్వం; ఐదవ పత్తులో (5) పురుషార్థోపాయత్వం; ఆరవ పత్తులో (6) ఆశ్రిత సులభత్వం; ఏడవ పత్తులో (7) ఆశ్రితుల అనిష్టనివర్తకత్వం; ఎనిమిదవ పత్తులో (8) ఆశ్రితుల అభిప్రాయానువర్తిత్వం; తొమ్మిదివ పత్తులో (9) నిరుపాధికసుహృత్త్వం, పదవ పత్తులో (10) సన్మార్గ సహాయత్వం; అనే దశ గుణాలు ప్రసాదింపబడినాయి (పత్తు శతకం) ఇలాంటి కల్యాణ గుణాలు కలవాడు కాబట్టి శ్రియఃపతి తన ప్రాప్తికి తానే ఉపాయ భూతుడని నమ్మాళ్వార్లు కృపజేశారు.

ప్రకా-వ్యాఖ్య :- దివ్యప్రబంధంలోని పది శతకాలయందు ప్రతిపాదితాలైన ప్రధాన గుణాల చేత శ్రీమన్నారాయణుడే మోక్షఫలప్రాప్తికి సాధన భూతుడనే శ్లోకమిది. తాత్పర్యం స్పష్టం. ఇందు క్రమాలంకారంతో శోభించే హేత్వలంకారం గమనీయం.

9. బ్రూతే గాథా సహస్రం మురమథన గుణస్తోమగర్భం మునీంద్రః
ప్రత్యేకం చాత్రగాథాఃప్రథితవిభుగుణాఃస్పష్టమధ్యక్షయామః।
తత్రా సంకీర్ణ తత్తద్దశకగుణ శత స్థాపనౌచిత్యయుక్తాన్

ఐదంపర్యావరుద్ధా నగుణిత గుణితాంస్తద్గుణానుద్గృణీమః॥

అర్థం:- మునీంద్రః= మునిశ్రేష్ఠులైన శ్రీనమ్మాళ్వార్లు; మురమథనగుణస్తోమగర్భం= మురాసురుని సంహరించిన సర్వేశ్వరుని గుణాలను గర్భమందుగల; గాథా సహస్రం=వేయి పాశురాలను; బ్రూతే=పలుకుతున్నారు. అత్ర= ఈ ప్రబంధమందు; ప్రత్యేకం,చ=ఒక్కొక్కటిగా; గాథాః= పాశురాలను; ప్రథిత విభు గుణాః=ప్రసిద్ధమైన భగవద్గుణాలు కలవాటినిగా; స్పష్టం= సంశయం లేకుండా; అధ్యక్షయామః= సాక్షాత్కరిస్తున్నాము. తత్ర= ఆ పాశురాలలో; అసంకీర్ణత-యుక్తాన్। అసంకీర్ణ= వేర్వేరుగా, తత్+తత్= ఆయా, దశక= తిరువాయ్ మొళుల యందలి; గుణశత= నూరుగుణాల యొక్క; స్థాపన=స్థాపనమందు; ఔచిత్యయుక్తాన్= యోగ్యతతో కూడుకున్న; ఐదంపర్య+అవరుద్ధాన్= భగవత్పరత్వ ప్రతిపాదనమందు దీక్షగొంటున్న; అగణిత గుణితాన్= అసంఖ్యాతాలై; పునరుక్తాలైన; తత్ + గుణాన్= ఆ వెయ్యి పాశురాల్లో ఉన్న గుణాలను; ఉద్గృణీమః= సంగ్రహిస్తున్నాము.

తా॥ భగవద్ధ్యాన పరులలో మూర్ధన్యులైన శ్రీనమ్మాళ్వార్లు తమ ప్రబంధంలో భగవద్గుణాలను ప్రతిపాదించే వెయ్యిపాశురాలను ప్రసాదించారు.మేము ఒక్కొక్క పాశురమందలి భగవద్గుణాలను స్పష్టంగా ప్రత్యేకీకరిస్తున్నాం. కాబట్టి ఆ వెయ్యి పాశురాలయందు ఆయా తిరువాయ్మొళి (దశకం) చేత వేర్వేరుగా ప్రతిపాదింపబడిన పరత్వాది శతగుణాల స్థాపనమందు యోగ్యతగల భగవత్పరత్వ ప్రతిపాదకాలై, అపరిమితాలైన సహస్రగాథలో గుణాలను సంగ్రహిస్తున్నాం. పునరుక్తాలైయున్నా, ఉపయోగాతిశయం కాబట్టి ఆ గుణాల పునరుక్తి దోష రహితమే అవుతుంది.

ప్రకా-వ్యాఖ్య :- 'ద్రవిడోపనిషత్తాత్పర్య రత్నావళి (దేశికులు) రచించిన విధానాన్ని బోధించే శ్లోకమిది.

భగవత్కల్యాణ గుణగర్భితాలైన వేయి పాశురాలలోని గుణాలను, ఒక్క దశకానికి (తిరువాయ్ మొళి) ఒక్క శ్లోకం చొప్పున రచిస్తూ, స్పష్టంగా ద్ర.తా.ర.లో సంగ్రహించినట్లు దేశికులు విశదం చేశారు. తాత్పర్యం స్పష్టం.

10. ఇచ్ఛాసారథ్య సత్యాపితగుణకమలాకాంతగీతాంతసిధ్య
చ్ఛుద్ధాంతాచారశుద్ధై రియ మనఘగుణగ్రంథిబంధానుబద్ధా।
తత్తాదృక్తామ్రపర్ణీ తటగతశఠజిద్దృష్ట సర్వీయశాఖా

గాధా తాత్పర్యరత్నావళి రఖిలభయోత్తారణీధారణీయా॥

అర్థం :- ఇచ్ఛా-శుద్ధైః ఇచ్ఛా= స్వేచ్ఛగా చేయబడిన; సారథ్య=సారథ్యంచే; సత్యాపిత=ప్రకాశిస్తున్న; గుణ=గుణాలు కల; కమలాకాంత= శ్రియఃపతి ప్రసాదించిన; గీతా+అంత=భగవద్గీతలోని చరమశ్లోకంచేత; సిధ్యత్= సిద్ధినస్తున్న; శుద్ధాంత=పరిశుద్ధమైన అంతంగల; ఆచార శుద్ధైః= సదాచార శీలుల చేత; అనఘ, గుణగ్రంథిబంధ+అనుబద్ధా= శ్లాఘ్యమైన; గుణాల సంబంధ పరంపరానువృత్తి గల; అఖిలభయ+ఉత్తారణీ= సకలచేతనులకు భయనివర్తకమైన, తత్తాదృక్= వళిః తత్+ తాదృక్= అట్టి ప్రసిద్ధవైభవంగల; తామ్ర పర్ణీతటగత= తామ్ర పర్ణినది యొక్క తీరమందు నివసించియున్న; శఠజిత్+దృష్ట= శ్రీనమ్మాళ్వార్లచే ప్రత్యక్షీకరింపబడిన; సర్వీయ= సర్వాధికారి యోగ్యమైన; శాఖా గాథా= ద్రావిడ వేదం యొక్క పాశురాల; తాత్పర్యరత్న + ఆవళిః= తాత్పర్యాలు అనే రత్నాల పంక్తియైన; ఇయం = ఇది; ధారణీయా= ధరింపదగినది.

తా॥ శ్రీకృష్ణ భగవానుడు తన ఆశ్రితులైన పాండవులకు సారథ్య దౌత్యాదులను అనుష్ఠించి, దానిచేత ఆశ్రిత పారతంత్ర్య రూపమైన గుణాన్ని అందరు విశ్వసించే రీతిగా ప్రకాశపరచాడు. ఆయన ప్రసాదించిన భగవద్గీతలోని చరమశ్లోకంలో ప్రతిపాదితమైన చరమోపాయాన్ని అక్షరాలా పాటించే చరమ పర్వనిష్ఠులచేత శ్లాఘ్యమైన గుణాలు కలది ఈ ద్రావిడీ బ్రహ్మ సంహిత. ప్రసిద్ధ వైభవం గల తామ్రపర్ణినదీ తీరాన వెలసిన శ్రీనమ్మాళ్వార్లచే ఇది దర్శింపబడినది. సర్వవర్ణస్థులకు అధ్యయనం చేయదగినదై, సమస్త భయ నివారకమైన, ద్రావిడ వేద రూపమైన, తిరువాయ్ మొళి పాశురాల తాత్పర్యాలు అనే 'రత్నావళి' హృదయమందు ధరింపదగినది.

ప్రకా-వ్యాఖ్య : **ద్రవిడోపనిషత్తాత్పర్య రత్నావళి హృదయ మందు ధరింప తగినదని దేశికులు అవతారికను ముగిస్తున్నారు.**

చరమశ్లోకంలో శ్రీకృష్ణుడు'తనయందేన్యస్తభరులు కావాలని బోధించాడు. "తన ఎదలో వెలుగుతున్న శ్రీరామచంద్ర స్వామినే చూస్తూ, రాముడే రక్షకుడు" అని సీతమ్మ ఆచరించి చూపినట్లు అనన్యోపాయత్వ, అనన్య ప్రయోజనత్వాలచే పరిశుద్ధులైన పరమైకాంతపరులే నమ్మాళ్వార్ల ప్రసాదించిన ప్రబంధాన్ని శ్లాఘించారు. అట్టి ప్రబంధంలోని పాశురాలకు తాత్పర్యాలు అనే రత్నావళిని దేశికులు రచించి మనకు అందించారు.

రత్నావళి హృదయమందే ధరించతగినది కదా!

అవతారిక సమాప్తం.

ప్రథమ శతకమ్

ప్రథమ దశకమ్

1. నిస్సీమోద్యద్గుణత్వాదమితరసతయానంతలీలాస్పదత్వాత్
స్వాయత్తాశేషసత్తాస్థితియతనభిదావైభవాద్విశ్వరూప్యాత్।
త్ర్యక్షబ్రహ్మాత్మభావాత్సదసదవగతే స్సర్వతత్త్వేషుపూర్తేః
పశ్యన్యోగీ పరం తత్పదకమలన తావన్వ శాదాత్మచిత్తమ్ ॥

అర్థం:- నిస్సీమ+ఉద్యత్+గుణత్వాత్= అవధిలేని ఉత్కృష్టమైన గుణాలు కలవాడైనందువలన, అమితరసతయా= అధికమైన ఆనందరసం కలవాడైనందువలన; అనన్తలీలా+ ఆస్పదత్వాత్= అంతంలేని లీలకు స్థానమైనందువలన; స్వాయత్తా-వైభవాత్ స్వ+ ఆయత్త = తన అధీనమైన; అశేష= సమస్తవస్తువుల; సత్తా= స్వరూప; స్థితి= రక్షణ; యతనభిదా= ప్రయత్న భేదాల; వైభవాత్= వైభవం కలవాడైనందువలన; వైశ్వరూప్యాత్= జగత్తును శరీరంగా కలవాడైనందువల్ల; త్ర్యక్షబ్రహ్మాత్మభావాత్= రుద్రునికి, బ్రహ్మకు, ఆత్మ అయినందువలన; సత్+అసత్+ అవగతేః= ఉన్నవాడు, లేనివాడు అనే జ్ఞానం వలన; సర్వతత్త్వేషు= సకల పదార్థాలయందు; పూర్తేః= నిండి ఉండడం వలన; పరం=శ్రేష్ఠుడైన శ్రియఃపతిని; పశ్యన్= సాక్షాత్కరిస్తూ; యోగీ= తపస్వియైన నమ్మాళ్వార్లు; తత్ పదకమలనతౌ= ఆ భగవానుని పాద పద్మాలను సేవించడమందు; ఆత్మచిత్తం= తన మనస్సును; అన్వశాత్= నియోగించారు.

తా॥ సర్వేశ్వరుడు అపరిమితమైన ఉత్కృష్ట గుణాలు కలవాడు. మితిలేని ఆనందముకలవాడు, సమస్త వస్తువుల యొక్క స్వరూప, స్థితి, ప్రవృత్తి, నివృత్తుల వైభవాన్ని తన అధీనమందు కలవాడు. జగత్తును శరీరంగా కలవాడు; బ్రహ్మరుద్రులకాత్మ, సదసచ్ఛబ్దవాచ్యుడు, వస్తువులన్నిటియందు వ్యాపించి ఉన్నవాడు, అని భగవంతుణ్ని దర్శించిన నమ్మాళ్వార్లు, ఇట్టి వైభవం కల శ్రియఃపతి యొక్క శ్రీపాదకమలాలను ఆశ్రయింపుమని తమ మనస్సును నియోగించారు.

ప్రకా-వ్యాఖ్య:- మొదటి తిరువాయ్ మొళి(దశకం)లోని పాశురాల తాత్పర్యాన్ని సంగ్రహించిన శ్లోకమిది.

ప్రథమ దశకం భగవానునిపరత్వాన్ని ఉపపాదిస్తుంది. పరాత్పరుడని గ్రహించడానికి శాస్త్రం ఒక్కటే ప్రమాణం. ఉయర్వఅఉయర్నలం ఉడైయ వన్=నిస్సమాభ్యధిక ఆనంద గుణుడు, అనే వాక్యంతో దివ్యప్రబంధం ప్రారంభ మవుతుంది. భగవంతునికి హేయ ప్రత్యనీక కల్యాణ గుణత్వం స్వాభావికమే కాని తపఃప్రముఖశ్రమార్జితంకాదు. ఈ వాక్యాన్ని అనుసరించే పూర్వాచార్యులు "స్వాభావికానవధికాతిశయాసంఖ్యేయ కల్యాణగుణగణు" డని శ్రియః పతిని కీర్తించారు. "తేయేశతం" అని ఆనందవల్లి (శ్రుతి)మయర్వు అఱ మదినలం అరుళినన్:- అజ్ఞానం (భ్రాంతి, సందేహం, విస్మృతి) మొదలైనవి నశించే విధంగా (నిర్హేతుకకృపతో ఆళ్వారుకు) జ్ఞానభక్తులను ప్రసాదించినవాడు, అని రెండవ వాక్యం "మతిః=జ్ఞానం, నలమ్=భక్తి" (చేవకలిగి మొలిచే మొక్కవలె) మొదలే భక్తిగా పర్యవసించిన జ్ఞానాన్ని కృపచేశాడని శ్రీ పరాశరభట్టర్ శ్రీసూక్తి.

"ప్రజ్ఞాచతస్మాత్ ప్రసృతాపురాణీ" అన్నట్లు ప్రసిద్ధుడైనవాడు కదా పరమాత్ముడు. అయర్వుఅఱుమ్ అమరర్కళ్ అధిపతి = మరపు లేని అమరులకు నిర్వాహకుడు అని మూడవ పాదం 'అమరులు' అంటే మరణం లేనివారు. 'మరణం' అంటే భగవంతుని పట్ల విస్మృతి కలుగడం. అట్టి మరపులేని వారునిత్యసూరులు-నిత్యులు, ముక్తులు. ప్రకృతి సంబంధంలేని అనంతగరుడ విష్వక్సేనాదులకు భగవదను భవమందు విస్మృతి (మరపు) లేనే లేదు. ఇట్టి విస్మృతి యొక్క అభావం. 'ప్రాగభావం' మొదటనే లేకపోవడమని అర్థం. ముక్తులకు సంసారంలో ఉన్నంతకాలం భగవద్విస్మృతి ఉండేది. ఆచార్య కటాక్షం వల్ల సంసార సంబంధం నశించి పరమపదం చేరిన తర్వాత భగవదనుభవమందు విస్మృతి యొక్క అభావమేర్పడింది. దీన్ని 'ప్రధ్వంసాభావం"- ఒకప్పుడుండి తర్వాత నశించడం - అంటారు. ఏదైనా ఉండే అవకాశం ఉన్నచోట అది లేదు అని విధించడం (ప్రసక్తస్యహి ప్రతిషేధః) అవసరం కాబట్టి అమరులకు 'మరపులేదు' అనబడింది. సర్వేశ్వరుని తో సమానమైన గుణాలు, స్వరూపం కల నిత్యసూరులకు కూడా విశేషంగా లక్ష్మీదేవి వక్షస్థలంలో ఉన్న నారాయణుడు అధిపతియై సేవ్యమానుడు అని అర్థం.

తుయర్అఱుశుడర్అడితొళుదుఎళు+ఎన్ మననే=దుఃఖాలను పోగొట్టే

జ్యోతిర్మయి పాదాలకు ప్రణమిల్లి ఉజ్జీవింపుమా! ఓ నా మనసా! అని చతుర్థపాదార్థం. శిశువు తల్లి యొక్క అవయవాలనన్ని వదలి పాలిండ్ల వద్దనే నోరు ఉంచేరీతిగా జీవుడు ఆశించేది భగవత్పాదకైంకర్యమే కాబట్టి దివ్యమంగళవిగ్రహానికి ఉపలక్షణం 'శుడరడి' అని తేజోమయ పాదాలే అనుసంధింపబడినాయి.'ఆశ్రితుల దుఃఖనివృత్తి చేత భగవంతుడు దుఃఖనివృత్తిని పొందువాడు'అని భగవద్రామానుజులవారు వివరించారు. భగవంతునికి దుఃఖం ఉంటుందా? అంటే "వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః" పౌరులకు ఆపద కలిగినప్పుడు శ్రీరాముడు వారికన్న ఎక్కువగా దుఃఖపడేవాడు-కాబట్టి పౌరులు, రాముడు దుఃఖపడడం కూడా ఒక గుణంగా భావించేవారు కదా!

శ్రీమన్నారాయణుడే పరతత్త్వం, ఆయన పాదసేవయే పరమహితం, ఆ సేవను పొందుటే పురుషార్థం అని మొదటి పాశురంలో తత్త్వ,హిత, పురుషార్థాలు సంక్షిప్తాలు. (కంచి) శ్రీ వరదరాజస్వామి పాదాలనే "తుయరఱుశుడరడి" అని వ్యవహరిస్తారు పెద్దలు. కాబట్టి ఈ పాశురం శ్రీవరదరాజస్వామిని ఉద్దేశించి ప్రసాదింపబడినదని సంప్రదాయజ్ఞులంటారు.

అర్థపంచక వివరణం :-

1 ప్రాప్యం : కల్యాణగుణగణుడు, నిత్యసూరి నిర్వాహకుడు, ప్రాప్యుడు.

2. ప్రాప్త :- 'ఓనామనసా' అనడం వల్ల పరిశుద్ధాంతఃకరణుడైన జీవుడు.

3. ఉపాయం :-(అరుళినన్) జ్ఞానాన్ని కృపజేసినవాడు సర్వేశ్వరుడే.

4. ఫలం : (తొళుడు) సేవించి ఉజ్జీవించుము అనేదే కైంకర్యం

5. విరోధి : (మయర్వు) అజ్ఞానమ్.

1. "నిస్సీమోద్యద్గుణత్వాత్" అనే 'ఒక్క పదం"లో శ్రీమన్నిగమాంతమహాదేశికులు, తిరువాయ్మొళిలోని మొదటిపాశురం యొక్క అర్థబాహుళ్యాన్ని నిగూఢపరచి, సంగ్రహంగా తెలిపారు.

2. అమితరసతయా, అనంతలీలాస్పదత్వాత్:- 'మననగమలమ్ అఱ' అనేది రెండవ పాశురం. అవిద్యాదిదోషాల చేత కలుషితమైన మనస్సు ఆత్మ స్వరూపాన్ని ధ్యానించజాలదు. యమనియమా సనప్రాణాయామప్రత్యాహార ధారణ ధ్యానసమాధి' అనే అష్టాంగ యోగాభ్యాసంచేత, జ్ఞాన ప్రసరణ ద్వారమైన 'మనస్సును' ఆత్మవైపు

మళ్ళిస్తే మానసదోషాలు తొలగి ఆత్మజ్ఞానం వికసిస్తుంది. మానసజ్ఞానం చేత మాత్రమే తెలుసుకోదగిన జీవాత్మవంటివాడు కాడు పరమాత్మ. "మనసాతు విశుద్ధేన" (ముం.ఉ.)శ్రుతి రీత్యా, పరిశుద్ధాంతఃకరణం చేత "నేతి,నేతి' (బృ.ఉ.) ఇట్టివాడు కాదు, ఇంత వాడు కాడు" అని మాత్రమే గ్రహింపబడును, కాని 'ఇంతవాడు' అని పరిచ్ఛేదించి, పరమాత్మను తెలుసుకోవడానికి సాధ్యపడదు. అయితే పరమాత్మతత్త్వం తెలుసుకోవడానికి శక్యం కాదు అని ఛెప్పితే ఆ తత్త్వానికి తుచ్ఛత్వం-శూన్యత్వం-వచ్చి, అది లేనేలేదనే అర్థం సిద్ధిస్తుంది. కాబట్టి, అణువైన ఆత్మను మనస్సు గ్రహించే విధంగా విభువైన పరమాత్మను గ్రహించజాలదు అన్నారు ఆళ్వార్లు.

పొఱిఉణర్వు అవైఇలన్= బాహ్యేంద్రియజన్య జ్ఞానం చేత తెలుసుకోదగిన ప్రాకృత (బంగారు, బొగ్గు) పదార్థాల వంటివాడు కాడు పరమాత్మ. " యమాత్మానవేద, యం పృథ్వీనవేద". శ్రుతి చెప్పినట్లు జీవుడు జ్ఞానం కలవాడే అయినా, పరమాత్మను తెలుసుక్లోలేకపోవడంలో జ్ఞానం లేని (జడ వస్తువు) ప్రకృతితో సమానుడే. చిదచిత్తులకంటే పరమాత్మ ప్రత్యేకమైనవాడు అన్నారు.

ఉణర్ ముళునలమ్=పరిపూర్ణ జ్ఞానానందస్వరూపుడు. జ్ఞానం అంటే స్వయం ప్రకాశత్వం. ఆనందం అంటే తనకు అనుకూలమని తోచే జ్ఞానం.

ఎతిర్నికళ్కళి వినుమ్ ఇన నిలన్= భూత భవిష్యద్వర్తమాన కాలాలలో తనకు సాటి లేనివాడు. పరమాత్మ విషయంలో- ఒక వస్తువులాంటిది మరొక వస్తువు అని చెప్పబడే-సాధర్మ్యదృష్టాంతమూ లేదు. 'ఒక పదార్థం వంటిదికాదు వేరొక పదార్థం' అని చెప్పదగిన వైధర్మ్య దృష్టాంతమూ, సర్వవ్యాపకుడైనందువల్ల, సరిపడదు. మికునరై యిలనే= నతత్సమశ్చాభ్యధికశ్చదృశ్యతే (శ్రుతి)నియమించేవాడే కాని తనను నియమించే వాడు కాలేడు. కాబట్టి సర్వేశ్వరునితో సమానుడు కానీ అధికుడు కానీ కనబడదు, అని తెలిపారు ఆళ్వార్లు.

ఇలనదు వుడై యనిదు ఎననినైవు అరియవన్- (3పా) "తత్సృష్ట్వా, తదేవానుప్రావిశత్". "అంతఃప్రవిష్టఃశాస్తాజనానాం సర్వాత్మా", "అంతర్బహిశ్చతత్సర్వం వ్యాప్యనారాయణఃస్థితః" అనే శ్రుతి వాక్యాల అర్థం కలది మూడవ పాశురం. పరమాత్మ విశ్వాన్ని సృష్టించి, అంతటా, అన్నిట్లో అనుప్రవేశించాడు. నిలనిడై విశుంబిడై ఉరువినన్ అరువినన్= పాతాళ లోకం నుంచి వైకుంఠం వరకు ఉన్న చేతనాచేతన పదార్థాలలోనూ, బయటనూ వ్యాపించి ఉన్నాడు. సర్వాంతర్యామియే అయినా, వాటి దోషాలు [illegible] తనదే [illegible],

రాజ్ఞికీ మహానందకరం కదా! అలాగే దివ్యదంపతులకు లీలారసానికి స్థానమైన ఈ లీలా విభూతి కూడా సమాదరణీయమన్నారు ఆళ్వార్లు.

3. స్వాయత్తాశేషసత్తాస్థితియతనభిదావైభవాత్:- నామవనివనువన్:(4పా) సత్త సర్వనామవాచ్యాలు, మంచి చెడ్డ వస్తువులూ, సర్వకాలాల సర్వపదార్థాలూ, భగవంతుని అధీనమే. అన్నీ అయి ఉన్నవాడు ఆయనే అని 'తత్త్వమసి' వాక్యార్థాన్ని తెల్పుతుంది. స్వరూపైక్యం కాకుండా, సామానాధికరణ్యం చేత ఐక్యమున్నదని తెల్పుతుందీ మాట

"అవరవర్ తమ తమదు" (5పా) "న సంపదాం సమాహారే విపదాం వినివర్తనేసమర్థో దృశ్యతేకశ్చిత్ తం వినాపురుషోత్తమమ్" సంపదలనీయడానికి గానీ, ఆపదలను తొలగించడానికి గానీ పురుషోత్తముడు తప్ప వేరొకరు సమర్థులు కారు అని కానబడుతున్నది. "నహిపాలన సామర్థ్యమృతే సర్వేశ్వరం హరిమ్"(వి.పు.) విరోధి నివర్తకుడైన హరికి తప్ప మరొకరికి పరిపాలించే సామర్థ్యం లేదని అర్థం. ప్రణవంలోని అకారం కూడా (అవరక్షణే) శ్రీ మన్నారాయణుడే రక్షకుడని శ్రుతి బోధిస్తుంది. సర్వ దేవతలకూ అంతరాత్మగా ఉండి వారికి ఫలప్రదానశక్తి కలిగించి, వారినీ వారి నాశ్రయించిన వారినీ రక్షిస్తుంటాడు. "అయ్యన్ పాళియి లానై పోర్క్కు ఉరిత్తామెన్నా యిత్తు అవ్వోదేవతా మాత్రంగళుక్కు ఫలప్రదానశక్తి యుళ్ళదు" (ఈడు). ఒక శాసకుని యింట్లో ఉండే బొమ్మ ఏనుగు యుద్ధం చేయడం ఎంత అసంభవమో దేవతలు భగవదాత్మకులు కాకపోతే ఫలప్రదానశక్తి కలిగి ఉండడం అంతే అసంభవం. కాబట్టి లీలా విభూతి యొక్క స్థితి-రక్షణ-భగవత్సంకల్పాధీనమని బోధిస్తుంది.

నిన్ఱనరిరున్దవన్, కిడన్దవర్- (6పా) నిలుచోవడం, కూర్చోవడం, పడుకోవడం, తిరుగడం అనేవి ప్రవృత్తి (పనిచేయడం) ని తెల్పుతాయి. నిల్వకపోవడం, కూర్చుండకపోవడం, పడుకోకపోవడం అనేవి నివృత్తి (పనిచేయమి) ని తెల్పుతాయి. పనిచేసేవారు, చేయనివారు అనేవి ఆకృతి వాచక శబ్దాలు. ఆయా వ్యక్తుల, వస్తువుల ప్రవృత్తి నివృత్తులను తెలిపే ఏ శబ్దమైనా, లోపల ఉన్న పరమాత్మ వరకు అర్థం పయనిస్తుంది కాబట్టి అపర్యవసానవృత్తి చేత సర్వేశ్వరుణ్ని బోధిస్తుంది. ప్రవృత్తికే కాక నివృత్తికి కూడా భగవత్సంకల్పం ఉండవలెనా? అనే ప్రశ్నకు ఎంబార్ (గోవిందభట్టారకులు) సమాధానమిలా ఉంది. "స్వర్గం నుంచి పడుతున్న (ప్రవృత్తి

కల) త్రిశంకువు (నివృత్తియైన) ఆకాశాన ఆగిపోవడానికి శక్తిమంతుడైన మరొకరి (విశ్వామిత్రుని) సహాయం అవసరమయింది కదా! అట్లే నివృత్తి కూడా మనచేతిలోనిది కాక భగవదధీనమే. వేద ప్రతిపాద్యుడనే దృఢప్రమాణ సిద్ధుడైన సర్వేశ్వరుని సంకల్పాధీనమైనది సమస్తవస్తువుల ప్రవృత్తి నివృత్తులన్నారు. (స్వాయత్తా - అనే వాక్యం 4,5,6 - మూడు పాశురాల సారార్థాన్ని బోధిస్తుంది)

4. వైశ్వరూప్యాత్ :- జీవప్రకృతులకు, పరమాత్మకు గల సంబంధం శరీరాత్మ భావం, అని తిడవిశంబు, ఎరి, వళి- (7పా) విశదీకరిస్తుంది. అచేతనమైన శరీరానికి చేతనమైన జీవాత్మ ధారకం, నియామకం శేషి అయినట్లే చిదచిత్తులకు ఆత్మ సర్వేశ్వరుడే. "అనేన జీవేనాత్మనా అనుప్రవిశ్య నామ రూపేవ్యాకరవాణి" నేను జీవాత్మను శరీరంగా చేసుకొని అచేతనమందు జీవునితో కూడా ప్రకాశించి, ఆ అచేతనానికి నామరూపాలను కల్పిస్తాను అని (ఛాం.ఉ) శ్రుతిబోధిస్తుంది. 'శరీరాత్మభావం'లో (1) నియంతృనియామ్యభావం (2) ఆధారాధేయభావం (3) శేష శేషీభావం అనే మూడు లక్షణాలున్నాయి. శరీరాత్మభావంలో పృథక్ స్థితి ఉండదు. ఉదా: చెట్టుమీద దేవదత్తుడున్నాడు. అంటే చెట్టు వేరు, దేవదత్తుడు వేరు. కాబట్టి ఈ రెండింటికి గల సంబంధం శరీరాత్మభావం కాదు. చెట్టు నుంచి వేరయినా దేవదత్తుడు ఉండగలుగుతాడు కదా! ఇది పృథక్స్థితి.

శరీరం, ఆత్మ అనేవి ప్రత్యేక ద్రవ్యాలే అయినా, రెండు వేర్వేరు ద్రవ్యాలు వేరు చేయలేని రీతిగాకలిసి ఉన్నప్పుడు మాత్రమే వాటి మధ్య శరీరాత్మభావం ఉంటుంది. ఇది 'అపృథక్ స్థితి." ఉళన్మికుశురుతియుళ్" ప్రకాశవంతమైన శ్రుతులలో ఉన్న పరమాత్మ. ప్రత్యక్షాది ప్రమాణాలు మరొక ప్రమాణం చేత బాధింవబడతాయి. ప్రకాశవంతమైనది అంటే బాధింవబడనిది వేదం. భేదాభేదశ్రుతులను సమన్వయపరచే ఘటకశ్రుతులచే జగమంతా శరీరమనీ, శ్రియఃపతి శరీరి అని బోధింపబడుతుంది.

5. త్ర్యక్ష బ్రహ్మాత్మభావాత్:- శురర్ అఱివుఅరు-(8పా) దేవతలకు కూడా అగోచరమైన మూల ప్రకృతికి కారణభూతుడు పరాత్పరుడు అని తెల్పుతుంది. అక్షరవాచ్యుడైన పరమాత్మయందు ఆకాశం పడుగు పేకవలె ఉన్నదని (కస్మిన్నుఖల్వాకాశశ్చ ఓతశ్చప్రోతశ్చ-అనే ప్రశ్నకు సమాధానం) గార్గి విద్యలో చెప్పబడింది. "అక్షరమంబ రాన్తధృతేః" అని బ్రహ్మసూత్రాలలో ఆకాశానికి అంబరాంతం పర్యాయంగా చెప్పబడింది. 'ఆత్మన ఆకాశః సంభూతః' - ఆకాశం తర్వాత సృష్టింపబడినవాటికన్నిటికి అదికారణం కాబట్టి ప్రకృతికారణమైన ఆకాశాన్ని మూల ప్రకృతిగా ఆళ్వార్లు సంకేతపరచారు.

అవైముళుదు ఉణ్ణపరపరన్- మూలప్రకృతి మొదలైనవాటినీ పూర్తిగా ఆరగించిన-ప్రళయకాలాన తన ఉదరంలో ఉంచుకొన్న-పరాత్పరుడు, అన్నారు. సృష్టిస్థితులే కాక సంహారం కూడా స్వామి అధీనమే. బ్రహ్మ, రుద్రులకూ ఆత్మగా ఉన్నవాడు పరమాత్ముడు.

'బ్రహ్మ, క్షత్రం' అనేవి సంహరింపబడే పదార్థాలకు ఉపలక్షణం. మృత్యువు చంపేవారందరికీ ఉపలక్షణం. "యస్యబ్రహ్మచక్షత్రంచ ఉభేభవతిఓదనః; మృత్యుర్యస్యోపసేచనమ్"(కఠోప) పరాత్పరునికి చరాచర ప్రపంచం అన్నం, మృత్యువు నంచుకొనే వస్తువు, అంటూ ఇలాంటి వాని మహిమనెవరు తెలుసుకోగలరు? అని శ్రుతి తెల్పుతుంది. 'ఉపసేచనం' అంటే తినడానికి సాయపడుతూ తాను తినబడే పదార్థం. జగత్సంహారకర్తగా, త్రిపుర దహనం చేసినవాడుగా రుద్రునికి 'హరుడు' అనే ప్రసిద్ధి వచ్చింది. కాని ముఖ్యంగా ఆ పనిచేసినవాడు రుద్ర శరీరకుడైన పరమాత్మయే. "విష్ణురాత్మా భగవతో భవస్యామితతేజసః। తస్మాద్ధనుర్జ్యాసంస్పర్శం సవిషేహే మహేశ్వరః" (భారతం-కర్ణపర్వం) మహేశ్వరుడు, తనకు విష్ణువు ఆత్మగా ఉండడం వల్ల, వింటి త్రాటిని స్పృశింపగలిగాడు, అని వర్ణితం.

శివుడు ఇతరులను చంపడానికి ఉపకరణమవుతూ తాను కూడా మిగులక, నశించేవాడే. కాబట్టి పూర్తి సంహారం చేయగలవాడు సర్వేశ్వరుడే.

దేవతా జ్ఞాన ప్రదాత, సృష్టికర్త బ్రహ్మ అని ప్రసిద్ధి ఉంది కదా।

"యోబ్రహ్మాణం విదధాతి పూర్వం, యోవైవేదాంశ్చప్రహిణోతి తస్మై" (శ్వే-ఉ) పద్మనాభుడైన శ్రీ మహావిష్ణువు సృష్ట్యాదిలో బ్రహ్మను సృజించాడు. ఆయనకు తానే జ్ఞాన ప్రదాత అయ్యాడు అని శ్రుతి బోధిస్తుంది కదా!

బ్రహ్మరుద్రులూ, వారు చేసే సృష్టి సంహార కార్యాలూ పరిపూర్ణంగా పరమాత్మకు అధీనమై ఉన్నవనే వేదార్థాలకు సదృశంగా ద్రావిడవేదంలో తెల్పినందువల్ల, 'సృష్టిసంహారాలు బ్రహ్మరుద్రుల అధీనంలో ఉంటాయి" అనే కుదృష్టుల వాదం ఖండింపబడింది.

6. సదసదవగతేః :- ఉళన్ ఎనిల్ఉళన్- (9పా) పరమాత్మ 'ఉన్నాడు' అన్నప్పుడు జగద్రూపంలో ఉండే చిదచిత్తులు ఆయన స్థూల శరీరాలై ఉంటాయి. 'లేడు' అంటే చిదచిత్తులు ఆయన సూక్ష్మరూపాలై ఉంటాయి.

"కుందేటి కొమ్ము లేదు" అంటే కొమ్ము ఇక్కడలేదు, జంతు జాతికి లేదు అని అర్థమే. లేని వాటి విషయంలో లేదు అన్నందువల్ల సర్వశూన్యవాదం సిద్ధించదు. నిరుపాధిక నిషేధం కుదురనిది. "సర్వథానుపపత్తేశ్చ" అనే బ్రహ్మసూత్రంలో శ్రీభాష్యకారులు (ఈపాశురాన్ని బట్టి) సర్వశూన్యవాదాన్ని ఖండించారు. లేనివాడెవడు? అని అడిగితే నాస్తికుడు ' ఈశ్వరుడు' అనే చెబుతాడు. ఆస్తికుడు ఈశ్వరుడున్నాడని ఉపాసిస్తాడు. లేడనే మాటచేత నాస్తికుడు ఈశ్వరుని ఉనికినే సాధిస్తుంటాడు. "అసద్వా ఇదమగ్ర ఆసీత్" (ఉప) సూక్ష్మచిదచిచ్ఛరీ రత్వమే 'అసత్త్వం' అని నిర్ణయించింది శ్రుతి" సత్-అసత్ అనే భావాభావాలచేత కార్య, కారణ రూపద్వయంగా ఉన్న దేవుడు వర్ణింపబడుతాడు. సవసచ్ఛబ్దవాచ్యుడు సర్వేశ్వరుడే.

7. సర్వతత్త్వేషు పూర్తేః :- పరన్దతణ్ పరవైయుళ్ (10పా) చల్లని జల పరమాణువులన్ని దగ్గర చేరియున్న సముద్ర పరమాణువులన్నిటియందూ పరమాత్మ వ్యాపించి ఉంటాడు. పరమాత్మతత్త్వం "జ్యాయా అంతరిక్షాత్" అంతరిక్షం కంటేనూ పెద్దది. భూమ్యాకాశాది పంచభూతాలయందుండే సూక్ష్మ శరీరాల్లోనూ, వాటిలో ప్రకాశించే ఆత్మలలోనూ వ్యాపించి ఉంటాడు. "అణోరణీయాన్ మహతోమహీయాన్" (నారాయణోపనిషత్) జీవుడు శరీరంలో ఒక చోట తానుంటూ, ధర్మభూత జ్ఞానం చేత శరీరమంతటా వ్యాపించి ఉంటాడు. పరమాత్మ మాత్రం స్వరూపంతోనే సర్వత్రవ్యాపించి ఉంటాడు. చిన్న బొజ్జలో అఖిలాండకోటిని భరించినా, ఇంకా శూన్య స్థలం ఎంతో ఉందట. సుకర వ్యాప్తిని కలవాడని వేదం చెబుతుంది కాబట్టి "ఇవైఉణ్డ కరన్" వీటిని మ్రింగిన స్వామి (కరణ్) దిట్టధృఢమైనవాడు విచిత్రమేమంటే, పదార్థాలకు తెలియకుండా, వాటిలో వ్యాపించి ఉంటాడు. సర్వవ్యాపకుడు.

8. పశ్యన్ యోగీ పరమ్:- కరవిశుంబు-(11పా) పంచభూతాలు, వాటి గుణాలూ తనవిగా కల పరాత్పరుని చరణకమలాలయందు ఈ ప్రబంధాన్ని సమర్పించారు సర్వస్మాత్‌పరుడని సాక్షాత్కరించి, లోకులకు తెలియజేసిన ఆప్తతములూ, యోగిశ్రేష్ఠులైన నమ్మాళ్వార్లు. 'వాల్మీకిర్భగవాన్ ఋషిః' అన్నట్లు "కురుకూర్‌శడగోపన్ ' అని తామే చెప్పుకోవడం కవి సంప్రదాయం. నిరల్‌నిఱై- శబ్దపూర్ణత, అర్థ పుష్కలత- ఈ రెండు లక్షణాలతో అంతాది ప్రబంధంగా వెలసిన వేయిపాశురాలలో ఈ పదిపాశురాలు మోక్షమే.(వీడే) 'ఈ పొలమంతా ధాన్యమే' అంటే ఈ పొలం ధాన్యాన్ని పండిస్తుంది, అని అర్థం కదా! అట్లే ఈ దశకం మోక్షప్రదమని ప్రసాదించాడు శ్రీ శఠకోపదివ్యసూరులు.

రెండవ దశకం

2. స్వామిత్వాత్ సుస్థిరత్వాన్నిఖిల నిరుపధి స్వాత్మవిద్గ్రాహ్యభావాత్
తాదృక్ సర్వానుకూల్యాత్ చ్యవన వదితర ప్రాప్యవైషమ్యవత్త్వాత్।
సర్వత్రాపక్షపాతాచ్ఛుభవిభవతయా మానసాద్యర్చ్య భావాత్
సంకోచోన్మోచకత్వా జ్జగదయనతయోపాదిశత్సర్వయోగ్యమ్॥ 12

అర్థం : స్వామిత్వాత్= నియామకుడవడంవల్ల; సుస్థిరత్వాత్= చాల స్థిరుడవడంవల్ల; నిఖిల నిరుపధి స్వ+ఆత్మవిత్+గ్రాహ్యభావాత్=సమస్తమైన, అహంకార మమకారాది విరోధాలను పోగొట్టుకొన్న తమ ఆత్మను తెలుసుకొన్నవారి చేతగ్రహింపదగిన వాడైనందువల్ల; తాదృక్ సర్వ+ ఆనుకాల్యాత్= అందరియందూ ప్రసిద్ధమైన అనుకూల్యం కలవాడవడం వల్ల; చ్యవనవత్+ఇతరప్రాప్యవైషమ్యవత్త్వాత్= నశ్వరమైనకైవల్యం కంటె ఫల వైలక్షణ్యం కలవాడవడం వల్ల; సర్వత్ర+అపక్షపాతాత్= అంతట పక్షపాతం లేని వాడవడం వల్ల; శుభవిభవతయా= మనోహరమైన సంపదలు కలవాడవడం చేత; మానసం+ఆది+అర్చ్య భావాత్=మనోవాక్కాయాల చేత అర్చింపదగినవాడైనందువల్ల; సంకోచ+ఉన్మోచకత్వాత్= జ్ఞాన సంకోచాన్ని విడిపించే వాడవడం వల్ల; జగత్+ఆయనతయా=జగత్తులకు ఆధారుడవడం చేత; సర్వయోగ్యం= సకల చేతనులకు భజింపయోగ్యుడైన శ్రియఃపతిని; ఉపాదిశత్= ఉపదేశించాడు.

తా॥ ప్రథమశతకంలో ద్వితీయదశకం 'వీడుమిన్' అనే తిరువాయ్ మొళిలోని మొదటి పాశురంలో శ్రియఃపతియే సర్వస్వామి అనీ (2పా) భగవంతుని కంటె ఇతరసమస్త వస్తువులు అస్థిరాలనీ (3పా) అహంకారమమకారాలను సవాసనగా విడిచిన వారికే సర్వేశ్వరుడు ప్రాప్యుడనీ (4) లక్ష్మీనాథుడు సర్వచేతనుల యందు అనుకూలుడనీ (5) నశ్వరమైన కైవల్యం కంటె విలక్షణమైనది భగవత్ప్రాప్తి రూప మోక్షమనీ (6) భగవంతుడు సర్వసముడనీ (7) సర్వత్ర మనోజ్ఞ సంపదలు కలవాడనీ (8) త్రికరణాల చేత భజింపదగినవాడనీ (9) సర్వేశ్వరుణ్ని భజింపగా జ్ఞాన సంకోచం నివృత్తమవుతుందనీ (10) సకల జగదాధారుడైన స్వామి సర్వాంతర్యామియై, ఉపాయోపేయాలై ఉండడం వల్ల సకల జనులకు సమారాధ్యుడు. కాబట్టి శ్రియఃపతిని అనుసంధించండి అని నమ్మాళ్వార్లు ఉపదేశించారు.

ప్రకా-వ్యాఖ్య : ఇతర విషయాలయందు విరక్తులై భగవంతుణ్ని ఆశ్రయించండి, అని పరోపదేశాన్ని ప్రారంభించారు ఆళ్వార్లు.

1. స్వామిత్వాత్ :- వీడుమిన్ ముత్తవుమ్- వదలవేయండి అన్నిటినీ. బాలుడు పామును చేతిలో పట్టుకోగా తల్లి చూచి 'విడిచి పెట్టు' అని మొదట అరచి, తర్వాత పామును అంటుంది. అట్లే జననమరణాల మధ్య నలిగిపోతున్న జీవులను చూచిన ఆళ్వార్లు గాబరాతో 'విడిచిపెట్టండి' అని మొదట చెప్పి, తర్వాత విడువవలసినవేవి? అనే విషయాన్ని వివరిస్తున్నారు.

పరమాత్మతత్త్వాన్ని అనుభవించిన ఆళ్వార్లు "పరస్పరంబోధయంతః" (భ.గీత) అన్నట్లు ఇతరులతో భగవద్గుణాలను ముచ్చటింతామనుకొన్నారు. భగవద్విషయ ప్రవీణులైనవారు ఆళ్వార్లు. శబ్దాది విషయాలయందు ప్రవీణులు సంసారులు. విషయానుభవం వల్ల కలిగిన వారి అనర్థాన్ని తొలగించకుండా నిల్వనివారై ఉపదేశం చేశారు.'వీడు' అనే తమిళ శబ్దానికి నివాస స్థలం, శరీరం, సమర్పణం (వదలడం) అనే అర్థాలున్నాయి.

భగవంతుడు సర్వ నియామకుడు. భగవద్భజనకు విరోధాలైన సాధ్యసాధన వస్తువులనన్నిటినీ విడిచిపెట్టి, (ఉమ్మొయిర్ వీడుడయానిడై వీడుశెయిమినే) మీ ఆత్మలను పరమపదనాథుని సన్నిధిలో సమర్పించండి. (ఉయిర్=ఆత్మ), వీడు= శరీరం; ఉడైయాన్, ఇడై=కలవాని వద్ద) ఆత్మ, శరీరం ఎవనికి చెందిందో వాని వద్ద సమర్పించుమన్నారు.

"యమోవైవస్వతోరాజా యస్తవైషహృదిస్థితః।
తేనచేదనివాదస్తేమాగంగాం మాకురూన్ గమః।"

(1) యముడు అంటే నియమించే వాడు. " ప్రభవతి సంయమనే మమాపివిష్ణుః"- నన్ను కూడా నియమించేవాడు విష్ణువే- అని నరకాధిపతి చెప్పినాడు కదా! (2) వైవస్వతుడు అంటే సూర్యమండలాంతర్వర్తియైన నారాయణుడు. రాజు= రంజింపజేసేవాడు సర్వేశ్వరుడే. ప్రధానద్రవ్యం ఆత్మ. మనకు మనమే స్వతంత్రులమని భావించడం ఆత్మాపహారదోషమే. మనం మనస్వామికే చెందినవారమని అంగీకరించడమే స్వామితో వివాదం లేదని అర్థం. అదే తగిన ప్రాయశ్చిత్తం. "నీ హృదయంలో యముడూ, వైవస్వతుడూ అయిన రాజు ఉన్నాడు. ఆయనతో నీకు వివాదం లేకపోతే గంగానదికి, కురు క్షేత్రానికి (ప్రాయశ్చిత్తం కోసం) పోయే అవసరం

లేదు'' అని శ్లోకార్థం. ఆచార్యులవల్ల మనం స్వామికి చెందిన వాళ్ళమే అని తెలుసుకొని, దాన్నే విశ్వసించి, ఉండడమే ఆత్మను స్వామికి సమర్పించడమని భావం.

2. సుస్థిరత్వాత్:- స్వామి మాత్రమే స్థిరంగా ఉండేవాడు. భగవంతునికంటె వ్యతిరిక్తమైన విషయాలయందు ఉండే దోషాలను రెండవ పాశురంలో వివరించారు ఆళ్వార్లు. మిన్నిన్ నిలైయిల మన్ను ఉయిర్ ఆక్కైకళ్- మెరపు కంటెనూ నిలకడలేనివి స్థిరమైన ఆత్మలు కల శరీరాలు. ఆత్మ, తాను చేసిన కర్మల తారతమ్యాన్ని బట్టి ఒకప్పుడు దేవ శరీరాన్ని, మరొకప్పుడు మానవశరీరాన్ని (మాది మాఱిపలప్పిరప్పుమ్) మారి మారి పొందుతుంటుంది. 'ఎన్నుమిడత్తు, ఇఱై, ఉన్నుమిన్ నీరే'- శరీరాలు క్షణభంగురాలనే విషయాన్ని కొంచెం ఆలోచించండి మీరే.(ఇఱై= క్షణం, స్వామి) మీరే ఆలోచించి ఆత్మలను స్వామికి అర్పించండి.

3. నిఖిల నిరుపధి స్వాత్మవిత్ గ్రాహ్యభావాత్:- నీర్,నుమతు, ఎన్ను, ఇవై=మీరు, మీది అనే అహంకారమమకారాలను, రుచి, వాసన మొదలైన వాటితో పాటు సమూలం(వేరుతో కూడ) పెరికివేసి స్వామిని చేరండి. సింహం యొక్క దంతాలకు వైద్యం చేయడానికి నోటిలో వ్రేలు పెట్టిన వ్యక్తినైనా అది గాయపరచకమానదు కదా! అట్లే ఉపదేశించడానికి "నేను, నాది" అన్నంతలోనే అహంకార,మమకారాలు తమను ఆక్రమిస్తాయేమో అనే భయం వల్ల ఆళ్వార్లు "మీరు, మీది" అన్నారు. (ఈడు). 'నాది' అంటే ప్రాకృతిక వస్తువులు కాబట్టి 'నావికావు' అనే జ్ఞానంతో వదలివేయవచ్చు. కాని స్వరూపం ఉంటేనే. 'నేను' అనేది ఉంటుంది. దీన్ని ఎలా విడిచేది? "నేను స్వతంత్రుడను" అని (రావణుని లాగా) భావిస్తే దోషం కాబట్టి దీన్ని వదలాలి. "స్వామి సొత్తును నేను" అనే భావనలో ఉన్న 'నేను' భగవంతుని ఐశ్వర్యంలోని భాగమే కాబట్టి అనర్థం కలిగించని దీన్ని స్వీకరించాలి. అహంకార, మమకారాలు పురుషార్థాలు (కోరవలసినవి) కావు. "ఆత్మన్యాత్మబుద్ధిర్యా, అస్వేస్వమితియామతిః। అవిద్యాతరు సంభూతిర్బీజమేతత్ద్విధాస్థితమ్॥" కర్మ అనే చెట్టు పుట్టడానికి విత్తు రెండు రకాలు. (1) ఆత్మకాని దేహాన్ని ఆత్మగా భావించడం. (2) తనదికాని ప్రాకృత విషయాన్ని తనదిగా అనుకోవడం. ఇదే జీవునికి సంసారబంధాన్ని కలిగించడానికి కారణం. "అచ్యుతాహంతవాస్మీతి సైవ సంసార భేషజమ్" -అచ్యుత! నేను నీవాడను-అనుకోవడమే, సంసారబంధమనే వ్యాధిని పోగొట్టే ఔషధమని కూడా విష్ణు పురాణం తెల్పుతుంది. దేశికుల వారు ఇంత భావాన్ని ఇమిడించే (నిరుపధి స్వాత్మవిత్) పదాన్ని ప్రయోగించారు.

ఉయిర్‌కు అతనేర్ నిత్తైయిల్లే- ఆత్మకు దానితో సమానమైన ఆధిక్యం మరొకటి లేదు జ్ఞానానంద లక్షణమైన ఆత్మకు భగవత్సమాశ్రయణంతో సమానమైన శ్రేష్ఠమైన కార్యం వేరొకటి లేదు. "సంసారార్ణవమగ్నానాం విషయాక్రాంతచేతసామ్। విష్ణుపోతం వినా నాన్యత్ కించిదస్తి పరాయణమ్॥ (విష్ణు ధర్మం)

సంసారమనే సముద్రంలో మునిగి, బాహ్య విషయాలచేత ఆక్రమింపబడిన మనస్సు కలిగిన వ్యక్తులకు విష్ణువు అనే ఓడను మించిన ఉపాయం మరొకటి లేదు(శ్లోకార్థం) "విషల్-వ్యాప్తౌ" ధాత్వర్థాన్ని బట్టి, విష్ణువు సర్వవ్యాపకుడని అర్థం. ఓడ, ఒడ్డు రెండూ- సముద్రాన్ని దాటించే సాధనమూ, చేరవలసిన స్థానమూ- సర్వేశ్వరుడే. ఉపాయమూ, ఉపేయమూ సర్వేశ్వరుడే, అని అహంకారమమకారాలను సవాసనగా తొలగించుకొని తమ ఆత్మను తెలుసుకొన్న మహానుభావులచేత గ్రహింపదగినవాడు.

4. తాదృక్ సర్వానుకూల్యాత్:- ఇల్లతుమ్, ఉళ్ళతుమ్ అల్లదు అవనురు- ఆచిత్తు లేనిది. ఉన్నది ఆత్మ. ఈ రెండింటి (చిదచిత్తుల) లాంటిది కానిది సర్వేశ్వరుని స్వరూపం. అనుభవించి ఆనందింపదగినవాడు స్వామి.ఆయన మితిలేని ఆనందం కలవాడు కాబట్టి సంగం వదలుకొన్నవాళ్ళకు అనుకూలుడు.

ప్రకృతి, ప్రమాణయోగ్యమైనది కాదు, తుచ్ఛమైనది కాబట్టి 'లేనిది' అని ప్రకృతిని భావించినవారు శూన్యవాదులు. ముత్యపుచిప్పను చూస్తే వెండి అని భ్రమ కలిగినట్లే ఉన్నది అనే భ్రమవల్ల తోచి, తుదకు పోతుంది. ఉన్నదని భావించినా మళ్ళీ బాధింపబడుతుంది. కాబట్టి, ప్రకృతిని 'లేనిది' అన్నవారు మాయావాదులు (అద్వైతులు). ఆళ్వారుభావం ఇది కానే కాదు.

"సత్యంచానృతంచ సత్యమభవత్:- సత్యశబ్దం ఆత్మ వర్గాన్ని, అనృతశబ్దం ప్రకృతిని తెల్పుతూ, ఈ రెండూ సర్వేశ్వరుడే అని తై ఉపనిషత్తు బోధిస్తుంది.

"జ్యోతీంషివిష్ణుర్భువనాని విష్ణు ర్వనాని విష్ణు ర్గిరయోదిశశ్చ।
నద్యః సముద్రాశ్చస ఏవసర్వం యదస్తియన్నాస్తిచవిప్రవర్య॥" (వి.పు.)

ఆస్తి (చిత్తు) నాస్తి (ప్రకృతి) ఉన్నదేదో, లేనిదేదో అంతా విష్ణువే అని శ్రీపరాశర మహర్షి సూక్తి. శ్రుతి స్మృతులు చెప్పిన రీతిగనే ఆళ్వార్లు 'ఇల్లతు' అన్నారు. బొత్తిగా లేనిదని అర్థం కాదు.

ప్రకృతి కూడా సత్యమే. నిత్యం కాదు. ఎల్లప్పుడూ మారుతూ ప్రవాహ రూపంలో నిత్యమే. ఇప్పుడున్న రూపంతో మరొకప్పుడుండదు. కాబట్టి 'లేనిది' అన్నారు ఆళ్వార్లు. ఏక రూపంతో ఉండని ప్రకృతి యొక్క సంబంధం చేత జీవుడు సుఖ దుఃఖాలను అనుభవిస్తాడు. చిదచిత్తులవంటి వాడు కాక, అమితానంద స్వరూపంతో ఉండే భగవంతుణ్ని, "పరిత్యక్తా మయాలంకా" -విభీషణుడు మొదట లంకను వదలిన తర్వాతనే శ్రీరాముణ్ని ఆశ్రయించినట్లు, ఇతరోపాయాలను వదలివేసియే ఆశ్రయించాలి, అని ఆళ్వార్ల శ్రీసూక్తి.

5. చ్యవనవదితరప్రాప్యవైషమ్యవత్త్వాత్:- అత్తతుపత్తెనిల్-జ్ఞానానందాదిలక్షణం గల జీవాత్మకు ప్రకృతి సంబంధం పోగానే, స్వస్వరూపం ప్రకాశిస్తుంది. ఇంద్రపదవిని కోరేవాడు ఇహలోక సంపదనూ, బ్రహ్మపదవిని ఆశించేవాడు ఇంద్రపదవినీ లక్ష్యపెట్టడు. ఆత్మానుభవరూపమైన కైవల్యాన్ని కోరే వ్యక్తి బ్రహ్మ పదవినీ లెక్కింపడు. కైవల్యం నిత్యమైన పురుషార్థమే అయినా, అంతకంటే మహోన్నతంగా ఉండేది భగవత్ప్రాప్తి రూపమైన పురుషార్థం. కాబట్టి, 'శెత్తతు మన్నురిల్ అత్తు ఇఱైపత్తే- భగవదాశ్రయణానికి, ప్రతిబంధకంగా ఉండే కైవల్యాన్ని కూడా- అల్ప పురుషార్థాలను- విడిచిపెట్టి (కోరకుండా) స్థిరమైన భగవత్పాద పద్మాలను ఆశ్రయించడమే పరమ పురుషార్థం.

6. సర్వత్రా పక్షపాతాత్ :- పత్తిలన్ ఈశనుమ్ - సంగస్వభావుడు సర్వేశ్వరుడు ముత్తవుమ్ నిన్ఱవన్- పక్షపాతం లేకుండా అందరికీ సమానుడై ఉన్నాడు. పరత్వ సౌలభ్యాలలో స్వామి సౌలభ్యమే ఆశ్రయించడానికి ముఖ్యలక్షణం. మధురానగరికి బలరామకృష్ణులు వచ్చి, మాలాకారుని ఇంటికి పోయినప్పుడు, పారవశ్యంతో మాలాకారుడు పల్కిన మాటలు రమణీయాలు. "ప్రసాద పరమౌనాథౌ మమగేహ ముపాగతౌ। ధన్యోఽహమర్చయిష్యా మిత్యాహ మాల్యోపజీవనః॥(వి.పు.)- అనుగ్రహాధిక్యం గల ప్రభువులు నా ఇంటికి వచ్చారు. నేను ధన్యుడను, వారిని పూజిస్తాను, అని మాలికలను అమ్ముకొని బ్రతికేవాడు పలికాడు. పత్తు= సంగం, ఇలన్= ఇల్లుగా కలవాడని అర్థం. సౌలభ్యమే ముందుంటుందని భావం. అవాప్తసమస్తకాముడైన సర్వేశ్వరునికి కొరత లేనే లేదు. నిత్యసూరుల, ముక్తాత్మల పట్ల పత్తు= ఆసక్తి, ఇలన్ = లేనివాడు, అని (అరువేల వ్యాఖ్య) తిరుక్కురుకైప్పిరాన్ పిళ్ళాన్, శ్రీ పరాశరభట్టర్వారూ వివరించారు. అంటే, కొత్తగా తనను ఆశ్రయించే వారి మీద

పరిపూర్ణమైన ప్రేమ కలవాడు. మేడ మీద కనబడిన రావణున్ని చూడగానే సుగ్రీవుడు లంఘించి, వాని కిరీటాన్ని తన్ని పడవేసి మళ్ళీ రాముని దగ్గరికి వచ్చినప్పుడు రాముడు ఇలా అన్నాడు. ఒంటరిగా శత్రువు దగ్గరికి పోవడం, మంచి పనికాదు అనే భావాన్ని ప్రకటిస్తూ, "త్వయికించిత్ సమాపన్నేకింకార్యంసీతయామమ" నీకేమైనా జరిగితే ఇంక నాకు సీతతో ఏమిపని? కొత్తగా పుట్టినలేదూడమీద ఉన్న వాత్సల్యంతో మొదట పుట్టిన దూడను దూరంగా నెట్టిన ఆవులాగా, కొత్తగా తనను చేరిన కోతి కోసం నిత్యం ఆశ్రయించి ఉన్న సీతనూ కాదన్నాడు. కాబట్టి 'పత్తిలైయాయ్ అవన్ ముత్తిల్అడంగు' -హేయవిషయ రక్తి లేనివాడవై ఆ ప్రభువే సర్వమని చేరి ఉండు- మని ఉపదేశించారు నమ్మాళ్వార్లు.

7. శుభవిభవతయా:- అడంగు ఎళిల్‌శంబత్తు-పూర్ణసౌందర్యభరితమైన (ఉభయవిభూతి) స్వామి సంపదను చూచి, సర్వేశ్వరుడెక్కడ? నే నెక్కడ? అని సంకోచింపరాదు. కనువిందు చేసే తోటను చూచి, కాపరికి జడిసి అడుగు పెట్టడానికి సంకోచించే రాజకుమారునితో 'ఈ తోట మీ తండ్రిగారిదే' అని చెప్పితే జంకుకొంకు లేకుండా తోటలో ప్రవేశించి విహరిస్తాడు కదా! అట్లే స్వస్వామిభావాన్నీ, రక్ష్యరక్షకభావాన్నీ తెలుసుకొని ప్రవర్తిస్తే, భగవంతుని సంపదలో చేరినవాడే అవుతాడు శేషభూతుడైన జీవుడు. శేషికి కూడా అతిశయాన్ని కలిగిస్తుంది కాబట్టి భగవదైశ్వర్యంలో చేరి ఉండవలసిందన్నారు.

8. మానసాద్యర్చ్యభావాత్:- ఉళ్ళం, ఉరై, శయల్-సర్వేశ్వరుడు మనకు మనస్సును తనను ధ్యానించడానికి, వాక్కును కీర్తించడానికి, కాయాన్ని దాస్యం చేయడానికి ఇచ్చాడు. ఈ మూడింటిని విషయాంతరాలనుంచి మళ్ళించాలి. ఇలా త్రికరణాలను సాధనంగా చేసుకొని స్వామిని ఆశ్రయించడమే కర్తవ్యం. "తిరువన్దాది ప్రబంధంలో రెండు పాశురాలు ఈ భావాన్నే తెల్పుతున్నాయి. "తాముళ్ళరే, తమ్ముళ్ళముళ్ళుళతే ' మీరున్నారు, మీకు మనస్సు ఉంది. పూజ కోసం తామరపూలూ ఉన్నాయి. తన సొమ్మును తాను పొందడానికి యాచకుడైన శ్రీవామనమూర్తి శ్రీపాదాలను సేవింపక నరకానికి పోయేవారుంటారా? "నావాయిలుణ్ణే, నమోనారణావెన్నోవాతురైక్కు ముఱైయుణ్డే" నాలుక ఉంది. ఉచ్ఛరించడానికి సులభమైన అష్టాక్షరీ మంత్రంలో పునరావృత్తిరహితమైన ప్రాప్యాన్నిసిద్ధంగా ఉంచాడు భగవానుడు. కష్టించి సంపాదింపవలసిన పనీ లేదు. ఇంత మంచి స్థితిలో నీచ మార్గాన్వేషణ ఎలా జరుగుతుందో కదా!

వ్యర్థంగాపోతున్న నీటిని పంటపొలాలలోకి ప్రవహింపజేసే విధంగా, మనో వాక్కాయాలను విషయాంతరాలనుంచి మళ్ళించి భగవద్విషయంలో అన్వయింపజేయండి అని బోధించారు.

9. సంకోచోన్మోచకత్వాత్:- ఒడుంగవవన్‌గణ్-భగవంతుని యందు త్రికరణాలను చేర్చగానే జ్ఞానాన్ని సంకోచపరచే అవిద్యాదులన్నీ తొలగిపోతాయి. జీవులు భగవంతునితో వేరుగా గుర్తించరాని విధంగా భగవంతునితో చేరి ఉంటాడు కాబట్టి జీవులు ప్రకారాలు, పరమాత్మప్రకారి. పరమాత్మ లేకుండానే నేనుండనని గమనించాలి. "పెరియతిరువన్తాది" లో "వానోమణికడలో" అన్నట్లు భగవంతుణ్ని ఆశ్రయించినవారి పాపాలు ఆకాశంలోకి ఎగిరిపోతాయో సముద్రంలో మునిగిపోతాయో తెల్యదు. కృతకృత్యులు అంటే చేయవలసిన పనిని చేసినవారు. సిద్ధ సాధనమైన సర్వేశ్వరుడే ఉపాయమని గమనించినవారు శరీర వియోగం కోసం ఎదిరిచూస్తుంటారు. **"కృతకృత్యాః ప్రతీక్షంతే మృత్యుంప్రియమివాతిథిమ్॥"** అని శ్రీకృష్ణుడు ధర్మరాజుతో అన్నాడు. వారు మృత్యువును ఆనందంగా ఆహ్వానిస్తారు. ఒక సంవత్సరాదినాడు శిష్యునితో "ఈనాడు సంవత్సరాది సుమా" అన్నారట శ్రీమద్రామానుజులవారు. ఆ శిష్యునికీమాటకు అర్థం తెల్యక తెలతెలపోయాడట. రామానుజులవారే మళ్ళీ ' ఈ శరీరం అంతం కాగానే ఫలం లభించడానికి అడ్డుగా ఉన్న సంవత్సరాలలో ఒక సంవత్సరం గడచిపోయిందనడం ఆనందింపవలసిన విషయమే కదా! అని తెలియజేశారట. సర్వేశ్వరుడే ఉపాయమని విశ్వసించిన సిద్ధసాధననిష్ఠులు మరణ కాలం సమీపిస్తున్నదంటే సంతోషిస్తారు.

10. జగదయనతయా:- ఎణ్పెరుక్కు అన్నలత్తు ఒణ్‌పొరుళ్ - లెక్కకు మించిన అట్టి జ్ఞానానందాదిగుణాలు గల వరిష్ఠతత్త్వమైన జీవాత్మ వర్గాన్నీ, అనంత కల్యాణ గుణాలనూ కలిగియున్న శ్రీమన్నారాయణుని దృఢమైన శ్రీపాదాలను ఆశ్రయించండి అని ఉపదిష్టం.

తేజోద్రవ్యాలైన ఆత్మవస్తువులు అనంతాలు. ఓంకారంలోని'మ'కారం 'మన-జ్ఞానే ॥ 'మన-అవబోధనే' అనే రెండు ధాతువుల నుంచి ఉత్పన్నమైంది. జీవాత్మ జ్ఞానం కలది అని తెల్పుతుంది. ధర్మిభూతజ్ఞానం, ధర్మభూతజ్ఞానం అని జ్ఞానం రెండు విధాలు.

(1) ధర్మిభూతజ్ఞానం : తన కోసం తనంతతాను ప్రకాశించడం. వస్తువులు కనబడడానికి

కాంతి అవసరం. అవి తమంత తాము ప్రకాశించవు కదా! దీపాన్ని వేరే కాంతి ప్రకాశింపచేయనక్కర్లేదు. అది తనంతతానే ప్రకాశిస్తుంది. కాని తాను దీపాన్ని అనే సంగతి ఆ దీపానికి తెల్యదు. 'ఆత్మ' విషయమట్టిది కాదు. తనను వేరే ఒక జ్ఞానం చేత తెలుసుకోనక్కర్లేదు. ఆత్మ తనను తాను దర్శింపగలదు.

(2) ధర్మభూతజ్ఞానం :- ఆత్మకున్న జ్ఞానం ఇతరవస్తువులమీదికి ప్రసరించి, వాటిని ఆత్మకు ప్రకాశింపజేసేది.

ఈ రెండు లక్షణాలు ఆత్మకు కలవు అని తెల్పడానికే 'నలత్తు, ఒణ్పొరుళ్' అన్నారు. ఆత్మకు గల జ్ఞానం అనుకూలమయింది కాబట్టి 'నల' 'ఆనందం' అన్నారు. 'నలమ్' అంటే జ్ఞానం. అనుకూలజ్ఞానం కలవి జీవాత్మలు. జ్ఞానగుణానికి ఆశ్రయాలు (జ్ఞానగుణం కలవి) అని ధర్మ భూత జ్ఞానాన్ని తెలిపారు.

ఒణ్పొరుళ్:- తేజోద్రవ్యం ఆత్మ అనడం వల్ల స్వరూపమే ప్రకాశం. కాబట్టి జ్ఞాన స్వరూపుడు జీవాత్మ అని ధర్మి భూత జ్ఞానాన్ని తెలిపారు. ఇలాంటి అనేక జీవాత్మలు శరీరంగా కలవాడు పరమాత్మ.

ఈఱిల వణ్పుకళ్ నారణన్ - అంతులేని కల్యాణగుణాలు కలవాడు నారాయణుడు. పరమాత్మను భజించడానికి ఆలంబనం మంత్రం. మంత్రార్థాన్ని అనుసంధించుకొంటూ మంత్రాన్ని అనుసంధానం చేయడమే మోక్షమార్గమని సంప్రదాయం. (1) నారాయణః= నారాః అయనం యస్య సః. నారములనే నిత్య వస్తువులు నివాసంగా కలవాడు నారాయణుడు, బహువ్రీహి సమాసం వల్ల తనకంటె వేరైన వస్తువులను తాను సృజించి, నామ రూపాలను కల్పించిన ఆ వస్తువులన్నిట్లో అంతర్యామిగా తానే ఉండేవాడు నారాయణుడు అని తెలుస్తుంది. (2) నారాణాంఅయనం యః,సః=నారాయణః నారములకు నివాస స్థానమైనవాడు, నారాయణుడు. తత్పురుష సమాసం వల్ల సృష్టికి ముందు ప్రకృతినీ, జీవ వర్గాన్నీ తన లోపల ఉంచుకొని కాపాడే వాడు నారాయణుడనీ, తెలుస్తుంది. ఇలా, నారాయణుడు ఉభయవిభూతి నాయకుడు, విశ్వాధారుడనీ తెల్పి, ఆయన పాదాలు ఆశ్రయించిన వారిని ఎన్నటికీ విడువని పటిమగలవి కాబట్టి, స్వరూప జ్ఞానంతో స్వామి పాదాలను ఆశ్రయించండి, అని ఉపదేశించారు నమ్మాళ్వార్లు.

"నారాయణఃపరంజ్యోతిః" అని మొదట(మంత్రం) శబ్దాన్ని చెప్పి, తర్వాత "అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్యనారాయణఃస్థితః" అని మంత్రార్థాన్ని వేదం చెప్పినట్లు,

ఈ పాశురంలో తిరుమంత్రాన్ని అర్థంతో కూడా బోధించారు. ఈ పాశురం తిరుమంత్రార్థం కాబట్టి కూరత్తాళ్వాన్ తమ కుమారులైన భట్టర్, శ్రీరామపిళ్ళై అనే వారితో 'మీ ఆచార్యుని వద్దకు పోయి ఈ పాశురం చెప్పించుకోండి' అన్నారట. వారు లేచిపోతుండగా చూచి, వీరు ఆచార్యులను చేరే వరకు జీవిస్తారని నమ్మకమేమి? అనుకొని వెంటనే వారిని పిలిచి 'నేనే ఉపదేశిస్తాను, కూర్చోండి' అని ఆళ్వానే తిరుమంత్రాన్ని ఉపదేశించి, దానికి అర్థంగా ఈ పాశురాన్ని బోధించారట (ఈడు)

11. సర్వయోగ్యమ్ :- శేర్త్తడమ్త్తెన్‌కురుకూర్‌శడగోవన్- చెరువులతో చేరియున్న కురుకాపురిలో ఉన్న నమ్మాళ్వార్లు, చేతనుల హితం కోరి సకలజనసమారాధ్యుడైన భగవంతుని కల్యాణ గుణాలను ప్రతిపాదించే వేయి పాశురాలలో ఈ పదిపాశురాలను అనుగ్రహించారు.

ఈ మొదటి రెండు తిరువాయ్‌మొళి(దశకా)లలోని విషయాన్నే మిగతా ప్రబంధం వివరిస్తుంది, అన్నారు విజ్ఞులు. దీంట్లో ఉన్న ఉభయవేదాన్తాల ఐకకంఠ్యాన్ని దేశికులవారు 'ఆదౌశారీరకార్థక్రమ మిహవిశదం వింశతిర్వక్తిసాగ్రా" (అవతారిక-5శ్లో) అని ముందే దృఢీకరించారు. ఈ తిరువాయ్ మొళి భక్తిపరమైనదా? ప్రపత్తిపరమైనదా? ఆళ్వార్లు ప్రపన్నులా? భక్తినిష్ఠులా? అన్న విషయం "వీడుమిన్" ప్రవేశం (ఈడు) లో వివరింపబడింది. అది ఇక్కడ సంగ్రహంగా తెలపబడుచున్నది.

శ్రీయామునాచార్యుల అభిప్రాయాన్ని బట్టి తిరుమాలై ఆండాన్ ఈతిరువాయ్ మొళి ప్రపత్తిని తెల్పుతుందన్నారు. భగవద్రామానుజులవారు కూడా ఆ విధంగానే అన్నారు. శ్రీభాష్యరచన తర్వాత రామానుజులవారే న్యాన విద్యను బహిరంగపరచకూడదని, ఇది భక్తిపరమైనదన్నారు. ఎంబారు అలాగే అన్నారు. **"ఇవరుడైయ భక్తిప్రపత్తికళ్‌తాన్ వికల్పిక్కలాయిరే యిరుప్పతు".** ఆళ్వార్ల విషయంలో భక్తి ప్రపత్తులు రెండూ వేర్వేరుగా చూపించే వీలులేని విధంగా ఉన్నాయి. "ఉభయపరికర్మితస్వాంతస్య" కర్మజ్ఞానాల (రెండింటి) చేత సంస్కరింపబడిన అంతఃకరణం కలవారికే పరభక్తి కలుగుతుంది. నమ్మాళ్వార్లకు ఆకర్మజ్ఞానాల స్థానంలో భగవదనుగ్రహం ఉన్న కారణంగా భక్తి జనించింది. భక్తి రెండు రకాలు : (1) సాధనభక్తి. వర్ణాశ్రమ ధర్మానుకూలమైన కర్మలను ఆచరించడం వల్ల స్వస్వరూప, పరస్వరూపాది జ్ఞానం కలిగిన తర్వాత జనించేది సాధన భక్తి.

(2) సాధ్య భక్తి :- ప్రయత్నమేమిలేకయే, కేవలం భగవదనుగ్రహం వల్ల పొందేది

సాధ్య భక్తి. "మయర్వఱమతినలమరుళినన్" అని చెప్పిన ఆళ్వార్లు పొందినది భక్తి రూపాపన్న జ్ఞానమే కదా! కాబట్టి, నమ్మాళ్వార్లు సాధ్యభక్తినిష్ఠులు -ప్రపన్నులు.

"భజ ఇత్యేవ ధాతుర్వై సేవాయాంపరికీర్త్యతే" భజధాతువువల్ల నిష్పన్నమైన భక్తి పదం సేవార్థకం. "సాధ్యభక్తిః స్మృతాసైవ ప్రపత్తిరితిగీయతే". సాధ్యభక్తికే ప్రపత్తి అని వ్యవహారం. (భగవచ్ఛాస్త్రం) 'భగవత్ ప్రవృత్తి విరోధి స్వప్రవృత్తి నివృత్తిఃప్రపత్తిః అని శ్రీ రామమిశ్రులు నిర్వచించారు. రక్షించే భగవంతుని యత్నానికి 'నన్ను నేనే రక్షించుకొంటాను' అనే భావాన్ని, యత్నాన్ని, మానుకోవడమే ప్రపత్తి నమ్మాళ్వార్లు ఆర్తప్రపన్నులనడం సర్వ గురు సమ్మతం.

తృతీయ దశకం

3. బంధ్వర్థ త్వాత్ స్వభక్తై రధికతరగుణానంతదివ్యావతారాత్
సర్వేష్వాసక్తిమత్త్వాన్నత సుగమతయా స్వప్రబోధప్రదత్వాత్।
ఖ్యాతాభిఖ్యాదిచిహ్నాత్స్వరుచివితరణాత్సర్వకాలాశ్రయత్వా
చ్ఛర్వాదే స్స్వాంగదానాత్ప్రహితపదతయాఽనంతసౌలభ్యమాహ॥ 13

అర్థం : స్వభక్తైః= తనయందు భక్తి కలవారి చేత; బంధుఅర్హత్వాత్=బంధించడానికి తగినవాడవడంవల్ల; అధిక తర గుణ+అనంత దివ్య+అవతారాత్=మిక్కిలి అధికమైన గుణాలతో కూడి అనేకమూ, దివ్యమూ అయిన అవతారం వలన; సర్వేషు=సమస్త చేతనులయందు; ఆసక్తిమత్త్వాత్=ప్రీతికలవాడైనందువల్ల; నతసుగమతయా= నమస్కరిస్తున్నవారికి సుఖంగా ఆశ్రయణంకలవాడైనందున; స్వప్రబోధప్రదత్వాత్= తన విషయమైన జ్ఞానాన్ని ఇచ్చేవాడవడంవలన; ఖ్యాత+అభిఖ్యా+ఆది చిహ్నాత్= ప్రసిద్ధమైననామం మొదలైన వాటిని గుర్తుగా కలవాడైనందువలన; స్వరుచివితరణాత్= తనయందు ఆశను ఇవ్వడం వలన; సర్వకాల+ఆశ్రయత్వాత్= సమస్తకాలాలయందు ఆశ్రయమవడంవల్ల; శర్వ+ఆదేః= శివుడు మొదలైనవారికి; స్వ+ అంగదానాత్= తన శరీరాన్ని ఇవ్వడం వల్ల; ప్రహిత పదతయా=చక్కగా ఉంచబడిన పాదం కలవాడైనందు చేత; అనంత సౌలభ్యం=అమితమైన సౌలభ్య గుణాన్ని; ఆహ=చెబుతున్నాడు.

తా॥ మూడవ తిరువాయ్ మొళిలో (1) భక్తులు కట్టివేయదగినవాడు (2) అనేకావతారాలనెత్తినవాడు (3) మితిలేని కల్యాణగుణాలు కలవాడు (4) ఉత్పత్తి చరిత్రల చేత అతిమాత్ర నీచులైన గుహశబరీత్యాది వ్యక్తులయందు ప్రీతికలవాడు

(5) తనను ఆశ్రయించినవారికి సుఖంగా ప్రాప్యుడు (6) తన విషయమైన జ్ఞానాన్ని ఆశ్రితులకు ఇచ్చేవాడు (7) ఉపనిషత్ప్రసిద్ధమైన నారాయణనామాన్ని, దానికి అర్థమైన నియామకత్వాన్ని గుర్తుగా కలవాడు, తనను మనస్సులో ధ్యానించగా అప్పుడే తక్కిన విషయాలయందు (సంగం) ఆసక్తిని తొలగించి, తన విషయంలో రుచిని పుట్టించేవాడు; (8)ఆశ్రయించడానికి కాలం అతిక్రమించిందని చేతనులు నిరాశులై పోకుండా ఎల్లప్పుడు ఆశ్రయమవుతాడు. (9) బ్రహ్మ, రుద్రుడు మొదలైన వారికి తన శరీరమందు అవకాశాన్ని ఇచ్చేవాడు, (10) త్రివిక్రముడుగా అవతరించి నీచోన్నత భేదాన్ని పాటించకుండా సకలచేతనుల తలమీద తన పాదపద్మాన్ని అమర్చడం వల్ల పరమోపకారుడు భగవానుడనీ నమ్మాళ్వార్లు ప్రసాదించారు.

ప్రకా-వ్యాఖ్య:- సర్వేశ్వరుని సౌలభ్యగుణాన్ని అనుభవపూర్వకంగా ఉపదేశించారు.

అవాప్తసమస్తకాముడైన భగవంతుణ్ని 'భజించండి' అంటే, క్షుద్రసంసారులకు సాధ్యమా? మొండి చేతులవాణ్ని (ఆనైయేఱు) ఏనుగునెక్కుమని ఎన్నిసార్లు చెప్పినా అతడెక్కగలడా? నిజమే. రెండు చేతులు లేనివాడు తనంతతాను ఏనుగును ఎక్కలేడు కాని ఆ ఏనుగే వంగి తన తొండంతో అతనిని తనమీదికెక్కించుకొంటే ఎక్కగలడు కదా! అలాగే ఈ సంసారులు తనను భజించడానికి తగినట్లు తానే వచ్చి చేరువైనప్పుడు ఆటంకమేమీ ఉండదు కాబట్టి ఆ దయామయుడు సులభుడై ఉండే విధంగా రామకృష్ణావతారాల నెత్తి సంసారులకు భజనీయుడయ్యాడు.

దీపం చీకటిని చీల్చివేస్తూ బాగా వెలుగుతుంటే దాన్ని ఉపయోగించుకొని ఆనందిస్తారు కొందరు. కొన్ని పురుగులు మాత్రం ఆ దీపంలో పడి మరణిస్తుంటాయి. అది దీపం యొక్క దోషం కాదు.

1. బంధార్హ త్వాత్స్వభక్తైః: పత్తుడై అడియవర్క్కు ఎళియపన్-భక్తి గల దాసులకు సులభుడు. పత్తి (భక్తి) నే పత్తు అన్నారు. పత్తు అంటే పది. "ఎట్టినోడిరండెన్నుమ్ కయిత్తినాల్ మనన్దనైక్కట్టి" (తి.చ.వి.) అష్టాక్షరితో కూడిద్వయమంత్రాన్ని (8+2) అనుసంధించడం చేత మనస్సును భగవద్విషయమందు లగ్నం చేసి-అంటే భక్తి ప్రపత్తులు కలశేష భూతులకు సులభుడు. భక్తి అంటె పరభక్తి కాదు . ఇక్కడ 'భక్తి యొక్క ఆరంభదశ' అన్నారు. భగవంతుణ్ని సేవించాలనే ఆశ (అద్వేషం, అభిముఖ్యం) కొంచెం ఉంటే చాలు. దాన్ని పరభక్తిగా భావిస్తాడు భగవంతుడు. "భక్తిక్రీతోజనార్ధనః" (వి.ధ) భక్తికి అమ్ముడుపోతాడు జనార్ధనుడు. భక్తులకు

విధేయుడౌతాడు. యశోదాదులకు సులభుడు కదా!

పిఱర్కళుక్కు అఱియవిత్తకన్-ఇతరులకు (భక్తిలేనివారికి) తెలుసుకోవడానికి విస్మయనీయుడు. పూతనాదులకు అప్రధృష్యుడు కదా! స్వామిని సాధనంగా చేసుకొని వేరొక ఫలాన్ని పొందగోరేవారు 'ఇతరులు'. శ్రీకృష్ణుడే ఉపాయమని భావించిన అర్జునునికి తననే ఇచ్చుకొన్నాడు. అచేతనమైన యజ్ఞయాగాదులనే ఉపాయంగా స్వీకరించేవానిలాంటి దుర్యోధనునికి పనికిరాని తన సైన్యాన్ని ఇవ్వడం ఆశ్చర్యం కాదా! ఆశ్రితులకు సులభుడై ఇతరులకు దుర్లభుడైన స్థితి రామావతారంలోనూ ఉంది. "శత్రూణామప్రకంప్యోపిలఘుత్వ మగమత్కపేః" మూర్ఛిల్లిన లక్ష్మణుని శరీరం, ఎత్తడానికి యత్నించిన రావణునికి "హిమవాన్ మందరోమేరుః" అన్నట్లు బరువయింది. పగవానికి కదల్చరానివాడైన లక్ష్మణుడు, ప్రేమ-భక్తి కలిగిన హనుమంతునికి మాత్రం తేలిక అయ్యాడు కదా! రామునివంటిదే లక్ష్మణుని స్వభావం, కాబట్టి ఒక్కపనిలోనే వారి వారి మనఃస్థితిని బట్టి సౌలభ్య, దౌర్లభ్యాలను ప్రదర్శించడం విస్మయనీయమే కదా!

కమలవాసినియైన లక్ష్మీదేవి 'కూడగోరేది' 'వీడజాలనిది' స్వామి వక్షఃస్థలం. సర్వశేషి అని తెలియడానికి కావలసింది లక్ష్మీ సంబంధమే. లక్ష్మీ విశిష్టుడే భజింపదగినవాడు కదా! మత్తు ఉఱుకడైవెణ్ణెయ్‌కళవినిల్ ఉరవిడైఆప్పుణ్ణు-యశోద కవ్వంతో కష్టించి చిలుకుతుండగా వెన్నను దొంగిలించి (తల్లిచే) గుండెయందు కట్టుబడినాడు. లక్ష్మీదేవి గాఢాలింగనానికి ఆలంబమైన వక్షఃస్థలం కట్టబడింది.

ఉర= బలం; విడై=వృషభం; వృషభబలుడైన స్వామి ఇలా కట్టుబడిపోయాడు. దామోదరుడని ప్రసిద్ధికదా! 'ఉదర' శబ్దంలో ని'ద'కారం చ్యుతమయింది. (చ్యుతాక్షరి. కవిత్వంలో ఒక ప్రక్రియ) కాబట్టి 'ఉరం'ను 'ఉదరం' గా భావించాలి.

తల్లి, త్రాడు యొక్క ఒక కొనతో శ్రీకృష్ణుని బొజ్జ మీద కట్టి, మరొక కొనను ఱోటికి కట్టింది. "ప్రేమ్నాధదామ పరిణామజుషాబబంధ" (అతిమానుషస్తవం) శ్రీకూరేశులన్నారు. అచేతనమైన రోలు కదలకుండా ఉన్నట్లే స్వామి కూడా ఆ స్థలంలోనే కదలలేక ఉన్నాడు. వెక్కి వెక్కి ఏడుస్తుండడం వల్ల, చైతన్యమున్నదని తెలుస్తున్నది. తల్లి చేత ఱోటికి కట్టివేయించుకొన్న స్వామి యొక్క సౌలభ్యగుణాన్ని అనుసంధిస్తూ, ఆశ్చర్యంతో ఆళ్వార్లు ఆరు నెలలు మూర్ఛపోయారట. " మూవాఱుమాసం మోహిత్తు" (ఆచార్యహృదయం)

2. అధికతరగుణానంత దివ్యావతారాత్:- ఈ పదమందు 'కల్యాణగుణాలతో పాటు అవతారవైలక్షణ్యం, అనే రెండు పాశురాల అర్థాన్ని దేశికులు బోధిస్తున్నారు.

శ్రీమధురకవియాళ్వార్ మొదలైనవారు మోహపరవశులై నమ్మాళ్వార్లను, సీతారాముల శయనస్థలాన్ని గుహుడు రక్షించుకొంటున్నట్లే, రక్షించుకొంటూ చుట్టు చేరి ఉండిరి. తిరువాయ్‌మొళిని అనుభవించడానికి పుట్టినవారి భాగ్యం చేత మోహంతీఱి ఆళ్వారు స్వామి సౌలభ్యగుణాన్ని విశేషంగా చెప్పడానికి ఆరంభించారు. "ఎళివరుమ్ ఇయల్వినన్" (2పా) సౌలభ్యమే స్వభావంగా కలవాడు సర్వేశ్వరుడు. 'నిలైవరంబుఇలపలపిఱప్పుఆయ్- నిలుకడ, నీతిలేని పలుజన్మలు కలవాడు. (నిలై ఇల) ఈ జాతిలోనే పుట్టాలి (వరంబు ఇల) ఈ చేష్టితాలనే చేయాలి, అనే వ్యవస్థ లేనివాడని పూర్వాచార్యులు వివరించారు. శ్రీపరాశరభట్టరు. 'నిలై ఇల' అనే మాటకే అవతార, చేష్టితాలకు నియమం లేనివాడని చెప్పి, 'వరంబు ఇల' అనే పదానికి, అవతరించి సులభుడై ఉన్న స్థితిలోనే పరత్వాన్ని ప్రదర్శించేవాడని అర్థం చెప్పారు. శ్రీకృష్ణుడు సారథ్య వేషంలోనే (సులభుడై) ఉండి విశ్వరూపాన్ని (పరత్వాన్ని) దర్శింపచేశాడు. 'తనకు పుత్రులు కావాలి' అని తపస్సు చేయడానికి వెళ్ళుతూ, దారిలో ఘంటాకర్ణునికి మోక్షాన్ని ప్రసాదించడమూ; ఏడేండ్ల బాలుడే గోవర్ధనగిరిని ఉద్ధరించడమూ వంటి చేష్టలకు హద్దులేదు. సౌలభ్యం, పరత్వం అనే నియమం లేకుండా ఆశ్రితరక్షణకు అవసరమైనదాన్ని స్వీకరించడం స్వామిస్వభావం. పలపిఱప్పుఆయ్- 'అజాయమానోబహుధా విజాయతే' (శ్రుతి) పుట్టుకలేనివాడై అనేక జన్మలెత్తుతున్నాడు. 'బహూనిమేవ్యతీతాని జన్మాని' (భ.గీత) నాకు అనేక జన్మలు గడచినాయి-అన్నట్లే, ఆళ్వార్లు 'పలుజన్మలు కలవాడు' అన్నారు. తనఇష్టంతోనే మానవుడై అవతరించాడు భగవానుడు.

"ఆత్మానంమానుషంమన్యేరామందశరథాత్మజమ్"-నన్ను నేను దశరథపుత్రుడైన మానవునిగానే భావిస్తున్నాను, అన్నవాడు శ్రీరాముడు. "అహంవోబాంధవోజాతః" నేను మీ బంధువుగా పుట్టినవాడను, అని శ్రీకృష్ణుడు గోపాలకులకు ధైర్యం కల్పించాడు కదా! 'ఒళివరుములునల ముదల్ఇలకేరుఇల-ప్రకాశించే పరిపూర్ణ కల్యాణగుణాలు ఆది,అంతంలేనివి. జీవాత్మకు కూడా అపహతపాప్మత్వాది కల్యాణగుణాలుంటాయి. కాని జీవునికి కర్మలవల్ల కలిగే జన్మ ఎత్తి శరీరసంబంధం ఏర్పడగానే ధర్మభూతజ్ఞానానికి సంకోచమేర్పడి, ఆగుణాలు మరుగుపడుతాయి. జన్మజన్మకు కాంతి తరగిపోతుంటుంది.

"సఉశ్రేయాన్భవతిజాయమానః" (శ్రుతి) అన్నట్లు, పుట్టుతున్న వాడై ఉంటూనే శ్రేయస్సును కలిగిస్తాడు. సర్వేశ్వరుడు కృపతో అవతరించినప్పుడు ఇంకా కల్యాణగుణాలకు ప్రకాశమే ఏర్పడుతుంది.

వీడామ్తెళితరుమ్-మోక్షరూపజ్ఞానాన్ని ఇచ్చేవాడు. అవతారప్రయోజనం మోక్షప్రదత్వమే కాబట్టి కల్యాణగుణాలకంటే వేరుగా మోక్షప్రదత్వాన్ని తెలిపారు. అక్కడికి చేరిన జీవునికి (తెలివిని)పూర్ణజ్ఞానాన్ని కలిగించేది పరమపదం. ఇక్కడికి దిగివచ్చిన సర్వేశ్వరునికి కూడా శోకమోహాలను కలిగించేది భూమండలం. అళివరుంఅరుళినోడుఅమైన్దు-చల్లని కృపతో అమరి ఉండేవాడు. 'అళి' పదానికి చల్లదనం, పక్వత అని రెండర్థాలు. మొదటి అర్థంతో నిర్హేతుకంగా (మన ప్రయత్నం లేకున్నా) స్వామి అనుగ్రహిస్తాడని, రెండవ అర్థంతో ఫలమిచ్చిగాని ఆగని అనుగ్రహంతో కటాక్షిస్తాడనివిశదమవుతుంది. ఆకత్తనన్-ఆశ్రితులకు విధేయుడై (సులభుడై) ఉండేవాడు. ఆ స్థితిలోనే ఉన్నస్వామి అనాశ్రితులకు 'పుఅత్తనన్' అనుపస్వర ణీయుడు-చేరాలనుకున్నా చేరరానివాడుగా ఉంటాడు. అమైవుఉడై అఱమ్నెఱి ముళువతుమ్ ఉయర్వ్వఅఱఉయర్న్దు-(3పా)ధర్మమార్గంలో అత్యంతోన్నతి పొందినవారు బ్రహ్మరుద్రులు. ఇతర ఫలాలకన్న ఉత్కృష్ట స్వభావం గల సృష్టిసంహారాధికారాలను వీరికి ఇచ్చిన వాడు శ్రీమన్నారాయణుడు. బ్రహ్మరుద్రాది దేవతలూ, సకలచేతనాదేతన; పదార్థాలూ తానే అయ్యి ఉన్న నారాయణుని యొక్క "మాయమై అఱిపవర్యారే" ఆశ్యర్యకరవ్యాపారాలను తెలుసుకొనే వారెవ్వరు? పరత్వానుభవనిమగ్నులైన నిత్యసూరులకూ భగవదవతారరహస్యం తెలియదు. నాస్తికులైన, ఐహికవస్తువులందువ్యాముగ్ధులైన సంసారులూ తెలుసుకోలేరు. భగవదనుభూతి పరవశులైన ఆళ్వార్లు కూడా తెలుసుకోలేరు. భగవదనుగ్రహం చేత జ్ఞానాన్ని పొందినవారే అయినా, అవతారసౌలభ్యాన్ని తెలుసుకొన్నంతనే ఆళ్వార్లు మోహపడిపోతున్నారు. "జన్మకర్మచమే దివ్యమ్" - నా జన్మకర్మలు దివ్యమైనవి (విలక్షణమైనవి) అన్నాడే కాని ' ఈ రీతిగా ఉంటాయి" అని చెప్పలేదు కదా! కాబట్టి, ఎవ్వరికైనా తెలుసుకొనడానికి సాధ్యం కానిది భగవంతుని అవతారరహస్యం.

3. సర్వేష్వాసక్తిమత్త్వాత్ :- యారుమ్ఓర్నిలైమైయన్ (4పా) ఎంతటి జ్ఞానులకైనా 'భగవంతుడీరీతిగా ఉంటాడు' అని తెలుసుకోవడానికి అశక్యుడు. ఎంతటి జ్ఞానహీనులైనా భక్తులకు ఇట్టి స్వభావం కలవాడని గ్రహించడానికి సులభుడై ఉంటాడు.

పేరుమ్ఓర్ఆయిరమ్ పిఱపల ఉడైయ ఎంబెరుమాన్- ఇక్కడ జన్మమనే అర్థమిచ్చే 'పిఱ' అనే పదానికి 'రూపం' అని అర్థం. "నామరూపే వ్యాకరవాణి" (ఛాం.ఉ) "నామరూపంచ భూతానామ్" (వి.పు) గుహశబరీ, వానర, గోపాల, మాలాకారాది భక్తులకు విధేయుడై తన స్వరూపసౌలభ్యాలను రుచిచూపించాడు కాబట్టి నాస్వామివేలనామాలూ, రూపాలూ కలవాడు అని అనుభవింపతగినట్లుగా ఉంటాడు. 'ఉళతు ఇలదు ఇల్లై-అనన్త నామరూప విశిష్టుడైన భగవంతునికి నామరూపాలు 'కల' వనీ'లే'వనీ 'వివాదం' అనుకూలురకూ, ప్రతికూలురకూ సాగుతూ ఉంటుంది. 'పిణక్కే-వివాదం ఉంటుంది. అని ఒక అర్థం. "పిణక్కే?" వివాదం ఉంటుందా? ఉండదు, అని మరొక అర్థం. పరిపూర్ణంగా దర్శించడం వల్ల, స్వామికేమి అవద్యం కలుగుతుందో అని మంగళాశాసనం చేస్తే ఆశ్రితులకు వాదనతో పనిలేదు. భగవంతునికి నామరూపాలు లేవని దృఢవిశ్వాసంతో ఉండే అనాశ్రితులకూ వాదన అవసరం లేదు.

4. నతసుగమతయా:- పిణక్కుఅఱ,అఱువగై సమయముమ్(5పా)- వేద ప్రమాణాన్ని అంగీకరింపని మతాలు ఆరు-సాంఖ్యం, యోగం, కాణాదం (నైయాయిక, వైశేషికం) బౌద్ధం, జైనం, పాశుపతం. వీటితో వైదికమతానికి వివాదం లేకుండా వేదమార్గాన్ని శోధించి, సకల వేదాలకు తానే అర్థమనీ "వేదైశ్చసర్వైరహమేవవేద్యః" (భ.గీత) అని బోధించినవాడు భగవానుడే. అమ్ బగవన్-అందమైన భగవానుడు. (భ= జ్ఞానశక్తులు; గ=బలైశ్వర్యాలు; వ=వీర్యతేజస్సులు. షాడ్గుణ్యపూర్ణుడు. అన్=హేయగుణాలు లేనివాడు). "వణక్కుడై తవనెఱివళినిన్ఱు" నమస్కారం అంగంగా ఉండే భక్తిమార్గమందు నిలిచి ఉండండి-అన్నారు. "నమస్యంతశ్చమాంభక్త్యా" (భ.గీత) 'యస్యజ్ఞానమయంతపః! (శ్రుతి) తపోరూపమైన జ్ఞానమే భక్తి లేదా 'ప్రపత్తి' అని అర్థం. "న్యాసమేషాంతపసామతిరిక్తమాహుః" (నారా ఉప.) 'న్యాసం' అంటే ప్రపత్తి తపస్సులలో శ్రేష్ఠమైనది, అని అర్థం. "పుఱనెఱికళై కట్టు"- ఇతర మార్గాలను (విషయాలను) ఛేదించి; అవనుడై ఉణర్వుకొణ్డుఉణర్న్దే"-భగవంతుని జ్ఞానాన్ని స్వీకరించి, దర్శించండి. విషయవాసనలను విడిచి, నమస్కారంతో కూడిన భక్తి ప్రపత్తులచే భగవానుని అనుగ్రహాన్ని పొందడమే సుగమమైన ధర్మమార్గం, అన్నారు నమ్మాళ్వార్లు.

5. స్వప్రబోధప్రదత్వాత్:- ఉణర్న్దుఉణర్న్దు (6పా)-(తెలుసుకొని) జ్ఞానం, జ్ఞానం

కలవాడు, రెండూ ఉన్నాయని తెలుసుకొనవలెను అన్నారు. ఇది ఆత్మ లక్షణం.

నైయాయికవైశేషికులు 'ముక్తి పొందినప్పుడు జీవునికి చైతన్యం ఉండదు, పాషాణంలాగా పడి ఉండడమే మోక్షం' అన్నారు. కాబట్టి 'ద్విరుక్తి' చేత వీరివాదం నిరసింపబడింది. "పాషాణకల్పమంతే పరిచితగౌతమ పరిగ్రహ న్యాయాత్! ప్రతిపద పరిచరణార్థం పరిణమయ ముకుంద పాదరక్షిణి! మామ్!!" (పాదుకాసహస్రమ్-970శ్లో) చూడండి.

ఆత్మజ్ఞానమేకాని, జ్ఞానం కలది కాదనే వాదం క్రియావాది (అద్వైతి) వాదం. జ్ఞానం కలవాడు ఆత్మ (జీవుడు) అని చెప్పితే, జ్ఞానంక్రియ కాబట్టి క్రియకు ఆశ్రయమైనది ఆత్మ అవుతుంది. క్రియ నిత్యం కాదు. అది ఒకప్పుడు పుట్టి ఒకప్పుడు నశించేది. అందువల్ల ఆత్మ కూడా ఒకప్పుడు ఉండి మరొకప్పుడు పోయేది అవుతుంది. కాబట్టి, జ్ఞాతృత్వం అనిత్యం జ్ఞానమే నిత్యమని క్రియా వాది యొక్కవాదం.

ఆళ్వార్లు 'జ్ఞానం కలవాడు జీవుడు' అని చెప్పినందువల్ల క్రియావాది వాదం ఖండితం. ఆత్మ అణువు కాబట్టి స్వరూపంతో అంతటా వ్యాపించలేదు. పరమాత్మమాత్రం స్వరూపంతోనే అంతట వ్యాపించి ఉంటాడు. శరీరంలో ఏ భాగానికి దెబ్బతాకినా, ఆ నొప్పిని జీవుడు అనుభవిస్తాడు కాబట్టి, జీవుడు మాత్రం ధర్మభూత జ్ఞానం చేత శరీరమంతా వ్యాపించి ఉంటాడని సిద్ధాంతం.

జడమైన అచిత్తు(దేహం) కంటె భిన్నమైన జీవాత్మకు జ్ఞానమే స్వరూపం. ఆత్మ యొక్క స్వరూపాన్ని శ్రవణమననాదులచేత సాక్షాత్కరింపచేసుకొనవచ్చు. కాని బ్రహ్మరుద్రాదులను శరీరాలుగా స్వీకరించి, వారికి అంతర్యామిగ ఉండే పరమాత్మ స్వరూపాన్ని తెలుసుకోవడం అరుదు. ఉయిర్‌కాళ్-చైతన్యమున్నందువల్ల ఆశ్రయింపవలసిన విధానాన్ని తెలుసుకోదగిన ఓ చేతనులారా! అని సంబోధించారు.

అరి,అయన్,అరన్, ఎన్నుమ్ఇవర్రై ఉణర్న్దు, ఉర్రైత్తు-హరి,బ్రహ్మ, హరుడు అనే ఈ ముగ్గురి స్వరూప, స్వభావాలను శాస్త్రప్రమాణాల చేత, పక్షపాతరహిత బుద్ధితో, ఆలోచించగా, మనప్పట్టతొన్దుఉణర్న్దు ఉర్రైత్తు ఇఱైంజుమిన్ - మనస్సుకు సర్వేశ్వరుడని తోచిన ఒక్కణ్ణి ధ్యానించి, జపించి, ఆశ్రయించండి అని ప్రబోధించారు నమ్మాళ్వార్లు.

6. ఖ్యాతాభిఖ్యాదిచిహ్నాత్, స్వరుచివితరణాత్ :- ఒన్రుఎన, పల ఎన-నారణన్,

నాన్ముకన్ అరన్ ఎన్నుమ్ ఇవరై- (7పా) నారాయణుడు, చతుర్ముఖుడు, రుద్రుడు అనే వీరిలో ఒక్కడు ప్రధానుడా? ముగ్గురు ప్రధానులా? ఆశ్రయింపదగిన పరతత్త్వం ఏది? అని తెలుసుకోవడం సుకరం కాదు. శాస్త్రమే ప్రమాణం. " ఏష సర్వభూతాంతరాత్మా, అపహతపాప్మా, దివ్యో దేవ ఏకో నారాయణః" (సుభాలోపనిషత్తు). ఉభయవిభూతులలో ఉండే చేతన, అచేతన వస్తువులన్నిట్లో అంతరాత్మగా ఉన్నవాడు నారాయణుడు. అన్నిటిలో అంతరాత్మగా ఉన్నప్పటికీ ఆ వస్తువుల దోషాలు అంటని లక్షణం (అపహతపాప్మత్వం) కలవాడు. పరమపదవాసుడే దివ్యుడు. తనతో సమానులు కాని, అధికులు కాని లేని (ఏకః) అద్వితీయుడు అని ఉపనిషత్తువల్ల (నన్దు ఎళిల్) శ్రేష్ఠమైన ప్రకాశం కలవాడు నారాయణుడు అన్నారు.

సృష్టించడానికి జ్ఞానం కలిగించే నాలుగు వేదాలను అధ్యయనం చేసే నాలుగు ముఖాలు గల బ్రహ్మకు ఒక్క సృష్టికార్యమందే అధికారమున్నదని ఆ పేరే చెబుతుంది. ఒక్క సంహార కార్యమందే అధికారమున్న పేరు కలవాడు 'హరుడు'.

"సృష్టి స్థిత్యంతకరణీం బ్రహ్మవిష్ణుశివాత్మికామ్! స సంజ్ఞాంయాతి భగవానేకఏవ జనార్దనః॥ (వి.పు. 1-2-67) త్రిమూర్తులలో ఉన్న ఎక్కువ తక్కువలను తెల్పే శ్లోకమిది.

దీనిలో, సృష్టి స్థితి సంహార కార్యాలను నిర్వహించే బ్రహ్మ విష్ణు శివ నామాలతో వ్యవహరింపబడే భగవానుడు జనార్ధనుడు ఒక్కడే, అని శ్రీ పరాశర మహర్షి బోధించాడు. ఈ సూక్తి త్రిమూర్తి సామ్యభ్రమను తొలగిస్తూ, ముగ్గురిలో 'జనార్ధన' నామ (పర్యాయపదం) మున్న విష్ణువే ప్రధానుడని తెల్పుతున్నది. కాబట్టి, బ్రహ్మరుద్రులందు రుచి (ఈశ్వరభ్రాంతి) ని తొలగించుకొని, మనకున్న అల్పాయుష్కాలంలో శ్రీమన్నారాయణున్నే భజించాలి.

" నందంత్యుదిత ఆదిత్యే నందంత్యస్తమితే రవౌ! ఆత్మనోనావబుధ్యంత మనుష్యా జీవితక్షయమ్॥" (రామాయణం) సూర్యోదయం కాగానే ధనాన్ని సంపాదించవచ్చుననీ, సూర్యుడు అస్తమించినంతనే ప్రియాలింగన సుఖాన్ని అనుభవించవచ్చుననీ మానవులు ఆనందిస్తారు. కాని ఛిద్రాలున్న కడవలోని నీరులాగా ఆయుస్సు క్షీణిస్తున్నదని తెలుసుకోవడం లేదు-అన్నాడు శ్రీరామచంద్రస్వామి. బ్రతికే కాలంతరిగిపోతున్న విషయాన్ని ఆలోచించకున్నా, విషయవాంఛలు అనే దావాగ్ని మనలనాక్రమించుకొంటున్న వేగాన్ని చూచియైనా భయపడి శ్రియఃపతిని ఆశ్రయించాలి. రెండు తలుపులు మూసుకొని ఓ వ్యక్తి ఇంట్లో ఉంటుండగా, మీద

ఇల్లు తగులబడితే మెల్లగా అగ్గిని చల్లార్చుకోవచ్చునని ఎవ్వరైనా ఓర్చుకొని ఉంటారా? కాబట్టి శీఘ్రంగా కంసారి చరణకమల పరిభజనమే శ్రేయస్కరమన్నారు శ్రీపరాంకుశ దివ్యసూరులు.

7. సర్వకాలాశ్రయత్వాత్ :- నాళుమ్‌నిన్టుఅడుమ్‌నమపళమై అమ్‌కొడువినై ఉడనేమాళుమ్- (8పా) ఎల్లప్పుడు విడిపోకుండా బాధించే మన ప్రాచీన క్రూర పాపాలు భగవంతుణ్ని ఆశ్రయించినప్పుడే నశిస్తాయి. పాపాలు నిత్యములు, ఆత్మకు పరతంత్రాలు. జీవునికి అచిత్సంసర్గం అనాది. జీవునికి శరీంతోసంబంధం కలుగగానే, ఆత్మకు పాపాలు సంక్రమిస్తాయి. కాబట్టి పాపాలు కూడా పరతంత్రములే. నిత్యత్వం, పారతంత్ర్యం పరస్పర విరుద్ధ స్వభావాలే అయినా పాపాలకు ఈ రెండు లక్షణాలు ఉన్నాయి.

భగవంతునికి గల స్వరూపం, గుణాలు నిత్యములే, అయినా, ఆయనకు పరతంత్రమూ అయి ఉంటాయి కదా! అలాగే ఆత్మకు అచిత్సంసర్గమనేది నిత్యమూ, పరతంత్రమూ అయి ఉన్నది. "సుహృదః సాధుకృత్యామ్, ద్విషన్తః పాపకృత్యామ్" (శాట్యాయన శాఖ) బ్రహ్మవేత్తలకున్న పుణ్యపాపాలు మరణ సమయంలోతొలగిపోతాయట. వారి పుణ్య కర్మలన్నీ వారి స్నేహితులకు, వారి పాపకర్మలన్నీ వారి శత్రువులకు చెందిపోతాయి. మోక్షానికి ప్రతిబంధకాలైన పుణ్యపాపాలు తొలగిపోయిన పరిశుద్ధజీవుడు పరమపదం చేరుకొంటాడు.

మరి మన పాపాలో! మహా పురుషులను ద్వేషించినందువల్ల మన మీద వచ్చిపడినవి కావు. మన దుష్కృతుల వల్ల సంపాదించుకొన్నవే కదా! "అభూతపూర్వం మమభావికింవా సర్వంసహే మే సహజం హిదుఃఖమ్" (స్తో.ర) నేను మునుపు అనుభవింపని దుఃఖాలు లేవు. ఇకముందు అనుభవింప దగిన దుఃఖాలు లేవు. నాకు దుఃఖాలు సహజాలు. నాతో ఉండేవే, అన్నిటినీ అనుభవింపగలనన్నారు ఆళవందారు. అలాగే మన పాపాలు సహజాలే కాని ఆగంతుకాలు కావన్నారు నమ్మాళ్వార్లు. మన ప్రాచీన, క్రూరపాపాలు భగవంతుణ్ని ఆశ్రయించిన వెంటనే మిగులకుండా పోతాయన్నారు.

"యధేషీక తూల మగ్నౌప్రదూయేతైవం హాస్యసర్వేపాప్మానఃప్రదూయంతే" (ఛాం.ఉ) దూది కుప్ప మీద నిప్పు పడితే దూదిలాగా, భగవంతుని దర్శనమైన వెంటనే మన ప్రాచీన పాపాలన్నీ దగ్ధమవుతాయని పలికినారు.

"మేరుమందర మాత్రోపి రాశిః పాపస్యకారణః। కేశవం వైద్యమాసాద్య దుర్వ్యాధిరివనశ్యతి' (విష్ణుధర్మం) వైద్యుని ఆశ్రయిస్తే తీవ్ర వ్యాధినశించే రీతిగా, మేరు, మందర పర్వతాలంత పరిమాణంతో ఉన్న పాపరాశి కేశవుణ్ని ఆశ్రయిస్తే నశిస్తుంది.

"దురాచారోపి సర్వాశీ కృతఘ్నోనాస్తికఃపురా! నమాశ్రయే దాదిదేవంశ్రద్ధయా శరణంయది। నిర్దోషం విద్ధి తంజంతుం ప్రభావాత్పరమాత్మనః॥ (మహాభారతం) చేయరాని పనులను చేసినవాడైనా, తినతగని వాటిని తిన్నవాడైనా, ఉపకారికి అపకారం చేసినవాడైనా, వేదాన్ని విశ్వసించనివాడైనా, ఆది దేవుణ్ని శ్రద్ధతో ఆశ్రయిస్తే, స్వామి ప్రభావం చేత ఆ వ్యక్తి, నిర్దోషిగా పరిగణింపబడుతాడు. "నవాసు దేవభక్తానామశుభం విద్యతేక్వచిత్(వి.స.నా) వాసుదేవుణ్ని ఆశ్రయించినవారికి ఎప్పుడూ అశుభం జరుగదు. పూర్వాఘాలు నశిస్తాయి. ఉత్తరాఘాలు అంటుకోవు. ఆశ్రితుల అభిమతాలన్నీ నెరవేరుతాయి.

హరి హరబ్రహ్మలలో పరతత్త్వమెవరో అనే సందేహం కల మనస్సులోని మలినాన్ని కడుక్కొని 'తిరువుడైయడిగళ్' శ్రియఃపతి యొక్క (నలం కళత్) భోగ్యమైన పాదాలకు వందనమాచరించాలి. సర్వేశ్వరుడే ఫలప్రదుడై ఉండగా, శ్రీదేవిని కూడా ఆశ్రయించడం ఎందుకు? అని అడిగిన సంజీయర్ స్వామికి, భట్టర్‌వారు 'తిరువుడైయడిగళ్' అని ఆళ్వార్లు చెప్పినారు కదా! అని వివరించారట. స్వతంత్రుడైన స్వామి మన దోషాలను చూచి శిక్షించడానికి సిద్ధపడినప్పుడు, జగన్మాతయైన లక్ష్మీదేవి తన వాగ్విలాసాదుల చేత స్వామిని దయాంతరంగుణ్ని చేసి మన దోషాలను క్షమింపజేస్తుంది. కాబట్టి లక్ష్మీదేవి పురుషకారంగా స్వామిని ఆశ్రయించాలి. మరణిస్తున్నప్పుడు కూడా స్వామి పాదాలకు నమస్కరిస్తూ చావడం మేలు. "ద్విధాభజ్యేయమప్యేనంననమేయం కదాచన" రెండుగా చీల్చబడినా, నేను రామునికి వంగను' అన్న రావణాసురునిలాగా మాటాడకూడదు. పర్వదినాలలో తప్ప సముద్రస్నానం చేయరాదు అనే నియమం ఉంది. కాని తిథివార నక్షత్రాలను చూడకుండా, పుట్టినప్పటి నుంచి ఏ రోజైనా, ఏ దశలోనైనా శ్రీమన్నారాయణుని చరణాలనాశ్రయిస్తే ఫలమీయక మానదు అని ఆశ్రయించే విధానాన్ని బోధించారు శ్రీవకుళాభరణులు.

8. శర్వాదేఃస్వాంగదానాత్:- వలత్తనన్తిరిపురమ్ ఎరిత్తవన్- (9పా) త్రిపురాలను దహించివేసిన రుద్రుడు స్వామి దక్షిణభాగంలో ఇమిడిపోయాడు. "పశ్యైకాదశమే రుద్రాన్ దక్షిణం పార్శ్వమాశ్రితాన్" (మోక్షధర్మం-భారతం) "తపసాతోషితస్తేన విష్ణునాప్రభవిష్ణునా। స్వపార్శ్వే దక్షిణే శంభోర్నివాసః పరికల్పితః (24 వేల వ్యాఖ్యలో) అనే సూక్తులు ఉదాహృతాలు. చతుర్ముఖబ్రహ్మ, ఆయన సృజించినలోకాలతో కూడా (తున్దిత్తలం) నాభిస్థలంలో ఉన్నవాడు. ఈ దేవతలందరు, వారికి ఆపద వచ్చినప్పుడు మాత్రమే, అవసరం తీరువరకే స్వామి శరీరంలో ఉంటారు. ఎల్లప్పుడు ఉండరు. సామంత రాజులకు వారి రాజ్యాలు వేరుగా ఉన్నా, చక్రవర్తి అనుగ్రహించి బహుమతులిస్తే, వారు మహాభాగ్యమని తృప్తిపడినట్లే, దేవతలు స్వామి శరీరంలో నివసించడం అదృష్టమని ఆనందిస్తారు. ఆ బ్రహ్మాదులే హేయమని భావించే ఈ భూలోకంలోనూ,తన ఆశ్రితులకు దృష్టిచిత్తాపహారియైన తన రూపసౌందర్యాన్ని చూపించి, తనపైన రుచిని జనింపజేయడానికే అవతరిస్తాడు భగవానుడు. సాధుపరిత్రాణానికే, వారిని రక్షించడమూ ప్రధాన కృత్యాలు. ఇవై అవన్తుయక్కే- ఆయన గుణాలన్నీ మోహజనక వ్యాపారాలే. "మమమాయాదురత్యయా"(భ.గీ) అన్నట్లు అయన మాయచేత ప్రకృతిబద్ధులైనవారెవ్వరు ఆ కల్యాణగుణాలను తెలుసుకోలేరు కదా!

9. ప్రహితపదతయా:- తుయక్కుఅఱుమతియిల్- (10పా) మోహంలేని మంచి జ్ఞానం కలిగిన దేవతలకూ భ్రమ పుట్టించే గుణచేష్టితాలు, ఆకాశం కంటెనూ పెద్దవి.

తుయక్కు=మోహం. ఇది సంశయం, విపర్యయం అని రెండు విధాలు.

1. సంశయం : అవునా? కాదా? అనిపించడం 2. విపర్యయం- ఒక రకంగా ఉన్నదాన్ని మరొక రకంగా భావించడం. స్వామి యొక్క మితిలేని గుణాలు దేవతలను కూడా మోహింపజేస్తాయి. దేవేంద్రుణ్ని నరకాసురుని బారినుండి రక్షించినవాడు శ్రీకృష్ణుడు. నందనవనం నుంచి పారిజాతపు మొక్కను తెచ్చుకొంటున్న శ్రీకృష్ణుణ్ని దేవేంద్రుడు వజ్రాయుధం ధరించి ఎదిరించాడు కదా! గరుత్మంతుడు నిత్యసూరియే అయినా, తాను లేకుంటే శ్రియఃపతి పర్యటనలు సాగవని గర్వించి భంగపడ్డాడు. త్రివిక్రమావతారంలో హెచ్చు తగ్గులను చూడకుండా అన్నిటి, అందరి తలలమీద తన పవిత్రపాదాన్ని అవతంసింపచేశాడు. పుయల్కఱునిఅత్తనన్- అట్టి నీలమేఘశ్యాముని శ్రీపాదాలనే పొందవలెనని నమ్మాళ్వార్లు కోరినారు.

అమరర్గళ్తొళుదు-(11పా) దేవతలు తనను సేవించి ఉజ్జీవించే రీతిగా పాలకడలిని చిలికిన శ్రీమన్నారాయణుని విషయమై నమ్మాళ్వార్లు అనుగ్రహించిన వేయి పాశురాలలోని ఈ పదింటిని అభ్యసించినవారు నిత్యసూరులతో సమానమైన ఆధిక్యాన్ని పొంది, తమ జన్మ బంధాన్ని త్రెంచుకొంటారు. "తద్విప్రాసోవిపన్యవః" స్తుతిశీలురైన నిత్యసూరులవలె ఆళ్వార్లు పరిపూర్ణుని విషయంలో వాచిక కైంకర్యం చేశారు.

అమరర్ఓడు- తమ్పిఱవి అమ్శిఱై అఱువర్, - ఆమరర్ అంటే అతివాహిక పురుషులని (ఇక్కడ) అర్థం. భగవంతుని అనుగ్రహాన్ని పొందిన వ్యక్తి శరీరం విడిపోగానే, ఆ జీవుణ్ని వైకుంఠానికి తీసుకొనిపోయే వారు అతివాహిక పురుషులు. వారితో పోయి విరజానదిలో స్నానం చేయగానే జీవుణ్ని అంటుకొని ఉన్న సూక్ష్మ శరీరం పోతుంది. "త్యక్త్వాదేహం పునర్జన్మనైతి, మామేతి సః, అర్జున!" (భ.గీత) శ్రీకృష్ణభగవానుడే స్వయంగా, తన అవతార రహస్యాన్ని తెలుసుకొన్న వ్యక్తులు దేహాన్ని వదలి, మళ్ళీ జన్మను పొందక, నన్నే పొందుతారని , బోధించాడు కదా! ఈ తిరువాయి మొళిని అనుసంధానం చేసిన వారికి కూడా ఆ ఫలమే లభిస్తుందన్నారు నమ్మాళ్వార్లు.

చతుర్థ దశకం

4. త్రాణే బద్ధ ధ్వజత్వాచ్ఛుభనయనతయా స్వార్థలాభేఽర్థిభావాత్
తిమ్యన్మేఘస్వభావాజ్జగదుపజననస్థాపనాతిప్రియత్వాత్।
కారుణ్యాప్తత్వయోగాదనుగతమహిషీ సన్నిధేస్సంగదైర్ఘ్యాత్
నానా బంధైస్సురక్షా వహితతమతయా క్షామ్యతీత్యాహకృష్ణమ్॥ 14

అర్థం :- త్రాణే= రక్షణమందు; బద్ధ ధ్వజత్వాత్= కట్టబడిన గరుత్మంతుడనే ధ్వజం కలవాడైనందువల్ల; శుభనయనతయా= సుందర నేత్రాలు కలవాడవడం చేత; స్వ+అర్థ లాభే=తన ప్రయోజనలాభమందు; అర్థిభావాత్= యాచకుడవడం వల్ల; తిమ్యత్+ మేఘస్వభావాత్=నల్లనిమేఘం యొక్క స్వభావం కలవాడైనందు వల్ల; జగత్+ ఉపజనన, స్థాపన+ అతిప్రియత్వాత్=లోకాలను సృజించడమందు, రక్షణమందు మిక్కిలి ప్రియుడవడం వల్ల; కారుణ్య+ఆప్తత్వయోగాత్=దయచే ఆప్తుడవడంవల్ల; అనుగతమహిషీసన్నిధేః= అనుసరిస్తున్న శ్రీదేవీ సన్నిధానం కలవాడైనందువల్ల; సంగదైర్ఘ్యాత్=ప్రీత్యతిశయం వల్ల; నానాబంధైః= అనేక విధాలైన సంబంధాల చేత;

సురక్షా వహిత తమతయా =సంపూర్ణ రక్షణమందు జాగ్రత కలవాడవడం చేత; క్షామ్యతి = సహిస్తున్నాడు; ఇతి=అని; కృష్ణం= శ్రీకృష్ణుణ్ని; అహ = సాధిస్తున్నాడు. (చెబుతున్నాడు)

తా॥ ఈ నాల్గవ తిరువాయ్‌మొళి మొదటి పాశురంలో సర్వేశ్వరుడు సమస్త రక్షణమందు దీక్షితుడన్నారు. (2) తామరదళామలాయతాక్షుడు (3) తనలోకాన్ని పొందడానికి తానే వామనుడై యాచించాడు (4) వర్షుకవలాహకం వంటి నల్లని శరీరకాంతి కలవాడు (5) జగత్తును సృజించడమందు, దాన్ని రక్షించడమందు మిక్కిలి ప్రీతికలవాడు (6) దయామయుడైనందువల్ల లోకానికి అప్తుడు (7) శ్రీదేవితో ఎల్లప్పుడు కూడి యున్నందువల్ల సమస్త ప్రాణులకు హితకరుడు (8) ఆశ్రితుల రక్షణకోసం ఉపయోగించిన వ్యామోహం కలవాడు (9) 'మాతా పితాభ్రాతా' అన్నట్లు సకలవిధ సంబంధం కలవాడు (10) లోకరక్షణార్థం మహాజలాన్ని సృష్టించి, దానియందు పవళించి, పూర్ణరక్షణమందు జాగ్రతకలవాడై ఆశ్రితుల అపరాధాలను సహించేవాడు సర్వేశ్వరుడని నమ్మాళ్వార్లు సాదించారు.

ప్రకా-వ్యాఖ్య :- **నాయికాభావాన్ని పొందిన ఆళ్వార్లు, తమ ఆర్తిని స్వామికి తెల్పగలవలని పక్షులను దూతలుగా పంపుతున్నారు.**

మానసికంగా స్త్రీత్వాన్ని పొందిన ఆళ్వార్లకు ఆనాడు సీతాదేవికి ఉన్న లక్షణాలున్నాయి.

1. అనన్యార్హశేషత్వం-స్వామికి తప్ప వేరే ఎవ్వరికీ చెందక ఉండడం.

2. అనన్యశరణత్వం - స్వామి తప్ప వేరే రక్షకులు లేకుండడం

3. తత్సంశ్లేషైకసుఖిత్వం-స్వామి కలయికలో సుఖాన్ని అనుభవించడం.

తద్విశ్లేషైకదుఃఖిత్వం - స్వామి ఎడబాటులో దుఃఖాన్ని అనుభవించడం

4. తదేకభోగ్యత్వం-స్వామినే సకలవిధాలుగా అనుభవిస్తుండడం.

5. తదేకనిర్వాహ్యత్వం-స్వామిచేతనే నడిపించబడడం.

"పాంచాలీగాత్రశోభా" (3) అవతారికలోనే, దేశికులు నమ్మాళ్వార్ల స్త్రీ భావాన్ని వివరంగా తెలిపారు కదా!

1. త్రాణే బద్ధ ధ్వజత్వాత్ :- అమ్శిఱైయమడనారాయ్- (1పా) అందమైన రెక్కలున్న విధేయురాలివైన ఓ సారస పక్షీ! నీవూ, నీ భర్త కూడా కలసి నా మీద దయ ఉంచి, వెమ్శిఱైపుళ్ఉయర్తార్క్కు ఎన్విడుతూదాయ్శెన్ఱు- క్రూరమైన రెక్కలు గల గరుడధ్వజుని వద్దకు నేను పంపేదూతగా పొమ్ము. ఇది నాయకీ వాక్కు. శ్రీశ్రియఃపతుల జంటతో పరిచయం ఉంది. లక్ష్మీ పురుషకారంతో నారాయణుణ్ని ఆశ్రయించడం సంప్రదాయం. కాబట్టి ఆడపక్షినే (ఓబకమా)సంబోధించారు ఆళ్వార్లునాయకి. "ఏహిపశ్యశరీరాణి"-రామా! రమ్ము,అని దండకారణ్యంలో మునులు రాక్షసుల బాధకు నలిగిపోయిన తమ శరీరాలను చూపినట్లే ఈ నాయకి భగవద్విరహం చేత కృశించిన తన శరీరాన్ని చూపి (అరుళి) దయను అర్థిస్తున్నది. సీతాదేవి, అంగుళీయకాన్ని అందించిన రామదూతను 'విక్రాన్తస్త్వం,సమర్థస్త్వం, ప్రాజ్ఞస్త్వం, వానరోత్తమ!" అని ప్రశంసించినట్లే, దయను చూపుము. నేను దయనీయురాలను, అని కొంగను ప్రార్థించింది, 'మంచి రెక్కలున్న వారు దయను చూపదగినవారు' అని ప్రశంసించింది.ఆచార్యుణ్ని ప్రశంసించడమే శిష్యుని పని. స్వామిని గుర్తించడానికి, గరుడధ్వజుడని పలికింది. శత్రువులకు భయంకరమైన రెక్కలుగలవాడు గరుడుడు. గోపికలు, శ్రీకృష్ణుణ్ని మధురకు తీసుకుపోతున్న ఆ క్రూరుణ్ని"అక్రూరఃక్రూర హృదయః" అన్నట్లు, నాయకి తన నుంచి దూరంగా స్వామిని ఎక్కించుకొని పోయిన గరుడుణ్ని క్రూరమైన రెక్కలు కలవాడని భావించింది. ఆర్తితో ఉన్న ఒక అబలకు మేలు చేయడానికి దూతగా వెళ్ళడం మహద్భాగ్యమని పలికింది. దౌత్యానికి వచ్చిన మీకు స్వామి ఆదరం లభిస్తుంది. నేను ఆశపడే గాఢాలింగనం నాకంటే ముందుగా, సీతమ్మ దగ్గరినుంచి వచ్చిన హనుమకు రాముని ఆలింగనం వలె, మీకే లభిస్తుంది. గరుడధ్వజుడు రక్షాదీక్షితుడే. "వన్శిఱైయిల్ అవన్వైక్కిల్"- కఠినమైన చెరసాలలో ఆయన పడవేస్తే; ఇది శబ్దార్థం. కాని "వైముఖ్యం" అని తాత్పర్యం. (కారాగారమని కాదు) "వైప్పుండాల్ఎన్శెయ్యుమో" చెరలో వేస్తే ఏమిసేగి జరుగుతుంది? దేవతా స్త్రీల చెరను విడిపించడానికి సీతమ్మ చెరలో పడలేదా? ఇతరుల కోసం చెరలో పడడం గౌరవమే కదా! నష్టమేమి? స్వామి ఎప్పుడైనా సరే! పెడమొగం పెట్టడు. ఒక వేళ పెట్టినా అదృష్టమనుకోవాలి. స్వామి ఆదరించినా, నిరా దరించినా శిరోధార్యమే, అని ఆళ్వారునాయకి.

2. శుభనయనతయా:- ఎన్ శెయ్యతామరైక్కణ్ పెరుమానార్క్కు- (2పా) నార పక్షులను తనకు దూతలై పోవలసిందని చెప్పిందే కాని సందేశం చెప్పలేదు. ఇప్పుడు

'ఇనక్కుయిల్‌కాళ్' గుంపులుగా ఉన్న కోకిలలారా! అని చెప్పవలసిన సందేశాన్ని కోకిలలతో చెప్పుతున్నది. ఒకరిని పిలిచి మరొకరితో చెప్పడం నాయకి యొక్క ఉన్మత్తావస్థను తెల్పుతుంది. భగవంతుని గుణాధిక విషయానికి ఇంత కలతను చెందించే శక్తి ఉన్నందువల్ల ఆళ్వార్లు ఒక నియతిలేకుండా మాటాడుతున్నారు.

తన స్వామి, దగ్గర ఉన్నప్పుడెంతవశపర్తియై ఉన్నాడో కాని దూరమైనప్పుడు కూడా 'నాస్వామి ఎఱ్ఱతామరల వంటికన్నులు కలవాడు, పుండరీకనయనుడు' అంటున్నది నాయకి.

1. స్వాభావికంగా ఎఱ్ఱతామరలవంటి కన్నులు కలవాడు సర్వేశ్వరుడు. 2. పూర్ణ వాత్సల్యం చేత తనవాడు తనకు దూరమవుతున్నారని ఎఱ్ఱవారి ఉన్నాయెమో. 3. ప్రియురాలి సంశ్లేషము అనే మధుపానంతో మత్తుడైనందువల్ల ఎఱ్ఱవారినవేమో! 4. నాయకిని ఎడబాసినప్పుడు విశ్లేషవ్యసనాన్ని భరింపలేక కూడా కన్నులు ఎఱ్ఱవారి ఉంటాయి. ఈ చతుర్విధాలైన స్వామి 'రక్తలోచనత్వం' ఆళ్వారునాయకికి పరిచయముంది కాబట్టి 'శెయ్యతామరైక్కణ్' అన్నది.

సహజ ఐశ్వర్యం గల స్వామి ఈమెను ఒక్కచూపు జూచి,ఈమె సర్వస్వాన్ని జయించిన (కొల్లగొట్టిన) ఐశ్వర్యంతో స్వామిత్వం రెట్టింపు అయింది. అట్టి ఐశ్వర్యవంతుని దగ్గరికి నా దూత(లు)గా వెళ్ళి ఒక్కమాటను చెప్పితే మీకేమి నష్టం? ఉభయవిభూతులు మీకు కానుకగా లభిస్తాయని ధ్వని. మీరు 'ఇనమ్' గుంపులుగా ఉన్నారు. మీకెడబాటులేదు. 'నీర్అలిరే'-చిరపరిచితులే మీరు. నేనుస్వామితో సంశ్లేషించి ఉన్నప్పుడు మామాటలకుకుహూ, కుహూధ్వనులతో ప్రత్యుత్తరమిచ్చిన మీరు, స్వామి దూరమైనందువల్ల మారిపోయినారా? "మున్‌శెయతముళువినైయాల్-అకల్వాతువోవిదియనమే?" (సందేశమిది) పూర్వ జన్మ పాపాల చేత మీ పాద కైంకర్యం చేయడానికి ఇంతవరకు ఏ సాధనాలు నాకు లేకున్నా, ఇక మీద, ఇలాగా నేను మీకు దూరమవడం న్యాయమా? అని నేను ప్రశ్నిస్తున్నానని స్వామితో చెప్పండి.

విదియినన్-భాగ్యవంతురాలను నేను. పెట్టుబడిలేనివారు వడ్డీని కోరకపోవడం సముచితమే కాని, నా పుణ్యధనమైన సర్వేశ్వరుడే నాకు పెట్టుబడి. ఫలాన్ని పొందడంలో ఆటంకమేముంది? అని భావం.

తిరుక్కోట్టియూరులో, సామాన్యుడైన తెఱ్ఱాళ్వాన్, సద్గుణుడైన కోళరియాళ్వాన్, ఇద్దరు కలిసినప్పుడు, ' ఈ పర్వదినాన పుణ్యనదీ స్నానం చేతామా?

అని కోళరియాళ్వాన్, తెఱ్కాళ్వాన్‌ను అడిగాడట. 'అయ్యో! నా పాపాలు ఈ యూరిలోవేంచేసియున్న శ్రీసౌమ్య నారాయణస్వామి తన చక్రంతో ఛేదిస్తేనే పోదగినవి కాని నదీస్నానాలతో పోయేవి కావు, అన్నాడట తెఱ్కాళ్వాన్. అక్కడున్న భట్టరు ఆతని ఉపాయాధ్యవసాయాన్ని ఎంతో మెచ్చుకొన్నారట.అలాగే ఆళ్వారునాయకి తనవి 'నిందు పాపాలు' అని తెలిపింది.

తిరువడీక్కీళ్ కుత్తేవలౌెయ్య" శ్రీపాదాల వద్ద దాస్యంచేయడానికి అని అర్థం. ఆళ్వార్ నాయకి ప్రియుని ఆలింగనం కోరక, పాదదాస్యాన్ని కోరుకోవడమేమిటి? అంటే, వేద పండితునికి పిచ్చిపట్టినా వేదమే చదివినట్లు, ఆళ్వార్లు నాయకీదశను పొందినప్పుడు కూడా, తన సహజ స్వరూపం పాదదాస్యమే కాబట్టి, దాన్నే కోరి, అది పొందలేకపోతినే అని దుఃఖిస్తున్నారు. (ఇది నంబిళ్ళై సూక్తి) కోకిలలు పరభృతాలు, భాగవతానుగ్రహాభివర్ధితులైన ఆచార్యులు, అని స్వాపదేశార్థం.

3. స్వార్థలాభే అర్థిభావాత్ :- విదియినాల్ పెడైమణక్కుమ్ మెన్నడైయ అన్నంగాళ్ (పా3) భాగ్యవశాన ఆడ పక్షితో కూడియున్న మందగమనం గల హంసలారా! అని కొన్ని హంసలను పిలిచింది. 'విధీయతే అనేన ఇతి విధిః' శాస్త్రంచే విధింపబడినదే 'విధి'. తానుగాంధర్వ విధిగా పరిణయమాడడం వల్ల కష్టపడుతున్నది. శాస్త్రోక్తంగా వివాహమాడిన హంస(ల)కు కష్టాలు లేవు అని భావన. విధి అంటె అదృష్టం. కోరినవారిని కలియడమే పుణ్యఫలం, ఎడబాయడమే పాపఫలం. రాజ్యాన్నీ, భార్యనూ పోగొట్టుకొన్న శ్రీరామునికి, అట్టి స్థితిలోనే ఉన్న సుగ్రీవుడు సహాయుడుగా లభించడం వల్ల అతని సహాయాన్ని పొందడానికి ముందు అతని కోరికలు తీర్చవలసిన అవసరం రామునికి ఏర్పడింది. అలా కాక, విరహిణినైన నాకు తోడ్పడవలసిన మీరు (హంసలు) అవిరహితులై ఉండడం నా భాగ్యం అని భావించింది.

మతియినాల్ కుఱళ్ మాణాయ్ ఉలకుఇరందకళ్వర్క్కు-బుద్ధి బలంతో పొట్టి అయిన బ్రహ్మచారి యై లోకాలను యాచించిన, (బలిని) వంచించిన చతురుని వద్దకు పొండి అన్నది. వామనుని బుద్ధి బలమేమి? బలిని, ఔదార్యగుణమున్న వాడు కాబట్టి ఎదుటికి పోయి చంపరాదు. ఊరకుందామంటే, దీనివల్ల నష్టపడిన ఇంద్రుణ్ణి రక్షించేదెట్లు? అందుకని, ముందే ఆలోచించి 'గోసహస్రప్రదాతారమ్' అన్నట్లు ఎప్పుడూ ఇవ్వడమే అలవాటైన తన చేతిని క్రింద చేసి బలిని యాచించి రాజ్యాన్ని ఇంద్రునికిచ్చిన చతురుడు వామనుడు. విశ్వరూపాన్ని కంటితో చూడడం దుష్కరం.

ఆ రూపాన్నే చిన్నదిగా చేసి ఆనందింపచేయడానికే (కుఱళ్) పొట్టిఅయ్యాడు. కొందరు భిక్ష పెడ్తారు. మరికొందరు కసరికొడ్తారు. ఈ రెండింటిని సమానంగానే స్వీకరించే యాచనలో ప్రావీణ్యాన్ని పొందియున్న బ్రహ్మచారి రూపాన్ని స్వీకరించాడు.

కళ్వర్క్కు-అనే పదానికి 'తిరుమాలై యాండాన్' వంచకునికి అనే అర్థం చెప్పారట. భగవద్రామానుజులవారు మాత్రం 'ఒకటి మనస్సులో పెట్టుకొని మరొకటి చేసేవానికి' అని అర్థం చెప్పారట. ఈనాడు ఆళ్వార్నాయకిని వశపరచుకోవాలే అని మనస్సులో పెట్టుకొని దాని కోసమే ఆనాడు బలిని వంచించాడని ఈమె అభిప్రాయం.

'మతియిలేన్ వల్వినైయేమాళాదో' మతిలేని నేను చేసిన పాపాలు మాత్రమేనా అనుభవిస్తే కాని నశింపనివి? అని మీరు నా మాటగా అడుగండి స్వామిని.

ఒక గోపిక కృష్ణుని దగ్గరికి అందరివలె తాను పోతుంటే పెద్దలు విధించిన ఆంక్షవల్ల పోలేక, ఇంట్లో ఉండింది. స్వామి రూపగుణాలను ధ్యానించడం వల్ల కలిగిన ఆహ్లాదంచేత ఆమె పుణ్యకర్మను అనుభవించింది. స్వామిని సాక్షాత్తుగా పొందకపోతిననే ఆవేదనతో పాపకర్మనూ అనుభవించింది. పాపపుణ్యాలు రెండూ మిగలకుండా పోయినందువల్ల ఆమెకి ముక్తి లభించింది. ఈమె పేరు చింతయంతి. ఒక్కరాత్రి మానసికానుభవం వల్ల చింతయంతికి కర్మలన్నీ నశిస్తే, జీవిత కాలమంతా మారి మారి సుఖదుఃఖాలనుభవిస్తున్న ఈ 'దీర్ఘచింతయంతి' (ఆళ్వారుపేరు)కి పాపాలెందుకు నశింపరాదో? అడుగండి స్వామిని అని హంసలను కోరింది ఆళ్వారు నాయకి.

ఒరుత్తిమతి యెల్లాం ఉళ్కలంగిమయంగుమాలెన్నీరే- ఒక్కతె, బుద్ధి అంతా లోలోన కలత నొంది మోహించి ఉన్నది అని చెప్పండి. పేరు చెప్పక 'ఒక్కతె'అంటే అక్కడ ఆడ లేడి గిలగిలకొట్టుకొంటున్నదని చెప్పితే దాన్ని కొట్టిన వేటకాడు గుర్తించినట్లే, బాధ పెట్టిన స్వామి గుర్తిస్తాడులే. ఆమె బుద్ధి, మీరిచ్చిన జ్ఞానం చేతనూ, మరెంతో కలత జెందింది. లంకలో సీతమ్మ ఓర్చుకొన్నట్లు, ఈమె ఓర్చుకోలేకపోతుంది. మీ దర్శనం కాకపోతే బ్రతుకడమే అసంభవమని చెప్పితే మీకే లాభం అన్నది నాయకి.

4. తిమ్యన్మేఘస్వభావాత్ :- ఎన్నీర్మైకణ్ణుఇరంగి ఇదుతకాదు ఎన్నాద ఎన్నీలముగిల్ వణ్ణర్క్కు ఎన్శొల్లి యాన్శొల్లుకేనో- (4పా) నా స్వభావాన్ని జూచి జాలిపడి ఇది తగదని అనుకోని నా నీలమేఘశ్యామునికి ఏమని నేను (సందేశం) చెప్పబోదు నో!

ఆళ్వారునాయకి స్వభావం పరమసుకుమారమైనది. కణ్ఠిరంగి-ఎడబాసి దూరంగా ఉన్న స్వామి ఈమె విరహావస్థను విని జాలిపడాలి కాని చూచి జాలిపడడమెట్లు కుదురుతుంది? అని ఒక పండితుడు అడిగాడు. దీనికి శ్రీపరాశర భట్టరు సమాధానం-ఈ చూడడం ఇప్పటి సంగతి కాదు. వారు కలిసి ఉన్నప్పుడు నాయకుని స్పర్శ అందిన నాయకిశరీరభాగం వికసించడం, అందనిభాగం వాడిపోవడం - బిగికౌగిలిసడలినంతనే నాయకి వెలవెలబోయిన స్థితిని స్వామి ఎన్నో సార్లు చూచాడు. అప్పుడే ఈమెను విడిచిపోవడం తగదు అనుకొన్నట్లు ఉన్న నావాడు నన్ను విడిచిపోయి "ఆమెకు ఈ దుఃఖానుభవం తగదు" అనుకోనట్టి స్వామికి ఏమనివార్త పంపాలి? అని నాయకి భావం అన్నారట.

ఆ నీలమేఘవర్ణుడు తన శరీరంలో ఉన్న వశీకరణశక్తి చే తన సౌందర్యాన్ని చూపి నన్నులొంగదీసుకోవడంలోని ఆంతర్యం, తాను దూరంగా ఉండి నాకు అధిక దుఃఖం కలిగించాలనుకోవడమే. ఆ నీలమేఘం(మనస్సు)లో ఈనాడు చల్లదనమే లేదు. ఉంటే నన్ను విడిచి, రాకుండా ఉంటాడా? నాకు పరితాపముంది కాని ఆయన కేతాపమూ లేనందు వల్ల, వైవర్ణ్యమూ లేదు. నీలమేఘశ్యాముడుగానే ఉన్నాడు. అట్టి జాలిలేని వానికేమని సందేశం పంపాలి? అని నిరాశ చెందినదే అయినా, భగవద్విషయ చాపల్యంతో మరేదో చెప్పాలనుకొన్నది నాయకి.

బలరామకృష్ణులు మధురానగరానికి వెళ్ళారు. కొంతకాలానికి తిరిగివచ్చిన బలరామునితో, తమపై జాలి లేక తమ సంగతినే మరిచియున్నాడన్న కోపం గల గోపికలు 'అథవాకింతదాలాపైః' - ఆ కృష్ణునికి సంబంధించిన మాటలు మాకెందుకు? అన్నారు. స్వామి నిర్లక్ష్యం వల్ల వారికి నిరాశ కల్గినా, తమ చాపల్యం చేత ఆశ పొడిమి, వెంటనే వారు "అప్యసౌమాతరంద్రష్టుం సకృదప్యాగమిష్యతి"? ఎప్పుడైనా తన తల్లిని చూడడానికి శ్రీకృష్ణుడిక్కడికి వస్తాడా? అని అడిగారు. ఆ గోపికల వంటిదే ఈమె ఆశ. ఏమో చెప్పతలచింది నాయకి.

ఇలాంటి స్థితిలో ఉన్న ఆళ్వారు సన్నిధిలో కొన్ని క్రౌంచ పక్షులు 'మాకేమైనాపని చెప్పండి' అన్నట్లు ఎగురుతుండగా వాటిని పిలిచింది. 'నల్ నీర్మైఇని అవర్కణ్తంగాదు ఎన్నుఒరువాయ్శొల్(ఆళ్వారునాయకి యొక్క) మంచి ప్రాణం (వారి) ఆమె వద్ద ఇక నిల్వదని ఒక మాట చెప్పండి స్వామికి- ఆమె ప్రాణం ఆమెలో ఇక ఉండదు. స్వామీ! ఆ ప్రాణం నీలోనే చేరిపోతుంది. నీ కోసమే ప్రాణాన్ని నిలబెట్టుకొంటున్నది అనే భావంతో అన్నది.

సీతమ్మ"కుశలీయదికాకుత్థఃకింనుసాగరమేఖలామ్। మహీందహతికోపేన యుగాంతా గ్నిరివోత్థితః" కకుత్థ్సవంశంలో పుట్టిన శ్రీరాముడు సముద్ర పరివేష్టిత భూమినే ప్రళయాగ్నిలాగా ఉబికిన కోపంతో దహింపగలవాడైనా (తనకు కల్గిన పరాభవాన్ని తీర్చక) ఊరకున్నాడు. పోనీ. ఆయన కుశలమే కదా! అన్న మాటలో రాముణ్ని అధిక్షేపిస్తున్నట్లు భావించాడు హనుమంతుడు. ఒక విధంగా సీతమ్మను చూచాడు హనుమ. 'రాముణ్ని అధిక్షేపించడమెందుకు? ఆయన విశ్లేష దశలో నీవు కూడా ప్రాణాన్ని ధరించి ఉండడం వల్ల నీ ప్రేమమాత్రం నిజంగా పూర్ణమైనదని ఎలా చెప్పగల'మన్న భావం, హనుమంతుని చూపులో ఉన్నట్లుతలచింది సీతమ్మ. అప్పుడు 'నచాస్యమాతా నపితాచనాన్యఃస్నేహాద్వి శిష్టోస్తిమయా సమోవా! తావత్వహం దూత! జిజీవిషేయం యావత్ ప్రవృత్తిం శ్రుణు యాఃప్రియస్య" మాతా పిత్రాదుల యందు చూపవలసిన ప్రేమనంతటినీ ఏకముఖంగా నాపై నిల్పిన రాముడు (సముద్రాన్ని దాటి, రాక్షసులను చంపి నా దగ్గరికి వచ్చేసరికి నేను మరణిస్తే ఆయన ప్రాణంతో ఉండడు. అందుకోసమే) పంపే వార్తను వినేవరకు జీవించి ఉన్నాను అని సీతమ్మ హనుమంతునితో చెప్పింది. అలాగే ఆళ్వారునాయకి ప్రాణం స్వామి కోసమే నిలిచి ఉంది. "వాచాధర్మమనాప్నుహి" - మాట చేత ధర్మాన్ని పాటించండి. నల్‌నీలమకన్రిల్‌కాళ్- మంచి నీలవర్ణక్రౌంచ పక్షులారా! 'నల్‌కీరో' చెప్పుతారా? చెప్పరా? (నల్‌కుతల్= ఇచ్చుట, ఇక్కడ మాటకు ప్రాధాన్యం)

5. జగదుపజనన స్థాపనాతిప్రియత్వాత్ :- నల్‌కి తాన్‌కాత్తుఅళిక్కుమ్ పాళిల్ ఏళుమ్ (5పా) ఆదరించి తానే కాపాడి రక్షిస్తాడు ఏడు లోకాలను. ఎవ్వరూ ప్రార్థింపకయే స్వామికీ విభూతిపైన ఉన్న వ్యామోహం చేత, తన కొరకే అన్నట్లు ఆదరంతో రక్షిస్తాడు. భూమి క్రింద ఏడు లోకాలు-అధో లోకాలు ఉన్నాయి. భూమితో కలిపి మీది ఆరు లోకాలను ఏడు లోకాలు అన్నారు. నల్‌కి=సృష్టించి; కాత్తు= సంహారం-ప్రళయం చేసి; అని మరొక అర్థం. సమస్త చేతనాచేతనవస్తువులను, నామ రూప విభాగానర్హంగా, తానే తనలో ఉంచుకొంటాడు. కాబట్టి 'ప్రళయం' కూడా రక్షణయే. సృష్టించడం, రక్షించడం స్వామికి అతి ప్రియమైనవే. మల్‌కుమ్‌నీర్ పునల్ పడప్పై ఇరైతేర్ వణ్‌శిఱుకురుకే-ప్రవహించే నీటిపట్టున ఉన్న తోటలలో ఆహారాన్ని వెతుకుతున్న అందమైన చిన్నకోడీ-అని ఒక నీటి కోడి-పక్షి ని పిలిచింది ఆళ్వార్‌నాయకి. నీరు నిండుగా ప్రవహిస్తున్నది. పలు చేపలూ త్రుళ్ళిపడుతున్నాయి. అయినా ఈ పక్షి తాను తినడం లేదు. తన ఆడు పక్షికీ, పిల్లల నోటికీ సరిపడే ఎరనువెతుకుతున్నది.

ఇతరులకోసం అన్వేషించే ఔదార్యగుణం గల పక్షి నా దుఃస్థితిని జూచితాను తినడం లేదనుకొన్నది. లంకలో సీతాన్వేషణం కోసం తన శరీరాన్ని యోగ బలంతో పిల్లి అంత చేసుకొని హనుమంతుడు ప్రవేశించాడు. కాని ఈ చిన్న పక్షి నా కోసం దౌత్యానికి వెళ్ళడానికే అభ్యానంతో ఈ లాఘవాన్ని సంపాదించుకొన్నదని పిలిచింది. సందేశమిస్తున్నది.

విన్తైయేత్కేనల్కతాన్ అకాతు-ఈ పాపాత్మురాలిని మాత్రమే నా, ప్రేమ తాను చూపతగదు? తన కడుపులో, లేవన్నట్లు పడి ఉన్న, సమస్త వస్తువులను రక్షించి సృష్టి చేసిన స్వామి, సృష్టింపబడిన నన్ను నా పాపానికి వదలివేస్తాడా? సముద్రానికి ఏతాం వేసి కూడా నీటియెద్దడిని అనుభవించిన వారిలాగా, సర్వ రక్షకుణ్ని ఆశ్రయించి కూడా నా కోరికను తీర్చుకొనలేని నేనెంత పాపాత్మురాలినో కదా!

నారణనైకణ్ణక్కాల్- నారాయణుణ్ని చూస్తే - తన శరీరంలో స్వరూప, స్థితి గల జీవ సమూహాలన్నీ ప్రకారాలై తాను ప్రకారిగా ఉన్నవాడు నారాయణుడు. అట్టి బిరుదు గల నామంతో తిరిగేవాడు నీకు కనబడితే స్వామీ! మీకీ పేరు యోగరూఢికాదేమో! జిల్లేడు మొక్కకు మహా వృక్షమన్న పేరు స్థిరపడినట్లే మీకీ నారాయణ నామమేర్పడిందేమో! 'నార' శబ్దార్థమైన నిత్యవస్తువులలో చేరిన ఆళ్వార్‌నాయకిని రక్షింపకపోతే నీ నారాయణత్వానికీ, సర్వ రక్షణకూ కొరత-లోపం-ఏర్పడదా? అని నిలదీసి అడుగు. నీ పేరు చెడకుండా నడుచుకొనుమని చెప్పు- అన్నది నాయకి.

మల్కునీర్ కణ్ణేర్క్కు ఓర్‌వాశకమ్ కొణ్డుఅరుళాయే-ప్రవహించే కన్నీటితో నిండిన కన్నులు గల నాకు ఒక మాటను తీసుకొని వచ్చి కృప చేయుము, అని సందేశం.

ఈ నాయకికి కన్నీరు స్వరూపనిరూపక ధర్మమే. కంటి నీరు నిత్యమే. సంశ్లేషలో ఆనందాశ్రువులు, విశ్లేషలో శోకాశ్రువులు. అశ్రువులు తప్పవు. ఆ నీటి కోడికి కావలసినవి నీరు, చేపలే కదా! నాయకి కంట నీరున్నది. కన్నులు చేపలలాగా ఉన్నాయి. కాబట్టి నాయకి చెప్పే సందేశాన్ని తప్పక శ్రద్ధతో వింటున్నది.స్వామి ముఖారవింద సందర్శనాన్ని అపేక్షిస్తున్నదని చెప్పుమంటే ఆయన ఆగ్రహిస్తాడేమో! ఆయన నుంచి అనుకూలమైనదైనా, ప్రతికూలమైనదైనా సరే! ఒక్క మాట-సందేశం- తెచ్చి తనకు వినిపించుమని విధేయతతో పక్షిని అర్థించింది నాయకి.

జానకీదేవి తనదగ్గరికి దూతగా వచ్చిన కోతికి చేతులెత్తి నమస్కరించింది కదా! భగవద్విషయంలో ఉపకరించేవారెవరైతే నేమి? విధేయత విహితమే.

'నంబియేఱుతిరువుడైయాన్‌దాసర్' పరమపదానికి పోయాడు'అని ఒకరు వచ్చి చెప్పితే భట్టర్‌వారు 'పోయాడనుట తప్పు. 'వేంచేసినారు' అనవలె అన్నారట. ఆయన సాతానియైనా వైష్ణవుడే. కాబట్టి గౌరవంగా మాటాడాలి' అన్నారట. ఇక్కడ 'అరుళాయే' అని నాయకి పక్షితో గౌరవంగా -సంప్రదాయబద్ధంగా పలికింది కదా!

6. కారుణ్యాప్రత్యయోగాత్:- అరుళాతనీరరుళి-(6పా) ఆళివరివణ్ణే- గుండ్రని గీతలు గల తుమ్మెదా! అని తుమ్మెదను పిలిచి సందేశవార్తనంపుతున్నది నాయకి. ఆళి=సముద్రం, వరి=సౌందర్యం. శ్రమహరమైన సముద్రంలాగా అందమైన తుమ్మెదా! ఆళి=గాంభీర్యం. చెప్పిన పనికన్న ఎక్కువగా చేసే తుమ్మెదా! ఆళి= గుండ్రం; వరి= గీతలు, "నా నారాయణత్వమేమైనా సరె! ఆళ్వార్‌నాయకితో కలువడం నాకు ఇష్టం కాదు' అని స్వామి పలికినట్లు తోచిన నాయకి ఇప్పుడొక తుమ్మెదను కృపజూపుమని అర్థిస్తున్నది. అరుళాత నీర్ అరుళి-దయతలచని మీరు దయతలచి-కలతను చెందిన ఆళ్వార్లు ఇప్పుడు స్వామికి గల అసంఖ్యాక నామాలలో 'దయజూపనివాడు' అనే నామాన్ని జతపర్చారు. "అభయం సర్వభూతేభ్యోదదామ్యేతద్వ్రతంమమ" ఆనాడు శ్రీరాముడు 'నేను నీవాడను' అన్న సర్వభూతాలకు అభయమీయడమే వ్రతం' అన్నాడు. ఈనాడు గూడా స్వామి 'దయచూపను' అనే ఒక వ్రతాన్ని పూనుకొన్నట్లన్నది. దయయే స్వామికినిరూపకం. ఆయనకు కనికరింపవలసిన వారెందరో ఉన్నారు. ఎవరి దగ్గరికి పోయాడో! ఒకవేళ స్వామి కనబడితే నీవిలా చెప్పుమన్నది తుమ్మెదతో. నిర్దయులు కూడా దయను చూపదగిన దుఃస్థితిలో ఉన్నమా ఆళ్వార్ నాయకిని మీరు వచ్చి కాపాడవలెనని చెప్పుమన్నది. ఆనాడు నీవు సీతనెడబాసి తిప్పలు పడ్డావు. ఈనాడు నిన్ను ఎడబాసి పరాంకుశనాయకి కష్టాలు పడేవంతు వచ్చింది. అవర్ అవితువరామున్-ఆమె ప్రాణం (వాడి) పోకముందే, వచ్చి రక్షింపుము. అరుళాతిప్పుళ్- నీ వాహనమైన గరుత్మంతుడు దయానముద్రుడు (వెనుక, ఇదువరకు 'వెమ్‌శిఱైయపుళ్-క్రూరమైన రెక్కలున్న పక్షి-అని గరుత్మంతుణ్ని గూర్చి పలికిన నాయకి ఇప్పుడు 'దయా సముద్రుడు' అనడం అవకాశవాది లక్షణం.)

అవర్‌వీతిఒరునాళ్‌కడవీర్ ఎన్ను- ఆ గరుడుణ్ని. ఆళ్వార్ నాయకి వీధిలో ఒక్కసారి నడిపించుకొని వస్తే చాలునని చెప్పుమన్నది. స్వామి తనమీద కూర్చోగానే

పారవశ్యంతో కదలలేడు; దర్శనం కోరేవారు చూడగలిగే రీతిగా మెల్లగానూ నడిచేవాడు గరుత్మంతుడు. కాబట్టి స్వామి తన వాహనాన్ని తానే త్రోసి నడిపించుకొంటూ నాయకి ఉన్నవీధిలో చాలా సార్లు కాక, ఒక్కసారైనా వేంచేయుమని చెప్పు. విహారంగా వెళ్ళినప్పుడుగానీ, గజేంద్రునిలాంటి ఆశ్రితులను రక్షించడానికి పయనించేటప్పుడు గానీ, ఈ వీధిలోనుంచి వేంచేయుమని పలుకుమన్నది. నేను గవాక్షంలో నుంచి స్వామిని సేవించి బ్రతికిపోతాను. అరుళ్అళి అమ్మానై-దయగల చక్రమున్న స్వామిని- 'దయ' చక్రానికీ, స్వామికీ విశేషణం. " ఎన్నడియార్ అదుశెయ్యార్" నా దాసులు తప్పులు చేయరని సమర్థించేంతటిది స్వామి దయ. "స్వామిదివ్యమంగళ విగ్రహ సౌందర్యాన్ని చక్కగా సేవించండి' అని తన తేజస్సును స్వామి వైపు ప్రసరింపజేసేటంతటిది సుదర్శన చక్రం యొక్క దయ. ఆ పక్షి, ఈ చక్రం స్వామిని దర్శింపజేసే శక్తిగలవారు కాబట్టి దయగలవారు. ఇట్లైతే స్వామికి నారాయణత్వమూ పోదు. నేను దగ్గరికి పోకుండా దూరం నుంచే చూస్తాను కాబట్టి స్వామికి నన్ను కలిసిన దోషమూ అంటదు.

యాముమ్ ఎన్ పిళైత్తోమే-(మేం) నేను చేసిన తప్పేముంది? అనాడు 'సుగ్రీవంనాథమిచ్ఛతి' ఒక కోతిని ప్రభువుగా చేసి ఆశ్రయించాడు స్వామి. తానే దూతను పంపాడు కదా! ఈనాడు ఆ బాధలన్నీ నావంతు అయినాయి. తాను చేయవలసిన పనులనే నేను చేస్తుంటే తానే మాత్రం స్పందించడాయె. తప్పు ఆయనదా? నాదా? అడుగమని చెప్పింది నాయకి. ఈ భావాన్నే సీతమ్మ హనుమంతునితో అనాడన్నది. "జీవన్తీంమాం యధారామః సంభావయతి కీర్తిమాన్। తత్త్వయాహనుమాన్। వాచ్యః వాచాధర్మమవాప్నుహి॥ " ఓ హనుమ! జీవించియున్న నన్ను కీర్తిమంతుడైన రాముడు ఆదరించే రీతిగా నీ మాటలను ఉపయోగించుమన్నట్లే, ఈ నాయకి కూడా 'నేను చావకముందే నన్ను రక్షింపుమని, పక్షులు చెప్పే మాటలే ప్రాణ రక్షణం చేస్తాయని వాటిని పంపుతుంది "ఏను బ్రతికియుండ నినకులవరుడున, న్నుంచితముగ గారవించుటెట్లు, గలుగునట్లు నీవుకడువడి ధర్మంబు, విక్రమంబు దెలియ విన్నవింపు" (గోపీనాథ వేంకటనాథరామాయణం)

7. అనుగతమహిషీ సన్నిధేః :- ఎన్నిళైకోప్పతుపోల-(7పా)ఈ దశకానికి ఈ పాశురమే హృదయం. పరాంకుశనాయకి ఇందు చిలుకను దూతగా పంపుచున్నది. ఎన్బుఇళైకోప్పతుపోల, ప్పనివాడై ఈర్కిన్ల-నా ఎముకల(ను తొలివేసివాటి)లో దారము

గ్రుచ్చినట్లు, చల్లనిగాలి చీల్చుతున్నది. చల్లగాలి విరహులకు ఎంత బాధాకరమో! సీతావిరహంలో ఉన్న రామచంద్రుడు లక్ష్మణునితో ఇలా అన్నాడు.

"పద్మసౌగంధికవహం శివం శోకవినాశనమ్!ధన్యాలక్ష్మణసేవంతే పంపోపవనమారుతమ్॥" తామర కొలనులలో చొచ్చి ఆ పూవుల సుగంధాన్ని మోసుకొనివచ్చే ఈ చల్లగాలి పరిశుద్ధమైనది. కొందరిదేహాలను స్పర్శించి వస్తే, దాని చల్లదనం కొంత తగ్గేది. శుద్ధమైనందువల్ల నిండు చల్లదనంతో పరిమళాన్ని మిళితం చేసుకొని నేరుగా వచ్చి శరీరాన్ని తాకుతున్నది. ఇదే ప్రమాదకరం. ఇది విరహులకు విషపుగాలికదా! శోకవినాశనమైన గాలి. జీవించినంతకాలం విరహబాధ ఉంటుంది. ఈ శీతలవాయువు ప్రాణాలనే తీసి శోకమే లేకుండా చేస్తుంది. పత్నీ సంశ్లేషసుఖాన్ని అనుభవించే భాగ్యవంతులు, ఇట్టి గాలి తాకడమే అదృష్టంగా తలచి అనుభవిస్తారు. బడబాగ్నిలాగా బాధను కలిగించే ఈ చల్లగాలి పంపానది యొక్క పరిసర ప్రాంతాలలో ఉన్న ఉద్యానవనాల మీదుగా రావడం వల్ల అధిక బాధాకరమైనది. ఆనాడు శ్రీరాముడు విలపించినట్లే ఆళ్వార్‌నాయకి కూడా చల్లని గాలి వీస్తుండడం వల్ల దుఃఖిస్తున్నది. విరహబాధ భరించలేక దూతలను పంపుతున్నది.

ఎన్ పిళ్ళైయే నినైన్దరుళి,అరుళాత తిరుమాలార్కు- నా పాపాలనే తలచి, కనికరించని శ్రియఃపతికి-ఋణదాత, ఋణగ్రస్తుని పాత బాకీలను గుర్తు చేసుకొన్నట్లు, స్వామి నా అపరాధాలనే స్మరిస్తూ దూరమవుతున్నారు. ఆశ్రితుల దోషాలను తెలుసుకోలేనివాడనే అర్థం గల 'అవిజ్ఞాత' అనే నామముస్వామికి ఉంది. వేయి విధాలా ఆశ్రితుల గుణాలను గ్రహించేవాడనే 'సహస్రాంశు' పనీ పేరుంది కదా! కానీ గుణాలను కాదు, దోషాలనే గ్రహిస్తున్నందువల్ల 'సహస్రాంశు' నామం సార్థకమైనట్లున్నది.

మారుతి సీతమ్మను, తనను కష్టపెట్టిన రాక్షస స్త్రీలను చిత్రవధ చేయడానికి, అనుమతినిమ్మన్నాడు. ఆ దయామయి అంగీకరించక "నకశ్చిన్నాపరాధ్యతి?" తప్పుచేయనివాడెవ్వడు? క్షమించడమే ఉత్తముని లక్షణమని మారుతిని వారించింది. తిరుమాలార్-అట్టి 'లక్ష్మీవల్లభుడు' తన క్షమాగుణాలను మరచి, నా అపరాధాలనే స్మరించి నన్ను కాపాడడం లేదు, అన్నది నాయకి. తిరుమాలార్-లక్ష్మియందు వ్యామోహం కలవాడు, అమె మాత్రం నన్ను కాపాడలేదనే కినుకతో విముఖంగానే ఉంది అని భావిస్తున్నది.

అరుళాత తిరుమాలార్క్కు-నిగ్రహమెరుగని అనుగ్రహమయియైన లక్ష్మికి వల్లభుడైన స్వామి నాపట్ల నిగ్రహం తగునా? అని నంజీయర్ వివరించారట. లక్ష్మితో భోగాలందు నిమగ్నుడైనందువల్లనే కదా నన్ను కటాక్షింపకున్నాడని కురుకేశ్వరులు భావించారట.

తిరువడియిన్ తకవినుక్కు ఎన్ పిళైత్తాళ్ ఎన్ను- స్వామి దయకు చాలినంతగా (నాయకి) ఏమి అపరాధం చేసింది? అడుగు. ఆశ్రితుల అపరాధాలే స్వామిదయకు ఆహారం. ఆ దయకు కడుపు నిండే రీతిగా తప్పులు చేయలేదని భావం.

మయితిష్ఠతి దుష్కృతాంప్రధానే, మితదోషానితరాన్విచిన్వతీత్వమ్। అపరాధశతైరపూర్ణకుక్షిః, కమలాకాంతదయే। కథంభవిత్రీ?" శ్రీదేశికుల వారి దయాశతకం.

ఓ లక్ష్మీనాథదయాదేవీ! అపరాధాలను అమితంగా (నిండుగా) చేసిన నేను ఉండగా, నన్ను విడిచి, అపరాధాలను మితంగా (కొద్దిగా) చేసినవారిని వెతుకుతున్న నీవు, ఆ కొద్ది దోషాల చేత కడుపునిండని దానివై ఎట్లు బ్రతుకుతావు? అని శ్లోకార్థం.

సర్వేశ్వరుడు సాపరాధినియైన నన్ను శిక్షింపక తప్పదని భావిస్తే, ఆయన క్షమాగుణాన్ని గుర్తుచేయుమన్నది నాయకి. ఎవరిచేతనైనంతపనిని వారు చేయడం ధర్మం. నేను చేతనైనన్ని పాపాలను చేశాను.స్వామి, తనకు చేతనయినంతగా క్షమించాలి కదా!

తకవు=కృప. స్వామికృపనుప్రసరింపజేయడానికి ప్రయత్నించినప్పుడు ఈ కృపను అడ్డగించే ప్రయత్నం (ప్రదక్షిణం, నమస్కారం ఇత్యాది) ఏమైన చేసిందా ఈ నాయకి? అని అడుగు. స్వామి కృపకు మన ప్రయత్నం, పానకంలో పుడకలాంటిదై, రసభంగం చేస్తుంది కాని ఉపాయంగా సహాయపడదు కదా!

తకవు = క్షమ. స్వామిదయను అడ్డగించే పాపం చేతనుని స్వప్రవృత్తి. తాను క్షమింపరానంత తప్పు ఆమె దగ్గరలేదే! తప్పులు చేసినా క్షమింపగల స్వామివి కదా! మౌనంగా ఎందుకున్నావు? అని ప్రశ్నించు అని మరొక అర్థం.

వర్షాకాలం దాటినా, సుగ్రీవుడే ప్రయత్నం చేయనందువల్ల, లక్ష్మణుడు ఆగ్రహంతో కిష్కింధకు వచ్చి ధనుష్టంకారం చేశాడు. సుగ్రీవుడు మొదట కనబడితే, లక్ష్మణునికి కోపమెక్కువ అవుతుందని భావించిన తార, ఆ ధ్వని విని తానే ముందుకు వచ్చి ఇలా మాటాడింది.

"కింకోపమూలంమనుజేంద్రపుత్ర! కస్తే నసంతిష్ఠతి వాఙ్ని దేశే"? రామలక్ష్మణుల క్షమాగుణం తారకు తెలుసు. ఓ రాజకుమారా! నీ కోపానికి కారణమేమి? మీ తండ్రి అరవై వేల సంవత్సరాలు ఆశ్రితుల దోషాలను క్షమించి ప్రజలను పాలించాడే! ఆయన పుత్రుడవైన నీవు ఈ పాటి అపరాధాలను క్షమించడం నీ కర్తవ్యం కాదా? నీ ఆజ్ఞకు బద్ధుడై ఎవడు ఉండలేదు? 'హాయిగా రాజ్యభోగాలను నీ భార్యలతో పాటు ఆనందంగా అనుభవించు, వానకాలం దాటిన తర్వాత సీతాన్వేషణ సాగించుమని సుగ్రీవునితో మీరే అన్నారు కదా! మేము చాపల్యం గల జంతువులం కాబట్టి మీరు చెప్పిన పనినే చేస్తున్నాం. ఇప్పుడు మమ్ములను చంపడమేనా మీ క్షమాగుణం? అని అడిగింది. అలాగే, ఆళ్వారునాయకి నీ క్షమాగుణానికి శక్యం కానంత తప్పు ఏమి చేసింది? అని స్వామిని అడుగుమని చిలుకను పంపుతున్నది.

చిలుక స్వరూపాన్ని చూచేసరికి స్వామి స్వరూప స్వభావాలు స్మృతికి వచ్చి ఆళ్వారునాయకికి విశ్లేషవ్యసనం అధికమయింది. 'ఎన్బుఇళైక్కుమ్ ఇళంకిలియే'- నా ఎముకలను చెక్కుతున్న ఓ చిలుకా! ఒరువాయ్‌శొల్-ఒక్కమాట చెప్పు. స్వామిని మరువనీయక సర్వదాస్మరింప చేస్తూ విరహతాపాన్ని పెంచుతున్న ఓ చిలుకా! అని ఒక అర్థం.

ఎన్‌పిళైక్కుమ్ ఇళంకిళియే-స్వామికి నా అవస్థను తెలియజేసే ఒక్కమాట (నాయకి ఏమి తప్పు చేసినది? అనే మాట) చెప్పితే తప్పేముంది, లేత చిలుకా! అని మరొక అర్థం. యాన్‌వళర్తనీయలైయే-నా పెంపుడు(చిలుక)నీవే కదా! ఈ మాత్రం ఉపకరింపకూడదా? ప్రేమించిన స్వామి నన్ను వేపుతున్నాడు. నేను పెంచుకొన్న నీవూ బాధిస్తున్నావు. నా తలవ్రాత ఇట్టిది. నన్ను బాధించడమే నా (సంబంధం ఉన్న) వారి పని కదా! ఈ విధంగా లేత చిలుకకు చెప్పి స్వామి దగ్గరికి దాన్ని పంపుతున్నది ఆళ్వారు నాయకి.

8. సంగదైర్ఘ్యాత్ :- నీయలైయేశిఱుపూవాయ్- (8పా) నీవేకాదా! ఓ చిన్న(పూవై) బెగ్గురు పక్షీ! ఆళ్వారు నాయకికి ఈ పూవై పక్షితో దీర్ఘ సంగముంది. సంశ్లేషదశలోవారు మాటాడుకుంటే, హాయిగా విని పలుకుచుండేది. ఇపుడు నాయకి విచారంతో ఉంటే, ఆ పక్షి కూడా దిగులుతో ఉంది. ఇదివరకు నీవు వెళ్ళి స్వామికి నా స్థితిని చెప్పుమంటే పెడమొగం పెట్టితివి. ఇప్పుడు నీవల్లనే కదా నా స్థితి విషమించింది. నీవు చెప్పితే స్వామి రాకపోవునా? అంటున్నది నాయకి ఆపక్షితో.'నెడుమాలార్కు ఎన్‌తూతాయ్'-

సహజంగా వ్యామోహశీలియైన స్వామికి నేను సిగ్గు విడిచి, పెంచిన పక్షిపిల్లనే దూతగా పంపే పరిస్థితిలో ఉన్నాను. వ్యామోహం కలిగియున్న ఇద్దరి నడుమ, దౌత్యం తప్పక ఫలవంతమవుతుంది కదా! సందేహమెందుకు? 'నోయ్ ఎనతు నువల్ ఎన్న, నువలాదే ఇరుండు ఒళిన్దాయ్'- నా విరహ బాధను (నీవు దూతగా పోయి) చెప్పుమంటే, చెప్పకయే ఉండిపోయావు. ఆనాడు భరతుడు రామవనవాసాన్ని భరించలేక అన్నగారిని అయోధ్యకు వచ్చి కిరీటాన్ని ధరించుమని ప్రార్థించడానికి చిత్రకూటానికి వెళ్ళాడు. వాల్మీకి భరతుని స్థితిని వర్ణించాడు.

"జటిలం చీరవసనం ప్రాంజలిం పతితంభువి! దదర్శరామో దుర్దర్శం యుగాన్తే భాస్కరం యథా॥" అందగాడు, అలంకరించుకొంటే అతి సుందరుడుగా ఉండే భరతుడు, జడలను, నారబట్టలను కట్టుకొన్నాడు. ఒకప్పుడు ఒడిలో కూర్చుండ బెట్టుకొని ఆదరింపబడిన భరతుడీనాడు భూమి మీద సాగిల పడి నమస్కరిస్తున్నాడు. పరితప్తుడైన భరతుని దుఃఖాన్ని రాముడే చూడలేనంత దీనుడుగా, ప్రళయకాల భాస్కరుని లాగా ఎవ్వరికినీ చూడరాని వాడుగా ఉన్నాడు భరతుడు-అమితబాధను అనుభవించిన భరతునికైనా, ఆ బాధ తీరడానికి పదునాల్గు సంవత్సరాల అవధి ఉండింది. కానీ, నా (ఆళ్వారు) బాధతీరేదెప్పుడో?ఓ పక్షీ! నీవు ఉపేక్షించడంవల్లనే ఏమయిందో చూడు.

'శాయలొడు మణిమామై తళర్న్దేన్' శరీరచ్ఛాయ (కాంతి)తో పాటు సౌందర్యాన్ని పోగొట్టుకొన్నాను. గతజలసేతుబంధనమెందుకు? ఒక్కమాట విను. ఇనిఉనతు నాయలగిల్ ఇన్ అడిశిల్ వైప్పారైనాడాయ్'- ఇక నీ నోటియందు మధురమైన ఆహారాన్ని పెట్టేవారిని వెదుక్కో. ఇప్పుడు స్వామి వచ్చినా, పొగడదగ్గిన నా శరీర లావణ్యమూ తిరిగిరాదు. నేను జీవించే నమ్మకమూ లేదు. కాబట్టి, నిన్ను రక్షించేవారినెవరినైనా నీవు వెతుక్కొమ్మని ఆళ్వార్ నాయకి పూవై పక్షితో చెప్పింది.

భగవద్రామానుజులమేనమామగారైన పెరియ తిరుమలైనంబి (శ్రీశైలపూర్ణులు) 'వెణ్ణెయ్ కొడుమ్ పిళ్ళై (నవనీత నటుడు) అనే శ్రీకృష్ణవిగ్రహానికి నిత్యం తిరువారాధన సమర్పించేవారు. తమ అంతిమదశలో లేవలేక, ఒక్కసారి మందిరంలోకి పోయి దైవాన్ని దర్శించి (శాయలోడు-నాడాయే)అనే ఈ పాశురోత్తరార్థాన్ని అనుసంధించారట. తమ ఆరాధ్య దైవానికి అరగింపును సమర్పించే వారెవరుందురో? అని ఆర్తిని నివేదించుకొన్నారు. మహాత్ముల స్థితి ఇట్టిది.

9. నానా బంధైః:- నాడాతమలర్‌నాడి- (9పా) ఊడు అడు పనివాడాయ్-(స్వామికీ నాయకికి) మధ్య తిరుగుతున్న ఓ చల్లగాలీ! జీవించలేనని పలుకుతున్న నాయకికి చల్లగాలి తగిలింది. రెండవసారి సుగ్రీవుడు వాలిని యుద్ధానికి పిలిచినప్పుడు ఆ పిలుపును విన్న తార 'ధైర్యంతో పిలిచే సుగ్రీవునికి వెనుక పెద్దవారి సహాయం ఉండవచ్చు'నని ఊహించినట్లే, ఈ గాలికి ఇంత బాధను నాకు కలిగించే శక్తినిచ్చి సర్వేశ్వరుడే ఇక్కడికి పంపినాడన్న వింత ఆలోచన నాయకికి వచ్చింది. నాడాత మలర్‌నాడినాడోఱుమ్‌నారణన్‌తన్- వెతుకడానికి అశక్యమైన పుష్పాలను వెతకితెచ్చి ప్రతిదినం శ్రీమన్నారాయణుని యొక్క 'వాడాతమలర్‌అడిక్కీళ్ వైక్కవేవకుక్కిన్లు- వాడిపోని కాంతి తరుగని పూవులాంటి శ్రీపాదాలయందు చేర్చడానికే సృష్టింపబడినవి. ఆత్మనే పుష్పమన్నారు కొందరు. నంజీయర్ మాత్రం పూవులు వెదకి తేవడమే పరమార్థమన్నారు. 'సృష్టస్త్వం వనవాసాయ'-వనవాసం (రాముని సేవ) కోసమే నీవు సృష్టింపబడినావు' అని సుమిత్ర లక్ష్మణునితో అన్నది. "విచాత్రాదేహసంపత్తి రీశ్వరాయనివేదితుమ్। పూర్వమేవకృతా బ్రహ్మన్ హస్తపాదాదిసంయుతా॥" అన్నట్లు భగవంతుణ్ని ఆరాధించడానికే మనకు కరణ కళేబరాలు ఏర్పడినాయి. జన్మలక్ష్యం భగవదారాధనం. "అహింసాప్రథమంపుష్పం, పుష్పమింద్రియనిగ్రహః। సర్వభూతదయా పుష్పం, క్షమా పుష్పం విశేషతః। జ్ఞాన పుష్పం, తపఃపుష్పం, ధ్యాన పుష్పం తథైవచ। సత్యమష్ట విధం పుష్పం, విష్ణోఃప్రీతి కరంభవేత్"॥ ఈ ఎనిమిది పూవులను భగవంతునికి సమర్పించాలి.

అధికారి హింసిస్తుంటే ఆ బాధ నుంచి తప్పించుకోవడానికి దొంగ, తాను దొంగిలించిన ద్రవ్యాన్ని ప్రభువుకు అప్పగించినట్లే, ఆళ్వార్‌నాయకి కూడా గాలికి ఇలా చెప్పుతున్నది. ఓ గాలీ! నేను అపహరించిన ఆత్మ ద్రవ్యాన్ని స్వామికే అర్పిస్తాను అని చెప్పు సుమా! 'వీడు ఆడి వీత్తిరుత్తల్ వినైయత్తదు ఎన్‌శేయవతో- (వీడు =విశ్లేషం; అడుకై= మునిగియుండడం) ఈ తీరని భగవద్విరహమనే దౌర్భాగ్యం ఏమి చేస్తుందో, ఏల దావురించెనో? (ఉరైత్తు= అడుగుము ఊడు =లోపల) స్వామికి అంతరంగికుడవైన ఓ గాలి! ఆ నాయకి చేసే కైంకర్యం మాకు అక్కఱలేదని స్వామి అంటే, నీవు తిరిగి వచ్చి ఈరాయ్ ఎనతు ఉడల్- ఈ నా శరీరాన్ని రెండుగా చీల్చివేతువు గాని, పోయిరమ్మన్నది నాయకి.

10 సురక్షావహితతమతయా:- ఉడల్‌అళిప్పిఱప్పువీడు ఉయిర్- (10పా) ఈ

పాశురంలో వ్యాఖ్యాతలు, మనస్సును దూతగా పంపిందని కొందరన్నారు; స్వామిని చేరే దాకా నన్ను వదలకే మనసా! అని తన మనస్సును ప్రార్థిస్తున్నదన్నారు మరికొందరు. **ఆళిమడ, నెంజే**- గంభీరమైన, విధేయమైన మనసా! **ఉడల్ ఆళిపిఱప్పు వీరు ఉయిర్ముతలాముత్తుమాయ్**- శరీరమందు చక్రాకారంగా మళ్ళీ మళ్ళీ జన్మ మోక్షాలు కలిగిన ఆత్మలు, మొదలైన సమస్త వస్తువులను సృజించడం కోసం; 'కడల్ ఆళినీర్ తోత్తి అతన్ ఉళ్ళేకణ్వళరుమ్, అడల్ ఆళిఅమ్మానై కండక్కాల్, ఇదుశొల్లి'- గంభీరజలంగల సముద్రాన్ని సృజించి, అందునిద్రించియున్న, యుద్ధోన్ముఖమై (ధ్వనిస్తున్న) చక్రం గల స్వామిని (నీవు) దర్శిస్తే, ఇది చెప్పి అని అర్థం. " బహుస్యామ్" నేననేకంగా అవుతాను- అని స్వామి మొదట సంకల్పించాడు. " అపఏవససర్జాదౌ" - మొదట నీటిని సృజించాడు. ఆ సముద్రంలో నిద్రించాడు. సృజించిన వస్తువులకు విరోధులైన వారిని నశింపచేయడానికి చేతిలో చక్రాయుధాన్ని ధరించియే పవళించాడు.

సంసారం ఒక చక్రం. ఆత్మ ఈ చక్రమందు పరిభ్రమిస్తున్నది. ఆత్మకు గమ్యం మోక్షం. దీనికంతటికి నిర్వాహకుడు సుదర్శనాయుధుడు. ఆయన సముద్రాన్ని సృజించి, అందు తాను శయనించి ఉంటాడు. ఆయన దర్శనం దుర్లభం అని సారార్థం.

అప్పుడు సీతమ్మ లంకలో ఉంది. దుర్భరవిరహతాపదూయమానుడైన శ్రీరాముడిలా అన్నాడు. "వాహి వాతయతఃకాంతాతాం స్పృష్ట్వామామపిస్పృశ! త్వయిమేగాత్రసంస్పర్శః, చంద్రే దృష్టి సమాగమః॥" ఓ గాలీ! సీత ఉన్నచోట నీవు వీచి, ఆమెను తాకి నన్ను కూడా తాకుము. నీయందే మా రెండు దేహాలు ఒండొంటిని స్పృశించుకుంటాయి. మా చూపులు చంద్రుని లోనే కలుసుకుంటాయి. అలాగే స్వామిని చూచినవారిని చూడడమే తప్ప ప్రత్యక్షంగా చూచే భాగ్యం నాకు లేదు, అని మనస్సుతో నాయకి చెప్పింది. అదృష్టవశాన స్వామి దర్శనమైతే, ఈ నా ఆవేదనను స్వామికి నివేదింపుమని మనస్సును అర్థించింది. (ఆళి= సుడితిరుగు) వినైయోమ్ ఒన్రుఆమ్ ఆళవుమ్ విడల్- లోలోపల మథనపడే అమాయకమైన మనసా! పాపాత్మ(లమైన మనం) రాలనైన నేను, ఆయనతో సాయుజ్యం పొందేవరకు నన్ను విడువకుమా! అని తన మనస్సును వేడుకొన్నది ఆళ్వార్నాయకి.

(11పా) చరాచరాత్మకమైన సకలలోకాలకు నాథుడైన శ్రియఃపతిని గూర్చి పొలాలు చుట్టు కల్గిన కురుకాపురికి నిర్వాహకుడైన నమ్మాళ్వార్లు ప్రేమతో

అనుగ్రహించిన సహస్రగీతిలోని ఈ పదింటిని అనుసంధించిన వారికి పరమపదమందు నిత్య కైంకర్య సంపదలభిస్తుందని ఫలశ్రుతి. (స్వాపదేశార్థశ్లోకం ప్రత్యేకంగా ఉంది ఈదశకానికి) ఒక స్త్రీకి పురుషునిపైన ఉండే వ్యామోహం "కామమష్ట గుణం భవేత్' అన్నట్లు పురుషునికున్న వ్యామోహం కంటె ఎనిమిది రెట్లు ఎక్కువగా ఉంటుంది. లౌకిక శృంగారానికి స్తనాద్యవయవాలు సాధనాలైనట్లే, భగవదనుభూతికి పరభక్తి, పరజ్ఞాన పరమభక్తులు సాధనాలు. జీవుడు రక్షింపబడేవాడు. స్వామి రక్షించేవాడు. భగవంతుడు చేయవలసిన పనిని ఆయనకే గుర్తుచేసే ప్రయత్నాన్ని జీవాత్మ చేయరాదు. ఇది మర్యాదను అతిక్రమించడమే. దోషాలుంటే క్షమించడమే మహాగుణం. మొదట ఆళ్వార్‌నాయకితో సంశ్లేషించిన స్వామి ఆమె దోషాలను చూచి వీడిపోయాడు. ఈ నాల్గవ తిరువాయ్‌మొళిలో భగవానుని క్షమాగుణాన్ని ఆయనకే గుర్తు చేయవలసిందని పక్షులను దూతలుగా పంపుతున్న విషయముంది. మూలమంత్రంలోని నారాయణశబ్దం చేత తెల్పబడే స్వరూపగుణ విభూతులు గల భగవంతుణ్ని చేరి జీవాత్మ మర్యాదోల్లంఘనం చేసే ప్రజ్ఞావస్థయే ఇక్కడ నాయకీ వాక్కు.

పూర్వం ఒక పండితంమన్యుడు ఈ ప్రబంధం విరక్తులకూ, వైదికులకూ సేవింపదగినదే అని శ్రద్ధతో వినడానికి పూనుకొన్నాడు. ఈ దశకంలోని శృంగార ఘట్టాలను వినగానే అయ్యో దీనిలో అన్నీ కాముక వ్యాపారాలే కనిపిస్తున్నాయి. కాబట్టి ఈ ప్రబంధాన్ని సేవింపతగదని లేచిపోయాడట. ఇది వేదాంతోక్తమైన భగవత్కామమని ఈ దరిద్రుడు తెలుసుకోలేకపోయెనో" అని శ్రీ నంబిళ్ళై చాలా పరితపించారట. వాస్తవంగా వీతరాగులు కూడా భగవత్కామాన్ని స్వీకరింపవలసిందే. "ఆర్తోవాయదివాదృప్తః పరేషాంశరణా గతః అరిఃప్రాణాన్ పరిత్యజ్యరక్షితవ్యః కృతాత్మనా॥" విభీషణశరణాగతిసందర్భంలో శ్రీరాముడు తక్షణ రక్షణను కోరే అర్తుడు కానీ, కాలాంతర రక్షణను సహింపగల్గే దృప్తుడు కానీ, అతడు శత్రువైనా తన ప్రాణాలను కూడా లక్ష్యపెట్టక రక్షింపవలెనని పల్కినాడు కదా! అట్టి దయాంతరంగుణ్ని ఆశ్రయించిన ఆళ్వార్‌నాయకిని వచ్చి రక్షించక దుఃఖాన్ని కలిగించాడు స్వామి. అజీర్తి గల రోగికి చికిత్స చేసే వైద్యుడు తర్వాత కడుపునిండా భోజనం చేయించాలని మొదట భోజనాన్ని మానిపించినట్లే. ఇక ముందు కలుగబోయే భగవదనుభవాన్ని అనుభవించి, ఉక్కిరి బిక్కిరి అయిపోకుండా విరహదుఃఖాన్ని అనుభవింపచేశాడు పరమాత్ముడు. భగవద్విషయాన్ని పొందడానికి సహాయపడేవారు ఆచార్యులు.

4-అ శ్లో॥ సధ్రీభవ్యాన్ సువాచః సుచరిత సుభగాన్ కృష్ణసారూప్యసామ్యాన్
స్వాహారోదారశీలాంస్తనుధృతభగవల్లక్ష్మణోబాల్యగుప్తాన్।
ఛాత్రస్వచ్ఛందవృత్తీనభిగతశిశిరానన్తరంగోక్తియోగ్యా
నాచార్యాన్ కృష్ణలబ్ధౌశరణమవృణుత ప్రేయసీదూతనీత్యా॥ - 15

స్వాపదేశార్థతాత్పర్య వివరణలు :- 1. సధ్రీభవ్యాన్= సుందరమైన నమ్రత కల వా(టి)రిని: మొదటి **పాశురం**లో, శిశువు తల్లి అవయవాలలో నేరుగా స్తనాలయందే నోరు పెట్టే రీతిగా, ఆళ్వార్ నాయకి పక్షి అవయవాలలో శీఘ్రగమన సాధనాలైన రెక్కలమీద కన్ను పెట్టింది. పక్షులు అనే ఆచార్యులు రెండు రెక్కలు అనే జ్ఞాన కర్మలతో ఆకాశం అనే పరమాత్మ పట్ల విహరించే విషయమిది. రెక్కల సౌందర్యం వర్ణితం. భగవద్వైభవాన్ని తెలుసుకొన్న వారు ఆచార్యులు. కాబట్టి ఆ జ్ఞానం వారి ప్రవర్తనలో ద్యోతకమవుతుంది. 'నీయుమ్నిన్శేవలుమ్' - నీవూ, నీ పెనిమిటి - అంటే, ఆచార్యులలాగా ఆచార్య పత్ని కూడా ఆరాధ్యురాలే అని సూచితం. అనుగ్రహశీలురు ఆచార్యులు. "పంపాతీరే హనుమతా సంగతా వానరేణహ!" పంపాతీరంలో రామునికి హనుమంతుని దర్శనం వలె, నాయకికి నారపక్షిదర్శనం ఓదార్పునిచ్చింది. కొంగ తెల్లదనం సాత్వికతను తెల్పుతుంది కదా!

రెండవ పాశురం. సువాచః = శోభనమైనవాక్కులు కలవా(టి)రిని :- పంచమస్వరంతో మధురంగా కలకూజితం చేసే కోకిలలను నాయకిదూతలుగా పంపింది. పరభృతాలవలె భాగవతోత్తముల అభిమానంతోనూ, ఆదరంతోనూ వృద్ధిని పొందే ఆచార్యులు,'సంశ్రవే మధురం వాక్యమ్' అన్నట్లు శ్రీ సూక్తులను మృదుమధురమైన భాషలో (వసంతర్తువున) కాల విశేషాన్ని బట్టి ప్రవచిస్తారుకదా!

సుచరిత సుభగాన్:- (3పా) మందగమనం చేత అందమైన వా(టి)రిని - హంసలునీరక్షీర విభాగం చేసే సామర్థ్యం కలవి. ఆచార్యులు సదాచారనిష్ఠులు. సారాసార వివేకజ్ఞులు, సారతమమైన - స్వీకరింపతగిన తత్త్వాన్ని గ్రహించేవారు. కరచరణ సరోజాలతో శోభించే శ్రీమన్నారాయణుని దివ్యమంగళ విగ్రహతేజుస్సు అనే సరస్సులో విహరిస్తుంటారుకదా!

కృష్ణసారూప్యసామ్యాన్:- (4పా) కృష్ణునివలె సమానమైన స్వరూప స్వభావాలు కలవా(టి)రిని. నీల వర్ణ పక్షులు క్రౌంచపక్షులు, వాటిని చూడగానే నాయకికినీల

మేఘశ్యాముడు స్మృతికి వచ్చాడు. నీల పురంగు చల్లని, సౌమ్య గుణానికి సంకేతం. భగవంతుని స్వరూపంలాగా ఉండే ఆచార్యుల శరీరం సౌందర్యం కూడా ఆదరింపతగినది. ఆచార్యుల పురుషకారం వల్ల శ్రియ:పతి అనుగ్రహిస్తాడు.

స్వాహారోదారశీలాన్:-(5పా) జలాశయంలో (ఇరైతేర్) ఆహారాన్ని వెతుకుతున్న ఉదారశీలంకలవా(టి)రిని -ఇదొకనీటికోడి. "పళ్ళచ్చెఱువిల్కయలు గళ్ప్పళన క్కళని యదనుట్పోయ్, పుళ్ళుపిళ్ళైళక్కిరైతేడుమ్" (పెరియతిరుమొళి 5-2-1) చెఱువులో చేపలు బాగా ఉండగా పులుగు (పక్షి) ఆహారాన్ని వెతుకడమెందుకు? అని ఒకడు ఆక్షేపిస్తే శ్రీ పరాశరభట్టరన్నారట-పిళ్ళైక్కు - అని; ఆహారాన్ని వెతుకడం తనకోసం కాదండి. పిల్లల చిన్ననోటికి సరిపడే ఆహారం దొరికే దాకా తాను చలింపని శుద్ధస్వభావం కలది. భగవద్వైభవాన్ని సంపూర్ణంగా తెలుసుకొని, తమకు ధారకపోషక భోగ్యవస్తువులన్నీ భగవానుడే అని కాలయాపన చేస్తూ, తమను ఆశ్రయించిన వారికి అనుగుణమైన విషయాలను బోధించే ఉదార (ఎదుటి వ్యక్తి నుంచి ఏమీ ఆశించని) శీలం కలవారు ఆచార్యులు.

తను ధృతభగవల్లక్ష్మణ: (6పా) ఆళివరివణ్ణు -దేహమందు ధరించిసభగంతుని చిహ్నాలు గల(వి) వారు - షట్పదాలు - తుమ్మెదలు శరీరమందు గుండ్రని గీతలు - చక్రం, శంఖం గుర్తులను ధరించి షాడ్గుణ్యరూపమైన భగవంతుని గుణాలను అనుసంధిస్తూ షట్పదం-ద్వయమంత్రం గలవారై తుమ్మెదవలె మంచి రూపవంతులై, కృపావంతులై, గంభీరస్వభావమూ స్వరమూ వ్యంజింపగలవారు. ఆచార్యులు (షట్పదులు=ద్వయమంత్రాన్ని అనుసంధించేవారు. ఆరుకాళ్ళుకలవి తుమ్మెదలు)

బాల్య గుప్తాన్ :-(7పా) ఇళంకిళియే - చిలుక పిల్లవలె మృదువైన మాట, ఆర్జవం, శరీరమందలి పసిమి, ముఖమందలి రాగం (ఎరుపు, అనురాగం) కలవారు ఆచార్యులు తాము మహాజ్ఞానులే అయినా తమ మహిమను గోప్యంగా ఉంచుకొని తమ ఆచార్యులు చెప్పగా విన్న అర్థం గలమాటలనే తప్ప తక్కిన అర్థాలను చెప్పని ఆప్తత్వం కలవారు ఆచార్యులు -(జ్ఞానమున్నా బాలభావన)

ఛాత్రస్వచ్ఛంద వృత్తీన్:-(8పా) తమ ఆడ పక్షులకు స్వాధీనమైన పనులు చేసేవి (పూవై) బెగ్గురు పక్షులు - శిష్యులకు స్వాధీనమైన వ్యాపారం కలవారు, అంటే, అర్తి గలజీవులను భగవంతునితో చేర్చే జీవనం -దేహయాత్ర-కలవారు

ఆచార్యులు. లౌకిక జ్ఞానాన్ని కానీ, వైదికజ్ఞానాన్ని కానీ మోక్షంపొందడానికి తగిన అధ్యాత్మికజ్ఞానాన్నికానీ ఎవరు ఉపదేశిస్తారోవారికి మనం మొదట నమస్కరించాలి. ఇది శిష్యలక్షణం. భగవల్లాభాన్ని అనుగ్రహించడం ఆచార్యలక్షణం.

ఈ అర్థం గల శ్లోకమిది.

"లౌకికం, వైదికం వాపితథాధ్యాత్మికమేవవా!
ఆదదీతయతోజ్ఞానం తంపూర్వమభివాదయేత్॥" (మనుస్మృతి)

అభిగతశిశిరాన్ : (9పా) ఊడాడుపనివాడాయ్- ఆశ్రితులకు శీతలస్వభావుడు. లోకోజ్జీవన హేతుభూతమైన గాలికి స్వాపదేశార్థం ఆచార్యుడే. గాలి జగత్ప్రాణం. ఆచార్యుడు జగదాధారుడు. తాపాన్ని తొలగించే ధర్మపరాయణులు ఉభయులు. ఆచార్య సంబంధం మాత్రమే ఆశ్రితులకు సత్తాధారకం. ఇతరుల స్పర్శ వీరి సత్తకు బాధకం. గాలిని - ఆచార్యుని ఆశ్రయించి సంచరించేవారికి (భవ) రోగం ఉండదు. "భీషాస్మాద్వాతఃపవతే" (ఉపనిషత్తు) భగవదాజ్ఞనుతలదాల్చివీచేది గాలి. భగవదాజ్ఞలైన శ్రుతి స్మృతులను (శ్రుతిఃస్మృతిర్మమైవాజ్ఞా) అనుసరించి ప్రవర్తించేవాడు ఆచార్యుడు.

అంతరంగోక్తియోగ్యాన్ : (10పా) అంతరంగమైన అంటే మనోమయవాక్కులకు తగిన వారు ఆచార్యులు.ఇట్టి ఆచార్యులను భగవానుని ప్రేయసి (ప్రియురాలు) అయిన ఆళ్వార్ నాయకి శ్రీకృష్ణభగవానుని కైంకర్యాన్ని మనస్సున ఆశించి, దూతన్యాయం చేత రక్షకంగా ప్రార్థించెనని ఈ నాల్గవ దశకంలో స్వాపదేశార్థాన్ని ప్రబోధించారు.

పంచమదశకం :

5. క్షుద్రా హ్వానా భిముఖ్యాన్నిజ మహిమతిరస్కారకా ర్చాప్రియత్వాత్
సర్వత్రా ప్యంఘ్రిదానా త్సవిధశయన తస్స్వాంఘ్రిసక్తైక రస్యాత్!
గోపాద్యాప్తే రశేషేక్షణ విషయతయా భక్తవస్తు ప్రసక్తే:
శ్లిష్యన్నాశవ్యపోహత్త దహితశమనా త్ప్రాహనాథం సశీలమ్॥

అర్థం :- క్షుద్ర+ఆహ్వాన+అభిముఖ్యాత్ = క్షుద్రమైనపేరుచే పిలిచే టప్పుడు అభిముఖుడవడం వల్ల; నిజమహిమ తిరస్కారక అర్చాప్రియత్వాత్ = తనమాహాత్మ్యమును తిరస్కరించే ఆరాధన మందు ప్రీతి కలవాడవడం వల్ల; సర్వత్ర+అపి = సమస్త ప్రదేశాలయందునూ; అంఘ్రిదానాత్-శ్రీపాదాలను ఇవ్వడం వల్ల; సవిధశయనతః = సమీపాన పవ్వళించి ఉండడం వల్ల; స్వాంఘ్రిసక్త + ఏకరస్యాత్ = తనపాదాలను ఆశ్రయించిన వారి యందు ప్రీతివల్ల; గోప+ఆద్య+ఆప్తేః = గొల్లలయందు అవతరించడం వల్ల; అశేష+ఈక్షణ విషయతయా = అందరి కన్నులకు కనబడడంవల్ల; భక్త వస్తు ప్రసక్తే ః = ఆశ్రితుల వస్తువునందు ఆశవల్ల; శ్లిష్యత్+నాశవ్యపోహాత్ = భక్తుల యొక్క నాశనాన్ని పోగొట్టడం వల్ల; తత్+అహిత శమనాత్ = ఆయాశ్రితులకు అనిష్టాన్ని తొలగించడం వల్ల; నాథం = సర్వేశ్వరుణ్ని; సశీలం = సౌశీల్యంకల వాడుగా; ప్రాహ = ప్రవచిస్తున్నాడు.

తా॥ ఐదవ దశకంలోని మొదటి పాశురమందు ఆశ్రితులు నీచమైన నామంచేతపిలుస్తున్నప్పుడు సర్వేశ్వరుడు అభిముఖుడవుతాడు (2) తనచేత సృష్టింపబడిన బ్రహ్మాది దేవతల చేత చేయబడిన ఆరాధన తన మహత్వాన్ని పోగొట్టేదైనప్పటికీ దాని యందు ప్రీతికలవాడు (3) ఉచ్చనీచ విభాగం లేకుండా అంతట తన పాదారవిందాలను ఉంచి పరిశుద్ధంగా చేసినవాడు (4) జగత్సృష్టికోసం సమీపమైన క్షీరార్ణవమందుశయనించి ఉన్నాడు (5) ఆశ్రితులందు ప్రీతికలవాడు (6) గొల్ల కులమందవతరించి వారితో కలిసి ఉండేవాడు (7) అందరికీ చూడ తగిన వాడు, అని (8) ఆశ్రితులు సంతోషించిన ద్రవ్యాన్ని అపేక్షించే స్వభావంకలవాడు (9) ఆశ్రితుల విరోధులను పోగొట్టువాడు (10) ఆశ్రితుల అనిష్టాన్ని తొలగిస్తాడనీనమ్మాళ్వార్లు సర్వేశ్వరుని సౌశీల్యగుణాన్ని ప్రవచించారు.

ప్రకా-వ్యాఖ్య : - సర్వేశ్వరుడు తన సౌశీల్యాన్ని చూపి ఆళ్వార్ల సంకోచాన్ని తీర్చడం ఈ దశకానికి ప్రమేయం.

మొదటి తి.వామొళిలో భగవంతుని పరత్వాన్ని, రెండవ తి.వా. మొళిలో భజనీయతను, 3 తి.వా. మొళిలో సౌలభ్యాన్ని, 4 తి.వా.మొళిలో సులభుడైన స్వామి అపరాధసహుడుకాబట్టి ఫలప్రాప్తి తప్పదని ఆళ్వార్లు వివరించారు. ఈ 5 తి.వా. మొళిలో తమ నికృష్టతనూ, స్వామి యొక్క ఉత్కృష్టతనూ తలచుకొని, స్వామిని చేరడానికి అనర్హులమని భావించి, దూరమైన వారిని కూడా వదలక తన దరిని చేర్చుకొనే సౌశీల్యవంతుడు సర్వేశ్వరుడని తెల్పుతున్నారు.

"మహతో మందై: సహ నీరంధ్రేణ సంశ్లేష: సౌశీల్యమ్" అధికులు అల్పులతో అభేద ప్రతి పత్తితో కలిసి ఉండడమే సౌశీల్యం. "మయర్వఱ మతినలమ్" సర్వేశ్వరుడు ఆళ్వార్లకు అజ్ఞానంపోయేవిధంగా అనుగ్రహింపబడిన జ్ఞానం ఒకప్పుడు తన ప్రభావాన్ని చూపుతుంది. మరొకప్పుడు దానిస్థానాన్ని భక్తి-ప్రేమ-ఆక్రమిస్తుంది. నాల్గవ దశకంలోవాయకి కలతచెంది, దూతలను పంపడం ప్రేమకార్యం స్వామి యొక్క గొప్పతనం అవగతమైనందువల్ల తాను ఆయన సన్నిధికి చేరితే ఆయనవైభవానికి కళంకమేర్పడునేమో అని ఇప్పుడు ఆవేదన పొందడం జ్ఞానకార్యం.

అర్తిని గమనించినస్వామి 'అయ్యో! ఇంతకాలం ఆళ్వార్లను బాధించితిని కదా!' అనే చింతతో ఆనాడు జారిపోతున్న ఉత్తరీయాన్నికానీ, ముఖారవిందాన్ని కప్పివేస్తున్న ముంగురులనుకానీ సవరించుకొనకుండా (అరైకులైయ తలైకులైయ, గా) గజేంద్రుణ్ని రక్షించడానికి వేంచేసిన విధంగా, ఆళ్వారును అనుగ్రహించడానికి వేంచేసినాడు. ఆళ్వారుస్వామిని దర్శించారు. స్వామి ఎంతగొప్పవాడో, తానెంత అల్పుడో తెలిసింది. ఒక ధర్మాత్ముడు నిర్మించిన ప్రపను - చలివేంద్రాన్ని- పాడుచేసినట్లు, నిత్యసూరులు అనుభవించే పరాత్పరుని వద్దకు తాను చేరి ఆయనకు ఒక దోషాన్ని కలిగింపరాదు, అనుకొన్నారు ఆళ్వార్లు; తన వినాశం వల్ల స్వామికి అతిశయంకల్గితేచాలు, నని ఆళ్వార్లు దూరమవడానికే నిశ్చయించుకొన్నారు.

రామావతార సమాప్తి విషయమై చర్చించడానికి వచ్చిన యమధర్మరాజు కోరినవిధంగా శ్రీ రాముడు ఏకాంత సంభాషణ సమయాన ఎవరిని లోపలికి పంపినా మరణశిక్ష తప్పదని ఆజ్ఞాపించి ద్వారం వద్ద లక్ష్మణస్వామిని కాపలా ఉంచాడు.

అంతలో దుర్వాస మహర్షి వచ్చిలోపలికి అనుమతించుమన్నాడు. లేకపోతే రామ ప్రభువునూ, ఆయన వంశస్థులందరినీ శపిస్తానని హుంకరించాడు. లక్ష్మణుడు భయపడి, ఆమహర్షిని నిషేధించి - అడ్డుకొని - రామచంద్రునికి అవద్యం కలిగించడంకంటే, తాను నశించడమే మేలు అని నిశ్చయించుకొని, నియమాన్ని ఉల్లంఘించి, దుర్వాస మహర్షిని లోనికి పంపాడు. తర్వాత "యది ప్రీతిర్మహారాజ! యద్యనుగ్రాహ్యతామయి! జహిమాంనిర్విశంకస్త్వం ప్రతిజ్ఞామనుపాలయ॥ నా మీద నీకు ప్రేమ ఉండి నన్ను అనుగ్రహించాలనుకొంటే సందేహించక ప్రతిజ్ఞను నెరవేర్చి నన్ను వధించు - మని లక్ష్మణుడు అన్నను ప్రార్థించాడు.

అలాగే గర్భవతిగా ఉన్న సీతమ్మ, రామాజ్ఞచేత అడవిలో వదలిన లక్ష్మణునితో, దు:ఖిస్తూ", నఖల్వద్యైవ సౌమిత్రే!

జీవితం జాహ్నవీజలే! త్యజేయం రాఘవం వంశేభర్తుర్మాపరిహాస్యతి॥ లక్ష్మణా! నేను ఈ గంగా నదిలో మునిగి జీవితాన్ని సమాప్తి చేసుకోను. అలాచేసుకొంటే, (రామ) ప్రభువుకు రఘువంశమందు అవమానంకలుగుతుంది - అని పలికింది. 1. రామునివల్ల కీర్తిని పొందే రఘువంశం, ఒక స్త్రీ మరణించిందంటే అది అపకీర్తిని పొందుతుంది, 2. వంశమంటె గర్భం - కుక్షిస్థజంతువు. భర్త వంశాన్ని నేను ఆయనకు దూరంచేయరాదు. 3. దోషమున్నందువల్లనే మరణించిందని రాజవంశాన్ని అపహాస్యం చేస్తుందిలోకం. కాబట్టి ప్రాణత్యాగం చేయను - అన్నది సీతమ్మ. రాముణ్ని విడిచి ఉండడం దుర్భరంకాబట్టి సీతమ్మ బ్రతికి ఉండడమంటే మరణించడమని అర్థమే. ఆ సీతా లక్ష్మణులవలె, ఆళ్వార్లు కూడా స్వామికి దూరమైనశించడమే మంచిదనుకొన్నారు. మంచినీటి చెరువును గండిపెట్టి ఎండగొట్టినట్లు లేదా ఊరివారు త్రాగే నీటి బావిలో ముండ్లకంపపడ వేసినట్లు అమృతంలో విషంకలిపినట్లు నిత్య సూరులు అనుభవించే పరమాత్మను అర్హతలేనితా మనుభవించడమే ఒక దోషమని ఆళ్వార్లు (మొదటి పాశురంలో) భావించారు.

1. క్షుద్రాహ్వానాభిముఖ్యాత్ :- (పా) వళ వేషులకిన్ ముతలాయవానోర్ ఇఱైయై సమృద్ధమైన ఏడులోకాలకూ (లీలా విభూతికీ) నిత్య సూరులకూ (నిత్యవిభూతికీ) నాయకుడైనస్వామిని క్రూరపాపాలుగలనేను అందరికి తెలిసేరీతిగా, వెణ్ణెయ్ తొడువుణ్ణ 'కళ్వా' ఎన్బన్ - 'వెన్నదొంగా' అన్నారు వళమ్-సమృద్ధమైన, ఉభయత్రవిశేషణం-

నిత్యసూరులకున్న సమృద్ధి భగవదనుభవకౌశలం-అస్త్రభూషణాధ్యాయం (వి.పు)లో జ్ఞాన ప్రకాశానికి ఆశ్రయమైన కౌస్తుభమణి రూపంగా జీవసమష్టి, శ్రీవత్స మనే పుట్టుమచ్చ రూపంగా ప్రకృతి, ప్రాకృతాలన్నీ స్వామియందే ఉన్నవన్నారు. దీన్నిబట్టి శ్రీవత్స కౌస్తుభ రూపాలైన నిత్య సూరులకు కూడా జగత్కారణత్వం చెప్పబడింది కానీ అఖిలజగదేక కారణభూతుడు శ్రీమన్నారాయణుడే అన్నారు నంబిళ్ళైగారు. (ఈడు)

స్వామిపైన ఉన్మస్తకమైన ప్రేమచేత వెన్నదొంగా! అన్నారు ఆళ్వార్లు 'అని ష్టావహం పాపమ్' ఇష్టం కానిదేదో అదిపాపంకాబట్టి ప్రేమించడం తగదని పశ్చాత్తాపం (జ్ఞానావిర్భావంచేత) కల్గింది. కళవు+ఎళు = దొంగతనం ప్రసిద్ధ మయ్యేరీతిగా; వెళు = ఇష్టం దొంగతనానికి ఇష్టపడి న నవనీత చోరా! అని అర్థం ఆదొంగను శిక్షించే అర్హతగల యశోదమ్మ పిలువదగినమాటను నేను పల్కినానని ఆళ్వార్ల ఆవేదన. తళవు ఏళ్ముషువల్ పిన్నైక్కాయ్ వల్ఆనాయర్ తలైవన్ ఆయ్ - మొల్ల పువ్వులను తలపించే ముసిముసి నవ్వులతో కూడిన నప్పిన్నపిరాట్టి (నీళాదేవి) కోసం మేటి (బలం గల) గొల్లలకు నాయకుడై - (దంతపంక్తియే మొల్లల తెలుపుమెరుపు) కృష్ణాశ్రయాః కృష్ణబలాః గొల్లలు కృష్ణుణ్ని ఆశ్రయించినందువల్ల బలవంతులు ఆగొల్లలకు నాయకుడు కృష్ణుడే.'నీళ' అనే పిల్లను తనకిచ్చి పెండ్లిచేయరేమో, అనే భయంతో కృష్ణుడు గొల్లతనమంతా తనయందు ప్రదర్శిస్తున్నాడట. అట్టి ప్రియురాలు పలుకవలసిన వెన్నదొంగా ! అనేమాటను తాను పలుకడం అపచారమని బాధపడుతున్నారు.

సీతమ్మను ఆశోక వనంలో చూచిన హనుమంతుడు 'తుల్యశీలవయోవృత్తాం, తుల్యాభిజన లక్షణామ్! రాఘువోర్హతివైదేహీంతం చేయమసితేక్షణా' అందం, చందం, ఈడు, నడవడికల్గిన సీతారాములు ఒకరికొకరు సమానంగా ఉన్నారనుకొని అనందించాడు. అలాగే నీళాకృష్ణులు జంటఉండగా, పెండ్లి చేయడానికి 'మోటు గొల్లలు' ఎద్దులనేడింటిని జయింపుమన్నారు. ఇళ ఏఱు ఏళుమ్ - లేత ఎద్దులనేడింటిని తళువియ ఎన్దాయ్, ఎన్బన్, నినైందునైందు - తడివిన నాస్వామీ! అన్నాను. - ఇలాగా తలచి శిథిలమయ్యాను.

ఎద్దులను శిక్షించి అనక 'తడవి' అనడంవల్ల - ప్రియురాలి వక్షోజస్పర్శను భావిస్తూ ఎద్దులను తడవి భజించాడు శ్రీకృష్ణుడు. నీళాదేవి పలుకవలసిన 'నాస్వామీ' అనే

మాటతో పిలిచాడు. నేను (శ్రియఃపతిని) శ్రీకృష్ణుణ్ని 'నవనీతాచోరా! వృషభసప్తకదమనా' అని పిలువడం నా(నోటి) వాక్పాపం, ఆ శబ్దాల అర్థాన్ని భావించడం మనస్సు చేసినపాపం. ఇలాగా తలచి తలచి, పిలిచి పిలిచి దేహాన్ని శిథిలపరచుకోవడం శారీరకపాపంకాయేన వాచా, మనసా' చేసిన పాపం క్రూరమైనదే కదా!

"పండేయున్ తొండాం పళవుయిరై యెన్నతెన్నుకొండానై కళ్వ నెన్ఱుకూఱాదేమండలత్తోర్ పుళ్ వాయ్ పిళన్ద పుయలే, ఉన్నెక్కచ్చి కళ్వావెన్హోరువదెన్ కొణ్ణు॥ " (నూత్తెట్టుతిరుపతి అన్దాది గ్రంథం) - అనాదిగా నీ సొత్తైన ఆత్మను 'నాది' అనుకొనే ఆత్మాపహారదోషదూషితులను దొంగలనక, స్వామీ! నిన్ను వెన్నదొంగా! అంటా రెందుకు? - అని శ్రీ పిళ్ళైప్పెరు మాళయ్యంగారు చెప్పిన పాశురం ఇక్కడ అనుసంధించుకోతగినదే, అన్నారు శ్రీ కాంచి ప్రతివాది భయంకరం అణ్ణంగరాచార్యస్వామివారు.

2. నిజమహిమ తిరస్కారకార్చాప్రియత్వాత్ :- (పా.2) నినైందు నైందు ఉళ్కరైన్ధు ఉరుగి - స్మరించి, శరీరంసడలి, మనసు కరిగి, ద్రవించి - శ్రీకృష్ణావతారమప్పుడు కంసుని ఆజ్ఞచే మధుర నుంచి బృందావనానికి అక్రూరుడు పయనిస్తున్న సమయంలో స్వామి తనమీద చూపే అనుగ్రహాన్నీ పలుకరింపునూ తలచుకొనిపరవశించిపోయాడు. అట్లే 'ఇమైయోర్ పలరుం మునివరుమ్' - దేవతలు , పలువురు ఋషులు, స్వామిని ధ్యానించి శిథిలమవడం సహజమే. అన్ని విషయాలలో వీరు మానవులకంటే అతీతులుగానే ఉంటారు. రజస్తమస్సులు ఆవరిస్తే అప్పుడు అహంకారం విజృంభించి, దానికనుగుణంగానే ప్రవర్తిస్తారు. వీరికి సత్త్వగుణం ఉద్బుద్ధమైతే, భగవద్గుణాను భవంవల్ల శిథిలమయ్యే స్థితి కూడా ఘనంగానే ఉంటుంది. "పునైందకణ్ణనీర్ శాన్దం పుకైయోడు ఏంది వణంగినాల్" కూర్చిన మాలను, నీ టిని, చందనాన్ని, ధూపంతో కూడ ధరించి సేవిస్తే - బ్రహ్మాదిదేవతలూ, సనకాదిఋషులూ మంచి పూలను తెచ్చి భక్తితో 'పూలదండలుకట్టి, అర్ఘ్యం, పాద్యం, చందనం ధూపంమొదలైన పదార్థాలను స్వామికి సమర్పిస్తే ఎంత బాగుంటాడో స్వామి అని భావిస్తూ పరవశిస్తారు.

'ఏంది' = ధరించి (సమర్పించి అనలేదు ఆళ్వార్లు) స్వామికి అర్పించే వస్తువు లిప్పి అని భావించి మురిసి పోతారు. స్వామికి సమర్పించక ముందే వాటిని తామే ధరిస్తారన్నారు. ఇట్టి బ్రహ్మాదులుస్వామి సన్నిధిలో దండం సమర్పించగానే స్వామి

మహత్త్వం కూడా మాసి పోతుందేమో అని భావించారు ఆళ్వార్లు. భగవానుడెంతటివాడో చెప్పుతున్నారు.

"మాయోనే ! = ఆశ్చర్యభూతుడా! నినైంద ఎల్లా పొరుళ్ కళుక్కుమ్ విత్తాయ్, ముతలిల్శితై యామే మనమ్ శెయ్ జ్ఞానత్తు ఉన్ పెరుమై మాశూణాదో - తలచబడినఅన్ని వస్తువులకు కారణభూతుడవై మార్పు లేకుండునట్లు మనస్సు చేసే సంకల్ప రూప జ్ఞానం గల నీ పేర్మి (గొప్ప తనం) మాసిపోదా? కళంకితంకాదా!"

లోకంలో ప్రతికార్యానికి ఉపాదానం, సహకారి, నిమిత్తం అనే మూడుకారణాలు ఉంటాయి. జగత్తు అనే కార్యానికి ఆమూడు కారణాలూ భగవానుడే. సమస్త పదార్థాలను సృష్టించినా, భగవానుని స్వరూప స్వభావాలలో మార్పు ఉండదు. లోకంలో కారణ పదార్థం నుంచి కార్య పదార్థం పుట్టినప్పుడు కారణపదార్థం మాసిపోతుంది. ఒక విత్తు నుంచి చెట్టుపుట్టి న తర్వాత ఆ విత్తనం ఉండదు కదా! విత్తనం ఉపాదానకారణం అట్లే మట్టి ఉపాదానకారణం. ఆ మట్టి ముద్దను కుండగా చేయడానికి చక్రం, దండం ఆనేవి సహకారికారణం. కుండను చేసే జ్ఞానమూ, ప్రయత్నమూ కలవాడు కుమ్మరి, నిమిత్తకారణం. లోకంలోని ఉపాదానకారణానికి సంకల్పించగలిగే శక్తి లేదు. కాబట్టి ఆకారణాలు వేర్వేరుగా ఉంటాయి.

సూక్ష్మచిదచిద్విశిష్టబ్రహ్మమే ఉపాదానకారణం. "బహుస్యామ్-ఆనేకంగా అవుతాను" అని సంకల్పించిన తర్వాత సృష్టి సాగిస్తాడు. కాబట్టి సంకల్పరూప జ్ఞానంతో కూడిన బ్రహ్మమే నిమిత్తకారణం. ఆళ్వార్లు కారణత్వం, అవికారత్వం అనే రెండు విశేషణాలను సంకల్పరూ పజ్ఞానానికి ప్రయోగించారు. అంటే భగవానుడు ఉపాదాన కారణమైనా కార్యము పుట్టిన (సృష్టించిన) తర్వాత కూడా మాసి పోక ఉండడమే ఆయన విశిష్టాద్భుతశక్తి. చీమలు సింహాన్ని గౌరవిస్తాయి. అంటే సింహానికి ఆగౌరవమే కాని గౌరవంకాదు. అట్లే బ్రహ్మాదులు స్వామిని ఆరాధిస్తారంటే ఆయన పేర్మికి లొచ్చేకాని హెచ్చుకాదు. భగవంతునిచే సృష్టింపబడిన మనం, ఆయన సృష్టిలోని పదార్థాలను ఆయనకు సమర్పించడమేమి? అని బ్రహ్మాదులు భగవంతుణ్ని ఆరాధించడానికి యత్నించి దూరమయ్యే అర్హత వారికి ఉంది. నాకు మాత్రం ఆదాధించడానికి, దూరమవడానికి కూడా అర్హత లేదు. అంటూ బ్రహ్మాదులకు కూడా

క్షుద్రులకు కలిగే భావాన్ని కలిగించడం వల్ల స్వామి మాయావి, ఆశ్చర్యకర చేష్టితాలు కలవాడని ఆళ్వార్లు భావించారు.

సర్వత్రా ప్యంఘ్రి దానాత్ :- (3 పా) మా యోనిగళాయ్ నడై కత్త వానోర్ పలరుం ముని వరుమ్ యోనిగళై - గొప్పజన్మ కలవారై దానికి తగిన నడవడి (సృష్టి చేసేపని) ని నేర్చిన దేవతలను, ఋషులను అనేకులైన కారణభూతులైన ప్రాణులను - నీ పడైఎన్ఱు, నిలై నాన్ముకనై పడైత్తవన్ - నీవు సృజింపుము అని, జ్ఞాన పూర్తిగల బ్రహ్మను సృజించినవాడు.

గొప్పజన్మలు కలిగి వాటికనుగుణమైన సృష్టిసంహారాదిక్రియలను నెరవేర్చే టప్పుడు కూడా స్వామిని అడిగితెలుసుకోకుండా సమర్థవంతంగా నిర్వహించగలిగే విలక్షణ జీవులను - సప్త ఋషులు, దశప్రజాపతులు, ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు, అష్టవసువులు - ఒక్కొక్క పేరుతో అనేకులుగా ఉన్న వారిని నీవు సృజింపుమని, "యోబ్రహ్మాణం విదధాతి పూర్వమ్" (శ్వేతా. ఉప) మొట్టమొదట సర్వేశ్వరుడు చతుర్ముఖ బ్రహ్మను సృజించాడు. తనకు అప్పగించిన పనిని స్వామి మళ్ళీ తెలిపే అవసరం లేకుండా స్వయంగా తెలుసుకొనే జ్ఞానపూర్తిగలవాడు నలువ. స్రష్టలకు స్రష్ట. శేయోన్ ఎల్లా అరివుక్కుమ్ - అందరిజ్ఞానానికీ అందని వాడు. పరబ్రహ్మనుంచి సాక్షాత్తు గా జన్మించి, ఆయనవల్లనే వేదాలను నేర్చుకొని, అజ్ఞానంచేతనే కొరతలేకుండా ఉన్న బ్రహ్మ యొక్క జ్ఞానానికిగానీ, ఎవరి జ్ఞానానికి కూడా అందనంతదూరస్థుడు. అంతేకాదు; తనక్కుమ్ తన్ తన్మై అరివరియాన్తన జ్ఞానానికే తాను అందనివాడు శ్రీమన్నారాయణుడు, అన్నారాళ్వార్లు. అందనివాడే అయినా, తానే అనుగ్రహించి తనమహిమను చూపిస్తే ఆశ్రితులు తనను తెలుసుకొంటారని సూచించడానికి - తిశైకళెల్లామ్ తిరువడియాల్ తాయోన్ - దిక్కులనన్నిటినీ శ్రీ పాదాలతో కొలిచినవాడు. ఉచ్చ నీచాలనూ గుణదోషాలనూ లెక్కించక, లోకాలనన్నీతన చరణకమలాలతో కొల్చిన త్రివిక్రముడు శీలగుణాన్ని ప్రదర్శించినవాడు. అందరికి చరణదానమొసగడానికి కారణం - ఎల్లా ఎవ్వుయిర్క్కుమ్ తాయోన్ - అన్ని వర్గాల, అన్ని ఆత్మలకు తల్లి వంటివాడు. కాబట్టి సకల ప్రాణులను తల్లి వలె ప్రేమించే, అందరి తలలను తన పాదాలతో ముద్దుగా స్పృశించాడుకదా!

తాన్ ఓర్ ఉరువనే - అట్టి భగవానుడు ఒక అద్వితీయమైన (సౌశీల్యం) స్వభావంకలవాడు ఏవరికీ అందనివాడు స్వామి అని మొదట పరత్వాన్ని భావించారు. తర్వాత శీల గుణాన్ని దర్శించి, ఆసక్తులయ్యారు. పరత్వాన్ని కని దరిచేరలేక,

సౌశీల్యాన్నికని దూరంకాలేక, మధ్యదశలో ఉండి ఆశ్చర్య చకితులవుతున్నారు ఆళ్వార్లు.

4. సవిధశయనతః : - (4పా) తాన్ ఓర్ ఉరువే తని విత్తుఆయ్ - తానొక్కడే అద్వితీయుమైన రూపంకలిగి కారణమైనవాడు. ఛాందోగ్యోపని షత్తులో "సదేవసౌమ్యేదమగ్ర ఆసీత్, ఏకమే వాద్వితీయం బ్రహ్మ" అనే వాక్యం కార్య రూపంగా ఉన్న ఈ జగత్తు సృష్టికి ముందు సత్తుగానే ఉంది. రెండవది లేక ఒకటి అయ్యేఉంది అని బోధిస్తున్నది. ఏకమేవ అన్నందువల్ల సూక్ష్మచిదచిద్విశిష్ట బ్రహ్మమే ఉపాదానకారణం అద్వితీయమ్ అన్నందువల్ల సంకల్పం తో కూడిన బ్రహ్మమే నిమిత్తకారణం. సదేవ అన్నందువల్ల స్థూలరూపమైన జగత్తు సూక్ష్మరూపాన్ని పొందడం చేత సూక్ష్మచిద చిద్విశిష్టమైన బ్రహ్మమయ్యే ఉంటుంది. జ్ఞాన శక్త్యాదులతో కూడి యున్న బ్రహ్మమే సహకారి కారణం. ఈవిధంగా సృష్టికిఅవసరమైన మూడుకారణాలూ బ్రహ్మమే అని ఈ శ్రుతి వాక్యం తెల్పుతున్నది. ఈ విషయాన్నే ఆళ్వార్లు. "తానోరురువేత నివిత్తాయ్" అని తెలిపారు.

ఒక వస్తువు మరొక వస్తువు కంటె వేరైనది అని తెలియాలి అంటే, ఆ వస్తువుకు తక్కిన వాటికంటె త్రివిధ భేదాలలో ఏదో ఒక భేదం ఉండాలి! 1. సజాతీయ భేదం :- ఒకేరకమైన ఆకారంకలిగి ఒకే జాతికి చెందిన రెండువస్తువులున్నపుడు వాటి మధ్యనున్న భేదం ఉదా :- చెట్లన్ని ఒకే జాతికి చెందినవైనా వాటినడుమ భేదం ఉంటుంది.

2. విజాతీయభేదం :- భిన్న జాతులకు చెందిన రెండు పదార్థాలలో గల భేదం.

ఉదా:- చెట్టుకూ, గుట్టకూ, మధ్యగలభేదం

3. స్వగత భేదం :- ఒక వస్తువులోనే వివిధ అంగాలు ఉండి, వాటిలో వాటికి భేదాలుండడం ఉదా :- ఒక చెట్టులోనే కొమ్మలు, రెమ్మలు, ఆకులు, కాడలు, కాయలు ఉండి, అవి ఒకదానికంటె ఒకటి వేరుగా కనిపిస్తాయి.

'సదేవ, ఏకమేవ, అద్వితీయమ్' అని ఒకే అర్థమిచ్చే మూడు పదాలను ఉపనిషత్తు ప్రయోగించడం వల్ల' పరమాత్మకు మూడు భేదాలు లేవు ' అని అద్వైతులు అర్థం చెప్పారు .

1. పరమాత్మవంటివాడు మరొక పరమాత్మ లేడు కాబట్టి సజాతీయ భేదం లేదు.
2. అఖండమైన ఆత్మయే పరమాత్మ కాబట్టి విజాతీయ భేదం లేదు.

3. పరమాత్మలో గుణాలు లేవు, ఆకారం లేదు కాబట్టి స్వగత భేదం లేదు, అని వీరి వాదం. ఈ వాదం ఉపనిషత్తులోని పూర్వాపరాలను దృష్టాంతాలను పరిశీలిస్తే సరిపడడంలేదు. భగవద్రామానుజులు ఈ వాక్యాన్ని ఉన్నదున్నట్లు వ్యాఖ్యానించారు. సత్తే ఉపాదానకారణం.

1. తాన్ విత్తు = తానే కారణం = సదేవ. 2. ఓర్ విత్తు = ఒకే కారణం = ఏకమేవ. (సహకారి కారణం) 3. తనివిత్తు = ఒంటరిదైన కారణం = అద్వితీయమ్ (నిమిత్త కారణం). ఉపనిషద్వాక్యాన్ని ఆళ్వార్లు సులభంగా తెలిపారుకదా !

తన్నిల్ మూవర్ ముదలాయ - తనయందు బ్రహ్మరుద్రేంద్రులు మొదలుగా - తన్నిల్ తన సంకల్పరరూపజ్ఞానం చేత సృష్టింపబడిన ముగ్గురు బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు - అని ఒక అర్థం.

తనతో కూడిన ముగ్గురు త్రిమూర్తులలో ఒకడై సర్వేశ్వరుడున్న స్థితిగా రెండవ అర్థం. ఇక్ష్వాకు వంశంలో తానుకూడా ఒకడే అన్నట్లు, యాదవ వంశంలో తాను కూడా ఒక యాదవుడే అన్నట్లు జన్మించాడు భగవానుడు, అలాగే బ్రహ్మవిష్ణుమహేశ్వరులనే ముగ్గురిని ఒకే కోవకు చెందిన వారినిగా తలచేటట్లు సర్వేశ్వరుడు వారిలో విష్ణువుగా అవతరించాడు. అవతరించిన తాను స్వస్వరూపంతో ఉండి రక్షించి బ్రహ్మరుద్రాదులకు అంతరాత్మయై సృష్టి సంహారాలను జరిపించడంవల్ల ముగ్గురిని ఒకే రూపంగా తెల్పుతున్నారు.

వానోర్ పలరుమ్ - దేవతలను, సనకాదిమునులను, స్థావర జంగమాదులను సృష్టించడానికి -తానోర్ పెరునీర్ తనున్న ళ్ళే తోత్తి అదనుళ్ కణ్వాళరుమ్ - తనయందే సృష్టికి ఉన్ముఖుడైన తాను మహాసముద్రాన్ని కల్పించి పవళించినవాడు. నిత్య సూరి నిర్వాహకుడు, వైకుంఠుడు, మహా మాయావియైన మాస్వామి శ్రియః పతియే. ఎన్నోనోములనునోచి బిడ్డలను కన్నతల్లి ఆ బిడ్డడు పెరిగి దూరమైతే ఓర్వలేనట్లే స్వామిని గుర్తించని నాకు ఆయనే స్వయంగా జ్ఞానాన్ని కృపచేసి తనతత్వాన్ని దర్శింపచేస్తే, అజ్ఞానం చేతనే నేను దూరమవుతా ననుకొంటున్నప్పుడు స్వామి సహించలేక తన సౌశీల్యాన్ని చూపి నన్ను వదలకుండా ఉన్నాడని ఆళ్వార్లు భావిస్తున్న పాశురం యొక్క తాత్పర్యాన్ని 'సవిధశయనతః' అనే ఒక్క పదప్రయోగంతో బోధించారుదేశికులు. సింధు లక్షణాన్ని బిందువులో చూపుతున్నట్లు ఒక్కొక్క పదంలో ఒక్కొక్క పాశురార్థం గర్భితం.

5. స్వాంఘ్రిసక్తైకరస్యాత్ :- (5పా) మానేయ్ నోక్కి మడవాళైలేడి కన్నులవంటి కన్నులు కలిగిన 2. లేడివంటి చూపులు గలిగిన ; 1.నమ్రత 2. లాఘవం గల శ్రీదేవిని వక్షస్థలమందు కలిగి ఉన్న లక్ష్మీవతీ! భగవదభిముఖులైన ఆళ్వార్లు "క్రియతామితిమాంవద" అన్నట్లు ఈ పని, ఆపనినీ చేయ మని ఆజ్ఞాపించి, తమచేత సేవ చేయించుకొమ్మని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నారు. లక్ష్మీదేవినేత్ర సౌందర్య వర్ణన వల్ల ఆమె పురుషకారం చేత (మాటను) జవదాటడు స్వామి తనను అనుగ్రహిస్తాడనే ధైర్యాన్ని ఇచ్చే ఉపాయమని ఒక అర్థం. లేడి చూపులుగల శ్రీదేవి ఒక్క ఓర చూపుచూస్తే వాన జల్లులో తడిసి చల్లబడిన స్వామి అనుగ్రహపరీవాహాన్ని ఆళ్వారుకు అందిస్తాడని రెండవ అర్థం(మడమ్ = విధేయం, లాఘవం) దేహగుణాలేకాక, ఆత్మ గుణాలూ కలిగి స్వామిని పరవశింప జేసేది శ్రీదేవి. విధేయత, పారతంత్ర్యం జీవలక్షణం కదా! 2. అన్యోన్య కటాక్షవీక్షణంలో స్వామి యొక్క ప్రణయ దృష్టి శ్రీదేవి స్థైర్యాన్ని హరించింది. కాబట్టి సారగ్రాహి యైన తుమ్మెద అనుభవించిన పుష్పంలాగా లఘుత్వం కలిగియున్నది శ్రీదేవి అని ద్వితీయార్థం.

లోకంలో కొందరి పేరు కు ముందు శ్రీ చేర్చడం 'నేతి బీరకాయ' లాంటిదే ఔపచారికమే. కాని, స్వామి సాక్షాత్తు శ్రీ కలవాడుకదా ! లక్ష్మీదేవి వక్షస్థలమందునివసించడమే 'మాధవా' అనడానికి కారణం. అందుకే 'మార్పిల్ కొణ్ణాయ్ మాదవా' ! అని రెండు పదాలను ప్రయోగించారు. 'కూనేశిదైయ ఉండైవిల్ నిఱత్తిల్ తెఱిత్తాయ్ గోవిందా !' గూనుతొలగునట్లు చిన్న విల్లును సరిచేసినట్లే (సునాయాసంగా) చక్కదిద్దిన గోపాలా! కుబ్జ యొక్క తక్కిన అవయవాలకు ఒత్తిడికల్గకుండా, గూనుమాత్రమే పోవునట్లు చక్కదిద్దిన వాడు అని గోపాల కృష్ణ పరమైన అర్థం. శ్రీరాముడు చిన్నప్పుడు గూని దైన మందరగూను మీద మట్టిబెడ్డను ఉండవిల్లు (ఒడిశెల) లో పెట్టి కొట్టిన భూపాలుడు, అని రామపరమైన అర్థం. ఆకోపంచేతనే మందర రామ పట్టాభిషేకాన్ని తప్పించిందట. (ఇది కంబరామాయణంలో సూచితం) లేదా, రామునిచేష్ఠ కూడా, శ్రీకృష్ణుని నెత్తిమీదనే (నింద) పడనీ అది అన్ని నిందలను మో యడానికెత్తిన అవతారమని ఆళ్వార్ల హృదయం, అని ఒక సమాధానం చెప్పబడింది.

"పల్లాయిరవరి వ్వూరిల్ పిళ్ళైగళ్ తీమైగళ్ శె య్యార్ ఎల్లా మున్మే లన్ఱి పోగాదు" ఈ ఊళ్లో గొల్లపిల్లలెవ్వరు తప్పులు చేసినా, అవి శ్రీకృష్ణుని యందే ఆరోపితాలు - అన్నారు.

పెరియాళ్వార్లు. ఈ సందర్భంలో "పోమ్ పళియెల్లామ్ అమణన్ తలైయోడే" నిందకలిగిన బాధ్యత అంతా దిగంబరస్వామిదే అయినట్లు - (అన్నినిందలు శ్రీకృష్ణునివే) అన్నారు. శ్రీ నంబిళ్ళైగారు.

'అన్యాయ ధన్యచరిత్ర' లో ఒక కథ ఇది. ఒక దొంగ ఒక బాపనయ్య ఇంటికి కన్నం త్రవ్వాడు. అదిపచ్చి గోడ. దొంగ మీద కూలగా అతడు మరణించాడు. ఆ చావుకుబాధ్యుడెవడో నిర్ణయించి శిక్షింపవలసిన ప్రభువు కొందరిని విచారించాడు. 'గోడ పచ్చిగా ఉండడానికి బాధ్యుడు తాపీవాడు' అన్నాడు బ్రాహ్మణుడు. నీ ళ్ళెక్కువ పోసిన కూలివాడు బాధ్యుడు' అన్నాడు తాపీవాడు. కుండ మూతిని పెద్దగా చేసిన కుమ్మరివాడు బాధ్యుడు' అన్నాడు కూలీవాడు. నా దృష్టిని తనవంకకు మరల్చుకొన్న దారిని పోయే వేశ్య బాధ్యురాలు' అన్నాడు కుమ్మరి. నన్ను దారిని పోవునట్లు చేసిన వాడు దుస్తులను సకాలాన అందించని చాకలివాడు బాధ్యుడు' అన్నది వేశ్య. 'నా ఆలస్యానికి నేను బట్టలు ఉతికే బండమీద కూర్చుండి, చాలా సేపు లేవని దిగంబరస్వామియే కారణ' మన్నాడు చాకలి. ఆదింగంబర సన్యాసి మౌనవ్రతుడై ఏమీ చెప్ప నందువల్ల నేరమతని మీద స్థిర పరుచబడింది.

వానార్శోతి మణివణ్ణా - గాజుకుప్పెలోని మణి కాంతి అంతట వ్యాపించేరీతిగా, ఆకాశమంతా ప్రకాశవంతంగా చేసే శ్రియః పతి విగ్రహ తేజస్సు త్రి పాద్వి భూతికేకాక ఏక పాద్వి భూతికి కూడా ప్రసరిస్తున్నది. 'మతుశూతా ఉన్తేనే మలరుమ్ తిరుప్పాతమ్- " విష్ణోః పదేపరమే మధ్వ ఉత్సః" శ్రీ మహా విష్ణువు యొక్క దివ్య పాదాల యందు తేనె వాక ఉంది" అని శ్రుతి. తేనెలాగా మధురగంగా జలముద్భవించిన త్రివిక్రముని పాదాల భోగ్యతవల్ల స్వామిని వీడలేక ఓ మధుసూదనా! 'శేరు మాఱు అరుళాయే వినై యేనే' కంచంలో పెట్టిన అన్నం తిన లేని వానివలె నీవు వచ్చి దూరంగా ఉండేటంత పాపాన్ని చేసిన నేను, నిన్నుచేరే విధంగా అనుగ్రహింపుము, స్వామి! అని ఆళ్వార్లు ప్రార్థిస్తున్నారు.

6. గోపాద్యాప్తేః : - (6పా) వినైయేన్ వినైతీర్ మరున్దానాయ్ - భగవానుడు ఆలసించి నందువల్ల, స్వామి నన్ను వదలి వేశాడని బాధపడుతూ ప్రార్థిస్తున్నారాళ్వార్లు. పాపాత్ముడనైననా పాపాలను పోగొట్టే మందు అయినవాడా! నిత్య సూరినిర్వాహకుడా ! కేశవా!

తాను స్వామిని చేరితే ఆయనకు అవమానమనే భావమే తన పాపం. ఇదే వ్యాధి దీనిని వారించే ఔషధం ఆశీలగుణసంపన్నుడే. నిత్యులకు, ముక్తులకు నాథుడు. కేశి అనే రాక్షసుణ్ని సంహరించినవాడు. 'హరివంశం' అనే గ్రంథంలో ఇలా ఉంది. " కఇతి బ్రహ్మణోనామ ఈ శోవహం సర్వ దేహినామ్! ఆవాం తవాంగసంభూతౌ, తస్మాత్కేశవనామ వాన్ 'క' అంటే బ్రహ్మపేరు. నేను సకల జీవులకు ఈశుడను. క, ఈశ అనే మేమిద్దరం నీ శరీరం నుంచి జన్మించాం. కాబట్టి నీవు కేశవుడనే పేరుకలవాడవు" అని శివుడు శ్రీ మన్నారాయణుని తో చెప్పాడు. సృజనకు ఉన్ముఖుడై, ప్రద్యుమ్నమూ ర్తియై బ్రహ్మరుద్రులకు జనకుడైనవాడు కేశవుడు . నిత్యసూరి నిర్వాహకస్థితి నుంచి వచ్చి పాలకడలిలో పవ్వళించిన స్థితి ఇది.

"మనైశేర్ ఆయర్కులము త లే" గొల్లవారిగుడిసెలలో కి వచ్చివారికు లానికి కారణమైనవాడా! ప్రద్యుమ్నస్థితి నుంచి పంచ లక్ష గృహాలలోకి వచ్చిచే రిన స్థితి ఇది. "మామాయనే మాతవా" మహామాయావీ! లక్ష్మీపతీ ! గొల్లకులంలో జన్మించడం, వారు స్పృశించిన పదార్థాలే తనకు ధారకమని స్వీకరించడం, వెన్నను దొంగిలించితినడం, పట్టుపడి కట్టుబడడం, కొట్టుబడడం మొదలైనవి అద్భుత కృత్యాలు. ఆ శ్రితులకు అధీనుడై ఆడడం, పాడడం, ఆవులను కాయడం లక్ష్మీ సంబంధం వల్ల చేసినవే. గోగోపగోపికలకు అప్పుడు శ్రీకృష్ణుడు.

శినై యేయ్తళైయ మరామరంగళ్ ఏళు మె య్ త శిరీదరా! కొమ్మలు దట్టంగా ఉన్న ఏడుసాల వృక్షాలను (సుగ్రీణ్ని రక్షిస్తాననే విశ్వాసంకలిగించడానికి) భంజించిన వీరలక్ష్మి గలవాడా! శ్రీ రామా! ఆశ్రితులను రక్షించే వాత్సల్య పరి పూర్ణుడా!

ఇనైయాయ్, ఇనైయ పేయరినాయ్ ఎన్ము - ఇట్టి స్వరూపానికి తగిన గుణాలూ, గుణాలకు తగిన నామాలు (పేర్లు) కలవాడా! అని, నైవన్ అడియేనే - ఆనందరసంలో కరిగిపోతున్నాను. నీదాసుడను. ఆలసించక వచ్చి నన్ను నీ తో చేరు నట్లు చేయుమని ప్రార్థించారు.

7. అశేషేక్షణ విషయతయా :- (7పా) అడియేన్శిఱియజ్ఞానత్తన్ - అల్పజ్ఞానం గల వాడను నేను. భగవంతుడు సర్వజ్ఞుల జ్ఞానానికి కూడా అందనివాడు. కడిశేర్ తణ్అమ్ తుళాయ్ కణ్ణి పునైన్దాన్ తన్నై కణ్ణనై - పరిమళంగల చల్లని అందమైన తులసీమాలనుధ రించిన వాడు, కృష్ణనాముడు, మా ఇద్దరిచేరిక చీకటి వెలుగులకలయికవలె ఉన్నది

కదా! ఎవరి జ్ఞానానికి అందని వాడైనా, గొల్లలకూ, గొల్లెతలకూ తనను సులభునిగా చేసుకొన్నాడు. "శెడియార్ అక్కై అడియార్ శేర్దల్ తీర్కుమ్ తిరుమాలై అడియేన్ కాణ్బాన్ అలత్తు వన్" క్రూరమైన (సంసారకాంతారనిబిడమైన) శరీర సంబంధం తన దాసులను చేరకుండా చేసే లక్ష్మీ కాంతుని నేను చూడడానికి కూయిడుతున్నాను. "జరా మరణమోక్షాయ మామా శ్రిత్యయతంతియే" (భ.గీత) అన్నట్లు ముసలితనం, మరణం నుంచి విముక్తులవడానికి మాత్రమే కోరుతున్న ఆశ్రితులు కేవలులు. అట్టికేవలులకు శరీరసంబంధాన్ని తెంచి వేసే శ్రీమంతుణ్ని దర్శించాలని నీచాతినీచుడనైన నేను కోరుతున్నాను. భగవద్దాస్యాన్ని కోరని కేవలు లే నిజంగా దాసులై పోయారు కదా! నా కంటే వారే, కైవల్యాన్ని ఇప్పించుకొని, ఎడబాసియుండడం వల్ల, మేటి దాసులయ్యారు. స్వామికి కూడా అతిశయం కల్గుతున్నది.

నేను భగవంతుణ్ని దర్శించాలి, సేవచేయాలి. అని కోరుతున్నాను. నా చేరిక చేత స్వామికి అపవిత్రతను కలిగించడానికి ఉరవడిస్తున్నాను. ఇదనిల్ మిక్కుఓర్ ఉయర్వు ఉండే ఇంతకు మించిన ఒక అజ్ఞానం, అవివేకం ఉంటుందా? అని ఆళ్వార్లు నైచ్యాను సంధానం చేస్తున్న పాశురమిది.

8. భక్త వస్తుప్రసక్తేః :- (8పా) ఉణ్డాయ్ ఉలకు ఏళ్ మున్నమే ఉమిళ్న్దు, మాయైయాల్ పుక్కు ఉణ్డాయ్ వెణ్ణెయ్ - పూర్వం ఏడు లోకాలను మ్రింగి ఉమిసితివి. మాయతో (ఈలోకానికి) ప్రవేశించి వెన్నను ఆరగించావు. ప్రళయకాలంలో లోకాలను తన బొజ్జలో పెట్టుకొని, మళ్ళీవాటిని సృష్టికాలాన బయల్పరచావు. "మాయా వయునంజ్ఞానమ్'' (వేదనిఘంటువు) నీ ఇచ్ఛారూపమైనజ్ఞానంతో గొల్లల గుడిసెలలో ప్రవేశించి వెన్ననునే తిని బాగా తిన్నావు. అప్రాకృతదివ్యదేహానికి హేయమైన మనుష్యస్థితిని పొంది, గోపాలుడవైవెన్నను ఆరగించావు.

"సఫలందేవి! సంజాతం, జాతోఃహంయత్తవోదరాత్" - (వి.పు) నీకోరిక సఫలమయింది. దేవీ! నీకడుపులో జన్మించాను - అని భగవానుడు దేవకీదేవికి తానవతరించినప్పుడు తెలిపాడు. అయితే, స్వామిది అప్రాకృత దివ్యదేహం అవుతుందా? " నైషగర్భత్వమాపేదే, నయోన్యామవసత్ప్రభుః" (మహాభారతం) ప్రభువైనశ్రీకృష్ణుడు గర్భంలో ప్రవేశింపలేదు. యోని సంభవుడూకాదు - అని వ్యాసభగవానుడు చెప్పాడు. ఇందులో సత్యమేది? రెండూ సత్యాలే. గర్భవాసం జన్మ, స్వామి ఇచ్ఛవలననే కలుగుతాయి. ఆ జన్మవల్లకలిగేదోషాలు స్వామికి అంటవు.

ఈ లోకంలో శుక్లశోణిత వికారంకానట్టి జన్మ సంభవమా? అంటే, సంభవమే. ఇక్ష్వాకువంశంలోని యవనాశ్వుడనే ప్రభువుయాగం చేశాడు. అప్పుడు బాగా దాహం కలిగినందువల్ల మంత్ర పూతమైన జలాన్ని త్రాగాడు. మంత్రంలోని శబ్దశక్తివల్ల కలిగిన జలాన్నిపానం చేసిన సామర్థ్యంచేత ఆ ప్రభువుకు శుక్లశోణితాలు కారణం కానట్టి గర్భమేర్పడిందికదా! ఆ సర్వశక్తి మంతుడైన శ్రీమన్నారాయణుడు కేవలం తన సంకల్పం చేతనే జన్మించడమనేది అసంభవం ఎలా అవుతుంది ? సంభవమే.

మణ్ణాన్శోర్న్ద తుఉణ్డేనుమ్ మనిశర్కు ఆగుమ్ పీర్ శిఱిదుమ్ అణ్ణావణ్ణమ్ మణ్కరైయనెయ్ ఊణ్ మరున్దో మాయెూనే - (పీర్ = అత్యల్పం, పాండురోగం)(మునుపు భూమిని మ్రింగినప్పుడు కడుపులో) మట్టిపెల్లలు కడుపులో మిగిలి ఉంటే కూడా, మనుష్యులకుకలుగదగిన పాండు వ్యాధి - వైపర్ణ్యం - కొంచెమైనా చేరకుండే రీతిగా, ఆమట్టి పెళ్ళలు కరుగడానికి నెయ్యి, వెన్నను ఆరగించడం మందు అవుతుందా? మాయావీ! - మందుకాదు. - తెలిసిందిలే. ఆశ్రితుల స్పర్శకలిగినద్రవ్యంతప్ప మిగిలిందేదైనా నీకు ధారకంకాదుకదా! అవును. ఆ వెన్నవలె, మీ సంశ్లేషం కూడా మాకు ధారకమే. మీరుమాకుదూరమైతే, ఆ గొల్లపల్లెలో వెన్న తినకుండా నన్ను ఆటంకపరచినవారు పోయే లోకానికి మీరు కూడా పోవలసి ఉంటుంది సమా! అన్నాడు స్వామి. ఇలాదర్శనమైన భగవానునికీ, ఆళ్వారుకూమధ్య సంభాషణ జరిగిందని ఈ పాశురార్థాన్ని వ్యాఖ్యాతలు వివరించారు. భక్తుల వస్తు ప్రసక్తి కలదే కదా ఇది.

9. శ్లిష్యన్నాశ వ్యపోహాత్ :- (9పా) మాయెూమ్ - విశ్లేషం మీకూ మాకూ సత్తా హేతువే. కాబట్టి నశింపక ఉంటామంటున్నారీ పాశురంలో ఆళ్వార్లు. ఆనాడు గొల్లెతలు ప్రేమతో ఇచ్చిన వెన్న మీకుధారక మవుతుంది కానీ, ప్రేమ లేనినాశరీరస్పర్శ మీకు విషమే అవుతుంది. అని ఆళ్వారు అంటే, స్వామి అవునా? అయితే పూతన ఇచ్చిన విషపూరిత స్తన్యం మాకు ధారక మయినట్లే మీ శరీరం కూడా మాకు ధారకమే, రమ్ము అన్నాడు. కంస ప్రేరితయై శ్రీ కృష్ణుణ్ని మాత్రమే చంపేతలపుతో వచ్చింది కాబట్టి పూతనను 'తీయ' - క్రూరసంకల్పం కలది - అన్నారు. తన విషదిగ్ధమైనస్తన్యాన్ని కృష్ణశిశువు చేత్రాగించడానికి ముందు మంచి మాటలచే మచ్చుచల్లింది కాబట్టి 'అలవలై' - వదరుపోతు. తల్లియశోదకున్నంత ప్రేమతో నటిస్తూ మాయ రూపం దాల్చి

వచ్చినందువల్ల పూతనను 'పెరుమావంజమ్‌పేయ్' - పెద్దమహా వంచకి మైన భూతకి - రాక్షసి' అన్నారు. అది 'వీయ' - చనిపోవునట్లు "తూయకుళవియాయ్ విడప్పాల్ అముతు ఆ ఆముతుశెయ్ తిట్ట మాయన్" - పవిత్రమైన పసికందువు అయ్యి విషపుపాలను అమృతంవలె ఆరగించిన ఆశ్చర్యకరస్వభావుడు స్వామి. 'తూయకుళవి' అంటేఈశ్వరత్వపు కల్తీలేని శైశవం : అయితే విషం అమృతమే ఎట్లయింది? అనే ప్రశ్నకు, అది శ్రీకృష్ణుడవతరించిన (విషాన్ని అమృతంగా మార్చే) లగ్న ముహూర్తబలం' అనడం నంబిళ్ళైగారి రసోక్తి. మానవత్వం కలిగి బాల్య లీలలు చేస్తున్నా భగవంతుని సహజ స్వభావం విడిపోనందువల్ల అనన్యార్హంగా స్వామికి సమర్పించిన ఏ వస్తువైనా, అది అమృతమే అయింది. అవుతుంది కూడా. వంచకి కాబట్టి పూతన ప్రాణాలను కూడా హరించి, తనను, తన ఆశ్రితుల ఉనికిని కాపాడుకొన్న ఆశ్చర్య చేష్టలు కలవాడు శ్రీకృష్ణుడు.

వానోర్ తనిత్తలైవన్ - నిత్య సూరులకు అద్వితీయనిర్వాహకుడు, మలరాళ్‌మైన్దన్ - పుష్పపుత్రికకుప్రియుడు. ఎవ్వుయిర్క్కుమ్ తాయోన్-సకల ప్రాణులకు తల్లియైనవాడు 'తమ్మాన్, ఎన్నమ్మాన్, అమ్మామూర్తియైశార్న్దే' - తనకుతానే స్వామియైనవాడు, నాస్వామి, అనడంవల్ల నిత్యసూరులు తక్కిన ఆత్మవర్గమంతా ఒక ఎత్తు. ఆళ్వారు ఒక ఎత్తు, అనిపించే విధంగా దివ్యమంగళ విగ్రహం గల స్వామి విశేష అనుగ్రహాన్ని చూపాడు కాబట్టి 'మాయోన్ ' - అట్టి స్వామిని చేరి, ఇక నేను ఆ స్వామి నశింపక, ఎడబాయక ఉంటా మన్నారు నమ్మాళ్వార్లు.

10. తదహితశమనాత్ (10పా) శార్న్ద ఇరువల్ విన్నైగళుమ్ శరిత్తు, మాయ ప్పత్తు అఱుత్తు, తీర్న్ద తన్పాల్ మనమ్ వైక్కతిరుత్తి, వీడు తిరుత్తువాన్-చేరియున్న రెండువిధాలైన క్రూరపాపాలను పోగొట్టి, (అజ్ఞాన ప్రభవమైన) ఇతర విషయ సంశయాన్ని ఛేదించి, తమవైపు మనస్సు నుంచేరీతిగా నన్ను తీర్చిదిద్ది,పరమపదాన్ని చక్కగా ఆలంకరించుకొంటున్నాడు స్వామి.

"తిలతైలవత్, దారువహ్నివత్" (శ్రీరంగగద్య) నూవులు నూనె, కట్టె అగ్ని, వలె జీవులనుంచి విడువడక ఉండే పుణ్యాపాపకర్మలను, ఉపాయశీలురు సులభంగా పెద్దగోడను పడగొట్టినట్లే, ఒక్కసారిగా త్రోసివేశాడు. స్వామి ఆళ్వార్లను దిద్దుబాటు చేసి కృతకృత్యుడయ్యాడు. (మాయమ్-రుచిరూపజ్ఞానం; పత్తు = వాసన; తీర్న్దు =

కృతకృత్యుడవడం, దిద్దుబాటు చేయడం) తనవైపు ఆళ్వార్లుమనస్సును ఉంచే విధంగా చేసి, మార్పులేని మోక్షస్థానానికి ఒక కొత్త దనాన్ని సంతరిస్తున్నాడుస్వామి. ఆర్న్ద జ్ఞానం శుడర్ ఆగి, అగలం కీళ్మేల్ అళవు ఇఱన్దు - పరిపూర్ణమైన జ్ఞానజ్యోతి కలవాడై, చుట్టూక్రింద మీద (పదిదిక్కుల) నిరవధికంగా వ్యాపించినవాడై; 'నేర్న్ద ఉరు అయ్, అరు అగుమ్ ఇవత్తిన్ ఉయిర్ అమ్ , నెడుమాల్ - (నేర్న్ద = అతి సూక్ష్మమైన; చేరిన) కారణదశలో అతిసూక్ష్మంగా ఉండేటి, కార్యదశలో ప్రత్యక్షంగా చేరికన్పించేటి చిదచిత్తులకు అంతరాత్మగా ఉండేవాడుస్వామి. ఆళ్వార్లను వశపరచుకోవాలనే సర్వపదార్థాలలో వ్యాపించి ఉన్నాడట. వ్యామోహ శీలి కాబట్టి, ఆళ్వార్లు రాబోవుతున్నారని తనదైన స్థానాన్ని చక్కగా అలంకరించుకొంటున్నాడన్నారు. శ్రీవకుళాభరణులు.

11. మాలేమాయ ప్పెరుమానే - (11పా) (మాల్ = సర్వాధికుడు; వ్యామోహస్వభావుడు) తాము అయోగ్యులమని దూరం కాబోయినప్పటికీ, సుకుమారుడైన కుమారుడు నెయ్యిలేనిదే ఒక ముద్దకూడా తినలేనట్లు, సర్వాధికుడైనస్వామి యొక్క అనుగ్రహంలేనిదే ఒక్కక్షణమైనా ఉజ్జీవించలేని నమ్మాళ్వార్లు అనుగ్రహించిన వేయి పాటలనే సముద్రంలో ముత్యాలవంటి ఈ పదిపాటలను నేర్చుకొని పాడేవారికి సాంసారిక దు:ఖంగానీ, భగవద్విశ్లేష దు:ఖంగానీ (పరివతుఇల్లై) ఎట్టి దు:ఖం ఉండదు.

పాలేయ్ తమిళర్ = పాలవలె మధురమైన తమిళబాషలో పండితులైనవారు.

తమిళులు = మొదటి ముగ్గురాళ్వార్లు; ఇశైకారర్ = గాయకులు-తిరుప్పాణాళ్వార్; పత్తర్ = భక్తులు - పెరియాళ్వారు - అని ఆళవందార్లు చెప్పేవారట. తమిళులు - పరాంకుశ నంబి అనీ, గాయకులు - ఆళ్వార్ తిరువరంగ ప్పెరుమాళ్రైయర్ అనీ, భక్తులు-ధనుర్దాసు అనీ శ్రీకూరనాథులు చేప్పేవారట.

షష్ఠదశకమ్ :

6. అక్రీత్తై రర్చ్యా భావా దనియత వివిధాభ్యర్చనా దల్పతుష్టే:
ప్రహ్వే వర్జ్యేశ భావాత్స్వ విషయనియతేష్వాదరా త్స్వాదుభూమ్నా!
పాదాసక్త ప్రసత్తే స్సకృదుపసదనే మోక్షణా ద్ధర్మసౌస్థ్యాత్
క్షిప్రక్షిప్తాహితత్వా త్సుకర భజనతాం మాధవస్యాభ్యధత్త!! 17

అర్థం :- అక్రీతైః = కొనబడనివాటిచే; అర్చ్యభావాత్ = పూజింపదగినవాడైనందు వల్ల; అనియత వివిధ + అభ్యర్చనాత్ = నియమంలేని, అనేకవిధాలైన పూజాద్రవ్యాలుకలవాడైనందువల్ల; అల్పతుష్టేః = స్వల్పంచేత సంతోషంకలవాడవడంవల్ల; ప్రహ్వా + అవర్జ్య + ఈశభావాత్ = నమస్కారంచేపూజింపదగిన స్వామి అవడంవల్ల; స్వవిషయ నియతేషు = తనపట్ల ఆదరంకలవారియందు; ఆదరాత్ = ప్రీతివల్ల; స్వాదుభూమ్నా = భోగ్యతయొక్క ఆధిక్యంచేత; పాద+ఆసక్త ప్రసత్తేః = పాదాలను ఆశ్రయించిన వారి యందు అనుగ్రహంకలవాడైనందువల్ల; సకృత్+ ఉపసదనే = ఒకానొకప్పుడు ఆశ్రయణమందునూ; మోక్షణాత్ = మోక్షమిచ్చేవాడై నందువల్ల; ధర్మసౌస్థ్యాత్ = ధర్మాలకు పరమ ప్రయోజనమవడంవల్ల; క్షిప్ర క్షిప్త + అహితత్వాత్ = శీఘ్రంగా పోగొట్టబడిన అనిష్టాలు కలవాడవడం వల్లనూ; సుకర భజనతాం = సుఖంగా ఆశ్రయింపదగిన వాడనే భావాన్ని; మాధవస్య = శ్రియః పతికి; అభ్యధత్త = సాదించెను. (ప్రతిపాదించెను.)

తా॥ ధనం వెచ్చించకుండా, సుఖంగాలభించే పదార్థాలచే పూజింపబడేవాడు, అధికారి నియమంలేని, నానావిధద్రవ్యాలచే అర్చింపదగినవాడు, స్వల్పమిచ్చినా సంతోషించేవాడు ఆశ్రితుల నమస్కారంచేత ఆరాధింపబడే మహత్వం కలవాడు, తనను ఆదరించే వారియందు తాను ఆదరంతో ఉండేవాడు, మిక్కిలిభోగ్యత కలిగియుండేవాడు, ఆశ్రితులననుగ్రహించేవాడు, ఒకానొకప్పుడు ఆశ్రయించిన వారికి మోక్షమిచ్చేవాడు, ధర్మాలకు పరమప్రయోజనమైనవాడు, భక్తుల అనిష్టాలను త్వరగాపోగొట్టేవాడు, సుఖారాధ్యుడు సర్వేశ్వరుడు అని పరిపూర్ణుణ్ని, అవాప్త సమస్త కాముణ్ని ఆ శ్రయించి స్వారాధతను (సుఖంగా పూజించే ధర్మాన్ని) ఈ ఆరవ తిరువాయిమొళియందు నమ్మాళ్వార్లు ఉపదేశించారు.

ప్రకా-వ్యాఖ్య- హేయరహితుడైన సర్వేశ్వరుణ్ని, క్షుద్రులమైన మనం క్షుద్రోపకరణాలతో ఆరాధించడానికి అయోగ్యులమని భావించకూడదు. భక్తితో మనస్వరూపసిద్ధికి ఎంత అల్పమైన వస్తువును, సమర్పించినా, పరిపూర్ణుడైన స్వామి దాన్ని అలభ్యలాభమైనట్లు ఆనందంతో స్వీకరించి మనలను కటాక్షిస్తాడు. భగవానుడు సులభారాధ్యుడు అని ఆళ్వార్లు ఈ దశకంలో విరించారు.

1. అక్రీతైః అర్చ్యభావత్ :- "పరివు అతుఇల్ ఈశనై పాడి, విరివతుమేవలుఱు వీర్- (1పా) (పరిపు=దుఃఖం, పక్షపాతం) దుర్గుణాలు దరిజేరని శ్రియఃపతిని ఆనందంగా గానంతో కీర్తించి, (సహజమైన అష్టగుణ) స్వరూప వికాసాన్ని పొందవలె నను కొనే వారలారా! పిరివకై ఇన్ఱి - ఎడబాయకుండా; పురివతువుమ్ -సమర్పింపవలసింది; తూయ్ నన్నీర్ - పరిశుద్ధజలం; పుకై పూవే - ధూపం, పుష్పం మాత్రమే! ఇందులో సామగానంతో స్వామిని కీర్తించేనిత్యసూరుల స్థితిని పొందవలెననే పట్టుదలకలవారిని సంబోధించారు. భగవానుడు దుఃఖరహితుడు. ఆశ్రితులు తాము సమర్పించే ద్రవ్యాలను చూచి స్వామి సంతృప్తి జెందునో లేదో అని దుఃఖిస్తే, ఆశ్రయణీయుడైనస్వామికీ దుఃఖం కలుగుతుంది. అట్టి దుఃఖంలేని వాడు స్వామి. ఈ దుఃఖరాహిత్యం అఖిల హేయప్రత్యనీకతకు ఉప లక్షణం. ఆయన పరమదయాళుడు. కాబట్టి ఆశ్రితుల దుఃఖాన్ని పోగొడుతూనే, ఆ ఆపదలుకలుగకుండా తాను చేయకపోయితినని దుఃఖిస్తాడు. ఈ పరదుఃఖ దుఃఖిత్వం హేయగుణంకాదు. కల్యాణ గుణాలలో అగ్రగణ్యం. శరణాగతయైన ద్రౌపదికి అక్షయ వస్త్రదానంచేసి కాపాడిన భగవానుడు, ఆమెకు ఆ ఆపదకలుగకుండా తాను చేయకపోయినందుకు తీరని పశ్చాత్తాపంపబడినట్లు ఆచార్యులు ప్రవచిస్తారుకదా! కాబట్టి, దుఃఖరహితుడు అంటే హేయదుఃఖరహితుడని అర్థం.

పక్షపాతంలేనివాడు భగవానుడు. ద్రవ్యమెక్కువ సమర్పించినవారి మీద పక్షపాతం చూపితే, ఆయనను అందరు ధైర్యంగా చేరలేరుకదా! మనకొరతలను తనకొరతలనుగా తలచవలసిన సంబంధం మనకూ, ఆయనకూఉంది. అందరికి అందుబాటులో ఉండడానికి కారణంఉంది. ఆయన ఈశ్వరుడు. సహజసంబంధంకలస్వామికి అందరూ సమానులే.

ఇతరులకు భోజనం పెట్టినప్పుడు వారికి పదార్థాలు రుచించునో లేదో అనే విచారముంటుంది మనకు కాని మన తండ్రికే భోజనంపెట్టినప్పుడు, ఏదైనా లోపం ఉంటే ఆయననే చూచుకొంటాడనే ధైర్యంతో ఉంటాం. అలాగే మనకు సహజ సంబంధంగల సర్వేశ్వరునికి ఏద్రవ్యాలను సమర్పించాలి? అనే సందేహం మనకు అవసరంలేదు.

శేషభూతులు సర్వశేషికి ఏదో కొంచెమైనా కైంకర్యం చేస్తే, ఆచేసినదేతనకొకగొప్ప లాభమని ఆయన భావిస్తాడు. మనకు స్వరూపవికాసమేర్పడుతుంది. కాబట్టి భగవానునిముఖోల్లాసం కోసం బాగాస్తుతించాలి. ఆరాధించాలి.

బ్రహ్మాదిదేవతలూ ఆరాధించేస్వామిని అల్పులమైన మనం ఆరాధిస్తే స్వామి గొప్ప తనం మాసి పోతుందేమో అనే భయంతో మనం స్వామికి దూరంకారాదన్నారు. ఆయన అవాప్త సమస్తకాముడు. మనమర్పించే వస్తువులలో ఆయన కులేని వేవీలేవు. ఆయన పరిపూర్ణుడు. మన సమర్పణలనే స్వీకరించి తృప్తి చెందవలసిన దారిద్ర్యమాయనకు లేదు. మనకు సత్తా కలుగడానికే కాని ఆయనకు సమృద్ధిని కూర్చడానికి కాదు. ఆయన శ్రియఃపతి ఆతల్లి లక్ష్మీదేవి మన రక్షణకోసం తానే ప్రార్థించి క్షుద్రులమైనమనను తన దరిజేర్చుకొనే రీతిగా స్వామిని చక్క దిద్దుతుంది కాబట్టి ఆమె సంతతి పట్ల స్వామి సుశీలుడై ఉంటాడు.

భగవదాదాధనలో మనం సమర్పించవలసింది పరిశుద్ధజలం. ఏలకులు, జాజికాయజాపత్రి, పచ్చకర్పూరం లాంటి సుగంధద్రవ్యాలు వేయని మంచినీటిని స్వామిపాదాలపైన చల్లితేచాలు. భగవానుని అనుగ్రహంకోసం మన మర్పించవలసింది ఏదో ఒక ధూపం, ఒక పూవే. ఇక్కడ ఏ సంపెంగపూవో, ఏ అగరుధూపమో అని ప్రత్యేకించి చెప్పలేదు. కాబట్టి మనకు లభ్యమైన ఏ పూవైననూ, పరిమళరహితమైన ధూపమైననూ స్వామికి, సమర్పించవచ్చును. ఈ పాశురాన్ని వివరిస్తూ శ్రీపరాశరభట్టర్, 'శెతుకై యిట్ట ప్పుకైక్కవమైయుమ్, కంటకాలి యిడవు మమైయుమ్'' కొయ్యపాట్టు పొగయైనా, కంటకాలి పూవైనా చాలును అన్నారట. ''నకంటకారికాపుష్పందేవాయవినివేదయేత్'' దేవునికి ముళ్ళగోరింటపువ్వును సమర్పించరాదని శాస్త్రం నిషేధిస్తున్నది కదా! అని నంజీయర్ (వేదాస్తి) అడిగారట. అందుకు భట్టర్ వాడు సరసమైన సమాధానం చెప్పారు.

ఆపూవులను కోసే భక్తులకు దాటి ముండ్లుకుచ్చుకొంటాయని భక్తులమీది దయతో ఆకంటకారి పూవు నిషేధింపబడిందేకాని అది దేవునికి సమర్పింపరాదని కాదు. అని తెలిపారు. ఈ విషయంలో 'తిరువెమొళి' లోని ఒకపాశురాన్ని ఉదాహరించారు. '' కళ్ళార్ తుళాయుమ్ కణవళరుమ్ కూవిళైయుమ్ ముళ్ళార్

ముళరియుమామ్బ లు మెన్ఱు, పుళ్ళాయోరేనముమాయ్ ప్పుక్కిడన్దాన్; ఉళ్ళాదాగుళ్ళత్తై యుళ్ళమాయ్‌క్కొళ్ళోమే''- అసాధారణమైన, మధుపూర్ణమైనతులసి, బిల్వం కంటకారికుసుమం, కమలం, కుముదం, అని విజాతీయమైనవాటిని ఏకరూపంగా భగవానుడు స్వీకరిస్తాడని చెప్పబడిందికదా! స్వామి ద్రవ్యతారతమ్యాన్ని అవలోకించడు. అప్రాకృతద్రవ్యాలే కావాలనుకొంటే ఆయన వైకుంఠంలోనే ఉండే వాడుకదా! పక్షి అయ్యి, వరాహమయ్యి ప్రవేశించి ఉద్ధరించాడు. వరాహావతారంలో తుంగముస్తెలను ఆరగించినస్వామి సౌలభ్యాన్ని ఏమని ప్రస్తుతించగలం ఏ ద్రవ్యం ఆయనస్వీకరించడానికి ఆయోగ్యమని నిర్ణయించగలం? ఇలా ఈ పాశురాన్ని విశదీకరించగా, నంజీయర్, ఇది సత్యాను కరణమా? అని కడు విద్ధుడయ్యాడట. ఈ పాశురంలోని నాల్గవ పాదార్థం ఏమిటి? అంటే ఈ విధంగా అనుసంధానం చేయని వారి హృదయాన్ని హృదయమని మేము భావింప మని అర్థం 'మేము' అనే బహువచనం వల్ల పదుగు రమని అర్థం ఇది తననూ, తక్కిన సూరులనూ (10 గురు ఆళ్వార్లను) సంగ్రహించి పలికిన మాటగా వ్యాఖ్యాతం.

2. అనియత వివిధాభ్యర్చనాత్ :- మదువార్ (2పా) మతువార్ తణ్ణన్తుళా యాన్ - మనోహరమైన తేనెస్రవించే చల్లని తులసీమాలకను ధరించే వాడు భగవానుడు. 'పూవే' - ఏదో ఒక పూవును సమర్పిస్తే చాలు నని చెప్పి, ఇప్పుడు తేనెస్రవించేతులసీ మాలిక అని చెప్పడమేమిటి? అంటే ఏ పూవైనా మధువుతో నిండి ఉంటుందని సమర్థించారు.

'వే' అనే అక్షరంతో ముగిసింది వెనుక పాశురం. కాబట్టి "వతునార్' అన్నట్లైతే 'అంతాది' సిద్ధిస్తుంది. 'వతువార్' అంటే 'పరిమళప్రచురమైన' దని అర్థం. ఇది శబ్దానుసారి అంతాది. అంతాది రెండు విధాలు 1. శబ్దానుసారి 2. అర్థానుసారి. 'మతువార్' అని ఆరంభిస్తే అర్థానుసారి అంతాది సిద్ధిస్తుందన్నారు. పూవు ఎంత వాడిపోయినదైనా, దాన్ని భగవంతుని చికురబంధంలో సమర్పించగానే, అది ఆదిత్యకేశ స్పర్శతో కాంతిని పొంది తేనె నిండి, పూవులో ఇముడక పైకి ప్రవహిస్తుందని ప్రవచించారు. కాబట్టి ఇది అర్థానుసారి.

ముతువేద ముదల్వనుక్కు - ప్రాచీనవేదం కారణంగా కలవానికి 'అని అర్థం' . సనాతన మైనవేదం 'మొట్టమొదటి వేల్పు' అని ప్రతిపాదించింది కాబట్టి శ్రియః

పతి పరిపూర్ణుడు. 'శాస్త్రయోనిత్వాత్', అనే బ్రహ్మ సూత్రానికి 'శ్రీభాష్యం' లో 'వేదం చేతనే భగవంతుణ్ని తెలుసుకోగలం కాబట్టి వేదమే కారణం' అని తెల్పబడింది. కారణం అంటే హేతువు. హేతువులు రెండు విధాలు 1. కారకహేతువు :- మట్టిలేకుండ కుండ (ఘటం) నిర్మింప బడదు కాబట్టి కుండకు మట్టి కారక హేతువు. 2. జ్ఞాపక హేతువు:- పొగలేకున్నా అగ్ని ఉంటుంది. కాబట్టి, పొగ కారక హేతువుకాదు. అగ్ని ఉన్నదని తెలియజేస్తుంది. కాబట్టి పొగ జ్ఞాపకహేతువు. స్వామి ఉనికిని తెలియజేసే వేదం జ్ఞాపక హేతువు.కాని కారకహేతువు కాదు కదా! 'తలసీమాలికాధారి' అన్నందువల్ల సర్వాధికుడు. వేద ప్రతి పాద్య' దన్నందువల్ల పరిపూర్ణుడు. అట్టి భగవంతునికి ఎతు, ఎన్పణి ఏతు? నేను చేయవలసిందేమి? ఏవిధమైనది? ఏన్నాదదువే - అనకుండుటే, "అళ్శెయ్యుమ్ ఈడు-కైంకర్యం చేయడానికి తగింది" నిత్యసూరు లేకదా స్వామికి కైంకర్యం చేసేవారు. నేను చేసేదేముంది? అని దూరంకాక సర్వవిధకైంకర్య చేయడానికి సిద్ధపడడమే దాస్యానికి అర్హత. ఏద్రవ్యమైనా పూజాద్రవ్యమే కాబట్టి ద్రవ్యనియతి లేదు. ఎప్పుడైనా ఆరాధించవచ్చు. కాబట్టి కాలనియతి లేదు. ఎవరైనా పూజింపవచ్చుకాబట్టి అధికారి నియమమూ లేదు. ఇందువల్ల శ్రియఃపతిని ఆశ్రయించడం, పూజించడం సుకరమన్నారు.

3. అల్పతుష్టేః :- ఈడుమ్ ఎడుప్పుమ్ ఇల్ ఈశన్ (3పా) కొందరిని విడవడం, కొందరిని పట్టుకోవడంలేని వాడు సర్వేశ్వరుడు, 'దేవానాందానవానాంచసామాన్యమధిదైవతమ్' (జితంతాస్తోత్రం) అన్నట్లు ఆయన ఉమ్మడి దైవం . అందరికీ సమానుడే, ఇది యోగ్యం అది అయోగ్యమనక, మనమేది సమర్పిస్తే దాన్నే సంతోషంగా స్వీకరిస్తాడు. స్వల్పసంతోషి. తాను తప్ప మిగిలిన జీవ, అజీవ పదార్థాలన్నీ ఈశితవ్యాలే. అన్నిటితో నూ ఆయనకున్న సంబంధం సమానమే భగవంతుడు తటాకంటాంటివాడు. దప్పిదీర్చుకొన దగిన తటాకంలో ఎవరైనా పడిచస్తే దానికి బాధ్యత వారిదేకాని తటాకందికాదుకదా! ప్రహ్లాద, విభీషణు లాశ్రయించి ఉజ్జీవించిన భగవంతుణ్నిడీకొని హిరణ్యరావణాదులు సమసి పోవడానికి బాధ్యులు వారేకాని దేవుడు కాడు.

మూడు విడాతు ఎన్మనన్ - అట్టి స్వభావం గల స్వామి పజ్జను (సాన్నిధ్యాన్ని) నామనస్సు, ఏ ఫలాన్ని ఆశింపనిదై, విడువలేకున్నది. పరోపదేశంచేయడానికి

హృదయంలేని మాటయైనా చాలును కదా! కాని, 'పాడుమ్ ఎన్నా అవన్ పాడల్' - నా నాలుక (వాక్కు) భగవంతుని పాటలనే పాడుతుంది. పోనీ, ఆవాక్కు (మాట) కూడా అవసరం లేకుండా ఏ చేతి ముద్రనోచూపి ఉపదేశిస్తా మనుకొన్నా "ఆడుమ్ ఎన్ అంగం అణంగే" -నాశరీరం దైవావిష్ట మైనట్లు (దయ్యమా వహించినరీతిగా) అవశంగా ఆడుతున్నది. ఇలా ఆళ్వార్లు పరోపదేశానికి పూనుకొన్నప్పటికీ, దాన్ని మరచి, తన మనోవాక్కాయాలకు సర్వేశ్వరుని యందున్న ప్రావణ్యాన్ని ఈ పాశురంలో తెల్పినారు.

4. ప్రహ్వావర్జ్యేశభావాత్ - అణంగు ఎన ఆడుమ్ ఎన్ ఆంగమ్ వణంగి వళిపడుం ఈశన్. (4పా) భూతావేశమయినట్లు నర్తించే నా శరీరం నమస్కారాదులచే ఆరాధించే స్వామి (ఎలాంటి వాడంటే) 'అమరర్ పిణంగి పిదత్తుమ్ కుణంగు ఎళు కొళ్గై నాన్' నిత్య సూరులు (బండొరులతో) పెనగులాడి వివాదపడుతూస్తుతించే కల్యాణ గుణాలు అమరిన పేర్మి (స్వభావం) కలవాడు.

(శ్రీ వేదాంత దేశికులు "యదేకైక గుణప్రాంతే శ్రాన్తా నిగమనందినః " -ఏగుణంచేత ఆకృష్టు లైనవారు ఆగుణమే సర్వశ్రేష్ఠమంటారు) కరణత్రయానికి ఉన్న ప్రావణ్యం తాత్కాలికంకాదు.

నిత్య సూరులలాగా నిత్యమైనదే. సర్వజ్ఞులైన నిత్య సూరులనే కలతచెందించి, (పిదత్తి = జల్పించి) అక్రమంగా పలికించే సర్వేశ్వరుని గుణాలు నా మనోవాక్కాయాలను వశపరచుకొని కలతను చెందించడంలో ఆశ్చర్యమేమి? శ్రియఃపతి యొక్క కల్యాణ గుణాలను అనుభవించి, ఆడుతూ పాడుతూ , నమస్కారంతో ఆ స్వామిని ఆరాధించడమే నా నిత్య కృత్య మన్నారు ఆళ్వార్లు. ఈ రెండు పాశురాలతో తమ అనుభవాన్ని తెల్పి, మళ్ళీ (ముందు పాశురంతో) పరోపదేశం సాగిస్తున్నారు.

5. స్వవిషయ నియతే ష్వాదరాత్ - కొళ్గై కొళామై ఇలాతాన్ (5పా) స్వీకరించడం స్వీకరించకపోవడం (విడచిపెట్టడం) అనేవి లేనివాడు. ఇతడు ఉత్తమ వంశజుడు, ఉత్తమ ప్రవర్తన కలవాడు. కాబట్టి ఇతని కైంకర్యాన్ని గ్రహిస్తాను. ఈ రెండింటిలో కొరత కలిగి ఉన్నందువల్ల అతనిని నా సేవలకు వెలివేస్తాననే ఉద్ధేశ్యం లేనివాడు భగవానుడు. 'ఎళ్కల్ ఇరాగమ్ ఇలా తాన్-వెగటుచూప డమూ, ఆదరించడమూ లేనివాడు. మనసులో కూడా వారి హెచ్చు తగ్గులనుచూచి కొందరిని ఆదరించడంగానీ,

అనాదరించడంగాని స్వామిచేయడు. "ఇళ్కై, విళామై విరుంబి" విడువడం, విడవకుండడాన్ని ఆలోచించి; ఉళ్కలన్దార్కు ఓర్ అముదే-తనలో నిమగ్ను లైనవారికి సాటిలేని అమృతం వలె భోగ్యభూతుడు. రెండు వర్గాల వారినీ పరిశీలిస్తాడు స్వామి. (1) ఇతర ప్రయోజనాల నాశించి పొంది తనను వదలి పెట్టే వారికి వారుకోరిన వాటిని సమకూర్చి వారిని పోనిస్తాడు. (2) తననేనమ్మి తన సేవలోనే నిమగ్నులై ఉండగోరే వారికి, తనతోనే కలిసి యుండగోరే వారికి తానే నిరతి శయ భోగ్యభూతుడైఉంటాడు. (ఆశంసాయాం కప్రత్యయంగా కూడియుండగోరేవారికి 'తేషాం సతత యుక్తానాం' - గీతాభాష్యవివరణలాగా)

6. స్వాదుభూమ్నా :- అముతం అమరర్ కళ్కు ఈన్ద-(6పా) అమృతాన్ని దేవతలకు ఇచ్చినవాడు. ఏమిస్వామి ఔదార్యం ! "నీ వక్కర్లేదు, మేం చావకుండా ఉండే సాధనం మా కిమ్మ్ అన్న దేవతలకు వారుకోరిన అమృతాన్నే అందించిన వాడు! అని ముగ్ధులవుతున్నారాళ్వార్లు. అమృత సంపాదన విషయం స్మృతికి రాగానే దేవతలు కోరిపొందిన ప్రయోజనమెంతతుచ్ఛమైనదో తాము ఆశించే ప్రయోజన మెంత ఉన్నతమైనదో తోచి తమ ప్రయోజనమెట్టిదో తెల్పుతున్నారు.

ఆళ్వార్లు భగవంతుణ్ని 'అమృతమనీ, చక్రధారి' అనీ పిలుస్తుంటారు. వీరి 'అమృతం' ఆశ్రితులకు ఇష్టప్రాప్తిని, అని ష్టనివృత్తిని కలిగించే చక్రాన్నిచేత ధరించి ఉంటాడు. 'నిమిర్ శుడర్ఆళి' వికసించే తేజస్సుగల సుదర్శనాయుధంకలవాడన్నారు. ఆశ్రితుల కోర్కెల ను తీర్చేకొద్దీ. చక్రకాంతి పెరుగుతుందట. "నెడుమాల్, అముతిలుమ్ ఆత్తవినియన్" వ్యామోహశీలి, అమృతంకంటె భోగ్యభూతుడు. దేవతలు తనను కాక వేరే ఫలాన్ని కోరినప్పుడు, పోనీ, ఆకోరికనైనా నావల్లనే పొందుతున్నారు. అదే చాలునని తృప్తి పడేటంత వ్యామోహం కలవాడు స్వామి. పాపం! ఆ దేవతలు భేదాన్ని గుర్తించి వైలక్షణ్య జ్ఞానం కలవారే అయితే స్వామినే ఆశ్రయించేవారు. వారుపొందిన అమృతంకంటె మిక్కిలి భోగ్యభూతమైన అమృతాన్ని వదులుకొన్న దురదృష్టులు. "కౌపీనాచ్ఛాదన ప్రాయ వాంఛా కల్ప ద్రుమాదపి! జాయతే యద పుణ్యానాం సోపరాధః స్వదోషజః" (జీయర్ అరుమ్బుదం) దౌర్భాగ్యులకు కల్పతరువునుంచి గోచిబట్టను కోరుకునే బుద్ధి పుట్టడం స్వయం కృతాపరాధమే కదా! చతుర్ముఖ బ్రహ్మను ప్రసన్నం చేసుకొన్న ఒక బాపనయ్య తన భార్యను ఏదేని వరం కోరుకొమ్మన్నాడట. అమె ఉప్పు.చారును, చీపురును, కుండను కోరుకొన్న దట. భర్త క్రుద్ధుడై నీ అవయవాలన్ని

నీ వీపులో చేరి , గూని దానివగుదువుగాక' అన్నాడట. ఆమె గూనిదైన తర్వాత స్వామీ! నా పూర్వపు అందచందాలను ప్రసాదించండి, అనివేడుకోగా 'తథాస్తు, అన్నాడట భర్త. (అ. అరుంబదవిశేషం'లో ఈ 'షడ్వరకథ' అనుసంధేయమని ఉంది. కుబ్జ బలరామకృష్ణులకు చందనం సమర్పించి ఎట్టి ఫలాన్ని పొందిన వృత్తాంతమూ స్మరణీయమే. 'నంబితిరువళుది నాడు దాసర్' అనే మహానుభావులు ఈ దేవజాతి కేవలం జ్ఞానహీనమైనది. ఉప్పుసారమైన అమృతం ఎప్పుడు బయల్పడుతుందో అని ఎదిరిచూస్తూ అధోముఖులయ్యారే కాని, సముద్రమథనం చేస్తున్న స్వామి సౌందర్యాన్ని భోగ్యతను అనుభవించి ఆనందించలేక పోయారు, అనే వారట(ఈడు వ్యాఖ్య)

''నిమిర్ తిరైనీళ్ కడలానే''- పెరుగుతున్న కెరటాలుకలవిశాల సముద్రమందుశయనించే వాడు అమృతందొరికే పాలకలిలోనే సర్వావయవాలను అసంకుచింతంగా వ్యాపించే రీతిగా పడుకొన్నాడు భగవానుడు తనపైన పవళించాడనే పారవశ్యంతో చెలరేగినందువల్ల, అలలతాకిడి అధిక మయిందన్నారు. అమృతంకంటె అధికభోగ్యమైన భగవచ్చరణ దాస్యాన్ని కోరుకోలేని దేవతల క్షుద్రప్రయోజన పరతను తెగడినార్రు ఆళ్వార్లు.

7. పాదాసక్త ప్రసత్తేః : - నీళ్కడల్ శూళ్ ఇలంగైక్కోన్ తోళ్కళ్ తలైతుణిశెయ్తాన్ (7పా) విశాల సముద్రం చేత అగడ్త వలె పరివేష్టితమై దుర్భేద్యమైన ప్రాకారం కల్గిన లంకకు అధిపతి యైన రావణుడు తనచేతికి చిక్కి నాడని ఒకేసారి చంపక వాని బాహువులను, పదితలలను ఖండించివీరవిహారం చేసిన పరాక్రమవంతుడు శ్రీరామచంద్రుడు.

"తాళ్కళ్ తలైయిల్ వణంగి, నాళ్కడలైకళిమినే'- "సో త్రైవ హస్త! హనుమాన్ వరమాంవిముక్తిం బుద్ధ్యా వధూయ చరితం తవసేవతే సౌ (అతిమానుషస్తవం 32) ఓ రామా! అనుకూలురైన వారిని గుణంచేతనూ, ప్రతికూలురైనవారిని బాణంచేతనూ జయించేవీరుడవైన నీ యందుగాఢంగాకలిగిన స్నేహభక్తుల చేత నా మనస్సు నీ గుణాను భవాన్నివిడిచి పరత్వానికి కూడా పోజాలదు. (భావోనాన్య త్రగచ్ఛతి) పరత్వమనే పేరు నూ చెప్పడానిక సహ్యామై అన్యత్రఇక్కడి నుండి, ఇంకెక్కడికి పోజాలదు' అని రాముని "చరిత్రనే యత్రయత్రరఘునాధకీర్త నం"- అన్నట్లు అనుభవించే హనుమంతునివలె, నిరతి శయ భోగ్యభూతుడైన రాముని పాదాలకు శిరసానమస్కరించి అయనచరితను అనుభవిస్తూ (కాల) భవసాగరాన్ని దాటండి అన్నారాళ్వార్లు.

సకృదుపసదనే మోక్షణాత్ :- కళిమిన్ తొండీర్‌కళ్! కళిత్తు తొళుమిన్ అవనై (8పా) భగవద్విషయమందు రుచి (చాపల్యం) కలవారలారా! బాహ్య విషయాలను వదలివేయండి! స్వామిని ఆశ్రయిస్తే క్రమంగా ఇతర విషయ వాంఛలు స్వయంగా తొలగిపోతాయని అశ్రద్ధచేయకుండా, వాటిని తొలగించుకొని ఆయనను ఆశ్రయించండి. ఆరాధించండి.

'తొళుదాల్ వళినిన్టవల్ వినై మాళ్విత్తు అళివు ఇన్ని అక్కం తరుమే' - ఆశ్రయిస్తే దారికి అడ్డుగా నిల్చిన క్రూరపాపాలను నశింపచేసి, నాశనం లేని సంపదను ఇస్తాడు స్వామి 'నమస్కరించండి' అన్న తర్వాత మళ్ళీ 'నమస్కరిస్తే' అని చెప్పడమెందుకు? అంటే, చెరుకు తిన్నందుకు కూలిచ్చినట్లు, ఆశ్రయించడమే సుఖ రూపమైఉండగా ఇంకొక ఫలం కూడా లభిస్తున్న దన్న ఆనందమే ఆత్మ నాశ్రయించి ఉన్న ప్రబల కర్మలు ఆత్మకంటె వేరుగా ఉన్నట్లు తోచక, ఆత్మ స్వరూపమే కావచ్చు నను కొనే రీతిగా విడదీయరాకుండా ఉన్నాయి. వాటిని సవాసనగా పోగొట్టడమేకాదు. "నచపునరావర్తతే" -(ఛాం.ఉ) బ్రహ్మలో కాన్ని పొందిన వాడు మళ్ళీ తిరిగి రాడు' అని చెప్పినట్లు పునరావృత్తి రహితమైన మోక్షసంపదనూ ప్రసాదిస్తాడు.

9. ధర్మసౌస్థ్యాత్ :- తరుమవరుంపయనాయ తిరుమకళార్ తని క్కేళ్వన్ (9పా) (1) తరుమ్+అవ్వరుం పయనాయ=శాస్త్రాలలో దుర్లభాలుగా ప్రసిద్ధి పొందిన ఫలాలను అనుగ్రహిస్తాడు స్వామి (2) తరుమమ్+అరుం, పయనాయ = ధర్మాలచేత పొందడానికి అశక్యమైన ఫలమే మూర్తీ భవించిందో అన్నట్లున్నలక్ష్మీ దేవికి వల్లభుడు, కాబట్టి, అద్వితీయనాయకుడు అయినవాడు.

"పెరుమైఉడైయ పిరానార్, ఇరుమైవినై కడివార్" -గొప్పతనం కల్గిన ఉపకారకుడు. శ్రియఃపతి మహత్వ పూర్ణుడు. లక్ష్మీ పురుషకారం వల్ల మోక్ష విరోధాలైన రెండు రకాలుగా ఉన్న కర్మలను పుణ్య పాపాలను పోగొట్టే మహోపకారకుడు శ్రీమన్నారాయణుడు. పుణ్యం సుఖాన్ని స్తుంది. పాపం దుఃఖాన్ని కలిగిస్తుంది. భగవత్ప్రాప్తికి పుణ్యపాపాలు రెండూ విరోధులే కాబట్టి వాటిని తొలగించే వాడు సర్వేశ్వరుడే.

10. క్షిప్రక్షిప్రాహిత త్వాత్:- కడివార్ తీయవినైగళ్ నొడి అరుమ్ అళవైక్కణ్(పా10) భగవానుడు ఆశ్రితుల పాపాలను పోగొట్టేవాడని 8 పాశురంలోను, లక్ష్మీ సన్నిధిలో

ఆపని అమోఘంగా నెరవేరుతుందని 9 పాశురంలోను, క్షణకాలంలో నెరవేరుతుందని ఈ 10 వ పాశురంలో చెప్పబడింది. 'కొడియా అడుపుళ్, ఉయర్త వడివు అర్ మాదవనారే'- శత్రువిధ్వంసకుడైన గరుత్మంతుణ్ని ధ్వజంగా ఎత్తినవాడు, దివ్యమంగళ విగ్రహాంచి తుడైన మాధవుడు- క్షణకాలం పూర్తి అయ్యే వరకు ఘోర పాపాలను పోగొడుతాడు. భగవానుడు, నిత్య సంసారులమైన మనలను కూడా గరుత్మంతుణ్ని ఏలుకొన్నట్లు ఏలుకొంటాడని 'తిరుక్కురుకై ప్పిరాన్ పిళ్ళాన్' అభిప్రాయం. ఈ పాశురార్థాన్నే శ్రీవైకుంఠస్తవంలో యఃకశ్చిదేవ యదికించన హస్త! జంతుర్భ వ్యో భజేత భగవంతమనన్య చేతాః" ఎవడైనా ఏదినమైనా అనన్యమనస్కుడై భగవంతుణ్ని ఆశ్రయించి ఆరాధిస్తే, ఆవ్యక్తిని కూడా నిత్య సూరి శ్రేష్ఠుడైన వైనతేయుణ్ని ఆదరించినట్లు ఆదరిస్తాడని శ్రీకూరేశు లన్నారు. 'అడుపుళ్ కొడియా ఉయర్త వడివార్' - ఆశ్రిత విరోధులను నశింప చేసే గరుడుణ్ని ధ్వజంగా దాల్చిన, అంటే గరుడ ధ్వజత్వమే స్వరూపంగా కలవాడు, అని అర్థం. 'వడివార్' అని విడిగా చెప్పితే, అందమైన శరీరం కలవాడు. 'వడివార్ మాతవనార్, అంటే సౌందర్య స్వరూపిణి యైన లక్ష్మికి వల్లభుడని అర్థం.

కాల తత్త్వ మున్నంత వరకు యత్నించినా, మనం పోగొట్టుకోలేనివి మన పాపాలు. వీటిని చూచి భగవానుడు అసహ్యించుకొన్నప్పుడు, భగవతి జగన్మాత మన స్థితి గతులను స్వామికి నివేదిన్తుంది " జనన మరణాలు ఒక దాని వెంట మరొకటితరుముకొంటూ వస్తుంటాయి ఈ రెండింటి మధ్యకాలంలోనైనా స్వస్థచిత్తులై సత్కార్యాలు చేయాలంటే మానసిక, శారీరక రుగ్మతలు వెన్నాడుతుంటాయి. ఈ స్థితిలో తప్పుచేయక ఎవరుండ గలరు? దోషమున్న వారందరినీ దూరంచేసుకోవాలనుకొంటే, మొత్తం విభూతినే వదలి వేయవలసిందే కదా! కాబట్టి క్షమించి అనుగ్రహించండి" అని స్వామికి చెబుతుంది. లక్ష్మీ దేవి ముఖవికాసం కోసం ఆమె వల్లభుడు మనలను కటాక్షిస్తాడు.

11. సుకరభజనతాం మాధవ స్యాభ్యధత్త - మాతవన్ పాల్ శడకోపన్ తీదు అవమ్ ఇన్రి ఉరైత్త, ఏదమ్ ఇల్ ఆయిరత్తు ఇప్పత్తు ఓతవల్లార్ పిఱవార్(11పా) శ్రీ శఠకోపసూరి, ఆశ్రితులను ఉపేక్షించడమనే దోషం స్వామి యందు లేదని చెప్పిన, ఏ కొరత లేని సహస్రగీతిలోని ఈ పది పాశురాలను అభ్యసించినవారికి జన్మవల్లకలిగే దుఃఖం ఉండదు.

భగవానుడు సుఖంగా భజనీయుడు, అని ఆరాధన పద్ధతిని గీతలో 'పత్రం పుష్పం ఫలంతోయం' అని శ్రీ కృష్ణుడు విశదీకరించాడు కదా! 'పత్రం' అంటే శ్రీ కృష్ణుని పరిభాషలో 'చందాంసి' యస్య పర్ణాని' చెప్పబడింది. స్వాధ్యాయం దివ్యప్రబంధాను సంధానం, స్తోత్రపఠనం, ఇత్యాది వివక్షితం - శ్రియః పతికి ప్రీతికరమైన పుష్పమేది? అంటే; అహింసా ప్రథమం పుష్పం అనే అష్టవిధపుష్పసమర్పణం సముచితం. " సర్వకర్మఫలత్యాగం తతః కురుయతాత్మవాన్ " అని చేసిన కర్మ ఫలాన్ని 'శ్రీకృష్ణార్పణం' అంటూ ఫల సమర్పణం చేయుమన్నాడు. తోయం అంటే నీరు. 'ఆహ్లాద శీతనే త్రాంబుః పులకీకృతగాత్ర వాన్! సదా పరగుణావిష్టః ద్రష్టవ్యః సర్వదేహిభిః ॥" శరీరం పులకించి, ఆనందభాష్పాలతో భక్తి పారవశ్యమైన కార్యమే నీరు అని చెప్పబడింది.

పాండవదూతను వశపరచుకోవడానికి దుష్టచతుష్టయం ఆలోచిస్తున్నప్పుడు, విదురుడు "అన్యత్ పూర్ణాదపాంకుంభాత్, అన్యత్ పాదావనే జనాత్! అన్యత్కుశల సంప్రశ్నాత్, నచేచ్ఛతి జనార్దన: ॥" శ్రీ కృష్ణుడు వచ్చే సమయాన గుమ్మంలో జలపూర్ణ కలశముంచడం, పాద్యమొసగడం, కుశల ప్రశ్న చేయడం కంటె వేరొకటి జనార్దనుడు కోరడు అని చెప్పాడు కదా!

"యాఃక్రియాః సంప్రయుక్తాః స్యుః ఏకాంత గత బుద్ధిభిః । తాః సర్వాః శిరసాదేవ: ప్రతిగృహ్ణాతి వై స్వయమ్॥" (భారతం- మోక్షధర్మం)- సర్వేశ్వరునియందుమాత్రమే మనస్సు కలవారు చేసే సేవలను ఆస్వామి తానే శిరసా ప్రీతితో స్వీకరిస్తాడు" ఎంత శ్రీమంతుడైనా, సంభోగానంతరం ప్రియాస్వేద సమ్మార్జనానికి ప్రతినిధిని (పనిమనిషిని) నియమించడుకదా! స్వీయ వస్తువును స్వయంగా అనుభవిస్తేనే ఆనందం. భగవదారాధన ఎంతసులభమో, ఈ దశకంలో ఆళ్వార్లు ఉపదేశించారు.

ఈ పాశురంలో 'తీతు, అవమ్, ఏదమ్' అనే మూడు పదాలకూ 'దోషం ' అని అర్థం మూడుసార్లు 'దోషంలేని' అనడంవల్ల (1) ప్రమాణమైన ఈ ప్రబంధానికి (2) ప్రమేయుడైన (ప్రబంధప్రతిపాద్యుడైన) భగవానునికి (3) ప్రమాత (ప్రబంధకర్త) కు కూడా దోషాలు లేవని ఆరువేల వ్యాఖ్యలో చెప్పబడింది. భట్టర్ 'ఏదమ్' ను ప్రబంధ పరంగా అన్వయించారు. తక్కిన రెంటిని భగవంతునికి అన్వయించారు. ' నేను సర్వేశ్వరుడను కదా! అని తన ప్రభుత్వాన్ని బెట్టుగా కొని తాను దూరమవడం 'తీతు'

(దోషం) సంసారులు అల్పులు అని మనను దూరం చేయడం 'అవమ్'. ఇలాగా ఈ రెండు దోషాలు లేనివాడు భగవానుడు అన్నారు.

సప్తమదశకం

7. సచ్చిత్తాకర్ష హేతో రఘశమన నిధేర్నిత్యభోగ్యామృతస్య
త్యాగే హేతూ జ్ఝితస్యప్రవహదు పకృతే ర్దుస్త్య జస్వానుభూతేః।
త్యాగా కాంక్షా నిరోద్ధు శ్రితహృదయ పృథక్కార నిత్యాక్షమ స్య
స్వాత్మ శ్లిష్టస్య గాయ చ్ఛ్ర మహరయశస స్సేవనం
స్వాద్వవోచత్॥ 18

అర్థం :- సత్+చిత్త+ ఆకర్షహేతోః = సత్పురుషుల యొక్క మనస్సును వశపరచుకోవడానికి కారణమునూ; అఘశమననిధేః = పాపాలను పోగొట్టడానికి నిధియు; నిత్య భోగ్య+అమృతస్య = సర్వదా అనుభవింపదగిన అమృతమునూ; త్యాగే, హేతు + ఉజ్ఝితస్య = విడిచిపెట్టడ మందు కారణరహితుడునూ, ప్రవహత్+ఉపకృతేః = ప్రవహిస్తున్న ఉపకారాలు కలవాడునూ; దుస్త్యజ, స్వ+అనుభూతేః = విడువకూడని తన అనుభవం కలవాడునూ; త్యాగ+ఆకాంక్ష+నిరోద్ధుః = విడువగోరినప్పుడు అడ్డగించేవాడునూ; శ్రిత హృదయ పృథక్ కార నిత్య + అక్షమస్య = ఆశ్రితులహృదయాన్ని ఎడబాయడానికి ఎల్లప్పుడూ అశక్తుడునూ; స్వ+ఆత్మ శ్లిష్టస్య = తనతో కలసి ఉండే వాడునూ; గాయత్+శ్రమహరయశసః = పాడేవారి శ్రమను తొలగించే కల్యాణ గుణాలు కలవాడునూ అయిన శ్రీపతి యొక్క; సేవనం = కైంకర్యం; స్వాదు = భోగ్యమని; అవోచత్ = పలికెను.

తా॥ భగవంతుణ్ని ఆశ్రయించడం మనోజ్ఞంగా ఉంటుందని, ఆశ్రయింపదగిన భగవానుడు పరిశుద్ధుడైనందువల్ల ఆశ్రితుల పాపాలను పోగొట్టేవాడని, నిరవధికమైన ఆనందం కలవాడు కాబట్టి ఆశ్రితులకు ఎల్లప్పుడూ సంతోషకరుడని, సర్వేశ్వరుణ్ని విడువడానికి కారణం లేదని; భగవంతుణ్ని విడువగోరినా ఆయన అనుభవం

నరసమైనందువల్ల నేను విడువడానికి అనమర్ధుడనని, ఆయన నన్ను విడువయత్నించినా, నేను ఆయనను విడువనని; నేను విడిచినప్పటికీ ఆయన నన్ను విడువడని; నన్ను విడిపించినా నా మనస్సును విడిపించడానికి ఆయన అసమర్థుడని, సర్వవిధాలా ఆయనతో కలిసి యున్న నా మనస్సు ను త్యజించడానికి కారణమేలేదని, సర్వదా ఆయనకల్యాణ గుణాలను కీర్తించినప్పటికీ మనోవాక్కాయాది కరణాలకు తృప్తిలేనందువల్ల స్వామిని విడిచిపెట్టడం అశక్యం అనీ, భగవదాశ్రయణం యొక్క సరసతను ఈ ఏడవదశకంలో ప్రసాదించారు.

ప్రకా-వాఖ్య :- భగవంతుణ్ని ఆశ్రయించడం ఆనందదాయకం. అంతేకాదు; ఆశ్రయించడమే ఆనందం. "రాజవిద్యారాజగుహ్యం పవిత్రమిదముత్తమమ్! ప్రత్యక్షావగమంధర్మ్యం సుసుఖం కర్తు మవ్యయమ్॥ (భ.గీత) భగవత్ప్రాప్తికి ఇతరోపాయాలకంటె భక్తి అనే ఉపాయానికున్న ప్రత్యేకతను భగవానుడు విశదం చేశాడు. ఈ భక్తి విద్యలలో శేష్ఠమైనది, రాజవిద్య మహా రహస్యం, పరమ పవిత్రం, ప్రత్యక్ష విషయం కలది. విషయం భగవానుడే కాబట్టి భక్తి అంటే మనస్సు దేన్ని ధ్యానిస్తుందో, ఆధ్యానం విచ్ఛేదం లేకుండా సాగడమే ఉపాసన లేదా భక్తి. ఇది పరమాత్మను దర్శింప చేస్తుంది. ఇంద్రియగోచ రునిగా చేస్తుంది. " నమాంస చక్షురభివీక్షతేతం" ప్రాకృత నేత్రాలు పరమాత్మ ను చూడ లేవు - అని శ్రుతి చెబుతుంది కదా! ప్రత్యక్షావగమం ఎలా అవుతుంది? అంటే ఉపాసించే వారికి భగవానుడే స్వయంగా ఇంద్రియ గోచరుడవుతాడన్నాడు.

'ధర్మ్యం' అంటే ధర్మ మైనది 'ధర్మం' అంటే ఉత్తమ ఫలసాధనం. ఉత్తమ ఫలం భగవత్ప్రాప్తియే కదా! భగవద్దర్శనం అవుతుంది, అంటే అధర్మాన్నైనా ఆచరించవలసిందే. ధర్మమే అయి నప్పుడు భక్తిని స్వీకరించకూడదా? అవ్యయం = నశించనిది. ఇతరకర్మలన్నీ ఫలాన్ని ఇచ్చి తాము నశిస్తా యి . భక్తి భగవంతుణ్ని పొందిన తర్వాత కూడా తాను నశించక నిరంతరం స్వామిని స్మరిస్తునే ఉంటుంది. "ఏష హ్యేవానందయాతి!" స్వామి ఆనందుడు.

ఆనందాన్ని పొందిస్తా డన్నది ఉపనిషత్తు. అందువల్ల మోక్షమానందమయింది. ఆశ్రయణ దశ కూడా ఆనందమే".

"అ శ్రద్ధధానా ః పురుషాః ధర్మస్యాస్య పరంతప

అప్రాప్య మాంనివర్తంతే మృత్యు సంసా ర వర్త్మని" ॥ (భ.గీత)

ఈ ఉపాసన మందు విశ్వాస పూర్వకమైన త్వరలేని పురుషులు నన్ను పొందక మృత్యు రూప సంసార మందు తిరుగుతుంటారు, అని ఈశ్లోకార్థం. 'అస్యధర్మస్య' అనడంవల్ల భగవంతునికి కూడా భోగ్యమైనది ఈ భక్తియే, అని తెలుస్తున్నది; అయ్యో ! మనకు ఆరాధించే భాగ్యంలేకపోయెకదా! అని భగవంతుడు సైతం ఆశపడేటంత భోగ్యత కలది భగవదారాధనమని నంబిళ్ళైగారి సూక్తి.

వటదళ మధిశయ్య రంగధామన్, శయిత ఇవార్ణవ తర్ణకః పదాబ్జమ్!

అధిముఖము దరే జగంతి మాతుం, నదధిథ-వైష్ణవభోగ్యలిప్సయావా॥

ఓ రంగనాథా! నీ భక్తులు నీ శ్రీ పాదకమల మందలిభోగ్యతను వర్ణించగావినీ, వినీ అభోగ్యతను రుచి చూడాలని మఱ్ఱి యాకుమీద బొటనవ్రేలును నోట బెట్టుకొని పవళించిసావా ప్రభూ? లేక నీకుక్షిలో కూరు కొని యున్న జగతిని కాపాడడానికి నీ శ్రీచరణ తీర్థాన్ని లోపలికి పంపు తున్నావా? అని శ్రీ భట్టర్ శ్రీ రంగరాజస్తవం లో వర్ణించారు.

"మనుజత్వ తిరోహితేనశక్యే వపుషైకేన విరోధినాం నిరాసే।

అభజత్ భరతాది భేద మీశః స్వయమారా ధయితుం పదావని! త్వామ్." (పాదుకాసహస్రమ్-176) శత్రు నిరసనం కోసం ఒక్క రామరూపం చాలుకదా! మరి భరతాది రూపాలతో ఎందుకవతరించాడు భగవానుడు? అంటే తన పాదుకను ఆరాదించడానికే" అన్నారు శ్రీ వేదాన్తదేశికులు.

నిరతిశయ మాధుర్యం గల భగవత్సేవను కోరక 'ఆత్మలాభం' అనే అల్పపురుషార్థాన్ని కోరుకొనే కేవలులను తూలనాడుతూ, భగవదాశ్రయణంలో ఉండే భోగ్యతను ఈ 'తిరువాయ్ మొళి'లో తెల్పుతున్నారు నమ్మాళ్వార్లు.

సచ్చిత్తాకర్షహేతోః :- పిఱవి తుయర్ అఱ(పా1) జన్మవల్ల కలిగే దుఃఖం పోవునట్లు 'జ్ఞానత్తుళ్ నిన్ఱు' - జ్ఞానమందు నిలిచి; తుఱవి - ప్రకృతినివిడిచి; శుడర్ విళక్కమ్, తలై పెయ్ వార్ - ప్రకాశవంతమైన ఆత్మ వికాసాన్ని దర్శించే వారు. (ఆత్మసాక్షాత్కారం

పొందగోరే కైవల్యార్థులు) అఱవనై ఆళిప్పడై అన్దణనై - ధార్మికుడుగ, చక్రాయుధుడుగా ఉండే పరిశుద్ధుని (శ్రియః పతిని) మఱవియై ఇన్ఱి మనత్తు వైప్పార్ - మరువకయే మనస్సులో నిలుపుతారు (ధ్యానిస్తారు)

(1) కైవల్యార్థుల అజ్ఞానం వారిదురదృష్టం (2) భగవత్ప్రాప్తి కాముల ఆర్తివారి అదృష్టం. ఈ రెండు తెగలవారికోరికలను తీర్చే ఉదారుడుస్వామి, అని రెండు విషయాలను ఈపాశురంలో తెల్పుతున్నారు.

(1) జరామరణ మోక్షాయ - అన్నట్లు ముసలితనంనుంచి, మరణంనుంచి విడివడాలన్నా, భగవంతుణ్నే ఆశ్రయించాలి. ఇలాగా ప్రకృతి విని ర్ముక్తుల వడానికి మాత్రమే భగవంతుణ్ని ఆశ్రయించి, ఆత్మసాక్షాత్కారాన్ని పొంది స్వయంప్రకాశత్వాన్ని కలిగి ఉండేవారు ('చతుర్విధా భజం తేమాం' అన్నట్లు నాలుగు విధాలుగా ఉన్న భక్తులలో ఒక తెగవారు) కేవలులు. ఐశ్వర్యాన్ని కానీ, ఆత్మలాభాన్ని గానీ, భగవత్సేవనుగానీ పొందగోరినా, అంతిమస్మృతి దాకా సర్వేశ్వరుణ్ని ఉపాసించవలసిందే. స్వామివరకు కోరిక వెళ్ళక నడుమనే ఆగిపోవడానికీ స్వామినే పొందాలనుకోవడానికీ కారణం వ్యక్తుల పూర్వపుణ్యంలో ఉన్న భేదమే ఈ సుకృత విశేషం చేత వేర్వేరు పురుషార్థాల యందు రుచిపుడుతుంది. రుచిని బట్టి ఉపాసన. ఉపాసనకు తగినట్లు ఫలంలభిస్తుంది. 'పిఱవి' అనే మాటచేత ప్రకృతి సంబంధంగల జీవునికి కలిగే - పుట్టడం, ఉండడం, మారడం, పెరుగడం, తరుగడం, నశించడం, -అనే, ఆరు రకాల దుఃఖాలు సూచింపబడినాయి. ఈ దుఃఖాలను నివారించుకోవాలనే జ్ఞాన మందునిలిచి భగవంతుని సేవలభించే దాకా పోగలిగినా, పోలేక ఆత్మాను భవంలోనే కూరుకొని పోయే వారు కేవలులు.

ఈ కేవలులను ఆళ్వారు నిందిస్తున్నారు. 'తిరువిరుత్తం' లో ఈ ఆళ్వారే "ఇన్నిన్ఱనీర్మైయిని యాముఱామై". సంసారబంధాన్ని తమకు అంటకుండా అనుగ్రహించు మని ప్రార్థించారు. కేవలులను, వారికోరికలను తక్కువగా భావించడానికి కారణమేమి? అంటే భగవత్ప్రాప్తియే ఆళ్వారుకు ముఖ్య ప్రయోజనం. ప్రకృతి సంబంధంతొలగిపోవడం ఆనుషంగికం. అంటే, ఇది భోజనానికి ముందు చేసే పాదప్రక్షాళనంలాంటిది. కాబట్టి వీరు జన్మాదులనే వద్దని కోరుకొన్నారు. కేవలులు ప్రకృతి సంబంధంతొలగిపోవడానికి మించిన ప్రయోజనం కోరడం లేదని వీరిని నిందిస్తున్నారాళ్వార్లు.

జీవాత్మ సంసారంలో ఉన్నప్పుడు కూడా జ్ఞాన స్వరూపుడై ఉంటాడుకాని అప్పుడుకర్మ కారణంగా జ్ఞానంసంకోచిస్తుంది. మోక్షదశలో ఆత్మ జ్ఞానస్వరూపం వికసితమై ఉంటుంది. భగవానుడు పరమ ఉదారుడు. నీవు అక్కరలేదు. మాకు అల్పమైన ఆత్మానుభవమే చాలును అని ప్రార్థిస్తే దాన్నే ప్రసాదిస్తాడు స్వామి. ఆత్మానుభవవిరోధులను తరిమివేసే చక్రం చేతిలోనే ఉంది, పరిశుద్ధుడైన ప్రభువు మా కోరికను తీరుస్తాడని కేవలులు భావిస్తారు. అంతే, చక్రహస్తుని అందచందాలను చూచి పరవశించరు.

గృహ పరిశుద్ధికి బ్రాహ్మణులు పేడను ఉపయోగిస్తారు. అట్లే తమ ఆత్మానుభవవిరోధులను నశింపజేసే పరిశుద్ధుడని మాత్రమే ఆ సౌందర్యనిధిని వీరు భావిస్తారు.

"ఆ ళి యెడుమ్ పొన్నార్ శార్ఙ్గముడైయ పడికళై యిన్నారిన్దరియాన్" -చక్రాన్ని, శార్ఙ్గమనే చాపాన్ని ధరించినస్వామి దేవుడో మానవుడో తెలుసుకోలేక పోతున్నాను అని తిరుమంగై ఆళ్వారు కూడా సుదర్శనా యుధుని సౌందర్యాన్ని చూచి పరవశించిపోయారు. మంచిని కూడా మరపించే భగవద్విషయాన్ని ఆశ్రయించి చెడును కూడా వదల లేక పోయారే వీరు, అని కేవలులను తూలనా డారు.

(2) ఈ పదాలలోనే భగవత్ప్రాప్తికాముల విషయాన్ని తెల్పడం రెండవ నిర్వాహం. పిఱవిత్తుయరఱ - సాంసారిక సకల దురితాలు పోయే విధంగా భగవద్గుణజ్ఞానం కలిగి, ప్రకృతి సంబంధమూ కలిగి ఉండి, గు ణ ప్రకాశకమైన దివ్య మంగళ విగ్రహ సౌందర్యాన్ని అనుభవించడానికి వారుకోరే ఉపాసన అనే ధర్మానికి నిర్వాహకుడూ, అజ్ఞానాంధకారనివారకమైన చక్రాన్ని ధరించిన వాడూ మిక్కిలి పవిత్రుడూ అయిన సర్వేశ్వరుణ్ని విచ్ఛేదం లేకుండా అనుభవించాలని సర్వదా మనస్సులో తలచే వారు భగవత్ప్రాప్తికాములు.

'పిఱవిత్తుయరఱ జ్ఞానత్తుళ్ నిన్ఱు' భగవద్గుణజ్ఞానం కలిగి ప్రకృతి బంధాన్ని విడిపించుకోవడానికి సాధనం ఉపాసన. "తుఱవిచ్చుడర్విళక్కమ్, తలైపెయ్వార్"- దివ్య గుణాలకా స్పదమైన దివ్య మంగళ విగ్రహాన్ని దర్శించడమే ఫలం తన విషయమై విముఖులైన వారి అభీష్టాన్ని కూడా సిద్ధింప చేస్తున్న భగవానునిది ఎంత ఔదార్యమో! అని ఆళ్వార్లు ఆశ్చర్యపడుతున్నారు

2. అఘశమన నిధేః : - వైప్పుఅమ్, మరుందు అమ్ - (పా2) నిధి అవుతాడు. మందు అవుతాడు. భగవత్ప్రాప్తినే ఆశపడేవారిపట్లస్వామి ఎలా ఉంటాడో తెలిపారు. భగవానుడుభక్తునికి, దాచి ఉంచుకొని తనకు నచ్చిన రీతిలో ఉపయోగించుకోవడానికి తగినట్లుండే నిధి లాంటివాడు. ఎంత అనుభవించినా తరుగనినిధివలె ప్రాప్యం. ఇది స్వామి యొక్క ఉపాయస్వరూపం.

క్షుద్రవిషయాలను కూడా సమగ్రంగా అనుభవించలేని చేతనులకు, తనను అనుభవింప గల భోక్తృ త్వ శక్తి ని ప్రసాదించడానికీ, వారికి గల అనుభవవిరోధులను తొలగించడానికీ సాధనమైన ఔషధం సర్వేశ్వరుడే. ఇది భగవంతుని ఉపాయస్వరూపం

"య ఆత్మదా బలదా" (వేదం) తనను తానే ఇచ్చే వాడు, బలాన్నీ ఇచ్చేవాడు, అన్నం దు వల్ల భగవానుడే ఉపాయమూ, ఉపేయమూను. "న నమేయంకదాచన" స్వామి పాదసన్నిధిలో నే నెప్పుడు తలవంచను' అన్నరావణుని లాంటి వారు. స్వామిని ఆశ్రయించి, కోరికలనుపొంది తర్వాత ఆయనకు దూరంగా ఉండేవారు భక్తులుకారు. సర్వకాల సర్వా వస్థల యందు సర్వం సర్వేశ్వరుడే అంటూ ఏకాంత గత బుధ్ధు లైన భక్తులను భగవానుడే ఉపాయమై ఉపేయమై అనుగ్రహిస్తాడు.

"అడియరై వల్వినై తుప్ప అమ్, పులన్ ఐందుం తుంజక్కొడాన్' భక్తులను, ధృఢకర్మలను వృద్ధి పరచే, ఐదు ఇంద్రియాలచేత, దుఃఖింపనీయడు. పాపమార్గం లో ప్రవర్తింప జేసే సామర్థ్యం గల పంచేంద్రియాలు జీవులను బాధింపకుండా చేసే వాడు లేదా ఇంద్రియాలు శబ్దాది విషయాల అనుభవంచేత, నాశనంకాకుండా చేసేవాడు భగవానుడు.

'అవన్ ఎప్పాల్ '- ఆయన సర్వత్ర ఉండేవాడు." నలత్తాల్ ఉయర్ న్దు ఉయర్న్దు ఎవర్క్కుమ్, అప్పాల్ అవన్, ఎంగళ్ ఆయర్కొళున్దే" ఆనందగుణంచేత పెంపొంది పెంపొందియున్న, ఎవరికిగాని , మనస్సులకూ మాటలకూ అందనివాడు, మాగోపాలనాయకుడే. ఎప్పాల్ - ఏస్థల మందున్న, ఎవర్క్కుమ్ - ఎవరికినీ " అని రెండు విధాలుగా ఎందుకన్నారు? స్థలాన్ని బట్టి శరీర భేదాలను బట్టి ఎక్కువ తక్కువ లుంటాయి. మానవులకూ దేవతలకూ భేదముంది. భూమికీ స్వర్గానికీ భేదం ఉంది కదా! అన్ని స్థలాల లో ఎంతో ఉన్నతిని పొందిన వారెందరో ఉన్నారు. ఆనందగుణంచేత అంతట ఉన్న వారందరినీ మించి "యతో వాచో నివర్తంతే" (వేదమన్నట్లు)

వాఙ్మనసాతీతుడైన భగవానుడే మాగోపాల చక్రవర్తి . ఆశ్రితులు విషయలో లు రై నశించక ఉండాలని సజాతీయుడై అవతరించాడు, వారి శోక మోహాలను పోగొట్టడానికి తానే వాటినీ అనుభవించాడు. 'ఆనందమయః' ఉపనిషత్తు 'పరబ్రహ్మతత్త్వం నిరతిశయానంద ప్రచురం' అని తెల్పింది అట్టి పరత్వాన్ని తనకంటె మించి నవారు లేని స్థితిని వదలి, తనకంటె మరింత తక్కువవారు లేరు. అనిపించే విధంగా ఉన్నాడు గోపాలనాయకుడు. 'మాగోపాలనాయకుడు:- నందవ్రజంలోని పేళ్ళలో తానొకడనే భావంతో అన్నాడు.

గోవిందుడు చేసిన నవనీత చౌర్యాదిలీలలను, ఆగోపజనాన్ని తన వారిని గా చేసుకోవాలని చేసినా, ఆలీలలను తలచుకొని మోహ పడిన ఆళ్వార్లు నందనందనుణ్ని తమ స్వంతమనుకొని 'మాగోపాలనాయకు'డన్నారు.

చతుర్ముఖ శతమఖ, ముఖ నిఖిల బర్హిర్ముఖులకు నాయకుడై పొందిన గొప్పతనాన్ని గోపాలనాయకుడనై పొందినా నని ఆ హృషీకేశుడు హర్షిస్తాడని భావం.

3. నిత్యభోగ్యామృతస్య :- ఆయర్‌కొళున్దాయ్ (పా3) స్వామి గొల్ల ఎకిమీడుఅయినాడు. గొల్లలనందరినీ శాసించే వాడుగా ఉన్నాడు కదా! అనుకోరాదు. వారితో కలిసి అరమరికలు లేకుండా ఉన్నాడు. వారి కంటె తాను అధికుడననిభావించలేదు.

'కొళున్దు' అంటె 'చిగురు'. ఎక్కడున్నా చిగురు ఆ చెట్టులోని ఒక భాగమే కదా! కాబట్టి శ్రీకృష్ణుడు ఆ గొల్లవారిలో తాను ఒకడై ఉంటాడు. చెట్టుపాదులోనీరుపోయక పోతే మొదట వాడిపోయేది చిగురే కదా! అలాగే, గొల్లలకేదైనా కష్టంవస్తే, ఈ బాలకృష్ణుని ముఖమే విచారంతో చిన్నబోయేదన్నమాట.

'అవరాల్పుడైయుణ్ణుమ్' -వారిచేత దెబ్బలు తిన్నవాడు. తల్లిచేత దెబ్బలు తినడం సహజమే, కాని అందరిచేత దెబ్బలు తిన్నాడా? అంటే 'అయిదు లక్షలగుడిసెలున్న ఆ ఊరివారందరిచేతకూడా, ఒక్కొక్కకవ్వపు దెబ్బతిని ఉంటాడు! అని భట్టర్ చమత్కృతి. అవాప్తసమస్త కాముడయినా తనకేదో కావాలన్నట్లే స్వామి గోకులంలోకి వచ్చాడు. ఆశ్రితులు స్పృశించిన పదార్థమే తనకు ధారకమను కొన్నాడు. అది సులభంగా చేతికి అందనప్పుడు చౌర్యానికి పూనుకొన్నాడు. ఆ నిసుగుకు దొంగతనంలో నూ పసి తనమే ఉన్నందువల్ల పాలు, పెరుగు, వెన్న ఉన్న ఉట్లమీది చట్లను కట్టెతో

కొట్టినప్పుడు చేతినిండా, మూతినిండా, మెయ్యినిండా అవిపడి, అవశ్యంగా పూసుకొన్నట్లుకనబడ్డాడు. సొమ్ముతో పాటు దొంగ పట్టుబడ్డాడు. కట్టబడ్డాడు. కొట్టబడ్డాడు. ఇట్టిస్థితిని తలచిన శ్రీశఠకోపసూరి ఒక్కసారే!! అక్కజపడి "మాయప్పిరాన్' ' ఆశ్చర్య భూతుడుకన్నయ్య- అంటూ వెల్లడించిందే ఈ తిరువాయ్ మొళి.

"ఎన్మాణిక్కచ్చోదియై, తూయ అముతై, పరుకి పరుకి" - నా మణి దీపాన్ని పరిశుద్ధామృతాన్ని త్రాగి త్రాగి - ఆశ్రితులు విధించిన శిక్షను బాగా అనుభవించి, సాన పెట్టిన మాణిక్యం లాగా ప్రకాశిస్తున్నాడు. ఆశిక్ష ఆనందదాయకమే కాబట్టి, ఇంద్రనీల మాణిక్యకాంతి లాంటి కాంతి కలదై కన్నయ్యమేనివన్నె మెరుస్తున్నది. దోషరహితమైన అమృతమే పరాత్పరుడు. దేవతలు కూడా ఆయనదగ్గరికి చేరరానట్లుండేవాడు. బ్రహ్మచర్యాది నియమాలను అనుష్ఠించే మహనీయులచే చేరదగినవాడు. అయినా ఆ స్వామి దర్శనం ఎప్పుడోకాని లభించదు. "నిరామయం కృష్ణరసాయనం పిబ" అన్నట్లు పరాత్పరుడు శ్రీ కృష్ణుడైన ప్పటి నుంచి అందరికీ నియమాల ఆవశ్యకత లేకుండా సేవింపదగినవాడై సర్వేంద్రియ సంతర్పిగా ఉన్నాడు.

'ఎన్ మాయ ప్పిఱవి మయర్వు అఱుత్తేనే' - ప్రకృతి వికృతి యైన నా జన్మ వల్లకలిగిన అజ్ఞానాన్ని పోగొట్టుకొన్నాను. పరిశుద్ధామృతస్వరూపుడైన స్వామి ని నిరంతరం అనుభవించడం వల్ల, దేవమనుష్యాద్యనే క రూపాలను కలిగించే నా అజ్ఞానం సవాసనగా పటా పంచలయింది, అన్నారాళ్వార్లు.

నేను అనన్య ప్రయోజనుడనై పరమాత్మున్ని ఆశ్రయించాను. అనలేదు. అది ఆత్మ ప్రశంస అవుతుంది. అలాగాచెప్పక స్వామిని సర్వదా అనుభవిస్తుంటే, విరోధం కలిగించేవన్నీ వాటంతట అవే పంచబంగాళమైపోయి నాయి. అందువల్ల ఇలాగా ఉన్నానని నమ్మాళ్వార్లు ఈ పాశురంలో తమస్థితిని వెల్లడించారు.

4. త్యాగే హేతూ జ్ఞితస్య :- మయర్వు అఱ ఎన్ మనత్తే మన్నినాన్ (పా4) అజ్ఞానం పోవునట్లు నా హృదయంలో స్థిరంగా ఉన్నవాడు. ఇంతకుముందే 'తిరువిరుత్తం' అనే ప్రబంధంలో "ఇన్నిన్ఱనీర్మై ఇని యాముఱామై" ఇటువంటి హేయమైనదేహాన్ని, దీని స్వభావాన్ని ఇక ముందు నీ కటాక్షంవల్ల మేము పొందక ఉండాలి" అని ఆళ్వార్లు భగవంతుణ్ని ప్రార్థించారు. ఆ విధంగానే జన్మవలని దు:ఖం దూరమయింది కదా! ఇక భగవద్విషయాన్ని వదలివేస్తారే మో అనే సందేహం కలుగకుండా, ఈపాశురంలో

ఇంతభోగ్యవిషయాన్ని ఏలోపమున్నదని వదలివేస్తాను; వదలనే వదలను - అంటున్నారు.

నివాసయోగ్యంగా మలచుకొన్న రాజధానిని వదలని చక్రవర్తి లాగా భగవానుడు ఆళ్వార్ల హృదయాన్ని తన మందిరంగా చేసుకొని వీడకుండా, స్థిరంగా ఉన్నాడు.

'తన్నై' - తనను (ఎలా వదలగలను) 'ఉయర్వినైయే తరుమ్' జ్ఞాన విశ్వాస, భక్త్యభివృద్ధినే ఇచ్చేవాడు. (వినై=క్రియ, వ్యాపారం) ఉత్కర్షహేతువులైన క్రియలు :- 1. జ్ఞానం - ప్రణవంలో చెప్పిన శేషత్వజ్ఞానం 2. విశ్వాసం - నమఃపదార్థమైన 'భగవానుడే ఉపాయం' అనే దృఢమైన నమ్మకం. 3. భక్తి - నారాయణ శబ్దార్థం ప్రాప్యమైన సర్వేశ్వరుణ్ని త్వరగా పొందాలి అనే ఆర్తి. ఆళ్వార్లకు అష్టాక్షరీమం త్రార్థాన్ని భావన చేసే సామర్థ్యాన్ని భగవానుడు అనుగ్రహించాడు. ఒకసారి ఇచ్చిఊరుకోలేదు. ఎల్లప్పుడు భక్తి కలిగిస్తూనే ఉంటాడు.

'ఒణ్ శుడర్ కత్తైయై' - చక్కని తేజోరూపుడు. బ్రహ్మాది దేవతలు స్వామిని 'తేజసాందాశి మూర్జితమ్' (వి.పు) అని కీర్తించారు. ఆళ్వార్లకు జ్ఞానభక్త్యాదులను కలిగించడం వల్ల తానేదో ఉపకారం పొందిన విధంగా ప్రకాశిస్తున్న భగవంతుణ్ని 'తేజః పుంజం' అన్నారు ఆళ్వార్లు.

'అయర్వ్వఇల్ అమరర్గల్ ఆది క్కొళున్దై' - ఎన్నడుకూడా భగవదనుభవవిషయమై మరపులేని నిత్య సూరులకు ముఖ్యనాయకుడు. మూలకారణమైనవాడు. ఆతిక్కొళుందు-మొదలు ఉన్న ఏ వస్తువైనా నిలిచి ఉంటుంది. కాబట్టి నిత్యసూరుల నిలకడకు ధారకమైనవాడు. మొదలు నుంచే తక్కిన భాగాలు ఆహారాన్ని గ్రహిస్తాయి. పెరుగుతుంటాయి. కాబట్టి, స్వామియే నిత్యసూరులకు పోషకం. 'కొళుందు' - చిగురు. అందమైనది, అనుభవయోగ్యమైనది చిగురు. కాబట్టి వారికి భోగ్యమైనవాడు భగవానుడు.

ఎన్ఇశైవినై - నన్ను వశంచేసుకొన్న, తనను పొందడానికి నాకు అమోఘమైన ప్రావణ్యాన్ని ప్రసాదించిన సర్వేశ్వరుణ్ని; - 'ఎన్శొల్లి యాన్ విడువేనో' ఏమని చెప్పి వదిలి వేయగలను? నా ఇచ్ఛయే తానై నా లో ప్రవేశించాడు. అజ్ఞానం మిగిలి ఉన్నదని స్వామిని విడిచిపెడుదునా? ఆయననా దరిచేరలేదని దూరమవుదునా? నాకు

యోగక్షేమాలను కలిగించలేదని వదలివేతునా? తాను చేసిన ఉపకారానికి ప్రత్యుపకారాన్ని కోరినాడనియా? పరత్వం తగినంత లేదనియా? సర్వేశ్వరునికి ఏలోపమున్నదని ఆయనను వదలివేయాలి? ఉత్తమ ఫలప్రాప్తికై నేను పడిన శ్రమ అధికమై విసుగు పుట్టి నందువల్ల స్వామిని విడిచి పెట్టగలనా? ఏమని సాకు చెప్పి సర్వశేషిని విడువగలను? నేను విడువనేవిడువను! అన్నారు ఆళ్వార్లు.

5. ప్రవహపకృతేః :- విడువేనో ఎన్ విళక్కై (పా5) విడువగలనా నా దీపాన్ని? (1) దీపం చీకటిని పోగొడుతుంది. అళ్వారు యొక్క అజ్ఞాన తిమిరాన్ని పోగొట్టేరీతిగా తన స్వరూపరూపగుణవిభూతులను నిర్హేతుకంగా దర్శింపజేసినాడుస్వామి. (2) దీపం పదార్థాలను ప్రకాశింప జేస్తుంది. తనను తాను ప్రకాశింపజేసుకొంటుంది . పరమాత్మ తనకు తాను ప్రకాశిస్తాడు. ఇతరులను ప్రకాశింపజేస్తాడు. కాబట్టి భగవానుడు 'విళక్కు' అందరికి ప్రకాశంకలిగించేస్వామిని 'ఎన్‌విళక్కు' నాదీపం అంటారేమి? తనకుమాత్రమే చెందినవాడా? అంటే అవును. దీపానికి స్నేహం ఉంటేనే గానిప్రకాశింపదుకదా! (స్నేహం=నూనే; ప్రేమ) స్నేహం ఇతరులవద్దలేదు. ఆళ్వారు దగ్గర సమృద్ధిగా ఉంది. కాబట్టి ఆదీపం ఆళ్వారు కుమాత్రమే ప్రకాశిస్తుంది.

'ఎన్ ఆవియై నడువే వందు ఉయ్యక్కొళ్‌గిన్ఱనాతనై' నా ఆత్మను మధ్యలో వచ్చి స్వీకరించి (ఉజ్జీవింపజేసి) న నాథుణ్ని. ప్రకృతి బద్ధమై విషయాలను పట్టుకొని ప్రాకులాడుతున్న నా ఆత్మను వాటినుండి మళ్ళించడానికి, విషయాల కూ ఆత్మకూ మధ్యలో తాను చేరి, తన వాణ్నిగా స్వీకరిస్తునే ఉన్నాడు స్వామి.

"అసన్నేవ సభవతి, సంతమేనం తతో విదుః" - భగవంతునికి అభిముఖుడు కానివాడులేని వాడే, అభిముఖుడు మాత్రమే ఉన్నవాడు-అని ఉపనిషత్తు తెలిపింది. మొదట గుర్తింపదగనట్లుండే ఆళ్వార్లను భగవానుడు నిర్హేతుకకృపచేత గుర్తింప దగినవారినిగా మార్చివేశాడు. నాథునికి రక్షించడం నైసర్గికం. కాబట్టి ఆళ్వార్లకు ఉపకారమనికాక తనకొరకే- తనసొత్తును తానే భద్రపరచుకోవాలి అని రక్షించుకొన్నాడు.

'తొదవేశెయ్‌తు, ఇళ అయ్‌చ్చియర్ కణ్ణినుల్ విడవేశెయ్‌తు, విళిక్కుమ్ పిరానై' కపటచేష్టలుచేసినవాడు. గొల్లపడుచుల కన్నులలో విటచేష్టలు చేసి, కన్నుగిలుకు ప్రభువైన భగవంతుణ్ని - నాడుగోపికలు పొందిన అత్యంత ఉత్తమ ఫలానుభవం కోసం వారుచేసిన ప్రయత్నంఏముంది? ఒకరుఫలాన్ని పొందడానికి మరొకరు

ప్రయత్నించడం ఎక్కడైనా ఉన్నదా? వ్రేపల్లెలోనే ఉన్నది. ఒకరి ఇంట్లో చొరవడి వెన్నను దొంగి లించినప్పుడు, ఆకన్నయ్య ధూర్త చేష్టల చేబాధితులైన వారందరు వచ్చి ఆవెన్నదొంగనుపట్టుకొని మనసారా సేవించారు. ఆప్రకారంగా శ్రీకృష్ణభగవానుడు వారి ద్రవ్యాన్ని స్పృశించి, ఆరగించి, వారికి దర్శనమిచ్చి అనుగ్రహించాడు.

బాలకృష్ణుని అల్లరికి భయపడే అవసరం మగవాళ్ళకు, ముసలివాళ్ళకు లేదు. యువతులైన గోపస్త్రీలకు మాత్రమే ఆదొకరకమైనభయం. తనవిషయంలో ఆర్ద్రనయనాలు కలిగిన తరుణగొపికలకు మాత్రమే కన్నయ్య ధూర్తచేష్టలు గోచరమవుతాయి. ప్రక్కనున్న వారికి తనబాల లీలలనే ప్రదర్శించేవాడు.

గోకులంలోని గొల్లభామలు శ్రీకృష్ణుణ్ని విడిచి, వైకుంఠనాథుణ్ని ఆశ్రయించడం ఎలా అసంభవమో, అలాగే తానుకూడా అస్వామిని విడిచి, ఇతర విషయాలను అనుభవించడం అసంభవమన్నారు నమ్మాళ్వార్లు.

విడువరాని సంబంధంకలిగి గోపికలను ఏలుకొన్నట్లే, నన్నేలు కొంటున్న స్వామిని నేనెలా విడువగలను? అంటూ, ప్రత్యుపకారమెరుగక భగవంతుడు చేసే ఉపకార పరం పరను స్మరించారు, స్మరింపజేశారు జగదాభరణులైన వకు ళాభరణులు.

6. దుస్త్యజస్వానుభూతేః :- పిరాన్, పెరునిలమ్ కీణ్డవన్ (పా6) ఉపకారకుడు, విశాలభూమిని పెకలించి ఎత్తినవాడు, ఆళ్వారు స్వామిని వదలనన్నారు. కాని స్వామియే వీరిని వదలివేస్తే, ఏమిచేయగలడు? అనే భావనకు సమాధానం ఇది.

సర్వేశ్వరుడు జగదుపకారకుడు ఇతరులకోసమే ప్రళయకాలంలో ముని గిపోయిన భూమిని, పైకి తేవడానికి తగినట్లు బురుదనీటిని భరింపగలిగే వరాహశరీరాన్ని ధరించి ఉద్ధరించాడు. అలాగే సంసార ప్రళయ మగ్నులైన తమనుకూడా స్వామి ఉద్ధరించాడు.

'పిన్నుమ్, విరాయ్ మలర్ తుళాయ్ వేయ్ న్దముడియన్' క్రుచ్చబడిన, పరిమళం కల్గివికసించిన తులసి (మాలిక) చే చుట్టబడినకిరీటం కలవాడు. భూమిని ఉద్ధరించడానికి నీటిలో మునిగినప్పుడుకూడా ఘుమఘుమ పరిమళించే తులసీ మాలికా లంకృతమైన కిరీటాన్ని కలిగి ఉండడం భగవద్దివ్య మంగళ విగ్రహభోగ్యతకు ద్యోతకం.

'మరామరమ్ ఎయ్‌త, మాయవన్' సప్తసాల భంజనం చేసిన మాయావి. భూమ్యుద్ధరణం అందరికోసం చేసిన ఉపకారం. ఇది ఆశ్రితుల కుచేసిన ఉపకారం. రామసుగ్రీవులు పరస్పరం సాహాయ్యంచేసుకోవడానికి సిద్ధపడినప్పుడు సుగ్రీవుడు 'మీరువాలిని సంహరించగలరా?' అన్నాడు. అప్పుడు రామచంద్రుడు సుగ్రీవుని అపనమ్మకానికి కోపగించుకోక, తనసామర్థ్యానికి నిదర్శనం చూపదలచి ఏడుమద్ది చెట్లను ఒక్క బాణంతో భేదించి, నమ్మకం కలిగించుకొన్న ఆశ్చర్యభూతుడు. ఆశ్రిత వ్యామోహశీలి ఆ స్వామి. ఉపకారకత్వమే అయన స్వరూపం. 'ఎన్ ఉళ్ ఇరాన్ ఎనిల్, పిన్నైయాన్ ఒట్టువేనో'- నాడెందంలో (స్వామి) ఉండనన్న తర్వాత నేను అంగీకరింతునా? నేను కర్మ పరతంత్రుడను. భగవానుడు కృపాపరతంత్రుడు. పరహితచింతన యే కృప కదా! భగత్కృప ప్రవహిస్తే నా కర్మ పరతంత్రత పోతుంది. స్వామి అనుభవం - కృపాపరతంత్రత-దుస్త్యజం. అదిపోయేదికాదు. కాబట్టి, అయన నా హృదయంలో వేం చేసి యుండనంటే నేను జీవించి యుండగలనా? నన్ను విడిచి వెళ్ళడు. వెళ్ళడానికి నేను ఒప్పుకోను అన్నారు పరాంకుశులు (పరాంకుశులు = మదగజంలాంటి పరమాత్మను అంకుశంలాంటి తమశ్రీ సూక్తుల చేత వశపరచుకొన్నవాడు)

7. త్యాగా కాంక్షా నిరోద్ధః :- యాన్ ఒట్టి ఎన్ ఉళ్ ఇరుత్తవమ్ ఎన్నుఇలన్ - (పా7) నేను ఇష్టపడి నా మనస్సులో (స్వామిని) ఉంచుకోవాలని తలచలేదు. 'తాన్ ఒట్టివన్ను, ఎన్‌తని నెంజై వంజిత్తు, ఊన్ ఒట్టి నిన్ను, ఎన్ ఉయిరిల్ కలందు' - తానే ప్రతిజ్ఞ చేసివచ్చి, నా స్వతంత్రమైన మనస్సు వంచించి, నా దేహంలో అమరినిల్చి, నా ఆత్మ లో కలిసినాడు. నేను స్వామిని నా హృదయంలో ఉండుమని ప్రార్థించలేదు.

శ్రీరాముడు లంకకు చేరాలని సముద్రాన్ని దారిని ఇమ్మని ప్రార్థించాడు. ప్రాయోపవేశంచేశాడు. "అద్యమేతరణం వాపి మరణం సాగరస్యవా" ఇప్పుడు సాగరునికి మరణమో, నాకు సాగరతరణమో జరుగవలసిందే, అని ప్రతిజ్ఞచేసి, దర్భాస్తరణం మీద పడుకొన్నాడు. అలాగే ఈనాడు ఆళ్వార్లనువశపరచుకోవడానికి ప్రతిజ్ఞచేసినా మనస్సున చేరి పోయాడు స్వామి. సర్వశక్తి మంతుడైన తనకు కూడా చక్క బరచడానికిఅశక్య మనదగినంత 'అవిధేయం' గా ఉన్న నామనస్సును తన శీలాదిగుణాలచేతనూ, సౌందర్యంచేతనూ తనకు విధేయంగా మలచు కొన్నాడు.

బిడ్డమేని మురికిని గొప్పచేసే తల్లిలాగా హేయమైన నా శరీరాన్ని ఆశ్రయించి నిల్చాడు. నేను పెడమొగంపెట్టడం మానగానే, నాఆత్మలో కలిసినాడు లేదా ప్రియురాలి శరీరం ఎలాంటి దైనా ప్రియునికి ఆనందమే కలిగిస్తుంది. ఆళ్వారు యొక్క హేయశరీరంకూడా స్వామికి ఆనందదాయకమే. కాబట్టి మొదట శరీరాన్ని ఆదరించి దానిలో చేరి, వారి అంగీకారం పొందిన తర్వాత ఆత్మలో స్వామి చేరి నాడు. ఎలాగైనా చుట్టు ముట్టి ఆశ్రితులను వశపరచుకొనేవాడు స్వామి.

ఇయల్వాన్, ఇవి ఎన్నై నెటిళిక్కఒట్టుమో - ఇట్టి స్వభావంగల సర్వేశ్వరుడు , ఇంకనన్ను వేడి పోసమ్మతిస్తాడా? నిర్హేతుకంగా నన్ను అనుగ్రహించినస్వామి, నేను తననుంచి తొలగిపోతా నన్నంతమాత్రాన వదలివేయసమ్మతిస్తాడా? సమ్మతించడన్నారు.

ఆళ్వారు నిత్య సంసారియే. కాబట్టి గుణత్రయం వీరిని వశ పరచుకొంటాయి. సత్త్వగుణం విజృంభించినప్పుడు భగవంతుణ్ని వీడనన్నారు. ఆస్థితిలోనేకదా 'యానొట్టువేనో'(పా7) అన్నారు. మళ్ళీ రజోగుణం విజృంభిస్తే ఆ మాట నిలువదేమో? అని భావించిన ఆళ్వారు 'నేను దూరమవుతానన్నా, నన్ను విషయికరించిన స్వామి నేను విడిపోవసమ్మ తిస్తాడా? ఆయన నన్ను వదలడని, ఈపాశురంలో ధైర్యంగా పలికారు.

8. శ్రితహృదయ పృథక్కారని త్యాక్షమవ్యః - ఎన్నైనెగిళిక్కిలుమ్, ఎన్నుడైయనల్ నెంజంతన్నై , అగల్విక్క, తానుమ్ ఇవికిల్లాన్ - (పా8) (ఒకవేళ) నన్ను ఎడబాసినా, (స్వామి) నా మంచి మనస్సును ఎడబావడానికి తానుకూడా ఇక సమర్థుడు కాడు. సర్వశక్తిమంతుడైన సర్వేశ్వరునికి అశక్యమున్నదా? సర్వదాస్వామి పట్ల ప్రవణమై ఉండే తన మనస్సు ను మాత్రం దూరంచేయసమర్థుడుకాడు,' ఇంక' అంటున్నారు. ఏమి ఆధైర్యం ?

'పిన్నై నెడుమ్, పణై తోళ్, మగిళ్ పీడు ఉడై' (పణై=వెదురు) నీళాదేవి యొక్క పొడువైన, గుండ్రగా (వెదురువలె) ఉన్న భుజాల (కౌగిలి) వలన కలిగిన, ఆనందోత్కర్షం కలవాడు. నీళాదేవిని పురుషకారంగా చేసుకొని స్వామిని ఆశ్రయించి ఉన్నాను. 'మున్నై అమరర్ ముళు, ముతలానే " -ప్రాచీనులైన నిత్యసూరులకు సమస్తం (పురుషార్థాలను) ఇచ్చుటకు కారణమైన వాడు పరమాత్ముడు

"యత్రర్షయ: ప్రథమజా యే పురాణాః" - జ్ఞానులైన ఋషులు ప్రాచీనులు. వారుపాత వారైనా, సర్వదా కొత్తగా స్వామిచే అనుభవింపబడుతుంటారు. అని వేదం తెలిపింది. స్వామిసంకల్పంచేత ఎల్లప్పుడు ఉండే నిత్య సూరుల స్వరూప స్థితిగతులు తన ఆదీనంలోనే ఉంటాయి. నీళా దేవి సౌందర్యానికి వశుడైన తాను, మన పట్లజాలి దయజూపుమని ఆమె చెప్పే మాటలను పాటింపక తోసి వేయజాలడు. నిత్య సూరుల పరిషత్తులో వేంచేసి ఉన్నప్పుడు. దాస్యాన్ని కోరి వచ్చిన ప్రియురాలి సంబంధాలను దూరం చేసుకొంటాడా? చేసుకోలేడు. కాబట్టి తన మనస్సును స్వామి దూరంచేయ సమర్థుడు కాడనే దృఢమైన అధ్యవసాయం కలవాడు ఆళ్వార్లు.

9. స్వాత్మశ్లిష్టస్య:- అమరర్ ముళు ముతల్ ఆకియ, ఆతియై (పా9) నిత్య సూరుల స్వరూప స్థితి ప్రవృత్తులన్నీ తన అధీనమైఉన్నవాడు భగవానుడు. (ఆతియై' -అనడం వల్ల లీలా విభూతి కి, సర్వ పదార్థాలకూ - కారణమైనవాడు. సహజంగా అనురాగబంధంలేని వారికి కూడా తనను పొందడానికి తగిన కరణకళేబరాలను అనుగ్రహించినవాడు. 'అమరర్క్కు అముతు ఈన్ద, ఆయర్ కొళుంద్' దేవతలకు అమృతాన్ని ఇచ్చినవాడు. గోపకిసలయమైనవాడు. దేవతలు పొందిన అమృతం లాంటి ఇతర భోగ్య వస్తువులు మాకు అక్కర్లేదు. నీవేకావాలనుకొన్నవారికి తానే గోపబాలుడై అవతరించి తననే ఇచ్చుకొన్నవాడు సర్వేశ్వరుడు. అట్టి స్వామిని 'ఎన్ ఆవి' -నా ఆత్మ " ఆమర అళుంబ తులావి, అమర తళువిత్తు, ఇని అగలుమో?" అమరి చేరినట్లు వెదకి, చక్కగా కలిసి

యుండి, ఇక విడుస్తుందా? నీటితో నీరు కలిసి నట్లు, ఏకద్రవ్యమని తోచేరీతిగా నా ఆత్మ స్వామితో చేరి పోయింది. ఆ స్వామి సౌలభ్యసౌశీల్యాది గుణాలను అనుభవించే నా ఆత్మను స్వామి నుంచి దూరం చేయడం అసాధ్యం .ఆత్మ పరమాత్మ రెండుద్రవ్యాలు, ఏకద్రవ్యం అన్నట్లు కలిసి పోవడం సంభవమా? దీపం కాంతి రెండు వేర్వేరు ద్రవ్యాలైనా అవి విడివడకుండా కలిసి ఉంటాయి. ద్రవ్యాన్ని జాతి, గుణం విడిచి ఉండవు. గోవు అనే ద్రవ్యాన్ని గోత్వమనే జాతిగానీ, నల్లరనం అనే గుణంగానీ విడిచి ఉండవు. 'ఆత్మ' ప్రకారం - విడదీయరాని విశేషణం 'పరమాత్మ' ప్రకారి - విశేష్యం. జీవునికి భగవదాశ్రయణం నిత్యం ఉండేది కదా!

10. గాయచ్ఛ్రమహరయశసః : - అగలిల్, అగలుమ్ (పా10) దూరమైతే, దూరమవుతాడు

స్వామి. చేతనుడు స్వామినుంచి దూరమైతే, స్వామికూడా దూరమవుతాడు. సముద్రతీరాన తన నాశ్రయించిన విభీషణుణ్ని తన దగ్గరికి తెమ్మని సుగ్రీవుణ్ని పంపుతూ, శ్రీ రామచంద్రుడు " ఆనయైనం హరిశ్రేష్ఠ! దత్త మస్యాభయంమయా! విభీషణోవాసుగ్రీవ! యదివారావణ స్స్వయమ్॥" - వానరశ్రేష్ఠ! సుగ్రీవా! విభీషణుడైనా లేక రావణుడే అయినా నేను అభయమిచ్చా ను తీసుకొని రమ్ము - అని చెప్పాడు. అలాగా, స్వామి ఎలాంటి బలహీనులనైనా తనవారినిగా చేసుకోవాలనేకోరుకొంటాడు. కొందరు పరాఙ్ముఖులైదూరమవుతున్నప్పుడు ఖిన్నుడైవిచారిస్తూనే స్వామి వారికి దూరమవుతాడు.

కొందరుస్వామి మీద ద్వేషం పెంచుకొంటారు. శ్రీరామునితో సమరంచేస్తు న్నప్పుడు రావణుడు" ద్విధా భజ్యేయ మప్యేనం ననమేయమ్" రెండుగా ఖండింపబడినా వంగను (నమస్కరించను) - అన్నట్టి మూర్ఖుడు. అలాంటి స్థితి ఏర్పడినప్పుడు వారిని అంతం చేస్తాడు. 'అణుకిల్, అణుగుమ్' - (అనన్యప్రయోజనులైతన) దరిచేరినవారిని, దరిచేర్చుకొంటాడు. అభిముఖ్యముంటేచాలు. వారిని ఆదరించి వారికి అభిన్నుడుగా ఉంటాడు. లంకను వదలి వచ్చి తన నాశ్రయించిన విభీషణుణ్ని ఎంతో అనునయించి, పెత్తనమతనికిచ్చి " ఆఖ్యాహి మమ తత్త్వేన రాక్షసానాంబలా బలమ్' ' - రాక్షసుల బలాబలాలను ఉన్నవి ఉన్నట్లు నాకు చెప్పుము - అని శ్రీరాముడు అడిగి నాడు. లక్ష్మణుడు ప్రక్కన ఉండగా కొత్తగా వచ్చిన విభీషణుణ్నే రాజకార్య నిర్వహణ విషయమై ప్రశ్నిస్తున్నాడు. శ్రీరామప్రభువు. 'మీవారి బలాబలాల ను అనక, రాక్షసుల బలాబలాలను తెల్పు మన్నాడేమి? విభీషణుడు కూడా రాక్షసుడే కదా! శ్రీరామచంద్రుడు తన నాశ్రయించిన విభీషణుణ్ని రాక్షసజాతీయుని గా కాక, ఇక్ష్వాకు వంశ్యుని గానే - తనసోదరునిగానే - భావించినందువల్ల ఇలాగా అన్నాడు.

'పిఱవిత్తుయర్' (పా1)లో 'అకలిలకలుమ్' విషయాన్ని తెలిపారు. కేవలులు ఆత్మ లాభంకోసం శరీరవిముక్తి మాత్రంకోరి స్వామికి దూరమవుతారు. వారికి స్వామి కూడా దూరమవుతాడన్నారు. 'వైప్పామ్ మరున్దామ్' (పా2) లో 'అణుగిల ణుగుమ్' - చేరినవారి కి తాను చేరియుంటాడనీ - గోపబాలుడై అవతరించి, భక్త సులభుడైన స్థితి వర్ణితం.

'పుగలుమ్ అరియన్,పొరువు అల్లన్, ఎమ్మాన్'-(ప్రతి కూలురు) దరిచేరుటకు

దుర్లభుడు. (అనుకూలురు ఆశ్రయించుటకు) అడ్డులేనివాడు - దరి జేర్చుకొనువాడు, నా స్వామి.

"యత్ర కృష్ణౌచ కృష్ణాచ సత్యభామాచ భామినీ! న చాభి మస్యు ర్న యమౌతం దేశమభిజగ్మతు:॥" పుకలుమరియన్-అర్జునుడు, దుర్యోధనుడు ఇద్దరు ఒకే సారి వచ్చికోరితే అర్జునునికి తనను ఇచ్చుకొని, సారంలేని సైన్యాన్ని దుర్యోధనునికిచ్చి పంపాడు శ్రీకృష్ణుడు. 'పొరువల్లన్' - ఒకసారి-అభిమన్యుడు, నకులసహదేవులు అక్కడలేనప్పుడు కృష్ణార్జునులు ద్రౌపదీసత్యభామలు మాత్రమేకాంతంగా ఉన్న సమయాన, సంజయుణ్ని లోపలికి రప్పించి దర్శన మిచ్చాడు. ఆ విధంగా స్వామి ఆశ్రితులతో కలిసి ఉండే స్థితిని తెలిసి, అనాశ్రితులైన దుర్యోధనాదులు తల్లడిల్లే రీతిగా ఆశ్రిత పారతంత్ర్యాన్ని ప్రకాశింపచేశాడు. "నిగరిల్ అవన్ పుగళ్ పగలుమ్ ఇరపుమ్ పడిందు కుడైందు, పాడి ఇళైప్పిలమ్" సాటిలేని సర్వేశ్వరుని కళ్యాణగుణాలను అహోరాత్రాలు దరిజేరి అవగాహించి, పాడి శ్రమలేని వాళ్ళమై ఉన్నామన్నారు. సర్వకాలాల్లోనూ స్వామి కల్యాణగుణాలను అనుభవించి కీర్తించినా విసుగూలేదు, తృప్తి పొందడమూ లేదు.

11. కుడైందు వండు, ఉణ్ణుమ్, తుళాయ్ ముడియానై- (వండుకుడైందు) తుమ్మెదలు ప్రవేశించి (మధువును) గ్రోలుతున్న తులసి మాలికను కిరీటాన ధరించిన సర్వేశ్వరుణ్ని; " అడైంద తెన్ కురుకూర్‌శ'డ కోపన్" ఆశ్రయించిన, అందమైన కురుకాపురిలోని శఠకోపుల యొక్క; "మిడైంద, శొల్‌తొడై, ఆయిరత్తు ఇప్పత్తు" - పరిపూర్ణమైన, శ్రీ సూక్తి మాలిక యైన, వేయింటిలో ఈ పది పాశురాలు; "నోయ్ కళై ఉడైందు, ఓడు విక్కుమ్" వ్యాధులను ముక్కలు చేసి, పారద్రోలుతాయి.

తుమ్మెదలు మహాసముద్రంలో దిగినట్లు లోపలికి చేరి మధుపానం చేసేటంత మధువు తులసి లో పొంగుతున్నది. ఆతుమ్మెదలు తులసి లో చేరి యుండడమేకాని విడిచి వెళ్ళజాలనంత మధువు ఆతులసిలో ప్రవహిస్తున్నది. ఆమధువులో మునిగిన తుమ్మెద దాన్ని విడువ లేనట్లు, భగవద్విషయంలో నిమగ్నులైన, తిరునగరి ఆళ్వారు దాన్ని విడువలేని వారయ్యారు. (తొడై = క్రిక్కిరిసిన) ఈ ప్రబంధగానం చేసే సమయంలో శబ్దాలన్నీ అహమహమికా పేక్షతో ఆళ్వారు భావ ప్రపంచంలోకి చొచ్చుకొని వచ్చాయి. అలాంటి సహస్రగీతిలోని ఈ దశకం అధ్యేతల ఆధివ్యాధులనూ, ప్రాప్తి ప్రతి

బంధకాలనూ విచ్ఛిన్నం చేసి తొలగిస్తుందనీ, పాపాలన్నీ ముక్కలు ముక్కలై ఒక్కొక్కటి ఒక్కొక్క దారిలో పరుగు పరుగున పారిపోతాయనీ ఫలాన్ని చెప్పి ముగించారు.

అష్టమదశకం :-

8. సూరీణాం స్వైరసేవ్యే స్వయమవతరతిక్షుద్రదివ్యైకనేత్రే
గోపాద్యర్థం ధృతాద్రౌశ్రితతనురసికే వామనీభావదృశ్యే।
సచ్చిత్తా నన్యవృత్తౌ విభవ సమతనౌ స్వాయుధారూఢహస్తే
నీచోచ్చగ్రా హ్యపాదేనిరుపధి మృజుతాంనీరవర్ణేజగాద॥ 19

అర్థం:- సూరీణాం = నిత్యసూరులకు; స్వైరసేవ్యే = యధేష్టంగా సేవింపదగినవాడు; స్వయం = తాను; అవతరతి = అవతరించేవాడు; క్షుద్ర దివ్య+ఏకనేత్రే = క్షుద్రులైన మనుష్యులకూ దేవతలకూ ముఖ్య నేత్రమైన (రక్షకుడైన) వాడు; గ్రోప+ఆది+అర్థం = గొల్లలు మొదలైన వారికోసం; ధృత+అద్రౌ = ధరింపబడినగోవర్థన పర్వతం కలవాడును; శ్రితతను రసికే = ఆశ్రితుల శరీరమందు ప్రీతికలవాడు; వామనీభావ దృశ్యే = వామనుడైనందువల్ల చూడదగిన వాడును; సత్+చిత్త+అనన్యవృత్తౌ = సత్పురుషులయొక్కమనస్సును అనుసరించిన వ్యాపారంకలవాడు; విభవసమతనౌ = మాహాత్మ్యంతో సమానమైన శరీరాలు కలవాడు; స్వ+అయుధ+అరూఢ హస్తే = తన ఆయుధాలు ఎక్కిన చేతులు కలవాడు; నీచ + ఉచ్చ గ్రాహ్య పాదే = అల్పుల చేతనూ, అధికులచేత నూ గ్రహింపదగిన పాదాలు కలవాడు; నీరవర్ణే = ఉదకం వంటి వర్ణం కలవాడునూ అయిన భగవంతుని యందు; నిరుపధిం = నిర్దుష్టమైన ; ఋజుతాం =ఆర్జవగుణాన్ని; జగాద = పలికెను,

తా॥ సర్వేశ్వరుడు నిత్యసూరులతో సంశ్లేషించే ప్రకారాన్ని (2) ఆశ్రితుల సంశ్లేషం కోసం ఎత్తిన అవతారాలు పరమభోగ్యాలు (3) అతి నీచులైన మనుష్యులకూ, దేవతలకూ నిర్వాహకుడు (4) గొల్లలు మొదలైన వారిని ఆపదలనుంచి రక్షించిన ఆపత్సఖుడు (5) ఆ శ్రితులతో సంశ్లేషించే స్వభావం కలవాడు (6) వామనావతారమెత్తి సకల చేతనులకు సేవను సాదించినవాడు (7) ఆశ్రితులమనస్సేతనమనస్సుగా కలిసి యుండే వాడు (8) తనమహిమవలె లెక్క లేని అవతారాలుకలవాడు (9)

అవతారాలలోనూ శంఖచక్రధరుడు (10)త్రివిక్రముడై అందరి తలలందు తన పాదాలను ఉంచిన భగవంతుని ఆర్జవ గుణాన్ని ఈ (8) దశకంలో సాదించారు.

ప్రకా-వ్యాఖ్య :- సర్వేశ్వరుడు నిరతి శయభోగ్యభూతుడని వెనుకతి. వా. మొళిలో తెల్పారు. 'పత్తుడై' - మూడవదశకంలో స్వామి సౌలభ్యాన్ని వళవేళులగిన్ - 5వ దశకంలో సౌశీల్యాన్ని ఆళ్వారనుభవించారు. ఈ (8) వ తి.వా.మొళిలో ఆర్జవ గుణాన్ని అనుభవిస్తున్నారు. వీటికున్న భేదం ఏమి? వైకుంఠసభలో ఉండే స్వామి ఈ సంసారిచేతను లున్నచోట అవతరించి వారికి దర్శనీయుడై, విధేయుడై ఉండడం 'సౌలభ్యం'.

జన్మచేత, ధనంచేత, విద్యచేత గొప్పవాడైన వ్యక్తి వాటిలో తక్కువైన వారితో కలిసి మెలసి ఉండడమే 'సౌశీల్యం' సౌలభ్యగుణంచేత సంసారుల మధ్యకు దిగి వచ్చినప్పటికీ, 'ఈ అల్పులతో కలిసి ఉన్నానేమి? అని మనస్సులో కూడా భావించని గుణం 'సౌశీల్యం'

మనసు, మాట, చేష్ట ఒక్క విధంగానే ఉండడం 'ఆర్జవం'. సౌశీల్య గుణంలోనే త్రికరణ శుద్ధిగా స్వామి సంసారులతో చేరి ఉంటాడని తెలుస్తుండగా మళ్ళీ ఆర్జవ గుణాన్ని చెప్పడమెందుకు? సంసారులు ఆర్జవగుణంలేనివారుకదా! స్వామి, వారితో చేరినప్పుడు వారిలాగా, మనస్సుచే, మాటచే, కర్మచేతనూ జారుడుగా, చోరుడుగా ఉంటాడు. ఇట్టి ఋజువర్తనమే సంసారులకు రక్ష. శ్రీ యామునాచార్యులు 'వశీవదాన్యో గుణవాన్ ఋజుశ్శుచిః (స్తో.ర) అని -'గుణవాన్', సౌశీల్యగుణంకలవాడు, అని చెప్పిన తర్వాత 'ఋజుః ఆర్జవగుణంకలవాడని చెప్పినాడుకదా!

ఈ తిరువాయ్ మొళి స్వామి యొక్క ఐశ్వర్యాన్ని చెప్తున్న దని తిరుక్కురుకై ప్పిరాన్ పిళ్ళాన్ (ఆరువేలవాఖ్య) ఆరాయిరప్పడి అవతారికలో సాదించారు. మరి కొందరు ఈశ్వరత్వ లక్షణాన్ని వివరిస్తున్న దన్నారు. శ్రీ వేదాంతదేశికులు, పెరియవాచ్చాన్ పిళ్ళై, నంబిళ్ళై, వడక్కు త్తిరువీధి ప్పిళ్ళై - అనేవారు ఆర్జవగుణమే ఈదశకసారాంశమన్నారు.

'నిత్యులు, ముక్తులు, బద్ధులు అనే త్రివిధ చేతనులను తన ఆశయానికి అనుగుణంగా మార్చుకోక, ఉన్నత స్థలాలకు ఉపాయంతో ఎత్తి పోసేనీరు లాగా భగవంతుడే వారి వారిల్లో పయనించి అనుగ్రహించడమే ఆయన ఆర్జవగుణం. కాబట్టి 'పాడిఇళై ప్పిలమ్'

కీర్తించి అలసట చెందని ఆళ్వార్లు, ఇందులో స్వామి యొక్క ఆర్జవ గుణాన్ని ప్రస్తుతిస్తున్నారని శ్రీపరాశరభట్టరు భావించారు.

వైకుంఠవాసులకు అనార్జవం (శెవ్వైక్కేడు) లేదు. వారు త్రికరణశుద్ధులు. కాబట్టి వారికోసం స్వామి తన ఆర్జవాన్ని మార్చుకోవడం ఉండదు. కాని అనేకులైన వారికి ఉండే రకరకాల అభిరుచులకు తగినట్లు వారికి తమ కైంకర్యాన్ని అందించడమే స్వామి ప్రదర్శించే ఆర్జవం.

1. సూరీణాం స్వైరసేవ్యే :- ఓడుమ్, పుళ్ఏఱి(పా1) పక్షిని ఎక్కి సంచరిస్తాడు. స్వామి ఆశ్రితుల కోరికకు తగినట్లు ప్రవర్తించే ఋజువర్తనుడని చెప్పదలచిన ఆళ్వార్లు గరుడ పక్షిపైన అధిష్ఠించిన విషయాన్ని ముందుగా తెల్పినారేమి? దు:ఖరూపమైన బరువును మోయడం ఒక కోరికయేనా? అంటే, నిత్య విభూతివాసులకు, స్వామికి చేసే కైంకర్య మేదయినా, ప్రీతిపూర్వకమై అభిలషణీయమై ఉంటుంది. ప్రియురాలికి ప్రియుని గాఢాలింగనం ప్రీతినే కలిగిస్తుందికదా! గరుత్మంతునికి కూడా తనమీద స్వామి అధిరోహించి నడిపించడం ఆనందదాయకమే. దీనివలన రెండు లాభాలున్నాయి.

(1) శ్రీహరి తనపైన అధిరోహించాలనే వైన తేయుని కోరిక తీరుతుంది. (2) పక్షిరథుడైన స్వామిని సందర్శించాలనే నిత్యవిభూతి వాసుల కోరిక కూడా తీరుతుంది. కాబట్టి, పక్షిరాజుపైన స్వామి అధిరోహిస్తాడు. 'ఓడుమ్' -నడిపిస్తాడు. ప్రియుని నఖక్షత్రాలు ప్రియురాలికి ప్రియమై అలంకారాలైనట్లు వేగంగా నడువాలని స్వామి తన కాలితో తాకగా గరుడుని దేహంపైన ఆ ఆస్ఫాల నాంఘ్రిప్రహతులచే ఏర్పడిన కాయలు విష్ణురథునికి తృప్తిని కలిగించి, అలంకారంగా ఉంటాయి.

శూడుమ్ తణ్ తుళాయ్ - చల్లని తులసిని ధరిస్తాడు - 'ఇప్పుడే తెంపి శ్రీ కేశాలలో మాలికగా, ధరించకపోతే, కాంతి తగ్గుతుంది, వాడిపోతాను, అనుకొంటుంది కాబట్టి, అప్పుడే ఆశ్రితాభీష్టాన్ని నెరవేర్చడానికి దాన్ని పరిగ్రహించి శ్రీకేశాలలో ధరిస్తాడు. తులసి చైతన్యం ఉంటుందా? అంటే, పౌష్కర సంహితలో 'చిన్మయై: స్వప్రకాశైశ్చ'' నిత్యవిభూతిలోని పదార్థాలు జ్ఞాన స్వరూపాలు. అవితమంత తామే ప్రకాశిస్తాయి అని చెప్పబడింది. అక్కడ కొందరు చేతనులు తులసి రూపంచేత,పక్షిరూపంచేత స్వామికి కైంకర్యం చేయ తలచినప్పుడు వారు ఆయారూపాలను వారి ఇచ్ఛానుసారంగా ధరించి సేవచేస్తారు. రాజసన్నిధిలో గూనివారు, గుజ్జు రూపంకల్గినవారు భోగరూప

మైన చైతన్యం కల్గి ఉంటారు కదా! అక్కడ చెట్టై, చట్టై ఉన్నా చైతన్యంనశించదు. 'నేను స్వంతంత్రుడను' అనుకొనే, స్వాతంత్ర్యమనే విరోధిరూప చైతన్యం అక్కడ నశిస్తుంది.

లీలావిభూతిలో "వాచికైః పక్షిమృగతాం, మానసైరంత్య జాతితామ్। శరీర జైః కర్మదోషైః యాతి స్థావరతాం నరః॥" (మనుస్మృతి) మానవుడు వాచిక కర్మదోషం చేత పక్షిగానో, మృగంగానో మళ్ళీ జన్మిస్తాడు. మానసకర్మ దోషంచేత అంత్య జాతిలో పుడుతాడు. శారీరక కర్మదోషం వల్ల చెట్టుగానో గుట్టగానో - స్థావరత్వాన్ని పొందుతాడు. అంటే ఈ ప్రపంచంలో జీవులు తమ కర్మానుగుణంగా తిర్యక్, స్థావర, జంగమాలుగా జన్మిస్తారు. కాని నిత్యవిభూతిలోని చేతనుల శరీరాలు కర్మ చేత ఏర్పడినవికావు. వారి సంకల్పానుగుణంగా వారే ఏదో ఒక శరీరాన్ని పరిగ్రహిస్తారు.

సంసారులకు కరణత్రయ మందు రుచిభేదం చేత అనార్జవం కూడా ఉంటుంది. మనస్సులో ఒకటి ఉంటే, మాటల్లో మరొకటి చెప్పడం, శరీరంతో వేరొకటి చేయడం జరుగుతుంది. కాని నిత్య సూరులకు కరణత్రయానికి విషయమొక్కటే - శ్రియఃపతియే. అయితే రుచి భేదమూ, అనార్జవమూ లేని నిత్య సూరులు వేర్వేరుగా ఎందుకు కోరుకుంటారు? అంటే, వారందరికీ విషయం ఒక్కటే అయినా, వారు భగవంతునికి చేసే వృత్తి-కైంకర్యం-వేర్వేరుగా ఉండడం వల్ల వాటికి తగినట్లు రుచులు-కోర్కెలు-వేర్వేరుగా ఉంటాయి. వాటిని గమనించి స్వామి, వారికి తృప్తికలిగిస్తాడు.

నీడునిన్నుఅవై'-నిత్య పదార్థాలతో, ఆడుమ్-కలిసి ఉంటాడు, నృత్యం చేస్తాడు. వ్యవహరిస్తాడని అర్థం. కర్మాను గుణమైన జన్మ అనిత్యం. తులసిగా, పక్షిగానో ఉండి, ఒక్కొక్కరు తమ స్వరూపానుగుణంగా కైంకర్యంచేసే వైకుంఠవాసులు నిత్యులు. భగవంతుణ్నివిడిచి వారు, భగవంతుడు కూడా వారిని విడిచిఉండడం జరుగదు. భగవంతుడునిత్య సూరులతో సంశ్లేషించి యుండే విషయంలో 'ఆడును' అన్నారు. ఘర్మార్తితో (విడాయర్ మడువిలే పుక్కు ఆడినా ప్పోలే ఇరుక్కైయాలే) దప్పిగొన్న వ్యక్తి మంచినీటి మడుగులోకి దిగి, మునిగిఎంత ఆనందిస్తాడో, అంత ఆనందంతో స్వామి ఆడుతాడట. స్వామికికలిగే ఆనందం ఒక నాట్యలీలగా, నృత్యహేలగా ఉంటుంది. స్వామి సర్వాధికుడు. కాబట్టి నిత్య సూరులతోనూ, నిత్య సంసారులతోనూ ఏకరూపంగా కలిసి ఉంటాడు స్వామి (అమ్మాన్) అన్నారు ఆళ్వార్లు.

2. స్వయమవతరతి :- "అమ్మానాయ్, (పా 2) స్వామి అయ్యి వెమ్, మా, వాయ్ కీణ్ణ, శెమ్మా కణ్ణన్'- క్రూరమైన, గుఱ్ఱం యొక్క నోటిని చీల్చిన ఎఱ్ఱని విశాలమైన కన్నులు గల సర్వేశ్వరుడు. భగవంతుడు కృష్ణుడుగా అవతరించి, సంసారులకు విధేయుడై ఉండే ఆర్జవ గుణాన్ని చెబుతున్నారు.

క్రూరమైన అశ్వం కేశి. కంసుని చే ప్రేషితుడైన కేశి అనే రాక్షసుడు అశ్వాకారంతో నోరు తెరచుకొని శ్రీకృష్ణుణ్ని అంతం చేయాలని పరుగెత్తి వస్తున్న దృశ్యాన్ని చూచిన శ్రీనారదభగవానుడు కూడా 'జగదస్తమితమ్' లోకం అస్తమిస్తున్నది. - అని మొరపెట్టి మూర్ఛపోయాడు. ఆయనకు అప్పుడు పుట్టిన భయం, ఆళ్వారుకు సంఘటన జరిగినప్పుడే కాక, ఆ విషయాన్ని తలచుకొన్నప్పుడు కూడా, నారదునికంటె ఎక్కువ భయం ఉత్పన్న మవుతూనే ఉన్నది. విరోధులను నిరసించిన సంతోషంతో శ్రీకృష్ణుని కన్నులు ఎఱ్ఱగా వికసించాయి.

పిన్నుమ్, ఎమ్ మాణ్పుమ్ ఆనాన్ - ఇంకను ఎన్నో అందమైన అవతారాలనెత్తాడు. (మాణ్పు-అందం) అందం శరీరానికే ఉంటుంది కాబట్టి (మాణ్పు-శరీరం) శరీరాలు కల వాడని అర్థం "బహూనిమేవ్యతీతాని జన్మాని" (భ.గీత) అన్నాడు కదా గీతా చార్యుడు. అవతారాలలో సౌలభ్యంతో కూడిన పరత్వం ఉండడమే అందం. అతిమానుష చేష్టల వల్ల 'అమ్మానాయ్' అని , పరత్వాన్ని చెప్పిన తర్వాత అవతార చేష్టలను చెప్పారు. పరత్వంతో కూడిన సౌలభ్యంగల అవతారం కృష్ణావతారం ఒక్కటే కాదు, అనే కావతారాలూ ఉన్నాయి.

3. క్షుద్ర, దివ్యైక నేత్రే :- కణ్ణావాన్ ఎన్ను మణ్ణోర్ విణ్ణోర్క్కు (పా3) కన్ను అయినవాడు. భూలోక, ఊర్ధ్వలోక వాసులకు. (కణ్ణావాన్-రక్షకుడు, జ్ఞానప్రదుడు)"చక్షుర్దేవానా ముత మర్త్యానామ్" (శ్రుతి) దేవతలకూ, మానవులకూ జ్ఞానప్రదుడు, అనడానికి (చక్షుః) కన్ను, అన్నది వేదం నిత్యసూరులకుగానీ, సంసారులకుగానీ, తమపనిని తాము చేసుకొనే సామర్థ్యం లేకపోవడంలో భేదంలేదు. కాబట్టి ఉభయ విభూతివాసులకు భగవానుడే రక్షకుడు.

'తణ్ణార్ వేంగడమ్' - చల్లదనంతో నిండిన వేంకటాచలం, స్వామికి రక్షింప దగినవారుల భించక తాపం. ఆశ్రితులకు రక్షకుడు దొరకక తాపం. ఈ ఉభయుల తాపాన్నీ పోగొట్టేశైత్యం కలది వేంకటాద్రి. స్వామినీ, ఆశ్రితులనూ ఒక్కచోటనే చేర్చేది ఈ పర్వతం.

"విణ్ణోర్ వెఱ్పన్" - నిత్యసూరుల పర్వతం. ఊర్ధ్వలోకవాసులూ. భూలోకవాసులూ, అందరు ఒక్కచోటనే కలిసి తనను సేవించాలని ఈ పర్వతం మీద వేంచేసి ఉన్నాడు సర్వేశ్వరుడు అయినప్పటికీ ఈ పర్వతంపైన ఉండేవారు నిత్య సూరులే కాబట్టి "విణ్ణోర్ వెఱ్పన్" నిత్యసూరుల పర్వతం - అన్నారు. "వరద సకల మేతత్ సంశ్రితార్థం చకార"-ఓ వరదా! నీ ఆశ్రితులకోసం సకల వస్తువులను చేశావు (అని 'వరదరాజ స్తవంలో') అన్నట్లు భగవానుడు సర్వం ఆశ్రితాధీనం చేస్తాడు. పూచిన చెట్లు, జల పూర్ణవనాలు, వీటిని చూచి భయపడి చెట్లనెక్కే కోతులూ, కొండెంగలూ సంచరించే వేంకటాచలమందు విరాజమానులైన శ్రీనివాస భగవానుని సౌలభ్యాన్ని ఆళ్వార్లుఅనుభవిస్తూ! అహా! ఇదేమి సౌలభ్యం! అని విద్ధులై 'విణ్ణోర్ వెఱ్పన్' అన్నారు.'వానవర్నాడు' వలె 'విణ్ణోర్ వెఱ్పన్' 'దివిషద్దేశం' లాగా 'దివిషత్పర్వతం'. సంసారులో, నిత్య సూరులో ఎవరైతేనేమి? శ్రీ వేంకటాచలం ఆశ్రితులదే. కవలపిల్లలను కన్న తల్లి వారికి చనుబాలను ఇవ్వడానికి యోగ్యంగా ఆపిల్లల నడుమ పడుకొన్నవిధంగా సర్వేశ్వరుడు ఊర్ధ్వలోకవాసులకూ, భూలోకవాసులకూ సమానంగా దర్శనమీయ డానికి వేంకటాచలమందునిల్చిన సౌలభ్య గుణాన్ని అనుసంధానం చేశారు. నమ్మాళ్వార్లు ఈ పాశురంలో "మందిపాయ్ వడవేంగడ మామలై వానవర్‌కళ్ శన్ది శెయ్యునిన్ఱాన్" పరమపదంలో నిత్య సూరులనుభవించేది పరమ పురుషుణి మహిమాతిశయాన్ని తప్పవేరేమి లేదు. అయితే వానరులు సంచరించే వేంకటాచలం మీద నీచాతి నీచులకు కూడా తమ దర్శన భాగ్యాన్ని కలిగిస్తూ వేంచేసి యున్న స్వామి సౌలభ్యాతిశయాన్ని నిత్య సూరులు ఇక్కడికి వచ్చే అనుభవిస్తుంటారు. వైకుంఠంలో దర్శించలేని సౌలభ్యాన్ని పుడమి జనులకంటే నిత్య సూరులే ఎక్కువగా అనుభవిస్తూ పుష్ప ఫలాదులతో శ్రీనివాసునికి ఆరాధనసమర్పిస్తారు. కాబట్టి 'విణ్ణోర్ వెఱ్పన్' 'దివ్యుల పర్వతం' అన్నారు 'తిరుప్పాణాళ్వార్లు.

"కణ్ణనడియిణై యెమక్కుకాట్టుమ్వెఱ్పు" కడువినైయ, రిరువినైయుం కడియుం వెఱ్పు

తిణ్ణమితు వీడెన్నత్తి గళుమ్ వెఱ్పు, తెళిన్ద పెరుంతీర్తంగళ్ శెఱిందవెఱ్పు

పుణ్ణియత్తిన్ పుగళిదెన్నప్పుగళుమ్వెఱ్పు, పొన్నులగిల్‌పోగమెల్లా పుణర్కుమ్ వెఱ్పు

విణ్ణవరుం మణ్ణవరుమ్ విరుంబుంవెఱ్పు వేంగడ వెఱ్పెన విళంగుమ్ వేదవెఱ్పే

శ్రీ కృష్ణపరంధాముని రెండుపాదాలే మనకు ప్రాప్యప్రాపకాలు, అని ప్రదర్శించే పర్వతం. సంచితాగాములనే రెండు రకాల పాపాలను ధ్వంసం చేసే పర్వతం, పరమ పదం ఇదే అన దగినట్లు ప్రకాశించే భూధరం; పరిశుద్ధమైన పెక్కు తీర్థాలు (ఝరులు) చేరియున్న శిఖరి; పుణ్యసాధక మిది అని కొండాడే కొండ; స్వర్ణలోక (పరమపద) మందలి భోగాలనన్నిటినీ (ఇక్కడ) కలుగజేసే ధరాధరం; నిత్య ముక్తులూ మనుష్యులూ ఆదరించే మహీధరం. వేంకటాచలమని శాస్త్రప్రసిద్ధమైనవేద (మయ) గిరి అని శ్రీ వేదాంతదేశికులు 'అధికారసంగ్రహమ్' అనే తమ ప్రబంధంలో 'తిరుమల' ను ప్రస్తుతించారు.

4. గోపాద్యర్థం ధృతాద్రెః:- వెత్తి ఒన్టు ఎడుత్తు, ఒఱ్కమ్ ఇన్టియేనిఱ్కుమ్ అమ్మాన్(పా4) కొండనొక దాని నెత్తి శ్రమలేకయే నిల్చిన స్వామి. భగవంతుని ఆర్జవగుణం తమ వరకు ప్రసరించిన ప్రకారాన్ని తెల్పుతున్నారు. (గోవర్ధన పర్వతోద్ధరణ విషయమిది) ఇంద్రుడు కోపించి గోగోపజనం బాధింపబడే రీతిగా (రాళ్ళ) వానకురిపిస్తు న్నప్పుడు దానికి తగిన రక్షణోపకరణం లభించనందువల్ల తన ముందు కనబడిన ఒక పర్వతాన్ని ఎత్తి పట్టి వర్షబాధను పరిహరించాడు శ్రీకృష్ణుడు. ఏడేండ్ల ప్రాయపు బాలునికి, ఒక్క శ్వాసతో దొడ్డపర్వతాన్ని ఎత్తి పట్టుకొని నిల్చి ఉంటే శ్రమ కలుగ లేదా? అంటే సంకోచమేలేదు. (ఒఱ్కమ్-సంకొచం ఇక్కడ శ్రమ-ఇళైప్పు-అని అర్థం) ఏడు దినాలు దాకా ఒకే రీతిగా కొండ నెత్తి పట్టుకొని నిల్చిన బాలునికి శ్రమ ఎందుకు కలుగ లేదు? అంటే, 'అమ్మాన్' - ఆయనస్వామి కదా! అన్నారు. సంసారులతో సహజ సంబంధమున్న స్వామి ఆయన. సంతానరక్షణ విషయంలో తల్లికి శ్రమ ఉండదు కదా!

'శీర్ కఱ్పన్ వైకలే' - (స్వామి యొక్క) కల్యాణ గుణాలను అభ్యసిస్తాను ప్రతిదినం. ఆళ్వార్లు గుణలుబ్ధులు. 'గుణైర్దాస్యముపాగతః' - శ్రీరామచంద్రస్వామి గుణాలకు లోబడి దాసుడై లక్ష్మణస్వామి ఆయన వెంట పోయినట్లు శ్రీ కృష్ణుడు గోవర్ధన గిరినెత్తి రక్ష్యవర్గాన్ని కాపాడిన స్వభావాన్ని - సౌలభ్యాన్ని - అనుసంధించి క్రమంగా ఆయన కల్యాణ గుణాలను నిరంతరం అనుసంధానం చేస్తాను. 'వైకల్' - ఒక్కసారి గుణకీర్తన చేసి, తర్వాత తమ పనిని చేసుకోవడానికి పోయే వారు కాదు ఆళ్వార్లు. 'విపన్యవః' స్తుతిశీలురైన నిత్యసూరులలాగా ఈ దివ్యసూరికి భగవద్గుణానుసంధానమే జీవయాత్ర. కాబట్టి ప్రతిదినం సర్వదా అనుసంధిస్తానన్నారు ఆళ్వార్లు.

5. శ్రితతనురసికే :- వైకలుమ్ వెణ్ణెయ్ కైకలందు ఉణ్ణాన్ - (పా5) ఎల్లప్పుడు వెన్నను చేతులతో కలిపి పూసుకొని ఆరగించే వాడు శ్రీ కృష్ణుడు .ఆళ్వార్లు స్వామిని వదలి స్వామి గుణాలనే అనుభవిస్తుంటాడు. స్వామి కూడా ఆళ్వార్లను వదలి వారి శరీరాన్నే ఆదరిస్తుంటాడని తెల్పుతున్నారు. భగవద్గుణాలు ఆళ్వార్లకు ధారక మయినట్లే, ఆశ్రితులు స్పృశించిన ద్రవ్యమే భగవంతునికి సదా ధారక మవుతుంది. వెన్న మీద ఉన్న ఆదరం చేత కుడి, ఎడమ ఆనక, రెండుచేతులను కడవలోనికి దించి, రెండు చేతుల నిండా వెన్న ను తీసుకొని తినేవాడు శ్రీకృష్ణుడు. "తారార్ తడన్తోళ్ ఉళ్ళళవుమ్ కై నీట్టి" (శ్రీఃయ తిరుమడల్) మాలాలంకృత స్కంధ పర్యంతం చేతిని చొనిపి - అన్నట్లు బాలుడు కాబట్టి, చేతుల నిండా ఎంత వెన్న నుతీసుకొంటే అంత కడుపు నిండుతుందనుకొని కడవ అడుగుదాకా చేతులను దింపి వెన్న ను కలిపి, రెండు చేతుల నిండా వెన్న ను తీసుకొని, పులుముకుంటూ ఆరగించేవాడు. వెన్న దొంగ అని పసికట్టి కలహింప వచ్చిన వారి చేతులతో తన చేతులు కలుపుతూనే లేదా దొంగను వెదకి పట్టుకోవడానికి వచ్చిన వారితో చేతులు కలిపి ,తానూవెదకు తున్నట్లు నటిస్తూనే వెన్ననారగించేవాడు బాలకృష్ణుడు.

సర్వాధికుడైన స్వామి, నిత్య సంసారి యొక్క శరీరాన్ని గోకులంలో వెన్నను ఆదరించినట్లు ఆదరించి, చేరి ఉన్నాడనడం వాస్తవమా? అంటే 'పొయ్ కలవాతు ఎన్మెయ్ కలన్దాన్'- అసత్యం కాక, నిజంగా నాశరీరం లో చేరి ఉంటాడు అన్నారు ఆళ్వార్లు. వ్రేపల్లెలో వెన్న మీద స్వామి చూపిన ఆదరణ ఎలా అబద్ధం కాదో, అలాగా నా మేనిలో (ఆత్మతో) స్వామి కలిసి ఉండడం అసత్యం కాదు. సత్యమే అని దృఢంగా చెప్పారు. 'ఎన్మెయ్' -నా శరీరం - అనడం వల్ల, హేయమైన తమశరీరాన్ని స్వామి స్పృశించి అపవిత్రుడైతాడేమో అని భావిస్తూ, అనాదరణీయమైన తమమేను స్వామికి భోగ్యమైనదన్నారు.

6. వామనీభావ దృశ్యే :- కలన్దు ఎన్ ఆవి నలమ్ కొళ్ నాతన్ (పా6) కలిసి యుండినా ఆత్మ యొక్క మంచితనాన్ని స్వీకరించిన నాథుడు. నాతో 'ఒకేనీరు' ఒకే వస్తువు అన్నట్లు కలిసి ఉండి తర్వాత నా ఆత్మ యొక్క శేషత్వ మనే మంచితనాన్ని స్వామి స్వీకరించాడు. నన్ను దాసునిగా నూ చేసి (తి.నెదుం) అన్నట్లు, తాను నాకు విధేయుడై ఉన్నట్లు ఉండి. నాది అనుకొన్న ఆత్మను నాదికాకుండా తనదిగా చేసుకొన్న ప్రభువు

నా స్వార్థత్వస్థితిని నివర్తింపచేశాడు. తానే ఆక్రమించాడు. ఈ విధంగా నీవు ఒకడవే ఆక్రమింపబడినావా ఇంకెవరైన ఉన్నారా? అంటే, మహాబలి, ఆనాడు ఆయన మాయకు లొంగి వశపడినాడు అన్నారు.

'పులన్ కొళ్ మాణాయ్ నిలమ్ కొణ్డాన్- ఇంద్రియాలనాకర్షించే బ్రహ్మచారియై భూమిని స్వాధీన పరచుకొన్నాడు. బలిచక్రవర్తి ఆత్మను అనన్యార్హంగా చేయలేదు. సర్వేశ్వరుడువామన మూర్తి యై తన రూప సౌందర్యాన్ని ప్రదర్శించి, బలినిలొంగదీసి అయన తనదిగా అభిమానించే భూమిని స్వీకరించాడు. సర్వేంద్రియా పహారక్షమమైనది వామనుని దివ్య మంగళవిగ్రహం ఆప్రభువు ఈదివ్య చేష్టలను నాకు చూపి, తన గుణాలచేత నన్ను వశపరచుకొని నాశరీర మందుండి 'నేను స్వతంత్రుడ' ననే నాభ్రాంతిని పోగొట్టి నాఆత్మను శేషభూతంగా - నన్ను దాసునిగా - ఏలుకొన్నాడు అని భావించారు నమ్మాళ్వార్లు.

7. సచ్చిత్తానన్య వృత్తే:- కొణ్డాన్ ఏళ్ విడై (పా.7) ఏడెద్దులను వశపరచుకొన్నాడు. (''ఇన్నప్పడై వీట్టైక్కొండాన్''-వెన్డాన్ ఎన్నాతే, కొణ్డాన్ 'గెల్చెను' అనక స్వాధీనపరచుకొన్నాడు అన్నారు. ఈ పట్టణాన్ని స్వాధీన పరచుకొన్నాడన్నట్లు) నీళాదేవిని వివాహమాడడానికై ప్రతిబంధకంగా ఉన్న ఏడెద్దులను జయించాడు. శ్రీ కృష్ణుడు.

'ఏళ్వైయమ్ ఉణ్డాన్' ఏడులోకాలను ఆరగించాడు. ప్రళయకాలంలో భగవానుడు భూమిని తన గర్భంలో ఉంచకోవడమనేది లోకాలను సంహరించడంకాదు, రక్షించడమే. ప్రళయమనే ఆపదనుంచి, భూమిని తన ఉదరంలో చేర్చుకోక ఎలా ఉండ లేక పోయాడో అలా సర్వేశ్వరుడు తమలో చేరితే గాని నిల్వలేక, తమతో సంశ్లేషించారని ఆళ్వారుభావించారు. తాను ప్రేమించిన వారిని కాపాడడానికి అడ్డు తగిలిన విరోధులను శిక్షించి నట్లే స్వామి తమ విరోధులను శిక్షించాడనే రెండు విషయాలను ఉదాహరణగా -సప్తలోక భక్షణం, సప్త వృషభశిక్షణం, అనే రెండింటినీ ఆళ్వార్లు తెలిపారు. అంతేకాదు;

'తణ్ తామమ్ శెయ్తు, ఎన్ ఎణ్ తాన్ ఆనాన్' - శీతల ధామంగా చేసుకొని, నా భావన తాను అయ్యాడు. చల్లని వరమపదమని భావించి నాలో చేరి నామనోరథంతాను కలవాడయ్యాడు స్వామి. "వైకుంఠానికి పోవాలి, విరజలో మును

గాలి, సామగానంచేస్తూ శ్రియఃపతిని అనుభవించాలి” అని ఆళ్వారు భావిస్తుంటే దానికి ప్రతిగా స్వామికూడా “తిరునగరికి పోవాలి. తామ్రపర్ణిలోమునుగాలి, కణ్ణినుణ్ శిఱుత్తాంబు పాడుతూ ఆళ్వార్లను అనుభవించాలి” అని కోరుతున్నాడు. నాయందు అంత ప్రేమను చూపాడు, అని తెలిపారు ఆళ్వార్లు.

8. విభవసమతనౌ:- ఆనాన్ ఆన్ ఆయన్, మీ నోడు ఏనముమ్ తాన్ ఆనాన్-(పా8) గొల్ల వాడుగా అవతరించిన తానే మత్స్యం తో పాటువరాహమూ అయ్యాడు. ‘తాన్’ అన్నందువల్ల ‘సర్వాధికారత్వం కలవాడుస్వామి’ అని సూచితం ఆయన్-గొల్లవాడై రాజ్యాధికారం కోసం ఎత్తిన జన్మకాక, ఆ జాతికి తగిన గోరక్షణం తన ధర్మంగా స్వీకరించిన జన్మ ఇది. మనుష్యులు - గొల్లలు-తిన్నదేతిని, వారితో కలిసి మెలసితిరిగిన కృష్ణావతారాన్ని మొదట తెలిపారు ఆళ్వార్లు. ఇంతటితో ముగించలేదు. క్రమంగా అవతరించినవే అయినా, “మత్స్యంతో పాటు వరాహమయ్యె” అని, ఏకకాలంలో అవతార ద్వయం జర్గినట్లు అనుసంధించడం ఆళ్వారు యొక్క అనుసంధాన త్వర’ గా సూచింపబడినది, మీనమైనా వరాహమైనా శరీరంలో గుణాలూ, చేష్టలూ, అన్నీ ఆయాజాతులకు తగినట్లు స్వీకరించాడుస్వామి. మత్స్య,, వరాహ, కృష్ణావతారాలు మూడు కూడా విద్యా దానంచేసిన అవతారాలు. మత్స్యావతారంలో మనువుకు ఉపదేశించాడు. వరాహావతారంలో భూ దేవికి ‘స్థితేమనసి’ అనే చరమశ్లోకద్వయాన్ని ఉపదేశించాడు. శ్రీకృష్ణుడైనరునికి గీతోపదేశంచేశాడు. చేతనులను తనవైపు మళ్ళించు కోవడానికే ఈ విద్యా ప్రదానం కాబట్టి ‘ఎన్నిల్, తాన్ ఆయ శంగు’ - చెప్పదలచుకొంటే, (నాకోసం ఎత్తిన) తన అవతారాలు ఒక శంఖు(వేయికోట్లకు సమానమైన సంఖ్య) ఆశ్రిత వాత్సల్యాన్ని ప్రకాశింపచేసే ఆదిదేవుని అవతారాలకు మితి లేదని విశదం చేశారు ఆళ్వార్లు (శంగు=సంగం; ఎన్నిల్ శంగు = నా మీద ప్రేమ. ఎన్నిల్=లేక్క పెడితే, శంగే=ఒక్కసంఖ్యేనా? అసంఖ్యాకాలు)“ బహూని” - తనజన్మలు అనేకములన్నాడేకాని ఇన్ని అని ఒక సంఖ్యను చెప్పలేదు గీతలో.

9. స్వాయుధారూఢహస్తే:- శంగుశక్కరమ్ అమ్ కైయిల్ కొణ్ణాన్, ఎంగుమ్ తాన్ ఆయ నంగళ్ నాతన్ - (పా9) శంఖ చక్రాలను అందమైన హస్తాల యందు ధరించినవాడు. అంతట ఆవతరించేవాడు మన ప్రభువు.

ఎవరినైనా వశపరచుకోదలచేవారు తమ చేతిలో వశీకరణౌషధాన్ని పట్టుకొని, వారు దొరికినప్పుడు వారిమీదప్రయోగించడానికి తిరిగే రీతిగా, స్వామి చేతను లను వశీకరించు కోవడానికి తన బాహువులందు దివ్యాయుధాలను ధరించి అవతరిస్తాడు. అన్ని అవతారాల్లో ఆయుధాలు దగ్గరనే ఉంటాయా? ఉంటాయి. రాజు నగర శోధనార్థం పర్యటన చేసే సమయాన ఎవ్వరు గుర్తు పట్టకుండా నల్లని ముసుగువేసుకొని తిరుగుతున్నప్పటికీ, అక్కరపడి కూతపెడితే పరుగెత్తి రాదగినంత దూరంలో ఆంతరంగికులు అవశ్యంగా ఉంటారు కదా! అలాగే ఆశ్రితులకు మాత్రమే దివ్యాయుధాలు కనబడుతాయి. అనాశ్రితులకు ఆయుధాలను ప్రకాశింప చేయడు మన ప్రభువు. 'కూరారాళి వెణ్ శంగేంది వారాయ్'- విరోధినిరసనార్థం పదునైన (తీక్షణమైన) చక్రాన్ని తెల్లని శంఖాన్ని ధరించి రావయ్యా"! అని ఆర్తితో ప్రార్థించే వారు కాబట్టి ఆశ్రితులకు దివ్యాయుధాలతో స్వామి దర్శనమిస్తాడు. అలంకారశూన్యమైనప్పుడు దృష్టిదోషం కలుగుతుందో! అనిపించేంతటి అందమైన ఆభరణాలు శంఖచక్రాలు చేతులందే ఉంటే ఆ ఆందం చెప్పశక్యమా?

దేవ, మానవ, పశుపక్ష్యాదులలోను అంతటా అవతరించేనాథుడు లేదా; ఒకరిని పట్టుకోవడానికి ఊరంతా చుట్టుముట్టిన విధంగా నన్ను వశపరచుకోవడానికి, అన్ని ప్రదేశాలయందునూ వ్యాపించి ఉన్నాడు స్వామి. తమనుస్వాదీనంచేసుకోవడమే ఈ అవతార ప్రయోజనం అని తెలిపారు ఆళ్వార్లు, 'శంగుశక్కరమ్' - ప్రధానమైన చక్రాయుధాన్ని మొదట చెప్పక, శంఖాన్ని మొదటి చెప్పినారేమి? సంహరించేది చక్రం, రక్షించేది శంఖం 'ముక్తయే పాంచజన్యంచ' - మోక్షమిచ్చే దిశంఖం - అనే పాంచరాత్రాగమాన్ని బట్టి శంఖం మొదట చెప్పబడింది.

10. నీచోచ్చగ్రాహ్యపాదేః- నాతన్, జ్ఞాలమ్ కొళ్పాతన్, ఎన్ అమ్మాన్-(పా10) నాథుడు, శ్రీచరణాలతో నేలను కొల్చినవాడు, నాస్వామి, సర్వనియంత, నాథుడు. వసిష్ఠ - చండాల విభాగరహితంగా - గొప్పవారు తక్కువవారనే భేదంలేకుండా - అందరి తలల మీదనూ తనపాదాలనుంచిన వాత్సల్య పూర్ణుడు. లోకత్రయాన్ని ఆక్రమించి పరత్వాన్నీ, అందరి తలలపైన పాదాలనుంచి సౌలభ్యాన్నీ ప్రదర్శించి నన్ను అనన్యార్హునిగా చేసిన వాడు నాస్వామి.

మొదటి పాశురంలో చెప్పిన రీతిగా శ్రియఃపతి శేషి అని 'నాతన్' శబ్దం సూచిస్తుంది.

'జ్ఞాలమ్ కొళ్ పాతన్, వల్ల రెండవపాశురంలో చెప్పినట్లు సౌలభ్యం సూచితం. 'ఎన్అమ్మాన్' అనడంవల్ల 3 పాచెప్పినట్లు వేంకటాచలం మీద వేంచేసి యుండి ఆళ్వారు యొక్క కైంకర్యాన్ని స్వీకరించే వృత్తాంతం తెల్పబడింది. (కణ్ణావాన్- కన్నుకలవాడు-జ్ఞానప్రదుడు రక్షకుడనే రెండు అర్థాలనూ సూచించారు కదా!)

'ఓతమ్పోల్ కిళర్ వేత నీరన్'- సముద్రంవలె పొంగుతున్న వేదం చేత ప్రతిపాదింపబడే స్వభావం కలవాడు. ఇక్కడ 'నీరన్' - స్వభావం-ఆర్జనగుణంకలవాడని అర్థం.

శబ్దార్థసమృద్ధి గల వేదం చేత ప్రతిపాదనీయ స్వభావుడు సర్వేశ్వరుడు.

11. నీరవర్ణే:- నీర్పురై వణ్ణన్శీర్-(పా11) ఉదకంవంటి స్వభావం గల స్వామి యొక్క కల్యాణగుణాలను (ప్రతిపాదించిన) 'శడగోపన్, నేర్దల్ ఆయిరత్తు, ఓర్దల్ ఇవైయే' - నమ్మాళ్వార్లు, స్పష్టంగా చెప్పిన వేయి పాశురాలలో పరిశీలించి చెప్పినవే ఇవ్వి (10పాశు) ఈ దశకమంతా స్వామి యొక్క ఆర్జన గుణాన్నేవివరించింది. ఆర్జవమంటే మనోవాక్కాయాలకు ఏకరూపత్వం. స్వామి ఆర్జన గుణమెట్టిది? సంసారుల భావానికి తగినట్లు స్వామి తన మనోవాక్కాయాలను ప్రవర్తింపచేయడం. కాబట్టి, జలతుల్యమైనది స్వామి యొక్క ఆర్జవగుణం. ఉపాయజ్ఞులు మళ్ళించిన దారిలోనే నీరు ప్రవహిస్తుంది. ఎటు త్రిప్పిన అటే తిరిగే నీటివెల్లువ లాగా, భగవానుడు ఆశ్రితుల కార్యాన్ని నెరవేర్చడానికి అవసరమైన రూపాన్ని స్వీకరిస్తాడు. ఆరూపమందలి చేష్టలను, అవి తనకు సహజమైనవే అన్నట్లు, కరణత్రయంతో చేసేవాడు.

నేర్తల్-ఆళ్వార్లు, తాము అనుభవించక ఇతరులకు చెప్పేవారుకారు. అగుణాలయందవ గాహించి, అనుభవించి ఈ తిరువాయ్ మొళిని స్పష్టంగా చెప్పారు.

ఓర్తల్-పరిశీలిస్తే, సంసారులు ఋజువర్తనులుకారు. వీరి మనస్సు, మాట, చేష్టమూడు నూ మూడు తెన్నులలో పయనిస్తుంటాయి. కాబట్టి సంసారులను ఉద్ధరించడానికి చాలా ఆలోచించిన నమ్మాళ్వార్లు, స్వామియొక్క ఆర్జవగుణాన్ని 'సహ ప్రగీతి' లోని ఈదశకం ఓర్తల్-అనుసంధేయం. నమ్మాళ్వార్లనుగ్రహించిన ఈ తిరువాయ్మొళి. పది పాశురాలు - ఇహ పరసుఖాలను పొందదలచే సంసారులకు నిత్యం అనుసంధింప దగినవని స్పష్టీకృతం.

నవమదశకం:-

9. పర్యంతే ంకేచదృష్టం స్వవిరహవిముఖండింభవత్ పార్శ్వేలీనమ్
చిత్తేక్ల ప్తప్రవేశం భుజశిఖరగతం తాలుసింహాసనస్థమ్।
చక్షుర్మధ్యేనివిష్టం స్థితమళిక తటే మస్తకే తస్థివాంసమ్
ప్రత్యాహారోక్త రీత్యా విభుమనుబుభుజే సాత్మ్య
భోగప్రదానాత్॥ 20

అర్థం:- పర్యంతే -సమీపమందును; అంకేచ = తొడయందును; దృష్టం = చూడబడినవాడు; స్వవిరహ విముఖం = తన విశ్లేషమందు ఉపేక్షకలవాడు; డింభవత్ = బిడ్డవలె; పార్శ్వలీనం = ప్రక్క యందు దాచుకొని యున్నవాడు; చిత్తే = మనస్సునందు; క్లప్తప్రవేశం = చేయబడినప్రవేశంకలవాడు; భుజశిఖర గతం = భుజాల యొక్క కొసనుపొందినవాడు; తాలు సింహాసనస్థం = నాలిక అనే సింహాసన మందు ఉరడే వాడు; చక్షుర్మధ్యే = నేత్రాల మధ్య యందు; నివిష్టం = ఉండేవాడు; అళిక తటే = నొసటి ప్రదేశమందు; స్థితం = ఉండేవాడు; మస్తకే = శిరస్సునందు; తస్థివాంసం = ఉండేవాడునైన; విభుం = సర్వేశ్వరుణ్ని; ప్రత్యాహార+ఉక్తరీత్యా = తక్కిన ఇంద్రియాలు మనస్సును అనుసరించడం అనే ప్రత్యాహార మందు చెప్పబడిన రీతిచే; సాత్మ్యభోగప్రదానాత్ = ఓర్చగా ఓర్చగా అనుభవం ఇవ్వడం వల్ల; అనుబుభుజే = అనుభవించెను.

తా॥ శ్రియఃపతి తన సమీపమందున్నాడని, తర్వాత తనతొడమీద ఉన్నాడని, తనను విడిచి ఉండలేడని, బిడ్డవలె నా పక్కకు దాగుకొన్నాడని, నామనస్సున ఉన్నాడని, నా భుజశిఖరాలను పొందినాడని, నా నాలికయందు నివసించాడని, (తన దివ్య మంగళ విగ్రహాన్ని నేను అనుభవించి సంతోషించే రీతిగా) నా నేత్రాల యందు ఉన్నాడని; నాముఖమందు చేరెనని, నాతలమీద ప్రవేశించాడని, సమస్త కరణాలచే తనను అనుభవించి, తన యొక్క సాత్మ్యభోగప్రదత్వాన్ని ఈ దశకమందు సాదించారు.

ప్రకా-వ్యాఖ్య:- ఆళ్వార్లు స్వామి యొక్క ఆర్జవగుణాన్ని అనుభవించిన స్థితిని చూచిన శ్రియఃపతి, ఇప్పుడు మంచి అవకాశం వచ్చిందని భావించాడు. తల్లి శిశువులకు

ఆహారాన్ని కొంచెంకొంచెం తినబెట్టేరీతిగా, భగవానుడు ఆశ్రితులకు తన అనుభూతిని మెట్టు మెట్టుగాకలిగిస్తాడని ఈ దశకం తెల్పుతుంది. శ్రీకృష్ణుడు గీతోపదేశమప్పుడు, మొదట తన విభూతిని వివరించి అర్జునునికి ఆవిభూతిగల దేవదేవుణ్ని చూడాలనే కోరికను కలిగించాడు. చర్మ చక్షువులతో చూడశక్యంకాదని,తానే పార్థునికి దివ్య చక్షువును ప్రసాదించి విశ్వరూపాన్ని దర్శింప చేశాడు. నిత్యవిభూతివాసులను, పరంధాముడు వేర్వేరు రకాలైన అనుభవాలనందించి పరవశింప చేస్తాడు. లక్ష్మీదేవిని గాఢాలింగనం తోనూ, గరుడుని వాహనంగా స్వీకరించడంతోనూ, నాగరాజును సెజ్జగా మార్చుకోవడంతో ఆనందింవచేస్తాడు. నిత్యసూరులకు కలిగించే అనేకానుభవాలనన్నిటినీ ఒక్క ఆళ్వారుకు ప్రసాదించి అనుభవింపచేస్తున్నాడు. అయితే గోష్పదమందు సముద్రాన్ని నింపినట్లు చేయక, ఆళ్వార్లు తాళలేడని మంద మందంగా అనుభవింపచేస్తున్నాడు. కాబట్టి ఆళ్వార్లు తమకోరిక తీరేవిధంగా సర్వేంద్రియా లతోనూ, సర్వావయవాలతోనూ అనుభవించి, తదనుభవజనితమైన ప్రీతిచే గానంచేసి అనుభవిస్తున్నారు ఈ దశకంలో.

ఈ మొదటి పాశురంలో జగత్కారణుడు, సర్వాంతర్యామియైన శ్రీ కృష్ణభగవానుడు నా దగ్గరి నుంచి (నన్ను విడిచి) పోలేకున్నాడంటున్నారు. స్వామి గుణాలను, విభూతిని అనుభవించడంలో భేదంలేదు. ఆళ్వారుకు ఈ రెండు సమానంగా అనుభవింపదగినవే. కాబట్టి సాముదాయికంగా (వీటిని) అనుభవిస్తున్నారు.

పర్యంతే దృష్టమ్:- ఇవైయుమ్, అవైయుమ్, ఉవైయుమ్; ఇవరుమ్, అవరుమ్, ఉవరుమ్; యవైయుమ్, యవరుమ్; తన్నుళ్ళే ఆకియుమ్ ఆక్కియుమ్ కాక్కుమ్; అవైయుళ్ తనిముతల్(పా1) దగ్గరున్న వస్తువులు, దూరంగా ఉన్న వస్తువులు, నడుమనున్న వస్తువులు;

వీరు, వారు, మధ్యనున్నవారు; అన్నిటినీ అందరినీ-చేతనాచేతనాలన్నిటినీ-తనలోపలుంచుకొని, సృష్టించి, కాపాడుతాడు. వాటికి ఏకైకకారణరూపి. ప్రళయకాలాన చిదచిత్తులను తన గర్భంలో ఉంచుకొని, వాటిని వేరుగా వ్యవహరింపవీలులేనిరీతిగా 'సదేవ' -సత్ మాత్రమే - ఉన్నది అనదగినట్లు ఉంటాడు. అప్పుడు భగవచ్ఛబ్దమే ఈ చిదచిత్తులకువాచకమై ఉంటుంది. తర్వాత చిదచిత్తులను సృజిస్తాడు. సృజించడమంటే లేని వాటిని కల్పించడంకాదు. నామరూపాలు లేక తనలోన చేరియున్న వాటికి

నామరూపాలతో విభాగార్హదశను కల్పించడమే. సృష్టించినవాటి నన్నిటినీ ఆర్ద్ర హస్తంతో తడవి రక్షించేవాడుకూడా భగవంతుడే. వాటిలో అంతరాత్మగా వ్యాపించి ఉండే అద్వితీయకారణభూతుడూ భగవానుడే.

"తత్సృష్ట్వా. అనేన జీవేనాత్మనాను ప్రవిశ్యనామరూపేవ్యాకరవాణి. తదను ప్రవిశ్య సచ్చత్యచ్చా భవత్" - అన్నట్లు సృష్ట్యర్థాను ప్రవేశం, స్థిత్యర్థానుప్రవేశం అని అనుప్రవేశం రెండు విధాలు కదా! ఈ చిదచిత్తులను బోధించే ఏశబ్దమైనా భగవంతుని వరకు బోధించక నిల్వదు.

'ఎమ్మాన్- తన విభూతి విషయమై తనకున్న పక్షపాతాన్ని చూపినన్ను అనన్యార్హునిగా చేసి కొన్నాడన్న సంతోషంతో 'మాస్వామి' అన్నారాళ్వార్లు. 'కణ్ణపిరాన్' సర్వకారణకారణుడైన సర్వేశ్వరుడు కంటికి కనుపించే గోపాలకృష్ణుడుగా అవతరించాడు. "ఎన్నముతమ్"-నాకు అమృతం వలె పరమభోగ్యుడు. అమృతమే. దేవతలు పొందినది ఒకరిచే అనుభవింప బడునట్టి అమృతమే కాని అది మరొకదాన్ని అనుభవించేశక్తి దానికి లేదు. 'శువైయన్' - పరమరసికుడు. శ్రీకృష్ణామృతం ఇతరులచే అనుభవింపబడుతుంది, తానూ అనుభవిస్తుంది. స్వామి రసాన్ని గ్రహించి అనుభవించే రసికుడు. "తిరువిన్ మణాళన్" -'లక్ష్మీవల్లభుడు' కావడమే ఈ రాసిక్యానికి కారణం. ఆళ్వార్ల యొక్క అమృతం మిధునమే. లక్ష్మీదేవి చేత"అకలకిల్లేనిఱైయుమ్" క్షణంకూడా విడిచిఉండడం నాకుశక్యంకాదు - అనిపించుకొనే యోగ్యతగల లక్ష్మీనాథామృతం.

"ఎన్నుడైశూళల్ ఉళాన్" - నాచుట్టు తిరుగుతున్నాడు. అట్టి లక్ష్మీనాధుడునా పరిసరాల్లో సంచరించడమే తన భాగ్యమని మురిసి పోతూ చుట్టూ తిరుగుతున్నాడన్నారాళ్వార్లు. "యస్యప్రసాదే సతతం ప్రసీదేయురిమాఃప్రజాః" - సరామోవానరేంద్రస్యప్రసాద మభికాంక్షతి" -ఈ ప్రజలందరు ఎవని అనుగ్రహాన్ని ఎల్లప్పుడు కోరుతుంటారో, అట్టి శ్రీరామ చంద్రస్వామి వానరాధిపతి యైన సుగ్రీవుని అనుగ్రహాన్ని కోరుతున్నాడు - అన్నట్లు లభించనీ, లభించకపోనీ మొదట కోరుతున్నాడు. అట్టి లక్ష్మీనాథుడు ఆళ్వారు చుట్టూ తిరుగుతున్నాడు. రసికత్వం, లక్ష్మీ సంశ్లేషం - ఈ రెండు పరస్పర సాపేక్షాలని సుందర జామాతృయోగుల శ్రీసూక్తి నమ్మాళ్వార్లు పరత్వాన్ని అనుసంధిస్తూ, సౌలభ్యాన్నీకీర్తిస్తున్నారు.

2. అంకే చదృష్టమ్:- శూళల్ పలపల వల్లాన్ (పా 2) అనేకావతారాలను (ఎత్తే) సమర్థుడు (శూళల్-చుట్టుముట్టు, చేతనుబను వశవరచుకోవడానికే (చుట్టుముట్టడానికే) అవతారాలు. కాబట్టి "అవతారాలు" అని 'శూళల్' పదానికి అర్థం) పలపల - అనేకావతారాలు. పలుజాతులలో, ఆజాతులలో ఉన్న అవాంతర భేదాలతోను అవతరించాడు. మానవజాతిలో రాముడుగానూ, పరశురాముడుగానూ, గొల్లల్లో కృష్ణుడుగా, బలరాముడుగానూ, జలచరాల్లో చేపగా, తాబేలుగానూ జన్మించాడు స్వామి. వల్లాన్-సమర్థుడు. కర్మచేత పలు జన్మలనెత్తే జీవులవలెకాక, కరుణచే పలుజన్మలనెత్తే సమర్థుడు. కర్మకువశ్యుడైన జీవుడుకూడా, నీచజన్మను కోరుకోడు. కర్మచేత అవశ్యంగా జన్మిస్తాడు. అంతే కాని స్వామి స్వయంగానే నీచజాతులలో జన్మిస్తాడు. కర్మచేయలేని పనిని స్వామికరుణ చేస్తుంది.

తొల్లై అమ్‌కాలత్తు కేళల్ ఒన్టు ఆకి, ఉలకై ఇడంతకేశవన్-తొల్లి మంచి కాలమందుఅద్వితీయవరాహమై లోకాలను (అండాన్ని) వేరుచేసిన కేశవుడు. అమ్‌కొలత్తు-ఆవరాహం అందరికి కన్నుల పండుగ గాగోచరించినందువల్ల అందమైనకాలం, అన్నారు. ఒన్టుఆకి - సాటిలేనిది. తనపరత్వానికి తగిన వరాహ రూపాన్ని స్వీకరించాడా? అంటే, ఔను, సర్వశక్తిమంతుడైన సర్వేశ్వరుడు కూడా మళ్ళీ అట్టివరాహరూపాన్ని స్వీకరించాలనుకొన్నాపొందలేని అద్వితీయ రూపం అది. మరి ఇలా అవతరించింది గరుడానంతాదులను కాపాడడానికా? అంటే కాదు. సంకల్పానికి కూడా అపాత్రమైన - అచేతనమైన భూమిని ఉద్ధరించడానికి, అది ప్రళయార్ణవంలో మునిగిందని, నీటికీ, బురదకూ భయపడని వరాహరూపాన్ని స్వీకరించి రక్షించాడు.

ఆశ్రితుల ఆపదలను నివారించడానికి హీనరూపమెత్తినా, ఆరూపమే నీరాజనమీయదగినంత సుందరమైన వరాహతేజస్సు అది.

కేశవన్-ప్రళయార్ణవం నుంచి భూమిని విడదీసిన వాడు. ప్రశస్త(కేశములు) కేసరాలుకల-సటాయుక్తమైన వరాహరూపం కలవాడు.

'ఎన్నుడై అమ్మాన్' - భూమిని ఉద్ధరించినట్లే నన్నుకూడా సంసార సముద్రం నుంచి ఉద్ధరించి 'నా స్వామి' అన్నారు. వేళమ్ మరుప్పై ఒశిత్తాన్ - ('కువలయాపీడ'మనే) ఏనుగు దంతాన్ని విరిచినవాడు. ఆమదగజాన్ని శిక్షించిన విధంగా నా పంచేంద్రియాలను విషయాలనే మురికి గుంటలో పడనీయక శిక్షించినవాడు. -

విరోధినిరసనశీలుడుస్వామి. "విణ్ణవర్కు ఎణ్ణల్ అరియాన్" -దేవతలకు కూడ తెలుసుకోడానికి దుర్లభుడు. అసహాయుడై కువలయాపీడ గజాన్ని సంహరించిన శ్రీకృష్ణుడు బ్రహ్మాది దేవతల మనస్సుకూ అందనివాడు.

"ఆళమ్ నెడుమ్ కడల్ శేర్న్తాన్, అవన్, ఎన్ అరుకలిల్ ఆన్" -గంభీరమైన, విశాలమైన సముద్రమందు చేరి ఉన్నవాడు, నా సమీపంలోనే ఉన్నాడు. బ్రహ్మాదుల మొరనువినడానికి కాళ్ళుచేతులను చాపి పడుకోదగిన, విశాలమైన పాల్కడలిలో 3. స్వవిరహవిముఖమ్:- అరుకల్ ఇల్ ఆయ, పెరుంశీర్, అమరర్కళ్ ఆతిముదల్వన్' (పా3) తరగుదల (మొదలైనదోషాలు) లేని, మితిలేని గుణాలుకలవాడు, దేవతలకు మూలకారణుడు, హేయగుణప్రత్యనీకుడూ, అపరిచ్ఛిన్న కల్యాణగుణాకరుడూ అయిన స్వామి, తనగుణాలను నిత్యసూరులకు అనుభవింపచేస్తూ వారి స్థితి ప్రవృత్తులను తన ఆధీనంలో ఉంచుకొనే వాడు.

"కరుకియనీల నల్ మేనివణ్ణన్, శెంతామరైకణ్ణన్, పొరుశిఱైప్పుళ్ ఉవన్దు ఏఱుమ్, పూమకళార్ తని క్కేళ్వన్" - నల్లని నీలమణివంటి మేలైన మేని వన్నె కలవాడు, ఎఱ్ఱితామరలను పోలిన కన్నులుకలవాడు. దృఢమైన రెక్కలు కలపక్షిని ఆదరించి అధిరోహించేవాడు, పుష్పపుత్రికయైన లక్ష్మికి సాటిలేని వల్లభుడు.

శరీరకాంతి విలక్షణమైనది. ఆశ్రితులకోసం పరితపించి తనలోపల ఉన్న వాత్సల్యాదిగుణాలను ప్రకాశింపజేస్తూ, నిత్యజాగృతుడైనందువల్ల కన్నులు ఎఱ్ఱిబారినాయి. అధిరోహించడానికి స్వామి రమ్మనగానే గరుడుడు ఆనందంతో నదీప్రవాహం సుళ్ళుతిరిగి నట్లు తిరుగుతున్న శరీరంలో అమరియున్న రెక్కలను రెపరెపలాడిస్తూ పొంగిపోతుంటాడు. 'ఈపక్షిని మనం వాహనంగా పొంది తిమే! ఆహా! అని సంతోషంతో గరుత్మంతుణ్ని అధిరోహిస్తాడుస్వామి.

పుష్పమందలి పరిమళమే మూర్తిమంతమైనట్లు భోగ్యమైన లక్ష్మిదేవి సంబంధం, రెండవ వ్రేలిమీదికి రానట్లే -కనిష్ఠికాధిష్ఠితమై-ఉన్నస్వామి ఒక్కడే, వేరొకడులేడు కాబట్టి సాటిలేని వల్లభుడు.

"ఒరుగతియిన్, శువైతన్దిట్టు ఒళివిలన్, ఎన్నోడుడనే" - ఒకేవిధంగా, రసానుభవాన్ని ఇచ్చి, ఊరుకోలేనివాడై, నాతో కూడియున్నాడు. గరుడునికి ఆరోహణాన్ని, లక్ష్మికి

ఆలింగనాన్ని, నిత్యసూరులకుపాదసేవాదులను ప్రసాదిస్తాడు. ఒక్కొక్కరికి ఒక్కొక్క అనుభవాన్ని ఇచ్చి కటాక్షిస్తాడు స్వామి. కల్యాణై కతాన స్వరూపవై లక్షణ్యం, నిత్యసూరినిర్వాహకత్వం, దివ్యమంగళ విగ్రహయుక్తత్వం, పుండరీకాక్షత్వం, గరుడ వాహనత్వం, శ్రియఃపతిత్వం - అనే షడ్రసానుభవాన్ని నాకు ప్రసాదిస్తూ నాతో కూడియున్నాడు. వేరొక స్థలం ఆదరణీయమైనదన్నట్లు చూడక, నిత్యసూరులకు చూపే ఆదరం నా పైన చూపుతున్నాడు. మొదటి దశకంలో పరమపదంపైన ఉన్న ఆదరం నామీద చూపినాడని, ఇక్కడ మాత్రం పరమపదవాసుల మీద ఉండే ప్రీతిని కూడా నా మీదనే ప్రసరింప చేస్తూ, నన్నెడ బాయక ఉన్నాడు స్వామి, అన్నారు.

4. డింభవత్ పార్శ్వలీనమ్:- ఉడన్ అమర్ కాతల్ మకళిర్,తిరుమకళ్, మణ్మకళ్, ఆయన్ మడమకళ్ (పా4) తోడకూడి అమరి యుండే ప్రేమ - ఆశగల దేవేరులు శ్రీ భూనీళాదేవులు. 'ఎన్లుఇవర్ మూవర్' - అనే ఈ ముగ్గురు. కలిసి ఉన్నప్పుడే, ఎప్పుడైనా ఎడబాటు కలుగుతుందేమో అని భయపడుతూ, భగవదనుభవమందున్న ఆశతో, ఎప్పుడూ కూడి యుండే భార్యలు ముప్పురు. వీరిలో ప్రధానురాలు, పట్టమహిషి 'నకశ్చిన్నాపరాధ్యతి' (రామా) తప్పు చేయనివారెవ్వరు? చేసిన దోషాలను క్షమింపవలెనని స్వామికి చెప్పడానికి ఆయన ప్రక్క చేరియుండే మహాలక్ష్మి. భూదేవి, క్షమయేతాను కాబట్టి స్వామికి క్షమను బోధించే ఉపాధ్యాయిని. మొదట దోషాన్ని చూడడమెందుకు? అని మనదోషాలేకనబడకుండా చేయడానికి స్వామిని చేరి యుంటుంది. నీళాదేవి-గొల్లచెలువ. సౌందర్యరాశి. స్వామి అనుభవసుఖరూప. జీవుల దోషాలు స్వామి మనస్సులో భాసించకుండా, తన సౌందర్యంతో స్వామికి ఆనందాతిశయాన్ని అనుభవింపచేస్తూ స్వామిని తన అధీనంలో ఉండేరీతిగా చేరియుంటుంది. పరత్వమందు స్వామితో కూడియుండి, పురుషకారిణులై, స్వామిచే మనలను రక్షింపచేయడానికి దేవేరులు ముగ్గురున్నారు.

'ఆళుమ్ ఉలకముమ్ మూన్టే' - పాలింపబడే లోకాలూ మూడే. ఆ ముప్పురి స్త్రీధనం. లోకాలు అంటే లోకంలో ఉండే చేతనులు. త్రివిధ చేతనులు 1. భూలోకం 2. భువర్లోకం 3. సువర్లోకం లేదా (వి.పు.తో చెప్పినట్లున్న) 1. కృతక 2. అకృతక 3. కృతకాకృతకలో కాలు మూడు. 1. పాతాళం నుంచి భూమి వరకున్న లోకాలన్ని కలిసి ఒక్కటిభూలోకం, కృతకం. 2. జనోలోకం, తపోలోకం, సత్యలోకం (ఈ మూడు)

అకృతకం 3. మహర్లోకం, కృతకాకృతకం. లేదా ఊర్ధ్వలోకం, అధోలోకం, మధ్యలోకం. 'ఉడన్ అవై, ఒక్క, విళుంగి' ఒకేరీతిగా, ఒకే కాలాన, మ్రింగి - ఆమూడు లోకాలను సంపూర్ణంగా, ఒక్కటైనా ప్రిదిలిపోకుండా (విడిపోకుండా) ప్రళయకాలాన తన కుక్షిలో నిక్షేపిస్తాడు. రక్ష్యవర్గమైన విభూతిద్వయాన్ని శ్రీమద్గర్భమందు-ప్రళయానికి కర్మీభావసీమయందు స్థాపిస్తాడన్నారు. 'అలిలైచేర్న్దవన్' - వటపత్రమందు పవళించినవాడు. ఒక్కసారేముజ్జగాలను చిన్న బొజ్జలో ఇముడ్చుకోవడమూ, అంతభారంతో తాను ఒకలేత మఱ్ఱిఆకు (సద్యోజాత వటపత్రం) మీద శయనించడమూ, ఈ రెండు అఘటితాలే. (కూర్చజాలలేనికార్యాలు) ఆరెండింటిని కూర్చడం ఘటనాసామర్థ్యం. కూర్చరానివాటిని కూర్చడం అఘటితఘట నాసామర్థ్యం. లోకాలు లీలోపకరణాలు. సృష్టి స్థితి లయాలు లీలలు, ఎమ్మాన్ - ఇదివరకే ఉన్న అఘటిత ఘటనా సామర్థ్యానికి మించిన అఘటిత ఘటనాసామర్థ్యం "ననమేయంతు కస్యచిత్" -ఎవ్వనికీ తలవంచను - అనే స్థితిలో ఉన్ననన్ను తాను వటపత్రశాయిగా ఉండి అనన్యార్హ దాసునిగా స్వీకరించడమే. కాబట్టి నా స్వామి అన్నారు. "కడల్మలి మాయమ్,- పెరుమాన్ కణ్ణన్ ఎన్ ఒక్కలై ఆన్" -సముద్రం కంటే అధికమైన ఆశ్చర్యచేష్టలచే పేర్మినొందిన శ్రీకృష్ణుడు నా నడుమున చేరి యున్నాడు. సముద్రస్థుడైనా దాని కంటె మిక్కిలి ఆశ్చర్యగుణాలు కలిగి యున్న శ్రీ కృష్ణుడు అగుణాలను నాకు చూపినవాడు. సముద్రం లోతైనది, విశాలమైనది. చూడదగినది కాని అనుభవింపరానిది. అట్టి సముద్రంకంటె గొప్ప ఆశ్చర్యకరమైన (మాయ) చేష్టలు శ్రీకృష్ణునికి 'పెరుమాన్' పేర్మిని కూర్చాయి. ఆ శ్రీకృష్ణుడు యశోదఒడిలో బాలుడై కూర్చున్నట్లే, నా ఒడిలోనూ కూర్చున్నాడు.

అఘటితఘటనా సామర్థ్యం గల కృష్ణభగవానుడు తన పరత్వాన్ని ప్రదర్శిస్తూనే వాత్సల్యంతో తన సౌలభ్యాన్ని అనుభవింపజేస్తున్నాడు. ఆళ్వారును ఆపాదచూడం మెల్ల మెల్లగా సంశ్లేషించడానికి యత్నిస్తున్నాడు సర్వేశ్వరుడు. ఆనందం భగవానునిది. అనుభవం ఆళ్వారుది.

5. చిత్తైక్లప్త ప్రవేశమ్:- ఒక్కలైవైత్తు, ములైపాల్ ఉణ్ ఎన్ను తన్దిడ వాంగి శెక్కమ్ శెగ, అన్ను, అవళ్పాల్ ఉయిర్ శెక, ఉణ్ణ పెరుమాన్ (పా5) ఒడిలో వేసుకొని, చనుపాలు త్రాగుమని, ఈయగా స్వీకరించి, ఎఱ్ఱని పెదవులతో, ఆనాడు, ఆమెపాలనూ, ప్రాణాన్నీ

త్రాగిన స్వామి. ప్రేమగలయశోదాదేవివలె పూతన శ్రీకృష్ణుణ్ని తన ఒడిలోకి తీసుకొని నిర్బంధించి 'చూచుక పీడచేబాధపడుతున్నాను పాలను త్రాగు'మన్నది. విభీషణుడు ఆకాశాన నిల్చినప్పుడు "ఏష సర్వాయుధో పేతశ్చ తుర్భిస్సహరాక్షసైః॥ రాక్షసో భ్యేతి పశ్యధ్వం అస్మాన్ హంతుం ననంశయః॥ సర్వాయుధాలను ధరించి, నలుగురురాక్షసులను వెంటతీసుకొని మనలను చంపడానికే ఈ రాక్షసుడు వస్తున్నాడు. సందేహంలేదు" అని సుగ్రీవుడన్నాడు. రామునికి కలిగే హాని, తమకే హాని కలుగుతుందని భయపడినట్లు ఆళ్వార్లు కూడా ఆవిషదిగ్ధస్తన్యాన్ని తమకే ఇస్తున్నట్లు భావించి భయంతో 'తన్దుఇడ' ఈయబోయిన అన్నారు. 'వాంగి' పాలను కుడుపనిదే తాళలేనని పూతన తలచినట్లే ఆపాలను, త్రాగనిదే తాను ధరించలేనని శ్రీకృష్ణుడు చేతితో పట్టాడు.

'శెక్కమ్' అన్ననూశెక' అన్ననూ 'ఎఱ్ఱదనము'. శెక్కమ్శెక - సాంద్రమైన ఎఱ్ఱదనం, అని అర్థం ఎరుపుకోపానికి సంకేతం కాబట్టి 'శెక్కమ్శెక' అంటె కోపంకలుగగా అని భావం. తనకు స్తన్య మిస్తున్నదన్న తృప్తితో పెదవులను విప్పిచిన్నగా నవ్వినాడు కృష్ణుడు. శెక్కమ్-మరణం శెక్కమ్ శెక- మరణంకలుగునట్లు. శ్రీకృష్ణుడు మరణించాలని పూతన స్తన్యమిచ్చింది. మరణం ప్రధానం; కాబట్టి ఆమరణాన్ని కృష్ణుడు పూతనకే ప్రసాదించాడు. అన్దు-అప్పుడు జగదుపసంహారకాలమది.

అవళ్ పాల్ ఉయిర్ శెక - ఆమె పాలిటి ఆత్మ పోవడం. ఆమె యొక్కహేయశరీరాన్ని అంటు పెట్టుకొని ఉన్న ఆత్మను తీసి వేశాడు. అవళ్పాల్, ఉయిర్శెక-ఆమెపాలనూ ప్రాణాన్నీ అరగించాడు. "స్తన్యంతద్విషసమ్మిశ్రం రస్యమాసీత్ జగద్గురోః" (హరి వంశం) శ్రీ కృష్ణునికి విషంకలిసి నపాలు రుచికరమయ్యాయి -అన్నట్లు విషంకలిసినపాలు కూడా రుచిగా ఉన్నందువల్ల వాటిని త్రాగి విరోధిని తొలగించాడు. జగత్తుకు 'శేషి' ని అందించాడు, అన్నారు ఆళ్వార్లు.

నక్కపిరాన్ఓడు అయనుమ్ ఇందిరనుమ్ ముతల్ ఆగ ఒక్కవుమ్ తోత్తియ ఈశన్-నగ్నుడు ఉపకారకుడైన రుద్రుడు. దిగంబరుడైన రుద్రుడు తన గోష్ఠిలో ఉన్నవారికి ఉపకారంచేసేవాడు. అట్టి రుద్రునితోపాటు ఆయన తండ్రియైన (అజుణ్ని) చతుర్ముఖ బ్రహ్మను, ఇంద్రుడు మొదలైన దేవతలను, సకల పదార్థాలను ఒకేసారి సృజించిన సర్వేశ్వరుడు ఆయా పదార్థాలలోనూ తాను అంతరాత్మగాచేరినవాడు.

మాయన్ ఎన్ నెంజిన్ ఉళాన్ - సకల వస్తువులను తనకు శరీరంగా గ్రహించి తానుశరీరుడుగా వెలసి, ఆశ్చర్యభూతుడైన శ్రియఃపతి, నా శరీరంలోని ఏకదేశమైన హృదయమందు వెలసి యున్నాడు. బ్రహ్మాది దేవతలనూ, తర్వాత సమస్త పదార్థాలనూ మేడిపండు లోని పురుగులవలె ఒకేసారి అంకురింపజేసి వాటిలో తాను అనుప్రవేశం చేసిన సర్వశేషి తమ అంతరంగంలో నివసించాడన్నారు జగదాభరణులైన వకుళాభరణులు.

6. భుజశిఖరగతమ్:- మాయన్ ఎన్ నెంజిన్ ఉళ్ళాన్, మత్తు యవర్కుమ్ అతువే (అ.:తే) మాయావి నామనస్సున ఉన్నాడు. తక్కిన ఎవ్వరికైనా అలాగాచేయునా? సర్వేశ్వరుడు నా చిత్తంలో ఉన్నాడు. ఈ భాగ్యం ఇంకెవరికైనా కలిగిందా? ఇది వింతకలయిక, అలభ్యలాభం అని తెలుపుతున్నారు ఆళ్వార్లు.

'కాయముమ్, శీవనుమ్ తానే, కాలుమ్ ఎరియుమ్ అవనే - శరీరాలు, జీవులు (ఆత్మలు) వాయువు, అగ్ని తానే అయ్యాడు. దేవమానుష తిర్యగాది శరీరాలు, వాటిలో ఉండే ఆత్మలు, వాయ్వగ్నులు మొదలైన పంచభూతాలు తన సంకల్పాధీనాలై ఉండే రీతిగా ధరించి నియమించేవాడు సర్వేశ్వరుడు.

శేయన్, అణియన్-దూరస్థుడు, సమీపస్థుడు. తమ ప్రయత్నం చేత స్వామిని చేరగల మనుకొనే వారికి దూరంగా ఉంటాడు. భగవంతుని కృప చేతనే ఆయనను దర్శించగలమని తలచేవారికి దగ్గరగా ఉండేవాడు సర్వేశ్వరుడు అని భావించారు ఆళ్వార్లు. 'యమేవైష వృణుతే తేనలభ్యః":- అనే ఉపనిషద్వాక్యార్థం ఇదేకదా!

"యవర్క్కుమ్ శిన్దైక్కుమ్ కోశరమల్లన్; తూయన్" -ఎవరి కైనా చింతించడానికి కూడా గోచరించనివాడు; పరిశుద్ధుడు, జ్ఞానాతిశయం కలవారికైనా, కంటికి కనబడకపోవడమే కాదు, మనస్సుకు - ఊహించడానికి - కూడా స్వామి సాధ్యపడనివాడు. తల్లియశోదమ్మకు రోటికి కట్ట తగినవాడై 'యదిశక్నోషి గచ్ఛత్వమ్' -చేత నయితే నీవు విడిపించుకొని పో - అని బెదిరించదగినంతగా వశ పడినాడుకదా! స్వామి. పరత్వం ఇంచుకైనా ప్రకటింపబడని పరమ సౌలభ్యమే ఆ పరిశుద్ధి.

తుయక్కన్-విపరీత జ్ఞానం కలిగించేవాడు. మయక్కన్ -సంశయాన్ని కలిగించేవాడు. భగవంతుడే ఉపాయమో, మనసాధనమే ఉపాయమో అనే సందేహమే సంశయం.

కర్మ జ్ఞానాదులే ఉపాయాలని భావించడం విపర్యయం, సంశయ విపర్యయాలను కలిగించేవాడనే చోట 'జీయర్ అరుంబదం' లో ఒక ఐతిహ్యం చెప్పబడింది.

శ్రీపరాశరభట్టార్యుల ప్రవచనాన్ని వినగోరిన ఒక పండితుడు ప్రతిదినం వచ్చేవాడట. ఆయనను "వచ్చారా? కూర్చోండి" అని సామాన్యంగా ఆదరించేవాడట భట్టర్. సామాన్య జ్ఞానం గల ఒక శ్రీ వైష్ణవుడు కూడా ప్రతిదినం వస్తుంటే, ఆయనను 'వేంచేశారా? ఆసనం అలంకరించండి!' అని ఎంతగానో ఆదరించేవాడట. ఈ విషయాన్ని పరిశీలించిన ఒక వ్యక్తి ఏమండి? అజ్ఞవిజ్ఞుల పట్ల మీరు చూపే ఆదరాభిమానాలలో తారతమ్యం ఉండడానికి కారణమేమి? అని భట్టర్ ను అడిగాడు. వారిద్దరి మధ్య నున్న భేదాన్ని తెల్పడానికి, మరునాడు వచ్చిన వారిలో ముందుగా పండితుణ్ణి మీ ఉద్దేశ్యంలో పరతత్త్వ మెవ్వరు ? అని భట్టర్ ప్రశ్నించాడు. ఆవిద్వాంసుడు "శాస్త్రాలలో కొన్ని ప్రామాణికవాక్యాలు బ్రహ్మను, కొన్ని విష్ణువును, మరికొన్ని రుద్రుణ్ని, పరతత్త్వమని చెప్పుతున్నాయి. ఇందులో ఏది పరతత్త్వమో; మనం నిశ్చయించి చెప్పలే"మన్నాడు. అలాగే శ్రీవైష్ణవుణ్ణీ ప్రశ్నించాడు భట్టర్. "అయ్యా! మీరు చెప్పినట్లేవిని, శ్రీమన్నారాయణుడే పరతత్త్వమని నిశ్చయించుకొన్నాను. వేరె ఏమీ తెల్వదు. ఆయనయే ఉపాయమూ, ఉపేయమూను, అని భావించాను" అని సమాధానమిచ్చాడట. మళ్ళీ 'మీరేది రక్షకమనుకొంటున్నారు? అని భట్టర్ ప్రశ్నిస్తే, అల్పజ్ఞుడైన ఆవైష్ణవుడు "భగవద్రామానుజుల పాదపద్మాలే రక్షకమని మీరు చెప్పినారు కదా! నాకు అవే రక్షకం ఈ విషయంలో నాకు సంశయమేలేదు" అన్నాడట. ఈ రెండు విధాలైన సమాధానాన్ని విన్నవ్యక్తులతో "ఆదరణలోని తారతమ్యమిదే" అని భట్టర్ పలికారట. వాస్తవంగా భగవద్భక్తి లేని వారికి ఆ పండితునికి కలిగిన సంశయాలే కలుగుతుంటాయి.

తుయక్కుమ్ - మానసిక భ్రాంతి. 'ఆరువినైయేన్' అని ఇది వరకు 'క్రూరమైన పాపాలకలవాడను' అని చెప్పుకొన్న ఆళ్వారును"ఉన్తేనే మలరుమ్ తిరుప్పాదమ్ శేరుమాఱు మకరందం స్రవించే నీ పాదపద్మాలను చేరే విధం నాకు తెల్పుము" అని ప్రార్థించే విధంగా - మానసిక భ్రాంతి లేనివారినిగా సంస్కరించాడుస్వామి. (మయక్కమ్=కలయిక) ఎన్నుడైతోళ్ ఇణైయానే-నా భుజాల రెండింటిమీద ఉన్నాడు. - గరుత్మంతునిపైన ఉన్నట్లే నాభుజస్కంధాలపైస్వామి అధిష్ఠితుడై యున్నాడనీ;

'మత్తుమ్యవర్క్కుమ్ అతువే' నాకు కలిగిన ఈ భాగ్యమింకెవరికైనా కలుగుతుందా? అని ఆళ్వార్లు తాను మహాభాగ్యవంతుడనని తెల్పారు.

7. తాలుసింహాసనస్థమ్:- తోళిణైమేలుమ్, నల్ మార్ పిన్ మేలుమ్, శుడర్ ముడిమేలుమ్, తాళిణై మేలుమ్, పునైన్ద తణ్, అమ్ తుళాయ్ ఉడైఅమ్మాన్ (పా7). భుజద్వయమందు, విలక్షణమైన వక్షస్థలమందు, తేజస్వంతమైన కిరీటం మీద, పాదద్వంద్వ మందు అలంకరింపబడిన చల్లని, చక్కని తులసి (మాలిక) కలిగిన స్వామి. ప్రేయసిదగ్గరికి పయనమైన ప్రియుడు ఆమెకిష్టమైన వస్త్రాభరణాదులను ధరించి వచ్చినట్లే ఆళ్వారు కిష్టమైన తులసీమాలికలను శరీరమంతట అలంకరించుకొని వారి దగ్గరికి చేరినాడు. గరుడ వాహనునికి మధువొలికే వికసితతులసీ పుష్పాలను అలంకరించు కోవడమందే చిత్త ముత్తల మొందుతుంది. 'తోళిణైమేలుమ్' -పాణి పద్మంచేత స్పృశించి, ఆకర్షించి ప్రేమతో "సుగాఢం పరిషస్వజే", అన్నట్లు దగ్గరకి వచ్చి కౌగిలించుకొనే సమయానమొదట స్పృశించే అభిలాషకల భుజాల యందు తులసీమా లికను ధరించాడు. 'నల్ మార్పిన్ మేలుమ్' -ఆలింగనానికి కారయిత్రి పురుషకారిణి - యైన శ్రీదేవి ఉండే వక్షస్థలం మీదతులసీ మాలికను ధరించాడు. 'శుడర్ముడి మేలుమ్'- ప్రియాలింగన పారవశ్యంతో మీదికి చూడగా, శేషిత్వాన్ని - ప్రభుత్వాన్ని - ప్రకటించేకిరీటం దర్శనమిస్తుంది. కాబట్టి, కిరీటం మీదకూడా తులసీమాలికనలంకరించాడు. 'తాళ్ ఇణైమేలుమ్'- శేషిత్వస్థాపకాలు శ్రీచరణాలు. అంటే, పాదాలనాశ్రయించిన శేషభూతులే స్వామి శేషిత్వాన్ని నిల్పేవారు కాబట్టి, శేషిత్వాన్ని దృఢపరచే తన చరణయుగళాన్ని తులసిచేత అలంకరించుకొని వచ్చి సర్వేశ్వరుడు నమ్మాళ్వార్లను అనుగ్రహించాడు.

ఈ సందర్భంలో భట్టర్ వ్యాఖ్యానించిన విధం ఇలా ఉంది :" వీరులు భోగ్యపదార్థాలను మొదట తమ ఆయుధాలకు అలంకరిస్తారు. కాబట్టి స్వామి ఆయుధాలను ధరించే (ఆయుధాలైన) భుజయుగ్మమందు తులసిని అలంకరించాడు. (తర్వాత వీరులు ప్రణయంకలవారు కాబట్టి) కాముకులు వారికి ష్టమైన వారికి భోగ్యవస్తువులనర్పిస్తారు కదా! అట్లే సర్వేశ్వరుడు తనకు ప్రియమైన లక్ష్మిదేవి నివసించే అంతఃపురాన్ని వక్షస్థలాన్ని అలంకరించాడు. (భుజపరాక్రమం చేత సాధింపబడేది విజయలక్ష్మికదా!) తర్వాత తానలంకరించుకొన్నాడు. (విజయలక్ష్మినలంక రించగానే

ప్రభుత్వ చిహ్నమైన కిరీటాన్ని అలంకరించుకోవడం వీరపురుష లక్షణం) మిగిలిన దాన్ని దాసులు స్వీకరిస్తారు. కాబట్టి మిగిలిన తులసిని దాసులైన పాదాలకూ స్వామి అర్పించాడు. ఆపదలో సహాయపడేవారు దాసులుకదా! శకటాసురుణ్ని బొక్కలు విరుగతన్ని కన్నయ్యనుకాపాడిన పాదాలు దాసులేకదా! స్వామికి గానీ , ఆశ్రయించిన వారికి గానీ, కలిగే ఆపదలను తొలగించడానికి ఆపాదకమలాలేగతి ("గతి రితి పాదయోః గతి అనేది పాదాల యందే ఉంది. అన్నది ఉపనిషత్తు)

"కేళిణై ఒన్టుమ్ ఇలాతాన్, కిళరుమ్ శుడర్ ఒళి మూర్తి" ఉపమానం ఒక్కటి కూడా లేని వాడు. నిరవధికంగా విజృంభించేతేజో మూర్తి స్వామి. 'శుడర్-ఒళి' -కాంతి, అని అర్థమిచ్చే పర్యాయపదాలు కాబట్టి 'శుడర్ ఒళి మూర్తి' అంటే ప్రతి అవయవ సౌందర్య మందుగానీ, సాముదాయిక (సర్వాంగ) శోభయందుగానీ చెప్పదగిన సమాన సంబంధం (ధర్మం) గల సుందర వస్తువు ఏదీ లేని వాడు స్వామి . వివిధ అవయవ, ఆభరణ వస్త్రాదులతో కూడికనిపించే సౌందర్యమే సాముదాయిక శోభ. పొంగి ఆదరి ఈదరి అదురునట్లు పొర్లి ప్రవహించే నది లాగా, తళుకు లీనుతూ చెంగలించే కాంతి రూపమైన దివ్యమంగళవిగ్రహ సౌందర్యంకలవాడు సర్వేశ్వరుడు.

"నాళ్ అణైన్ద ఒన్టుమ్ అకలాన్, ఎన్నుడైయ నావి నుళాన్"- ప్రతిదినం చేరి ఉండి ఒకప్పుడును విడువని వాడై నా నాలుక మీద ఉన్నాడు. ఎన్ని రోజులైనా స్వామి నాతో చేరియుండడమే కాని నన్ను విడిచి పోలేకున్నాడు. క్రమంగా నానాలుక మీద ఉన్నాడు. అంటే, నా చేత స్తుతింపబడుతున్నాడు. లేదా' "యోవాచి తిష్ఠన్, వాచోన్తరోయం వాఙ్నవేద యస్యవాక్ శరీరం యోవాచమన్తరో యమయతి ఏషత ఆత్మా న్తర్యామ్యమృత: " (బృ.ఉప) ఎవడు వాక్కు నందుండి వాక్కు చే తెలుసు కొనబడడో, ఎవనికి వాక్కు శరీరమో, ఎవడు వాక్కును లోపల ఉండి నియమిస్తాడో అతడే అమృతుడు - అన్న ట్లు సర్వేశ్వరుడు నా వాగింద్రియానికి అంతర్యామియై విషయమైనవాడు; అని నమ్మాళ్వార్లు తెలిపారు.

8. చక్షుర్మధ్యేనివిష్టమ్:- నావినుళ్ నిన్టుమలరుమ్ జ్ఞానక్కలై కళుక్కు ఎల్లామ్ అవియుమ్, ఆక్కైయుమ్ తానే - (పా8) జిహ్వాగ్రంనుంచి వికసిస్తున్న జ్ఞాన సాధనాలైన కళలన్నిటికి ఆత్మ, శరీరం కూడా తానే. సకల విద్యలకు ఆత్మఅర్థం; శరీరం శబ్దం.

ఈ రెండు కూడా భగవానుడే అయిఉన్నాడు. ఈ అర్థాన్ని ఈ శబ్దం తెలియచేస్తుందని, నియమించేవాడుతానే. శబ్దార్థ సంబంధం భగవానుని సంకల్పాధీనమై ఉంటుంది. "అళిప్పోడు అళిప్పవన్‌తానే" నాశం చేయడంతోపాటు సృష్టిచేసేవాడుమాతనే. మందమతులైన చేతనులు అర్థం చేసుకోవడంలోనూ, వ్రాయడంలోనూ కలిగే దోషాలు వల్ల. పాఠభేదాలవల్లనూ విద్యల స్వరూపం నశిస్తున్నప్పుడు వాటినిలయం చేసి మళ్ళీ అపేక్షాసమయాన స్వచ్ఛమైన విద్యలను సృజించేవాడుతానే, జగత్సృష్టి సంహారాలు చేసేవాడూ సర్వేశ్వరుడే సకల వేద ప్రతిపాద్యుడూ అవేదస్వరూప స్థిత్యాదులకు, ఉత్పత్తివినాశాలకు కారణభూతుడూ శ్రియఃపతియే, అన్నారాళ్వార్లు.

"పూఇయల్ నాల్‌తడమ్ తోళన్"- (ఇయల్=అలంకారం; స్వభావం) పూలచేత అలంకరింపబడిన దీర్ఘబాహువులు కలవాడు. పూవులాగా సుకుమారమైన శరీరంకలవాడు, పూవు తప్ప మరొకటి చెల్లనంత సుకుమారుడు. కల్పతరువు చిగురించి నాలుగు కొమ్మలను కలిగి యున్నదో అన్నట్లున్న గుండ్రని భుజాలు కలవాడుస్వామి.

"పోరుపడై ఆళిశంగు ఏంది" -యుద్ధ (సాధన) ఆయుధాలైన శంఖచక్రాలను ధరించి ఉండేవాడు. "దివ్యాస్త్రపుష్పిత చతుర్భుజ మత్యుదారం, రంగాన్పదం మమశుభాశ్రయమాశ్రయాణి! (రం.స్త.69) కల్పతరువు యొక్క నాలుగు కొమ్మల మీద ఉన్న పూవులలాగా దివ్యాయుధాలున్నవి. విరోధినిరసనకు, అలంకరణకు, ఆశ్రితులడిగినదాని కంటె అధికంగా ఇవ్వడానికి సమర్థుడు దివ్యాయుధోపేతచతుర్భుజుడు.

"కావి నల్‌మేని కమలక్కణ్ణన్, ఎన్‌కణ్ణిన్ ఉళాన్" -నీలోత్పలంలాంటి విలక్షణ మైన దేహం కల కమల నయనుడు, నా కంటి యందున్నాడు. నల్లకలువ లాంటి కాంతికల దేహమని స్వామిదేహానికి నల్లకలువను ఉపమానంగా చెప్పినా, అది సరిపడదు; అంతకంటె దివ్యంగా

భాసిస్తుంది. కాబట్టి "నల్‌మేని" దివ్యవిగ్రహం, అన్నారు. కమలనయనుడు స్వామి (కణ్వట్టన్=నేత్రమండలం; టంకశాల) టంకశాలలో నుంచి బయటకుపోతే కృత్రిమ నాణాలను ముద్రించేచోరుడంటారు. నయన మండలమందుండక బయట ఉంటే 'నన్నాశ్రయించిన వ్యక్తికి నేనేమి సాయంవడకపోతినే' అని శ్రీహరి

"హ్రీరేషాహిమమమాతులా" (రామా) అన్నట్లు సిగ్గుపడేవాడు. కన్నులు నగం ముడుచుకునేవి. కాని ఇప్పుడు నమ్మాళ్వార్లకు నయన విషయవర్తియైనందు వల్ల స్వామికన్నులు సంకోచించక కమలా లవలెవికసించి ఉన్నాయట. సర్వేశ్వరుని దివ్యమంగళ విగ్రహ తేజస్సు అనే పెద్ద ప్రవాహంలో ఒక సుడిలాంటివి దివ్యచక్షువులు అట్టి కమలనయనుడు ప్రకృతి విషయాలను అనుభవించే తమకన్నుల్లో చేరి ఉన్నాడు అన్నారాళ్వార్లు. నమ్మాళ్వార్లకు శ్రియః పతి తన దివ్య స్వరూపాన్ని దర్శింపచేశాడు. ఆ దివ్య సుందర తనువు "అమృత వర్తిర్నయనయో:" అని మురిసి పోతున్నాడు శ్రీ శఠకోపదివ్యసూరి.

9. స్థిత మళికతతేః :- కమలక్కణ్ణన్ ఎన్కణ్ణినుళ్ళాన్ కాణ్బన్. (పా9) పుండరీ కాక్షుడు నానయన గోచరుడయ్యాడు. చూచాను, "నచక్షుషాగృహ్యతే" పరబ్రహ్మతత్త్వం కంటి చేగ్రహించబడదు' అనే మర్యాద పోయింది. ఇప్పుడు స్వామి నా కన్నుల్లోనే చేరియున్నాడు. మరి నీవు చేస్తున్న పని ఏమి? అంటే. ఏముంది. స్వామిని కన్నారదర్శించి, మనసారఅనుభవించడమే నేను చేస్తున్న పని.

'అవన్ కణ్ణళాలే అమలంగళాక విళిక్కుమ్" -ఆస్వామి తననేత్రాలతో (అజ్ఞానాది) మాలిన్యాలు తొలగిపోయే రీతిగా కటాక్షించారు. కాబట్టి స్వామిని దర్శింపగలిగాను అన్నారు. అయితే పంచేంద్రియాలు భగవద్దర్శనానికి ప్రతిబంధకాలు కదా! స్వామి దర్శనవెలా లభించింది? అంటే, "ఐమ్పులనుమ్ అవన్మూర్తి" ఈనా పంచేంద్రియాలు స్వామికి శరీరం లాగా విధేయాలైనాయి. ఆయనకు పరికరాలైనాయి.

ఆయన ఎవరు? అంటే, "కమలత్తు ఆయన్ నమ్బితన్నై, కణ్ నుతలానొడుమ్తోత్తి పద్మసంభవుడూ, పరిపూర్ణుడు అయిన (అజుని) బ్రహ్మను, నుదుటికంటి వేల్పును శివుని సృజించి "అమలమ్ దెయ్వ త్తొడు ఉలగమ్ అక్కి, ఎన్ నెత్తి ఉళాన్" సాత్త్వికులైన దేవతలతో కూడిన లోకాలను సృజించినా లలాటమందు నివసించాడు.

"అజుడు (పుట్టుక లేనివాడు) కమలసంభవుడు" ఈ రెండు మాటలు అన్యోన్యంగా విరుద్ధమైనవికదా! అంటే, లోకులజన్మ వంటిది కాక, బ్రహ్మజన్మించిన పద్ధతి ప్రత్యేకమైనది కాబట్టి 'అజు' డని ప్రసిద్ధి.

అజుడు పూర్ణుడు :-తనకు విధించిన సృష్టికార్యాన్ని మళ్ళీ మళ్ళీ సర్వేశ్వరుణ్ని అడిగి తెలుసుకొనే అవసరం లేకుండా తానే నిర్వహింపగల పూర్ణత్వం కలవాడు. అట్టి బ్రహ్మనూ, ముక్కంటినీ స్వామి సృజించాడు. సంకల్ప మాత్రంచేత సత్త్వగుణం గల దేవతలనూ వారిలోకాలను సద్వారకంగా సృజింపగలిగిన స్వామికి అసాధ్య మేమున్నది పుండరీకాక్షుడూ, హృషీకేశుడూ, జీవులను వారికర్మానుగుణంగా సృజించి విశ్వస్రష్ట అయిన పరాత్పరుడు, ఇపుడు నా నొసట వెలసి యున్నాడు.

10. మస్తకే తస్థివాంసమ్:- నెత్తియుళ్ నిన్ఱు ఎన్నై ఆళుమ్, నిరైమలర్ పాదంగళ్ శూడి, కత్తె తుళాయ్ ముడి, కోలమ్ కణ్ణపిరానై తొళువార్ (పా10) ఫాలప్రదేశ ముందుండి నన్ను ఏలుకొనే (నాదాస్యాన్ని స్వీకరించే) విప్పారినవిరులబోలిన పాదాలను తమ తలయందు ధరించి, తులసీ మాలాలంకృత కిరీటం గల, ఉపకారకుడైన శ్రీకృష్ణుని సేవించేవారు. (దేవతలు)స్వామి కిరీటానికి అళ్వార్లు వాడిపోయిన (కత్తెత్తు ళాయ్ = కుచ్చిన తులసిమాల) తులసి మాలికను తెచ్చి అలంకరించినా, అది నవనవలాడుతూ వికసిస్తుందట.

ఒత్తె ప్పిఱై అణి న్దానుమ్, నాన్ముగన్, ఇందిరనుమ్, మత్తె అమరరుమ్ ఎల్లామ్ వన్దు - ఒక చంద్ర కళను ధరించిన శివుడు, చతుర్ముఖుడు, ఇంద్రుడు, మిగిలిన దేవతలందరు వచ్చి, సేవిస్తారు. బ్రహ్మరుద్రాది దేవతలు వచ్చి ఆరాధించే భగవంతుని చరణాలు నా లలాటమందు ఊర్ధ్వ పుండ్ర రూపంగా వెలసినవి. ఆ దేవతలందరు భగవంతుని ధర్శనానికి ఎంత ఆత్రపడుతారో అంతకంటె ఎక్కువగా, భగవంతుడు నన్ను పొందడానికి ఆత్రపడుతూ వచ్చి "ఎనదు ఉచ్చి ఉళాన్" నా యొక్క శిరస్సు పైన వేంచేసి ఉన్నాడు. అన్నారాళ్వార్లు. రాజభవనంలో రాజు ఒక మంటపం నుంచి మరొక మంటపానికి పోతున్నప్పుడు మధ్య లో సన్నిహితులు వచ్చి రాజు నర్థించి అనుగ్రహింపబడుతారుకదా! అట్లే ఈ పాశురంలో ఆళ్వారు యొక్క ఫాలం నుంచి తల మీదికి పోయే మధ్యలో స్వామిని దేవతలు వచ్చి సేవించినట్లు, తుదకు స్వామి శిరస్సున వసించినాడని విషయాకరింపబడింది.

11. "ఉచ్చియుళ్ళేనిఱ్కుమ్, దేవ దేవర్కు కణ్ణపి రానుక్కు ఉళ్ శెల్ల ఇచ్చై ఉణర్తి" నాశిరస్సు నందుండే దేవాదిదేవుడైన, ఉపకారశీలుడైన శ్రీకృష్ణుని హృదయానికి

తెలిసేరీతిగా (స్వామి తమపై చూపిన) ఆదరాన్ని తెలియజేసి; భగవానుడు మొదట అంకమందుండి క్రమంగా శిరస్సు పైన చేరినాడు. ఇక ఆ పైనపోవలసిన చోటు లేదు కాబట్టి ఆళ్వార్ల శిరస్సు నందేవేంచేసి ఉన్నారు. ఆళ్వార్ల శిరస్సు పైన స్థిరంగా నిల్చియుండడం వల్ల దేవదేవుడైనాడు, అన్నారు. నిత్య సూరినిర్వాహకుడు గా ఉండే స్థితిని కూడా విస్మరించి దేవుదేవుడు నాతల మీద నిల్చియున్నాడు. అనీ సర్వేశ్వరునికి తమ మీద ఉన్న అనురాగాన్ని తాము తెలుసుకొన్నామనీ, తమకు తెలిసినదంతా ఆళ్వార్లు సర్వేశ్వ రునికే విన్న పంచేసుకొంటున్నారు. స్వామికి తెలియజేయడమే కాక సంసారులకు కూడా తెలియజేసినవారు కాబట్టి "వన్ కురుకూర్ శడగోపన్" ఉదారులైన వారు శఠకోపులు.

"శొన్న ఇ అయిరత్తుళ్, ఇవైయుమ్ ఒర్ పత్తు, ఎమ్పిరార్కు విణ్ణప్పమ్ శెయ్య, నీళ్కళల్, శెన్ని నిచ్చలుమ్ పొరుమ్" చెప్పిన ఈ వేయి పాశురాలలో, ఈ సాటిలేటి పది పాశురాలు (దశకం) స్వామికి విన్నవించుకొంటే, (లోకాలను కొల్వడానికి సాగిన) పొడవైన పాదాలు సర్వదా వారి శిరోభూషణంగా అమరి యుంటాయి. ఎమ్ పిరానై -నాకు ఉపకారకుడు, అన్నారు నమ్మాళ్వార్లు. ఈ విషయాన్నే వేదాంతదేశికులు "ప్రత్యాహారోక్త రీత్యా విభుమను బుభుజే సాత్మ్యభోగ ప్రదానాత్" అన్నారు. యమనియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి అనే అష్టాంగ యోగ పద్ధతిలో 'ప్రత్యాహారం' (చాలా) కష్టతరమైనది. చిత్తం ఏకాగ్రంగా ఉండాలంటే ఇంద్రియాలన్నీ మనస్సును అనుసరించాలి. చంచలంగా ఉండే ఇంద్రియాలు అన్ని ఒకేసారి ఏకోన్ముఖంగా సాగవు. ఓపికతో ఒకటి తర్వాత ఒకటి మనస్సుకు హత్తుకొని ఉండే రీతిగా సాధన చేయాలి. చేరిన ఇంద్రియాన్ని చెదరకుండా చిత్తానికి హత్తించి, మిగిలిన వాటిని క్రమంగా ఆహరించుకొనే యత్నం ఒక ఎత్తు. అయితే, చిత్తవృత్తి ప్రిదిలకుండా నిగ్రహించుకోవడం ఒక ఎత్తు ఈ సాధన సహనానికి పరీక్ష ఉద్రేకం నామమాత్రమైనాసాధకునిలో అంకురించరాదు. ఆచార్య సన్నిధిలో కాలక్రమేణ ఈ ప్రక్రియను మెల్లగా జీర్ణించేకొలదిసాధకుడు ఆచరిస్తుండడం అత్యావశ్యకం.

సర్వేశ్వరుడు ఈ ప్రత్యాహార పద్ధతిగానే ఆళ్వార్ల యొక్క ఒక్కొక్క అంగమందు చేరి నిలిచి ఆ అనుభవం జీర్ణమైన తర్వాత నూతనా నుభవాన్ని అందిస్తూ, మెల్లగా

విశ్లేషవ్యసనాన్ని పోగొట్టి సంశ్లేషరసాన్ని అనుభవింపజేస్తూ ఆళ్వార్ల యొక్క మూర్ధమందు అధిష్ఠితుడయ్యాడు. స్వామి చేసిన మహోపకారాన్ని కృతజ్ఞతతో స్వామికే విజ్ఞాపన చేసుకొన్నాడు. ఇటు సంసారులకూ వినిపించారు. ఈ దశకాన్ని అభ్యసించిన వారి తలల మీదనూ భగవచ్ఛరణాలు అలంకరిస్తాయని ఫలాన్ని అనుగ్రహించారు శ్రీ పరాంకుశమునులు.

ఆహా! ఎంత ఉదారహృదయులో!! నమ్మాళ్వార్లు.

దశమ దశకం

10. విష్వగ్విక్రాంతి దృశ్యం విగణన సులభం వ్యక్తపూర్వోపకారమ్
స్వాంతస్యైకాగ్ర్య హేతుం స్వయముదయజుషం
బంధమాత్రోపయాతమ్!
చింతాస్తుత్యాదిలక్ష్యం నతజనసతతశ్లేషిణం దర్శితార్చమ్
స్మృత్యై చిత్తే మిషంతం స్వవితరణ
మహౌదార్యతుష్టోభ్యచష్ట॥ 21

అర్థం:- విష్వక్+విక్రాంతిదృశ్యం = నాలుగు ప్రక్కలను ఆక్రమించేటప్పుడు చూడదగినవాడు; విగణన సులభం = ఎంచేటప్పుడుసూనులభుడు; వ్యక్తపూర్వోపకారం = ప్రకాశమైన పూర్వీకులకు ఉపకారం కలవాడు; స్వాంతస్య = మనస్సు యొక్క ఐకాగ్ర్యహేతుం = నిశ్చలతకుకారణ భూతుడు; స్వయం = తానే; ఉదయజుషం = ప్రకాశించే వాడు; బంధమాత్ర+ఉపయాతం = సంబంధమాత్రంవల్ల వచ్చేవాడు; చింతా, స్తుతి+ఆది లక్ష్యం = స్మరించడం, స్తుతించడం మొదలైన వాటికి విషయమయ్యేవాడు; నతజన సతతశ్లేషిణం = నమస్కరించే వారితో ఎల్లప్పుడు సంశ్లేషించేవాడు;

దర్శిత+అర్చమ్ = చూపించబడిన అర్చారూపంకలవాడు; స్మృత్యై = స్మరణంకోసం, చిత్తే = మనస్సునందు, మిషంతం = జాగ్రతతో ఉన్నవాడునూ అయిన శ్రియఃపతిని; స్వవితరణమహా+ఔదార్యతుష్టః = తనను ఇచ్చు కోవడమనే గొప్ప ఔదార్యం చేత సంతుష్టులైన నమ్మాళ్వార్లు; అభ్యచష్ట = సాదించిరి

తా॥ సర్వేశ్వరుడు ప్రసాదించిన సర్వాంగ సంశ్లేషాన్ని అనుభవించిన నమ్మాళ్వార్లు (1) సర్వేశ్వరుడు తన దివ్యమంగళవిగ్రహాన్ని తమనేత్రాలకు సేవసాదించాడని (2) తలచి నంతనే సులభంగా సేవసాదించేవాడని (3) పూర్వీకులైన తండ్రి తాత ముత్తాత మొదలైన వారికి ఉపకరించినందువల్ల వాని స్వభావాన్ని అనుభవింపయోగ్యమని (4) ఎల్లప్పుడు అనుభవిపంప దగినవాడని (5) యాచింపకున్నను మహోపకారం చేసే వాడనీ (6) తన సంబంధం పొంది నంతనే ఉపకరించేవాడని (7) ఆశ్రితులైన నిత్య సూరుల యొక్క స్మరణం, స్తోత్రంమొదలైనవాటికి లక్ష్య భూతుడని (8) నమజ్జనులతో సంశ్లేషించే ఉపకారకుడు పూర్ణుడని, (9) అర్చారూపం చూపించిన ఉపకారం మరవశక్యంకాదని (10) నేను మరవకుండడానికి ఆయనయే యత్నిస్తున్నాడని సాదిస్తూ స్వామి యొక్క మహోపకారకత్వాన్ని ఈ దశమ దశకంలో అనుభవిస్తున్నారు.

ప్రకా-వ్యాఖ్య:- పూర్వదశకంలో - భగవానుడనుగ్రహించిన సర్వాంగ సంశ్లేషరసాన్ని ఆస్వాదించి ఆ ఆనందానుభూతిని ఆళ్వార్లు ఈ దశకంలో వివరిస్తున్నారని పూర్వాచార్యులు అభిప్రాయపడినారు. శ్రీ పరాశరభట్టర్, శ్రీ వేదాన్త దేశికులు భగవదనుగ్రహనిర్హేతుకతను గుర్తించిన ఆళ్వార్ల ఆనందమే ఈ దశకసారమని అనతిచ్చారు.

సర్వేశ్వరుడు శిరస్సున నిల్చియుండడం కంటె మించిన ఫలంలేదు. ఆళ్వార్ల పరిశీలన ఇలా సాగింది. "ఇంతటి ఆపూర్వ ఫలితాన్ని పొందడానికి తగిన సాధనవమేమీ నేను చేయలేదు. భగవద్విషయమై అద్వేషం ఆభిముఖ్యమున్నా ఇంతటి అనుగ్రహప్రాప్తికి తగిన సాధనాలు కావు. పరమ భక్తియే పొందిన ఫలానికి సాధనంగా చెప్పుకోరాదు. ఒక వ్యక్తి ఒక నిమ్మ పండును రాజుకు సమర్పిస్తే, రాజు అనుగ్రహించి ఆ వ్యక్తిని ఒక ప్రాంతానికి రాజుగా చేశాడు. నింబ ఫలాన్నిచ్చి రాజ్యాన్ని పొందానని (రాజ్యాన్ని సంపాదించదగిన విలువ నిమ్మ పండుకు లేనందువల్ల) ఆవ్యక్తి చెప్పుకోలేడు కదా!

కాబట్టి, స్వామి నిర్హేతుకంగా కృపజేసిన మహోపకారమే ఇది. చేతను లు సత్పథాచారులు కావాలని కృపతో సృష్ట్యాదిలోనే వారికి కరణ కళేబరాలనూ, మంచి బుద్ధి నీ, ప్రసాదించాడు. అందుకు చేతనులు చేసిన సాధన మేముంది? ఏదీలేదు. నిత్యసూరులు పొందవలసిన ఫలాన్ని నిత్యసంసారియైననాకు స్వామి అవ్యాజకృపతో అనుగ్రహించాడని తెలిపారు.

ఇలా ఉన్మస్తకంగా అనుభవించిన సంశ్లేషరసానికి కారణం భగవదనుగ్రహ నిర్హేతుకతయే అని నిష్కర్షించుకొని, స్వామి యొక్క మహోపకారాన్ని, ఆసుఖానుభవాన్ని ఆళ్వార్లు అనుసంధిస్తున్నారు.

1. విష్వగ్విక్రాంతి సులభమ్:- పొరు మానీళ్ పడై ఆళిశంగత్తొడు తిరుమానీళ్ ఏళుఉలకుమ్ తొళ (పా1) యుద్ధోన్ముఖమైన గొప్పవైన వృద్ధి పొందించే ఆయుధాలైన చక్రం, శంఖంతో కూడ ఐశ్వర్యచిహ్నాలు గల దీర్ఘచరణాలను ఏడులోకాలు సేవించే రీతిగా మహాబలి భగవానుని రాకను కోరక పోయినా, స్వయంగా యాచకుడైపోయి తనసొత్తును స్వీకరించినట్లే ఆళ్వార్లకు స్వామిపైన తలంపేలేక పోయినా, తానే వచ్చి తమకుసాక్షాత్కరించి తనదాసునిగా చేసుకొన్నాడని వామనోదంతాన్ని ప్రస్తుతిస్తున్నారు ఆళ్వార్లు.

త్రివిక్రముడు మూడు లోకాలను కొలచినప్పుడు, స్వామిని ఎదిరించ బోయిన బలి చక్రవర్తి పుత్రులైన నముచి మొదలైన వారిపైకి యుద్ధోన్ముఖమై ఉన్న ఆయుధాలు వైకుంఠంలో నిత్య స్వామిని అనుభవిస్తూ, స్వామిచేత అనుభవింప బడ దలచే నిత్య, ముక్తాత్మలు 'అహమన్న మహమన్నమ్' అహమన్నాదో హమన్నాదః''అని అనుసంధించేసంరంభానికి అలవాటు పడిన ఆయుధాలు, శత్రువులు చేసే కోలాహలాన్ని సహించక వారితో పోరాడసిద్ధపడినాయి ఆయుధాలు.

లేదు 'పొరు' అనే పదానికి 'తమలో తాము పోరాడునట్టి' అని అర్థమూ చెప్పవచ్చు. స్వామి సౌందర్య సౌకుమార్యాదులు అస్థానంలో అతి శంక కల్గింప సమర్థమైనవికదా!

మెత్తని చల్లని శేషతల్పం మీద పవళించేస్వామి తరుగిరులతో నిండిన లోకాలను తన పాదాలతో కొలుస్తున్నప్పుడు ఆయుధాలు తమలో తాము-ఒకరినొకరు - శంకించుకోవడం సహజమే. గుహుడు, భరద్వాజుడు శ్రీరాముని మీద ఎక్కువ ప్రేమ, భక్తి కలవాడైనందువల్ల భరతుణ్ని శంకించారుకదా! లక్ష్మణస్వామికూడా "భరతస్యవధే దోషం నాహం పశ్యామిరాఘవ" రామచంద్రా! భరతుణ్ని చంపితే దోషంలేదని భరతుణ్ని శంకించాడు కదా! అట్లే (యుద్ధకాండలో) విభీషణుణ్ని సుగ్రీవుడూ శంకించాడు. ఆ విధంగానే పాంచజన్య సుదర్శనా ద్యాయుధాలకు బండొరులపై అతిశంకకల్పించే గుణాతిశయంకలవాడు భగవానుడు.

"మా"-గొప్పవి. ఆశ్రిత రక్షణం పట్ల స్వామి కంటె ఎక్కువ పక్షపాతం కలవి ఆయుధాలు.

"అవ్యాహతాని కృష్ణస్య చక్రాదీ న్యాయుధానితమ్! రక్షంతి సకలా పద్భ్యోయేనవిష్ణు: ననాతన:॥" (విష్ణుధర్మం) విష్ణుమూర్తిని ఉపాసించే వ్యక్తిని శ్రీ కృష్ణుని చక్రాద్యాయుధాలు సకలాపదల నుంచి కాపాడు తాయని చెప్పబడింది. దూర్వాసుని మీద ప్రయోగింపబడిన చక్రాయుధమూ, కాకాసురుని మీద ప్రయోగింపబడిన బ్రహ్మాస్త్రమూ వారి వెంటబడి వారి మనస్సును మార్చి స్వామిని శరణుకోరే విధంగా చేశాయి కదా! భగవానుడే కోపం తెచ్చు కొని అయుధాలను ప్రయోగించినా ఆయాయుధాలే చేతనులమేలు కోరి వారిని మంచి మార్గానికి మళ్ళించిన గొప్పతనం కలవి.

భగవానుడు చేయబోయే కార్యాన్ని ఆయనకంటె ముందు ఉండి నడిపించడమే వృద్ధి పొందించడం. అలాంటి శంఖ చక్రాల తో కూడినవాడు సర్వేశ్వరుడు.

ఐశ్వర్య సూచక మైన ధ్వజారవిందాది చిహ్నాలతో ఉన్న, పరమపూజ్యమైన, ఆశావేశం ఉన్న వారి వరకు విస్తరించే తన పాదాలను ఏడులోకాలు - ఏ సాధనా నుష్ఠాన మెరుగని లోకులు కూడా - సేవింప దగినట్లు ప్రకాశపరచాడు భగవానుడు.

"ఒరుమాణి కుఱళ్ ఆకి, నిమిర్న్ద అక్కరు మాణిక్కమ్, ఎన్కణ్ ఉళదు ఆగుమే" సాటిలేని బ్రహ్మచారి కుఱుచయై వామనుడై - వర్థిల్లిన ఆ ఇంద్రనీలమణి సన్నిభదేహుడు నా నయన గోచరుడయ్యాడు. బ్రహ్మచారి భిక్షాటనంతో జీవనం సాగిస్తాడు.

"మాణి" -భగవానుడు తన శ్రియఃపతి త్వాన్నే మరచి యాచించే పాట వంకలిగిన బ్రహ్మచారి అయ్యాడు. "కుఱళ్" -పొట్టివాడు. అపరిచ్ఛిన్న స్వరూపుడే. తన రూపాన్ని సకల జనులకు కనువిందు చేయడానికి చిన్నదిగా చేసుకొన్నాడు. "నిమిర్న్ద" - వృద్ధిపొందిన - వాసుదేవతరువు అది. చెట్టు మొదట్లో - పాదులో - నీళ్ళుపోస్తే అదిపెరిగినట్లే వాసుదేవతరువు పాదాలు కడిగి దానమిచ్చిన వెంటనే పెరిగి ఆకాశమంతటా తన విగ్రహసౌందర్యాన్ని వ్యాపింపజేశాడు. "మయర్వఱమతినలమరుళినన్" అజ్ఞానం నశించేరీతిగా అనుగ్రహించిన జ్ఞానాన్ని పొందిన నేను కూడా పరిచ్ఛేదించి చెప్పజాలని ఆ నీలమేఘశ్యాముడు నా కంటికి కనబడి నాకు భోగ్యమయ్యాడు, అన్నారాళ్వార్లు.

2. విగణనసులభమ్:- కణ్ణుళ్ళేనిఱ్కుమ్, కాతన్మైయాల్ తొళిల్; (పా2) కంటి యందే నిలుస్తాడు. భక్తితో ఆశ్రయిస్తే; పరమభక్తియుక్తులై ఆరాధించినవారి దృష్టి నుంచి దూరంగా పోవడానికి అశక్తుడై ఉంటాడు. తనను విడిచి పోలేక, వేరే ఏదీ కోరక, స్వామినే సేవిస్తే స్వామికూడా వారికంటి నుంచి కాలుకదల్చలేక, వారిని విడిచి ఎక్కడికీ వెళ్ళక స్థిరంగా ఉంటాడు. అంటే స్వామిని సేవించేవారికి నయనగోచరుడవుతాడుస్వామి.

"ఎణ్ణిలుమ్ వరుమ్" ఎంచిననూ వస్తాడు. "ఘటం, పటం, ఈశ్వరుడు, అని వస్తువులలో ఒక వస్తువుగానైనా భావిస్తూ 'నన్ను లేడు' అనుకొనక, నా సత్తాను (ఉనికిని) అంగీకరిస్తున్నాడు కదా" అని భగవానుడు సంతోషించి, ఆస్తికుని వద్దకు చేరుకొంటాడు. సాధనభక్తి, సాధ్యభక్తి ఏదీలేక, ఒకటి,రెండు, మూడు అని లెక్కిస్తూ పోయి(26) ఇరువైయారు అంకెను ఉచ్చరించేటప్పుకటికి స్వామి ప్రత్యక్షమవుతాడు.

తత్త్వవేత్తలు (24) ఇరవైనాలుగు తత్త్వాలు కలది 'ప్రకృతి' అనీ, (25) ఇరువైయైదవతత్త్వం జీవుడనీ, (26) ఇరువైయాఅవతత్త్వం పరమాత్మ అని చెబుతారు.

లోకులు అంకెలను ఎంచుతూ, 26 అనేసరికి 'నేనే' అని స్వామి వారికి దర్శనమిస్తాడు. ఈ జీవుడు పొమ్మంటే కాని పోకుండా వచ్చి నిల్చియుండేవాడు భగవానుడు.

'ఎన్ ఇని వేణ్డువమ్' ఏమి ఇంకాకావలసింది? పరమభక్తికీ, పరిగణనకూ ఒకే రీతిగా అనుగ్రహించేస్వామి ఉండగా, ఇక మనకేమి కొరత? తన మీదద్వేషం లేకుంటే చాలు, అద్వేషం అతనికి (జీవునికి)ఎప్పుడు కలుగుతుందో అని ఎదిరిచూస్తూంటాడు భగవానుడు. వాస్తవంగా స్వామి దర్శన భాగ్య లభించిన తర్వాత మనకింకేమి కావాలి? ఈరకంగా, భగవంతుని విషయమై బద్ధికలిగి ఉండడమే ప్రపన్నత్వం.

అర్జునునికి స్వరూపాన్ని ఉపదేశించి, నీకు కలిగే దు:ఖాలకు ఇంక నీవు "మా శుచః' ' శోకించకు - అన్నాడు శ్రీ కృష్ణభగవానుడు. అట్లే ఆళ్వార్లు కూడా భగవంతుని స్వరూపాన్ని అనుసంధించి, ఇంక కోరుకొనేదేముంది? కొదువ ఏముంది? అనుకొన్నారు. ప్రపత్తి ఫలితంపొందడానికి కావలసింది భగవంతుని అనుగ్రహప్రవాహాన్ని ఆటంక పరచకపోవడమే "అప్రతిషేధం" అప్రతిషేధమే ఫలానికి అపేక్షితం. అందువల్ల బహిర్భూతమైన యోగ్య తాయోగ్యత్వం అకించిత్కరం.

వేల్ వెట్టి నంబిగారు"శ్రీ రామచంద్రస్వామి సముద్రుణ్ని శరణు పొందినప్పుడు, ప్రాఙ్ముఖత్వాది నియమాలతో శరణాగతిని అనుష్ఠించాడు కదా! అందువల్ల ఈ ఉపాయాని(శరణాగతి) కి కూడా ఇతర సాధనాల వలె కొన్ని నియమాలు పాటించవలసిఉంటుందా? అని నంబిళ్ళైగారిని అడిగారట. దానికి నంబిళ్ళైగారు "సముద్రంరాఘవో రాజా శరణం గంతు మర్హతి" -శ్రీ రామచంద్రస్వామికి "సముద్రుని గూర్చి శరణాగతి చేయు"మని విభీషణుడు ఉపదేశించాడు. మరి ఆ విభీషణుడు శ్రీరామచంద్రుణ్ని శరణు పొంది నప్పుడు సముద్రంలో ఒక సారి మునిగి వచ్చాడా? మునిగిరాలేదు కదా! ఇక్ష్వాకు వంశజుడై ఆచారప్రధానుడైన ఆ ప్రభువు తనకు తగిన నియమాలతో శరణాగతి చేశాడు. రాక్షసజాతీయుడైనందువల్ల విభీషణుడు ఉన్న వాడున్నట్లే శరణుపొందాడు. కాబట్టి యోగ్యునికి అయోగ్యతను అయోగ్యునికి యోగ్యతను సంపాదింప నక్కర్లేదు. అంటే, యోగ్యత కలవాడు దాన్ని పోగొట్టుకొని శరణాగతి చేయ నవసరం లేదు. ఎట్లున్నవాడు అట్లే ఆచరింపవచ్చును. కాబట్టి, ఈ ఉపాయం సర్వాధికారం అని సమాధానం చెప్పినారట.

భగవత్ప్రభావ జ్ఞానం కలవారికి ఈశరణాగతి సరియైన పద్ధతి అని భాసిస్తుంది. కేవలం క్రియామాత్రానికే ఫలప్రదాన శక్తి ఉంటుంది అనుకొనేవారికి - మనం చేసేపనియే మనకు ఫలమిస్తుందని తలచే వారికి - సాధనం లేకుండా ఫలం లభించడం సంభవించదనిపిస్తుంది.

"మణ్ణుమ్ నీరుమ్, ఎరియుమ్, నల్‌వాయువుమ్, విణ్ణుమాయ్, విరియుమ్, ఎమ్పిరానైయే" పృథ్వి, జలం, అగ్ని, మంచి (ప్రాణాధారమైన) వాయువు, ఆకాశం అయ్యి వ్యాపించి యున్న ఉపకారకుడు సృష్టికి కారణమైన భూత పంచకమందు అంతరాత్మగా ఉండి వ్యాపించే వాడు సర్వేశ్వరుడు. జగత్తు ను సృజించడానికి ఉన్ముఖుడైన శ్రీమన్నారాయణుడు 'బహుస్యామ్' అనేక పదార్థాలుగా అగుదును (ఉళ్ళీడాయ్) అంతర్యామియై సృష్టికి కారణుడైన ఉపకారకుడు. ఇలాగా స్వేతర సకలపదార్థాలు తనసంకల్పానికి అధీనమైన స్థితికలవాడుగా ఉన్న సర్వేశ్వరుడు తనమీద ఆశాలేశమున్న వారి సంకల్పానికి అధీనమైన స్థితి కలవాడుగానూ ఉంటాడు కదా! ఇంక జీవునికి కొదువ (తక్కువ) ఏముంటుంది?

'కాతన్మైయాల్' -భక్తిచేత అన్నారు. స్వస్వరూపజ్ఞానం, పరస్వరూపజ్ఞానం కలిగి తైలధారలాగా నిరంతరస్మృతి - ధ్యానం-చేసేవారు భక్తులు. ఈ సాధనతో వారు పొందే ఫలం ప్రత్యక్షాకార సమానమైన పరమాత్మ సాక్షాత్కారం.

'ఎణ్ణిలుమ్ వరుమ్' - లెక్కించినను వచ్చును. భగవంతుణ్ని పొందడానికి ఏ ప్రయత్నం చేయని వారు సుకృతమని తెల్యక చేసిన పనులను (24, 25,26 అనగానే) భగవానుడే ఎంచుకొని స్వయంగా వారిని కటాక్షిస్తాడు. తగిన సాధన లేకయే ఫలాన్ని పొందినవారు ప్రపన్నులు. భక్తులు సాధనతో పొందే ఫలం ప్రపన్నులు పొందే ఫలం ఒక్కటే - సమానమేకదా! ఇకవారికి కొరత ఏముంది? ఏమీ లేదు. 'నల్ వాయువుమ్' మంచిగాలి - జగత్ప్రాణుడని అర్థం 'విరియుమ్' వ్యాపిందేవాడు. 'బహుస్యామ్' అని అనుకొన్న ప్రకారంగా పరిణమించేవాడని అర్థం.

"ఎమ్ పిరానై - అనే చోట ప్రథమావిభక్తి స్థానమందు ద్వితీయా విభక్తి ప్రయుక్తం (ఎమ్పిరాన్-అస్మదుపకారకుడు, అన్న మాటయే)

3. వ్యక్త పూర్వోపకారమ్:- ఎమ్పిరానై ఎన్నై తన్దై తన్దైక్కుమ్ తమ్పిరానై తణ్ తామరై కణ్ణనై (పా3) నా స్వామిని, నా తండ్రి, తాత, ముత్తాత మొదలైన మా వంశ స్థులందరికి ఉపకరించిన స్వామిని, చల్లని పద్మాలవంటి నేత్రుని, క్రింది పాశురంలో అనుభవించిన సౌలభ్యాన్ని వదలక, నా తండ్రీ అన్నారాళ్వార్లు. తన వరకే ఆగక తనకులస్థులైన పూర్వులందరికీ ఆయన యే స్వామి, అనిస్తుతించారు. ప్రయోజనాంతర పరులమాటకు అనన్య ప్రయోజనులమాటకు గల భేదాన్ని గుర్తించినవాడైనందువల్ల ఇలాగాఎవడు కీర్తిస్తాడు? అని భగవానుడు (పద్మాక్షుడు) చల్లని చూపుతో చూచాడు.

'తానహంద్విషత: క్రూరాన్ సంసారేషు నరాధమాన్, క్షిపామి" (భ.గీత) నన్ను ద్వేషించిన వారినీ, క్రూరులను, నరాధములను సంసారంలో పడవేస్తాను అన్న భగవానుడు ఇప్పుడు ఇంత కటాక్షించడానికి కారణమేమి? ఆళ్వార్లు విచారించాడు. కారణం (కటాక్షిస్తున్న స్వామి) పక్కనే ఉంది.

"కొంబు అరావు, నుణ్ నేర్ ఇడై, మార్ పనై, ఎమ్ పిరానై, మడనెంజమే తొళాయ్" - ప్రబ్బలి వలె, పామువలెను అతిసూక్ష్మమైన నడుము కలిగిన లక్ష్మీదేవి (తన) వక్షస్థలమందు ఉన్నవాణ్ని విధేయమైన మనసా! సేవింపుము. (అరవు, అనిరాకు

దీర్ఘం "నచ్చరావణై" (తి.చ.వి)-విషసర్పం - అన్నట్లు; నుణ్, నేర్ సౌక్ష్మ్యవాచి. పునరుక్తి కాబట్టి అతి సూక్ష్మమైన గాక, అని సంకల్పించుకొంటాడు. తదనుగుణంగా తానే తన శరీరమైన ప్రకృతినే, పంచభూతాదులుగా వికసింపజేసి, తానే ప్రబ్బలి చెట్టు లాగా సన్నని, పాములాగా నిర్వక్రమైన నడుముగల లక్ష్మీదేవి ఉరస్థలంలో ఉన్న స్వామిని విధేయమైన ఓ మనసా! ఆరాధించుము. లక్ష్మీనారాయణుల మిథునమే సేవింపతగినది. శ్రియఃపతికి చేతనుల పట్ల కలిగే అపరిమిత కృపకులక్ష్మీ సంబంధమే, కాబట్టి ఆ జంటను అనుసంధించి సేవించుమా, ఓ మనసా! అని మనస్సును వేడుకొంటున్నారు ఆళ్వార్లు.

4. స్వాంతస్యైకాగ్ర్యహేతుమ్:- నెంజమే! నల్లై నల్లై; ఉన్నై పెత్తాల్ ఎన్ శెయ్యోమ్? ఇని ఎన్నకు తై వినమ్? (పా4) ఓ మనసా! మంచిది మంచిది; నిన్ను పొందితే దేన్ని సాధింపలేము? ఇక (మనకు) ఏమిలోటు? ఓమనసా! చెప్పినట్లు చేసిన నీవు చాలా మంచిదానివి. తాము చెప్పిన పనిని త్వరగా చేసిన సత్పుత్రులను ఒడిలో కూర్చుండ పెట్టుకొని ప్రశంసించే తల్లిదండ్రుల లాగా ఆళ్వార్లు కూడా తన మనస్సును హృదయాన హత్తుకొని ప్రశంసిస్తున్నారు. మంచి దానివి అని ఒకసారి చెప్పక రెండుసార్లు చెప్పడంవల్ల - వీప్సకు- ఏమి అభిప్రాయం? అంటే, స్వామికి దూతను పంపినట్లే, తన మనస్సుకు కూడా దూతను పంపి పిలిపించుకొనే రీతిగా ఉంటుంది. ఈ మనస్సు ఆళ్వారు దగ్గర ఉండక, స్వామి వద్ద చేరి ఉంటుంది.

"ఎన్నెంజినారైకండాల్ ఎన్నైచ్చొల్లి అవరిడై నీ రిన్నం శెల్లీరో" (తిరువిరుత్తమ్) స్వామి దగ్గరికి దూతను పంపుతూ నాయిక అక్కడ 'నా మనసు గారు కనిపిస్తే నా ఆర్తిని చెప్పి, వారి వద్దకు మీరు (ఇప్పటికైనా) ఇంకనూ పోకుండా ఉన్నారే!" అని ఒప్పించుమని చెప్పింది. (ఇక్కడ ఒక ప్రాసంగికశ్లోకం రమణీయం:

"నపుంసకమితి జ్ఞాత్వా ప్రియాయ ప్రేషితం మనః।

తత్తు తత్రైవరమతే హతాః పాణినినా వయమ్॥"

మనస్సును నపుంసక లింగం కదా! అని ప్రియుని యొద్దకు పంపితే, అది అక్కడనే క్రీడిస్తూ తిరిగి రానేలేదు; 'మనస్సు నపుంసకం' అని పాణిని పల్కిన మాటను నమ్మిచెడి పోతిమికదా!) తమకంటె ముందు స్వామిని చేరే మనస్సు కాబట్టి ఇప్పుడు చెప్పినట్లు

చేసిందన్న ఆనందంతో (నల్లై నల్లై, అని వీప్స-మీమిశ్రై) మనస్సును ప్రశంసిస్తున్నారు.

ఓ మనసా! నీవు అనుకూలంగా ఉంటే నేను చేయలేనిదే ముంది? ఫలమీ యడానికి సర్వేశ్వరుడు సిద్ధంగా ఉన్నాడు. ప్రతి షేధించక స్వీకరించడానికి నీవు (మనస్సు) ఉన్నావు. ఇక ఏమి సాధింపలేము? అన్నారు ఆళ్వార్లు .

తర్వాత 'ఏమిచేయలేము?' అని సాధ్యాంశాన్ని అంగీకరించడం అంటే, చేసే వారుతామే (ఆళ్వారే) అని పలుకడం, తప్పుకదా! అని విచారపడినారు ఆళ్వార్లు. స్వామి యత్నాన్ని ప్రతిషేధించని ఉత్తమస్థితిలో ఉన్న మనస్సు ను ఆలంబనంగా చేసుకొని, స్వామియే ప్రపన్నులు కోరనవసరం లేకుండానే తన పనిని చేసుకొనే వాడుకదా! నిర్హేతుకంగా, నిరపేక్షితుడై, కటాక్షిస్తాడు. "నేను కోరక ముందే, ఎల్లప్పుడునాకు ఉపాయమై ఉన్నవాడు స్వామి. ఇక నాకు సాధ్యాంశం - సాధింపవలసింది - ఏముంది? ఇక కొరతలేదు" అనుకొన్నారు ఆళ్వార్లు మనస్సుతో ఇంకో మాట చెబుతున్నారు.

"మైన్దనై; మలరాళ్ మణవాళనై, తుంజుంపోదుం విడాతు, తొడర్ కండాయ్" నిత్యయౌవనుడు, రసికుడు, భోగ్యభూతుడు; పుష్పవాసినీ వల్లభుడైన శ్రియఃపతిని విడువకు, కూడియుండుము. (తుంజుంపోం - చచ్చిపోయినను-విశ్లేషమే వీరి దృష్టిలో వినాశం.) "వళవేళులకు"లో వలె స్వామి ఆధిక్యాన్ని, తమ అల్పత్వాన్ని తలచుకొని స్వామికి దూరంగానేనె డబాసిఉన్నా, నీవుమాత్రం శ్రియఃపతిని వీడక చేరియుండుము'' అన్నారు. నిన్ను వేపచారుత్రాగుమన్నానా? భోగ్యుడైన లక్ష్మీ నాథుణ్ని అనుసరించుమని కదా! అన్నాను ? అన్నారు.

5. స్వయముదయజుషమ్:- కణ్డాయే, నెంజే! కరుమంగళ్ వాయ్క్కిన్డ్లు, ఓర్ ఎణ్తానుమ్ ఇన్డియే, వన్దు ఇయలుమ్ ఆఱు (పా5) చూచావా ఓ మనసా! పనులు ఫలించినప్పుడు, ఒక్క తలంపు కూడా లేకయే, వచ్చి ఫలించే విధాన్ని మనసా! నేనుచెప్పినట్లే ఫలంలభించింది. జ్ఞాన ప్రసరణ ద్వారమైన నీకు చెప్పవలసినది లేదుకదా! 'ఎణ్ణిలుమ్ వరుమ్'' తలచిన మాత్రాననే వస్తాడు. అని వెనుక చెప్పినా, దానికన్న అధికమైన రీతిగా (అంటే, మనం తలచే నియమం కూడా లేకుండానే) ఫలించిన రీతిని చూచావా? భగవత్ప్రభావం అలాంటిది. అది ఎంతటి వారైనా సరె! చెప్పతలచినా చెప్పగలిగే విధంగా ఉండదు. మన తలపు, యత్నం లేశమైనా లేకుండానే (భగవదను గ్రహం) ఫలంసిద్ధిస్తుందనే విషయాన్ని ఉదాహరణగా చూపుతున్నారు.

"ఉణ్ణానై ఉలగు ఏళుమ్, ఓర్ మూఅడి కొణ్ణానై" ఏడులోకాలను ఆరగించినవాణ్ణి, ఒక మూడడుగులచే (సప్తలోకాలను) స్వీకరించినవాణ్ణి అనాడు లోకాలకు "భగవానుడు మమ్మలను గర్భమందుంచుకొని కాపాడవలెను" అనే తలంపు ఉండిందా? అలాగే మూడు అడుగులతో కొలిచినప్పుడు లోకాలకు "మాతలమీద స్వామి శ్రీపాదం ఉంచవలెను" అనే కోరిక ఉండిందా? లేదుకదా! లోకాలు ఏకోరిక లేకయే ఫలాన్ని పొందినవి. నిషేధపరికరం లాగానీవు కూడా చూచావు కదా!

నీయుమ్ కణ్ణు కొణ్ణనై-స్వామి నిర్హేతుకంగా అనుగ్రహించే వాడని చెప్పడానికి వేరే ఉదాహరణం అవసరం లేదని నీవు కూడా గ్రహించావు కదా! మనసా! అన్నారు. ప్రధానమైనది మనస్సే కదా! ప్రళయాపదలో లోకాలకు స్వామి రక్షణను ప్రతిషేధించే (అడ్డగించే) మనస్సుకు విషయప్రాపణ్యం ఉండదు. కాబట్టి వాటిని రక్షించాడు స్వామి. ఆళ్వార్ల విషయంలో స్వామిరక్షణ ను ప్రతి షేధించే మనస్సు ఉన్నది కదా! అనుగ్రహిస్తాడేమో అని తెలిసి ప్రతిషేధించేవారే, వారికి తెలియకుండా హఠాత్తుగా (అనుగ్రహం) ఫలించినందువల్ల ఊర్కొన్నారు. అంతే.

శ్రియఃపతి యొక్క దివ్య చేష్టలను మనం అనుభవించాం కదా! అలాగా, మన కర్మలు (పనులు) ఫలించేకాలం వచ్చినప్పుడు మన తలంపులేకయే ఫలిస్తాయి. ఈదశకం నిర్హేతుక విషయికారపరమైనదని శ్రీపరాశరభట్టర్ నిర్వహించ డానికి ముఖ్య కారణం ఈ పాశురమే.

6. బంధమాత్రోపయాతమ్:- నీయుమ్ నానుమ్, ఇన్నేర్ నిఱ్కిల్, మేల్ మత్తు ఓర్ నోయుమ్ శార్ కొడాన్; నెంజమే! (పా6) నీవూ, నేనూ, ఈ విధంగా నిలచి నట్లైతే, ఇక మీద వేరే ఏవిధమైన ఒక్క ఆపదను కూడా పొందనీయడు; ఓ మనసా! ముందుగా స్వామి యొద్దకు చేరిన నీవూ నీ లాంటి పరికరం (కరణం) కలిగిననేనూ, ఈ విధంగా ఉంటే చాలా మేలు. ఫలానుభవంకల్గన నేను స్వామి అనుగ్రహాన్ని ప్రతిషేధించే స్వాతంత్ర్య భావం కల్గి ఉండకుంటే.. "ననమేయం-స్వామి ముందు తలవంచను" అన్న రావణునిలాగా ప్రాతికూల్యమనోరధం కలిగి ఉండకుంటే - ఇకమీద స్వామి ఎలాంటి బాధను - దు:ఖాన్ని - పొందనీయడు. (నోయ్-ఆపద. అంటే స్వామికి దూరమవడమే. దూరం కావడానికి ఎన్నోకారణాలున్నాయి)

నిషిద్ధానుష్ఠానం-భాగవతాపచారం లాంటి చేయకూడని పనులను చేయడం - వల్ల స్వామికి దూరమవుతాం - స్వామిని ఆశ్రయించినా, వేరే ప్రయోజనాలను కోరి దూరమవుతాం. స్వామికాక ఇతరులు ఉపాయమని భావించి దూరమవుతాం. పూర్వకృతపాపఫలానుభవం వల్ల దూరమవుతాం. ఇలాగా స్వామి మనలను దూరం కానీయడు, బాధపడనీయడు. శొన్నేన్' -మనసా! నీకు సత్యం చెప్పాను. శొన్నేన్ - చెప్పాను. తిరుక్కోట్టి యూర్ నంబివలె; గోష్ఠీ పూర్ణులు శ్రీమద్రామానుజులకు చరమశ్లోకార్థాన్ని ఉపదేశించి, భగద్విషయం ఇతరులకు - భగవద్విషయాభిరుచిలేనివారికి తెలియ తగదు. అనధికారులకు చెప్పతగదని చెప్పారు. శ్రీ కృష్ణుడు పార్థునికి గీతను సొంతం ఉపదేశించిన తర్వాత "ఇదంతే నాతపస్కాయ నాభక్తాయ కదాచన॥ నచాశుశ్రూషవే వాచ్యం నచమాంయోZ భ్యసూయతి॥" దీన్ని తపస్సు చేయనివానికి, భక్తి లేనివానికి, గురు శుశ్రూష చేయని వానికి, నాపైన అసూయగల వానికి చెప్పతగదని చెప్పారు. ద్రౌపది యొక్క విరబోసిన కురులు ముడి పడాలని కర్తవ్యాన్ని చూడక త్వరగా గీతను ఉపదేశించాడు స్వామి.

విషయగౌరవాన్ని ప్రాశస్త్యాన్ని చూచి "చేతిలో ఉన్న మాణిక్యం సముద్రంలో పడిపోయింది. భద్రం భద్రం " అన్నట్లున్నది కదా ఇది. ప్రపత్తి చేయని వారికి ప్రచ్యుతియే. అంటే అర్జునుడు తపస్సు చేయని వాడు కదా! అతనికి చెప్పానే ! అని స్వామి విచారపడినాడు. అలాగే అర్హతలేని మనస్సుకు గహన విషయాన్ని చెప్పివేశాను కదా! అనుకొన్నారాళ్వార్లు.

"తాయుమ్, తన్దైయుమ్ అయ్, ఇవ్వులగినిల్ వాయుమ్ ఈశన్; మణివణ్ణన్ ఎన్దైయే " తల్లీ, తండ్రీ అయ్యి, ఈలోకంలో ఆవతరించిన ప్రభువు; మణివర్ణుడు నా స్వామి. తల్లి దండ్రుల లాగా ప్రేమకలవాడుస్వామి. అంత మాత్రమే కాదు. "కూపాంతర్మగ్న పుత్రం పతితమను పతన్మాతృవత్ లోక మేతంప్రాప్తా వైకుంఠధామ్నస్త్వమిహ వృషగిరౌవర్తసే త్రాతుమేతాన్" బిడ్డడు నూతిలో పడిన వెంటనే దానిలో దూకిన తల్లి వలె ఈ లోకానికి చేరుకొన్నావు. ఈ లోకులను రక్షించడానికి నీవు వైకుంఠం నుంచి ఇక్కడ వృషగిరికి వచ్చి వెలసి యున్నావు. ఇలా రావడానికి హేతువేమి? అంటే, సహజ సంబంధం ఉన్నవాడు ఈశ్వరుడే కాబట్టి తనవారిని రక్షించుకొనే ప్రేమతో తానే దిగి వస్తాడు.

జీవుడు ఇంతవరకు తానే ప్రభువుననీ, తనను రక్షించడంలో కొంత భాగం స్వామి పాల్గొంటాడు అనీ భావించేవాడు. స్వామి అవతరించిన తర్వాత ద్వైరాజ్యం పోయింది. శ్రియఃపతి ఒక్కడే ప్రభువని తెలిసింది. కాబట్టి ఈశుడు ఆతడే అన్నాడు.

తన విగ్రహసౌందర్యాన్ని ప్రదర్శించి నన్ను తీర్చి దిద్దిన వాడాయన. నన్ను విషయాంతర ప్రావణ్యం నుంచి మరల్చి తన శేషిత్వాన్ని చూపి, నాశేషత్వాన్ని స్థిరంగా నిల్పినాడాయన. నీవూ నేను కలిసి ఉంటే సహజ సంబంధమున్న స్వామి మనకు రోగాలను పొందనీయడు. "సత్యం సత్యం పునస్సత్యం" అన్నట్లు ఓ మనసా! సత్యమే చెప్పినాను. నమ్ముమన్నారు ఆళ్వార్లు.

7. చింతాస్తుత్యాదిలక్ష్యమ్:- ఎన్నైయే ఎన్నుమ్ ఎమ్బెరుమాన్ ఎన్నుమ్, శింద్తై యుళ్ వైప్పన్, శొల్లువన్ పావియేన్ (పా7)నా తండ్రీ! నా స్వామీ! అని మనస్సులో ధ్యానించాను, పలికాను, పాపాత్ముడను. ధ్యానించడమేకాదు. వాక్కులతో అందరికి తెలిసే రీతిగా పలికాను. స్వామిని మలిన పరచిన పాపాత్ముడను" వానవర్ ఎన్నై ఎమ్బెరు మానెన్ను శింద్తైయుళ్ వైత్తుమ్ శెల్వనైయే" -నిత్యసూరులు తండ్రీ, స్వామీ! అని మనసులో ధ్యానించి స్తుతించే ఐశ్వర్యవం తుడైన ; మహోన్నతుణ్ని, దేవతలు అనుభవించే పురోడాశాన్ని కుక్క తిన్నట్లు, స్తుతించిపాపంచేశాను అని పశ్చాత్తప్తులైనారు ఆళ్వార్లు.

8. నతజన సతతశ్లేషిణమ్:- శెల్వమ్ నారణన్ ఎన్న శొల్ కేట్టలుమ్, కణ్ పని మల్గుమ్ నాడువన్ (పా8) శ్రీ మన్నారాయణ అనే నామం వినగానే, కన్నులనుంచి ఆనందబాష్పాలు స్రవిస్తాయి. (ఆయనను) వెదకుతుంటాను. భగవంతునికి దూరంగా ఉండడమే మేలని ఆయన గుణాలు నడయాడని ఒక చోటికి పోయి, అచ్ఛాదన లేని శూన్యగృహభిత్తిచే ఆవరింపబడిన - ఏకాంతస్థల మందు అవకుంఠిత శిరస్కులై కూర్చున్నారు ఆళ్వార్లు. అప్పుడు ఒక వ్యక్తి భారవాహియై ఆమార్గాన వస్తూ, మూటబరువైనందువల్ల అలసటతో శ్రీమన్నారాయణా! అన్నాడు. ఆ శబ్దంవినగానే మళ్ళీ తమ ఇంద్రియాలు స్వామి యందు ప్రవణమవడాన్ని చూచి, ఆళ్వార్లు ఆశ్చర్యపడుతున్నారు.

శ్రీమన్నారాయణ నామం విన్నవెంటనే నా కళ్ళల్లోనుంచి ఆనందబాష్పాలు స్రవిస్తున్నాయి. ఆళ్వార్లు న్నచోట ఎవరైనా బ్రహ్మచారి (లక్ష్మీరహితుడైన) నారాయణుణ్ని

స్మరించరు. అందువల్ల ఒక పాంథుడు శ్రమవల్ల పలికిన మాట కూడా 'శ్రీమన్నారాయణ' నామమే. ఈ నామం యొక్క అర్థం మనస్సుకు పట్టనవసరం లేదు, ఆళ్వార్లు భాధపడడానికి. దేనివలె?

అంటే, విషహరణ మంత్రంవలె. అర్థం తెల్యక ఉచ్చరించినా పాము మంత్రం విషాన్ని హరిస్తుంది. అలాగే నారాయణ నామంచెవిని పడగానే ఆళ్వార్ల మనస్సుక్షోభపడుతుంది. తమకు తెల్యకయే వారి కళ్ళలో నీరు నిండి పోయింది. "మాయమే" -అశ్చర్యమే దూరమైనప్పుడు నా ప్రయత్నం అవసరమయింది కాని ఇప్పుడు స్వామిని చేరడానికి మాత్రం నా యత్న మవసరం లేక పోయింది. ఏ మాశ్చర్యం! నా మనస్సు స్వామి ఎక్కడుంటాడో, అని వెదుకదొడగింది. "నల్ అల్లుమ్, పకలుమ్, ఇడై వీడిన్లినల్‌కి, ఎన్నై విడాన్, నమ్బి నంబియే" -మంచి రాత్రి యందు, పగటి యందును, ఎడతెగకుండా, మక్కువ చేసి, నన్నువిడువక ఉన్నాడు, తనవాణ్ణిగా ఆదరించి పరిపూర్ణుడైన శ్రియఃపతి. మనస్సు భగవదన్వేషణ పరమయింది స్వామి తమను విడువ జాలక, అభిమానించే కాలమవడంవల్ల రాత్రింబవళ్ళు మంచివి' అన్నారు ఆళ్వార్లు.

సంసారిచేతనుడనైననన్ను దాసునిగా స్వీకరించి, అలభ్యలాభాన్ని పొందినట్లు భావించిన పూర్ణుడు సర్వేశ్వరుడు అని ఆళ్వార్ల అధ్యవసాయం.

9. దర్శితార్థమ్:- నంబియై, తెన్‌కుఱుంగుడి నిన్ఱ (పా9) పరిపూర్ణుడై దక్షిణ మందున్న తిరుక్కు ఱుంగుడియందువేంచేసి యున్న స్వామి. 'మీరు ఇక్కడనే సంసారులలాగా అవిషయాన్ని మరచి, పొట్టనింపుకొని, బట్టకట్టుకొని, తిరుగవచ్చునుకదా!' అంటే, ఆళ్వార్లు స్వామికి ఏమి తక్కువ ఉన్నదని అయనను నేనుమరువగలను? అన్నారు.

స్వామి గుణాలన్ని పరమపదంలో ఉపయోగంలేక ఉంటాయి. గుణాల యొక్క అక్కర చేతనులున్న ఈ లోకంలో నే ఉంది. ఇక్కడనే గుణాలకు పూర్తి ఉంది. అందరు గుణపరిపూర్ణులుగా ఉండే వైకుంఠ మందుకంటె ఈ లోకమందు ఆర్చావతారాలలో, చీకటి గదిలో దీపం ప్రకాశించినట్లు భగవంతుని గుణపూర్తి మహోజ్జ్వలంగా ప్రకాశిస్తుంది. అందువల్ల, స్వామి వైకుంఠాన్ని నా కోసం వదలి వచ్చి, తిరుక్కు రుంగుడిలో స్థావరంగా ప్రతిష్ఠితుడై ఉన్నాడు.

(తిరుక్కుఱుంగుడి - పాండ్యదేశంలోని 18 దివ్య క్షేత్రాలలో ఇది (కుఱుచసామి) వామనక్షేత్రం. ఇక్కడ ఈఅర్చాస్వామికి భగవద్రామానుజులవారు ఊర్ధ్వ పుండ్రాలను పెట్టి, వేదాన్తార్థాన్ని విని పించి, శిష్యుణిగా చేసుకొన్నాడట. కాబట్టి, వైష్ణవవామనక్షేత్రమని పేరు. నమ్మాళ్వార్ల అవతారానికి కారణభూతుడు తిరుక్కుఱుంగుడి స్వామి యేనట.)

అట్టిస్వామిని గుణాలలో తక్కువ వాడని మరచిపోతానా? దూరంగా ఉన్నాడని మరచిపోతానా? నాకోసమైదగ్గరికి వచ్చి ఉన్న ఆ పరిపూర్ణున్ని ఎలా మరువగలను.?

“ఉమ్బర్ వానవర్ అతి, అమ్శోతియై, ఎమ్పిరానై, ఎన్శొల్లి మఱప్పనో” పైన ఉన్న అమరులకు కారణభూతుడు, సుందర జ్యోతిర్మయుడు, నాకు ఉపకారకుడైన స్వామిని ఏమని మరువగలను?

మీద ఉన్న దేవతలు, క్రింద ఉన్నదేవతలు అని దేవతలు రెండు విధాలా ఉన్నారు. మీది దేవతలు కర్మబంధంలేనివారై, సంసార గంధమంటనివారు, నిత్యసూరులు. క్రింది దేవతలు కర్మాను గుణంగా భగవంతుని చేత సృష్టింపబడే ఇంద్రాది దేవతలు. నిత్యసూరులకు సర్వస్వం స్వామియే. వీరు అనుభవింప దగిన దివ్యశరీరాన్ని స్వామి కలిగి ఉంటాడు. నిత్య సూరులు అనుభవించేరీతిగా ఆళ్వార్లకు దర్శనమిచ్చిన మహోపకారకుడు శ్రియఃపతి. ఇట్టి స్వామిని, పూర్ణుడు కాదనియా, దూరస్థుడనియా, సుందరుడు కాదనియా, నాకు ఉపకరించని వాడనియా, ఏమని మరువగలను? ఎలా మరువగలను? ఆపరిపూర్ణుణ్ని మరువడం అసంభవం అన్నారాళ్వార్లు

10. స్మృత్యైచిత్తే మిషంతమ్:- మఱప్పుమ్ జ్ఞానముమ్ నాన్ ఒన్డు ఉణర్ న్దిలన్ (పా10) మరపు, జ్ఞానం అనేవి నేను ఏ ఒక్కటి యెరుగను. స్మృతి విస్మృతి అనేవి కలుగడానికి నేనొక చేతనుని వలె ఉంటెకదా! అచిత్తు లాగా పడి ఉన్నాను. జ్ఞానం ఉండే అవకాశం ఉన్న చైతన్యం ఉన్నప్పుడే మరపు కూడా కల్గడానికి అవకాశం ఉంటుంది. చైతన్యమే లేనినాకు ఈ రెండూలేవు.

“మఱక్కుమ్ ఎన్డు, శెమ్తామరైకణ్ణనొడు, మఱప్పు అఱ, ఎన్ఉళ్ళే మన్నినాన్ తన్నై’ ’-మరచిపోతాను అని కమలాక్షుడు మఱపు లేకుండా నా హృదయ మందునిల్చినాడు. ఉత్పన్నజ్ఞానం - నాకు తననస్మృతి - అవిచ్ఛిన్నంగా ఉండడానికి సుందరనయనారవిందుడైన భగవానుడు నా డెంద మందే స్థిరనివాసమేర్పరనుకొని ఉన్నాడు.

"మఱప్పనో ఇని, ఎన్మణియైయే" మరుస్తానా ఇక, నేను నా నీలమణిని. మరవడానికీ, ఆయనను తల వడానికీ నేను స్వతంత్రుడను కాను కదా! నీలమణి అరుదైనందువల్ల దుర్లభం. ధరింపదగిన దైనందు వల్ల సులభం. అనర్ఘమైన నీల రత్నం లభించినప్పుడు, అనుభవింపక దాన్ని పారవేసుకొనే వారుంటారా? అలాగే శ్రియఃపతి నేను అనుభవింపదగినట్లు తనను తానే నాకు అందించిన తర్వాత కూడా నేను ఆస్వామిని ఆదరించకుండా మరువగలనా? ఆ స్వామి యొక్క రాగ పూర్ణ (ఎఱ్ఱబారిన) నయనాలే ఆయనను మరపించకుండా చేసే పరికరాలు అవి స్వామి యందు ఉండగా మరువడానికి ఉపాయమేది? గత కాలమంతా ఎలాగా నేను స్మరణోపాయం తెలియకుండా ఉన్నానో, అలాగే ఇక భావికాల మంతాప్రయత్నించినప్పటికీ నాకు విస్మరణోపాయం కనబడదు, అన్నారాళ్వార్లు. హృదయంలోని చీకటిని తొలగించి, అక్కడనేనిల్చి యున్నస్వామిని మరచిపోవడం అసాధ్యమని ఆళ్వార్ల ఆశయం.

"అచ్చెమ్బునే తిగళుమ్ తిరుమూర్త్తియై" -చొక్కంబంగారం వలె ప్రకాశిస్తున్న సుందర విగ్రహుణ్ని వాక్కుచేతగానీ, మనస్సుచేతగానీ అపరిచ్ఛేద్యుడైన, నిరవధిక తేజో రూపుడు. ఇంతమేని సోయగం కలిగిన శ్రియఃపతి నెలా మరువగలను?

11. మణియై, వానవర్ కణ్ణనై, తన్న దొర్ అణియై (పా11) మణిలాంటివాడు, నిత్యసూరులకు నేత్రుడు (నిర్వాహకుడు), తనకు తానే ఒక ఆభరణంగా ఉన్నవాడైన శ్రియఃపతిని గురించి.

మణి సదృశుడు సర్వేశ్వరుడు కాబట్టి కొంగు బంగారం లాగా సర్వకార్యాలను నెరవేర్చు కొనడానికి ఉపయుక్తుడైనందువల్ల సులభుడు. రత్నాన్ని పొందగోరేవారికీ, పొందినవారికీ నిద్ర ఉండదు. దానికి-పొందే శ్రద్ధ, రక్షించే శ్రద్ధయే కారణం. అట్లే భగవంతుణ్ని పొందగోరేవారికీ, పొందినవారికీ రెప్ప పాటు ఉండదు. రత్నం వెల పెద్దగానూ, రూపం చిన్నగానూ ఉంటుంది. భగవంతుడు అటు పరాత్పరుడు, ఇటు అత్యంత సులభుడు. అద్రులూ, అబ్ధియు అటు రత్నానికీ, ఇటు భగవంతునికీ ఉనికి పట్టు. తమను పొందిన వారిచే, 'నాకెదురు లేదు' అనిపించే శక్తి సకలలోకంచేత తమను అనువర్తింపజేసే శక్తి రత్నానికీ, భగవంతునికీ ఉంది. రత్నలబ్ధికి ఒక ప్రాపకుడు, భగవల్లబ్ధికి ఒక పురుషకారం ఉండాలి . రత్నానికి కొన్ని చోట్ల ధర అధికం; అలాగే

ఆళ్వార్ల చే కీర్తింపబడిన క్షేత్రాలలో భగవంతునికి గౌరవం అధికం. రత్నాని పోగొట్టు కొన్నవాడు ఎంత దుఃఖిస్తాడో భగవద్విరహితుడైన భక్తుడూ అంత దుఃఖిస్తాడు. మణితో పోల్చబడినందువల్ల భగవంతుడు సులభుడని తాత్పర్యం. నిత్య సూరినిర్వాహకుడు కాబట్టి శ్రియఃపతియే పరాత్పరుడు. శరీరసౌందర్యమే అలంకారమనదగిన సుందరుడు కర్పూర చందన కుంకుమ సముదాయం వలె మాషపిష్ట గుడ, తైల మిశ్రంలాగా; సౌలభ్యం, పరత్వం, సౌందర్యం అనే ఈ మూడింటి కూడికయే పరత్వం.

"తెన్ కురుకూర్ శడగోపన్‌శొల్, పణిశెయ్, ఆయిరత్తుళ్ ఇవైపత్తు, ఉడన్ తణివు ఇలర్ కఱ్పరేల్,కల్వి, వాయుమే" నమ్మాళ్వార్లు మాటలతో, కైంకర్యం చేసిన వేయి(పాశురాల)లో ఈ పది పాశురాలను ప్రీతితో తనివి లేనివారై అభ్యసిస్తే (వారికి) జ్ఞానం, ఫలిస్తుంది. భగవంతుని పరత్వాన్ని చూచిభయపడేవారిని సౌలభ్యం చూపి, సౌలభ్యాన్ని చూచినిరాదరించేవారిని 'పరత్వం' చూపి చక్కదిద్ద డమే ఆళ్వాళ్లు చేసేపని.

"శొల్ పణిశెయ్" మీ కవితలో నన్ను ముందుగా వాడుకొనండి' అని వాక్కులు అహమహమికాపేక్షతో ఆళ్వార్ల హృదయంలో భాసించి ఈ ప్రబంధంలో స్థానాన్ని సంపాదించుకొన్నాయి లేదా తిరునగరిలో నివసించిన నమ్మాళ్వార్లు వాచిక కైంకర్యం చేసిన వేయింటిలో ని ఈ పది పాశురాలను - ఈదశకాన్ని - అర్థానుభవపూర్వకంగా అనుసంధానం చేసేవారికి - (వరిల్ పొగడేన్, కెడిల్ తేడేన్) 'వస్తే వస్తుంది, లేకపోతేలేదు' అని ఔదాసీన్యం వహించక, మిక్కిలిశ్రద్ధతో వల్లించే వారికి - (మోక్షేధీర్జ్ఞానమ్) భగవద్విషయమైన జ్ఞానం ఫలిస్తుంది. ఫలించడమంటే కైంకర్యసిద్ధి కల్గడమే. జ్ఞానఫలమైన కైంకర్యాన్ని ఈదశకమేకలిగిస్తుంది.

11. ఆదావిత్థం పరత్వా దఖిల సమతయా భక్తసౌలభ్యభూమ్నా
నిశ్శేషా గస్సహ త్వాత్ కృపణ సుఘటనా చ్ఛక్య సంరాధనత్వాత్।
స్వాదుస్వోపాసన త్వాత్ ప్రకృతి ఋజుతయా సాత్మ్యభోగప్రదత్వా
దవ్యాజోదార భావా దమనుత శతకే మాధవం సేవనీయమ్॥ 22

అర్థం:- ఇత్థం = ఈరీతిగా; పరత్వాత్ = సర్వస్మాత్పరుడైనందువల్ల; అఖిలసమతయా = సమస్తజనులతో సమానుడవడంచేత; భక్తసౌలభ్యభూమ్నా = భక్తులకు సౌలభ్యంచేత అధికుడవడంచేత; నిశ్శేష+అగః+సహత్వాత్ = సమస్త అపరాధాలను సహించే


వాడైనందువల్ల; కృపణసుఘటనాత్ = అయోగ్యులను కూడా చేర్చుకోవడంవల్ల; శక్య సంరాధనత్వాత్ = సాధ్యమైన ఆరాధనకలవాడవడంవల్ల; స్వాదుస్వ + ఉపాసనత్వాత్ = భోగ్యమైతన విషయ మైన ఉపాసన కలవాడవడంవల్ల; ప్రకృతి ఋజుతయా = స్వభావంచే ఋజువవడం చేత; సాత్మ్యభోగప్రదత్వాత్=ఓర్చగా ఓర్చగా అనుభవాన్ని ఇచ్చేవాడవడంవల్ల; అవ్యాజ/ఉదారభావాత్=నిర్హేతుకమైన ఔదార్యంవల్లనూ; మాధవం=శ్రియఃపతిని; సేవనీయమ్=ఆశ్రయింపదగినవాడు గను; ఆదౌ=మొదటి దైన ; శతకే=పత్తునందు; అమనుత=తలచెను

తా॥ ఈ మొదటి శతకంలో మొదటి దశకమందు సర్వేశ్వరుడు సర్వస్మాత్పరుడని; (2) భజనీయుడైన భగవానుడు సర్వసముడని; (3) ఆశ్రితులకు సులభుడని (4) సకల అపరాధాలను ఓర్చువాడని (5) మంచి స్వభావంకలవాడని (6) సుఖంగా ఆరాధింపదగినవాడని (7) సుఖంగా ఉపాసనీయుడనీ (8) ఋజువైనగుణం కలవాడని (9) సాత్మ్యభోగప్రదుడని (10) పరమోదారుడని, సాదించి ఇట్టిక త్యాణగుణాలు కలవాడు చేతనులచే ఎల్లప్పుడు ఆశ్రయింప దగిన వాడని ఈ మొదటి పత్తు నందు ఆళ్వార్లు అనుసంధించారు.


ప్రకాశికావ్యాఖ్య:- నమ్మాళ్వార్లు ఈ మొదటి పత్తులో ఉయర్వఱ ఉయర్నల ముదై యవన్" శ్రియ:పతి నిస్సమాభ్యధిక కల్యాణ గుణవిశిష్టుడు - అని ఉపక్రమించి "కల్వి వాయుమొ" దీన్ని అనుసంధించే వారికి జ్ఞానం ఫలిస్తుంది - అని ఉపసంహరించారు. భగవద్గుణాలను వర్ణించిన నమ్మాళ్వార్ల భగవదనుభవం విలక్షణంగా ఉంటుంది. (ప్రథమశతకం సమాప్తం)

శ్రీమన్నిగమాన్త మహాదేశికాయనమః


ఇది శ్రీమాలోల నృసింహస్వామి కటాక్షపాత్ర, హరితసగోత్ర, శ్రీమాన్ కారంచేటి
తిరుమల మనోహరాచార్య ప్రథమ పుత్ర, వేంకట రాఘవాచార్య విరచిత
ప్రకాశికాఖ్యాంధ్ర వ్యాఖ్యాసమేత శ్రీమద్వేదాన్త దేశికానుగృహీత
'ద్రవిడోపనిషత్తాత్పర్యరత్నావళి' ప్రథమ
సంపుటమ్ సమాప్తమ్.



రంగనాథస్వామి (శ్రీరంగం)



వెంకటేశ్వరస్వామి



నమ్మాళ్వార్ (శఠగోపులు)



భగవత్ రామానుజులు



శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యులు

జననం : విభవ, పుష్యశుక్లద్వాదశి 22 జనవరి 1929

తల్లిదండ్రులు : తిరుమల వెంకటమ్మగారు, తిరుమల మనోహరాచార్యులు గారు

స్వగ్రామం : నారాయణపురం, ఎల్లారెడ్డిపేట మండలం, కరీంనగర్ జిల్లా, (ఆం.ప్ర)

విద్యాయోగ్యత : సంస్కృతం ఎమ్.ఎ., తెలుగు ఎమ్.ఎ., బి.ఇడి.

వృత్తి : విశ్రాంతాంధ్రోపన్యాసకులు

ప్రవృత్తి : పురాణ, ప్రబంధకాలక్షేపం, దైవ మానుషయాజ్ఞికం, గ్రంథరచన.

రచనలు :
1. మాఘకావ్య వైభవం - యువభారతి ప్రచురణ - 1983
2. (దేశికుల) 'గోదాస్తుతి'కి పరిమళవ్యాఖ్య - 1987
3. భగద్విషయం. ఈడు అవతారిక (తమిళానికి) ఆంధ్రానువాదం - 1989
4. భగవద్ధ్యానసోపానం-మనోరమావ్యాఖ్యానం-1989
5. శ్రీమద్రామానుజులు-వర్ణాశ్రమధర్మములు-1992 (శ్రీ రా.కీ.కౌ.భాగం 12 గుంటూరు)
6. పాదుకాసహస్రమ్-రమణీయాంధ్రటీకాతాత్పర్య వ్యాఖ్యాసహితం-భాగం1-1996
7. గరడదండకం-సుషమాంధ్రటీకాతాత్పర్య వ్యాఖాసహితం-1997
8. ఆళ్వారులు - భక్తి ప్రపత్తి మార్గములు - 1997 (భక్తినివేదన-స్వర్ణోత్సవ సంచిక)
9. పాదుకాసహస్రమ్ - రమణీయాంధ్రవ్యాఖ్య భాగం2-1998
10. పాదుకాసహస్రమ్ - రమణీయాంధ్రవ్యాఖ్య భాగం3-1999
11. పాదుకాసహస్రమ్ - రమణీయాంధ్రవ్యాఖ్య భాగం4-2001
12. శ్రీ నారాయణశతకం - రాఘవీయవ్యాఖ్యాసహితం - 2002 (శ్రీపావనీ సేవాసమితి - హైద్రాబాదు వారి ప్రచురణ)
13. దివ్యప్రబంధత్రయి - సాంద్రటీకాతాత్పర్య వివరణం - 2002
14. పాదుకాసహస్రం - రమణీయాంధ్రవ్యాఖ్య భాగం5 - 2003

గమనిక : నెం - 6,7,9,10,11,13 & 14 గల గ్రంథాల ప్రచురణ & ప్రాప్తిస్థానం :-
శ్రీమాలోల గ్రంథమాల శ్రీఅహోబిలమఠం, హైద్రాబాదు (ఆం.ప్ర)

రచయిత ప్రస్తుత నివాసం : C/o శ్రీ కె.వి. రమణాచారి, బి.హెచ్.3/6, ఐ.ఎ.ఎస్. క్వార్టర్స్, రోడ్ నెం.10, బంజారాహిల్స్, హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 23350258